సంస్కృత

భాణ సాహిత్యము

(ఏకపాత్రాభినయ చరిత్ర - సమీక్ష)

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ
బహుమతి పొందిన గ్రంథము
(1977 – ‘78)

రచయితలు

“భాషాప్రవీణ”

డా. తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

“సాహిత్యశిరోమణి” “భాషాప్రవీణ”

డా. సూరం శ్రీనివాసులు

సంస్కృత భాణ సాహిత్యము

(ఏకపాత్రాభినయ చరిత్ర - సమీక్ష)

రచయితలు

డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, M.A. Ph.D.

డా॥ సూరం శ్రీనివాసులు M.A. (Sanskri), M.A.(Telugu) Ph.D.

ప్రథమ ముద్రణ: 1979

ద్వితీయ ముద్రణ: డిసెంబర్ 2022 (ఈ-ముద్రణ / పీడీయఫ్)

సర్వస్వామ్యములు రచయితలవి

ప్రతులకు

1) **జయభాస్కర ప్రచురణలు,** ఫో: 8555082034

2) **డా॥ సూరం శ్రీనివాసులు,** ఫో: 9440242348

e-mail: srinivasulu.suram@gmail.com

Printed & Published by

Jaya Bhaskara Printers & Publishers

S3, 2nd Floor, 31 & 32, Road No.4, RKH colony

Dr. A.S.Rao Nagar, Hyderabad – 500062

Contact: 8555082034

Publication No. PST07/07

ఒక్క మాట

సాహితీ మధువ్రతులకు కుసుమాంజలి. సంస్కృత సాహిత్యములో రచనను బట్టి సమాజమునకు చాలా దగ్గరగానున్న భాణప్రక్రియ నేటి సాహితీలోకమున కెంతో దూరముగ చీకటి కోణములలో తాళీదళ కాంతారములలో చిక్కువడిపోయినది. దానిని మరల వెలుగు రేఖలలోనికి ఆహ్వానించుచు అరుణోదయమున కవకాశమిచ్చినది ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ. దానిలో మా కరములును పాలుపంచుకొనుట మా యదృష్టఫలము. అనేక భాణ రచయితల కాలములు సంశయాత్మకములుగ నున్నను, వీలైనంతవరకు మేము కాల-క్రమమునే అనుసరించితిమి. కొన్ని భాణముల నామ విషయమున సైతము వైవిధ్యము గన్పించుచున్నది. వాటిని "కొన్ని ప్రామాదికములు" అను శీర్షికలో సహేతుకముగా సూచింప ప్రయత్నించితిమి. తెలుగు దేశములో తెలుగు భాషలో వ్రాయుచుండుట వలన ఆంధ్రుల భాణములను విడిగా విశ్లేషించుటయే కాక ఆంధ్రమున కనువదింపబడిన తెలుగు భాణములను పరిశీలించుట జరిగినది. పై విశ్లేషణ యథాశక్తి చేయబడినదే గాని సమగ్రముగ లేదు. విషయము ప్రాచీనమైనది, సంస్కృత సాహితికి సంబంధించిన దగుటచే సరళ గ్రాంథికము నుపయోగించితిమి.

ఈ గ్రంథ రచనలో మాకు అనేక కోణములనుండి సహకారము లభించినది. ఎందరో పెద్దలు సలహాలతో పాటు తమదగ్గరున్న భాణ గ్రంథములను గూడ అందించి ప్రోత్సహించిరి. వారందరకు వినమ్రులము. మద్రాసులోని అడయార్ లైబ్రరీ, ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ మాకు అముద్రిత గ్రంథ పరిశీలనలో ఎంతో సహకరించినవి. వాని యాజమాన్యమునకు మా కృతజ్ఞతలు. తిక్కన గ్రంథాలయం - నెల్లూరు, సారస్వత నికేతనం – వేటపాలెం, పబ్లిక్ రిలిజియస్ లైబ్రరీ - పొన్నూరు కూడ మా పరిశోధనలో పాలుపంచుకొనినవి. తదధినేతలకును సమస్సుమాంజలులు. మా అభ్యర్థనను మన్నించి అభిప్రాయములనందించిన డా|| చిపుకుల మార్కండేయశాస్త్రి, డా|| దివాకర్ల వేంకటావధాని గార్లకు కృతజ్ఞతలు. భావభంజకములు కాని తప్పులు అక్కడక్కడ చాల తక్కువే - దొర్లినవి. క్షమించగలరు. ఏ విషయముల నైనను సూచనలను, సలహాలను మనస్ఫూర్తిగా ఆహ్వానించుచున్నాము. దిద్దుకొనగలము. గ్రంథమును సకాలములో సహృదయతతో ముద్రించి యిచ్చిన రాఘవేంద్రరావుగారికి (రామచంద్రాప్రింటర్స్ గుంటూరు) మా ధన్యవాదములు.

చివరగా చెప్పుచున్నను ముందుగా చెప్పవలసినది. మా గ్రంథమును ఉత్తమ గ్రంథముగా నిర్ణయించి మమ్ము ప్రోత్సహించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి సదా కృతజ్ఞులము.

ఇట్లు
రచయితలు

ప్రవేశిక

Dr. C. Markandeya Sastry, M. A., Ph. D.
Joint Director of School Education
Andhra Pradesh, Hyderabad.

సంస్కృత రూపకములలో భాణము, వీథి యీ ప్రక్రియలకొక వైశిష్ట్యము కలదు. ఈనాటి యేకాంకికలే గాక యేకపాత్రాభినయ ప్రక్రియ గూడ వీటియందు ప్రయుక్తమై యున్నది. ప్రాచీన సాహిత్యములో నాటకములు, నాటికలే గాని మరొక దృశ్య కావ్య ప్రక్రియ లేనేలేదని నాటి నాగరిక ప్రయోక్తల విశ్వాసము. కాని భాణమువంటి రూపకములు సంఖ్యలో నాటకముల కన్న మిక్కిలి.

కథాసంవిధానములో కూడ యివి ప్రజా జీవనమును ప్రతిబింబించును. మృచ్ఛకటికము, మాలతీమాధవము వంటి ప్రధాన నాటకములను మినహాయించిన ప్రజా జీవనమునకు అద్దముపట్టు రూపక ప్రక్రియలలో భాణము, వీథి యివియే సమర్థములైనవి. సంస్కృతములో భాణములు ఆనాటి మధ్యతరగతి జీవనమునకు ప్రతిబింబములు. వీరిలో ఎక్కువగా శ్రామికుల దైనందినయాత్ర ప్రతిఫలించును. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు యిట్టి భాణరూపకముల విషయమై స్పర్ధనేర్పాటు చేయుట, అందు పండితులు, ఆధునిక విమర్శన పద్ధతులలో నిష్ణాతులునగు శ్రీ టి. రామకృష్ణ మూర్తిగారు, శ్రీ సూరం శ్రీనివాసులుగారు విజయము నొందుట హర్షదాయకము.

గ్రంథకర్తలు భాణములను కూలంకషముగా విషయము దొరికినంత వరకును పరిశీలించినారు. సంస్కృతములో నింకను కొన్ని భాణము లుండవచ్చును. అందు కొన్ని యముద్రితములు అయినను శ్రీ రామకృష్ణమూర్తిగారు, శ్రీ శ్రీనివాసులుగారు చేసిన పరిశ్రమ యెన్నదగినది. రూపకము యొక్క ప్రథమాకారము భాణమే యగును అని వీరి నిర్ణయము. దీనిని శ్రవ్య కావ్యముగనే పరిగణించవచ్చునని వారు సూచించిన మరొక్క యభిప్రాయము. ఈ యభిప్రాయములతో నందరు నేకీభవించకపోవచ్చును. అయినను విషయ నిర్ణయమున వీరు అవలంబించిన పద్ధతి తర్కసహముగ నున్నది. అట్లే తెలుగున నున్న భాణములను గురించి వివరించుటగూడ వీరి యుచితజ్ఞతను సూచించుచున్నది.

ప్రాచీన ప్రజా జీవనము యొక్క సరణిని అవగాహన మొనరించుకొనుటలోను ఈ విషయములను ఇంకను పరిశోధించవలసిన అవసరమును సూచించుటలోను ఈ గ్రంథము ఎంతయో సహకరించగలదు. ఈ గ్రంథకర్తల కృషి అభినందనీయము.

(సం) చివుకుల మార్కండేయశాస్త్రి.

హైదరాబాద్
3-9-79

ప్రదర్శిక

డా॥ దివాకర్ల వేంకటావధాని,
ఎం.ఏ. (ఆనర్సు) పి. ఎచ్. డి.
పూర్వాంధ్రశాఖాధ్యక్షులు
ఉస్మానియా విశ్వవిద్యాలయము.

భాషా ప్రవీణులు, ఎమ్.ఏ పట్టభద్రులు, పరిశోధననిపుణులైన శ్రీయుతులు డా|| టి. రామకృష్ణమూర్తిగారును, సూరం శ్రీనివాసులుగారును కలసి రచించిన సంస్కృత భాణ రూపకములను పరిశోధన గ్రంథమునుఁ బఠించి యానందించితిని. అది ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ బహుమానము నందియుండుటయే దాని ప్రశస్తిని చెప్పక చెప్పుచున్నది. భాణము సంస్కృతమునందలి దశరూపకములలో నొకటి. దీనికి నాటక ప్రకరణాదుల కున్నంత ప్రసిద్ధిగాని, ప్రచారముగాని లేవు. ఇది ఏకాంకము; ఏకహార్యము. భాణములను రచించినవారెందరో యున్నారు. అందులో అనేకములు ఆంధ్రులు రచించినవగుట గమనింపవలసిన విషయము.

గ్రంథకర్తలు ముద్రితములైన భాణములనేగాక, అముద్రితములై గ్రంథ భాండాగారము లలో తాళపత్ర లిఖితములుగా నుండిపోయిన వానిని గూడ పరిశీలించి తమ గ్రంథమునకు సమగ్రత్వము నొసగియున్నారు. ఈ విషయమున వారి క్లేశమును, చేసిన పరిశ్రమయు ప్రశంసాపాత్రములు. కాలముగాని, గ్రంథకర్తల నామములు గాని తెలియని భాణములను వెలుగునకుఁ దెచ్చియున్నారు. చివర నాంధ్రమున రచింపబడిన భాణములను కూడ సమీక్షించి, వారు పరిశోధనమునఁ దమకు గల యభినివేశమును ప్రకటించియున్నారు.

మొదట రచయితలు భాణలక్షణములను సమగ్రముగా నొసంగి, యది సంస్కృత రూపకములలో నాటకమువలె సంపూర్ణ లక్షణము కాకపోయినను ప్రప్రథమసముద్భూతమై యుండుననియు, శ్రవ్యకావ్యలక్షణ ప్రచురమనియు నిరూపించియున్నారు. వారు నాటకోత్పత్తి విషయమును గూడా కూలంకషముగా చర్చించియున్నారు. ఈ రెండు సందర్భములందును వారు పలువురు విమర్శకుల యభిప్రాయములను ప్రదర్శించి, యందలి సత్యాసత్యములను నిష్పక్షపాతముగా ప్రకటించియున్నారు. భాసాది పూర్వ నాటకకర్తల కృతులలో గల భాణచ్ఛాయలనుఁ బరిశీలించి సోదాహరణముగా చూపుటలో వారు వెల్లడించిన పరిశ్రమయు, నేర్పును ఆపారములై ఆశ్చర్యమును కల్గించుచున్నవి.

గ్రంథకర్త లాంధ్రాంగ్ల సంస్కృతములలో నిష్ణాతులు. అందుచే వారా భాష లన్నింటఁ బూర్వులు బాణములను గూర్చి వెల్వరచిన సమీక్షలను, ఆశయములను పూర్తిగా పరిశీలించుటకవకాశ మేర్పడినది. వారాంధ్రులు, ఆంధ్రేతరులు రచించిన భాణములను

ప్రాచీనార్వాచీన భాణములను వర్గీకరించి, ఒక్కొక్క భాణమును రచించిన కవిని గూర్చియు, కాలమును గూర్చియు, వస్తువునుగూర్చియు, తద్విన్యాసమును గూర్చియు, రసపాత్ర పోషణమును గూర్చియుఁ జక్కగా విమర్శించియున్నారు. అచ్చటచ్చట వారొసంగిన యుదాహరణములు వారి విచక్షణతనే గాక పరిశోధన పాటవ పాండితీ ప్రకర్షలనుగూడఁ బ్రకటించుచున్నవి.

వారు భాణముల సారస్వత సౌందర్యమును సమీక్షించుటతోపాటు వానివలనఁ దెలియు నాయాకాలములయందలి సాంఘికాది పరిస్థితులను, క్రీడావినోదాదులను గూడ విశదీకరించియున్నారు. అట్లే ఆయా కవులు ప్రదర్శించిన వర్ణన వైశారద్యమును, ప్రయోగించిన సూక్తులను, సామెతలను సయితము వివరించి, గ్రంథమును సర్వ సమగ్రము గావించియున్నారు. పై విషయములను వివరించు ప్రకరణములు వారి విమర్శన వైచక్షణ్యమునకును, పాండితీ ప్రాగల్భ్యమునకును జక్కని నిదర్శనములు. చివర వారు భాణముల పట్టిక నొసంగి, పాఠకుల కా జాతిరూపకము లెన్నియో సులభముగా దెలిసి కొనుట కనువు గల్పించియున్నారు.

సంస్కృత రూపకములలో నేకాంకములు మరికొన్నియున్నవి. వీథి, ప్రహసనము మున్నగువానికిని, భాణమునకును గల సాదృశ్యములను వారు వివరించిన తెఱంగు మెచ్చదగి యున్నది. వారిచ్చిన యుదాహరణము లన్నియు భావగంభీరములును, సరసములునై పూర్తిగ భాణములను జదువని వారికిగూడ వాని స్వరూప స్వభావ శైలీ విశేషములను బ్రకటించునట్టివిగా నున్నవి. ఈ పరిశోధన గ్రంథము భాణములకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వము, (encyclopedia) వలె నున్నదనుటలో నతిశయోక్తి లేదు.

గ్రంథకర్తలు గొప్ప పండితులగుటయేగాక బోధనానుభవముగల దిట్టలు. వారి శైలి నిర్దుష్టము, నిరాడంబరము, నిరుపమానమునై యలరారుచున్నది. విషయమును సమగ్రముగను, సర్వసుబోధముగను వ్యక్తీకరించుటలో వారు చూపిన నేర్పు శ్లాఘాపాత్రము. ఉన్నవనియేకాని యెట్లున్నవో పండితులకుగూడ తెలియని భాణ రూపకములను గూర్చి యెన్నో విషయములను తెలిపి, వారు జిజ్ఞాసువులు కపారమైన మేలు చేకూర్చియుండుటయే కాక సారస్వత విమర్శన మెట్లుండవలయునను విషయమున నొక యుదాత్తాదర్శమును సయితము నెలకొల్పియున్నారు. విద్యావినయ సంపన్నులు, పరిశోధన ప్రవీణులైన గ్రంథకర్త లింకను యిట్టి ప్రశస్త గ్రంథములను మరికొన్నిటిని వెలయించి యుభయ భాషలకును, దదుపాసకులకు మేలుచేయుదురని యాశించుచున్నాను.

(సం.) దివాకర్ల వేంకటావధాని

హైదరాబాద్

2-9-79

రచయితలు



తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,   సూరం శ్రీనివాసులు

సంస్కృత భాణ సాహిత్యము

విషయసూచిక

		పుట
1.	రూపక పరిచయము.	1-13
2.	ప్రథమ రూపకము భాణమే	14 - 21
3.	భాణలక్షణము	22 - 47
4.	భాణము దృశ్యమా ? శ్రవ్యమా ?	48 - 51
3.	భాణచ్ఛాయలు	52 - 58
6.	ప్రాచీన భాణములు	59 - 77
7.	అర్వాచీన భాణములు	
	(అ) ఆంధ్రుల గ్రంథములు.	78 - 116
	(ఆ) ఆంధ్రేతర గ్రంథములు	117 - 173
8.	నవీన భాణములు	174 - 180
9.	అజ్ఞాత భాణములు	181 - 185
10.	భాణములు – సామాన్యాభిలక్షణములు	186 - 197
11.	సాంఘిక విషయానుశీలనము	198 - 206
12.	క్రీడలు – వినోదములు	207 - 216
13.	వర్ణనవైశిష్ట్యము	217 - 222
14.	భాణ వివరములలో కొన్ని ప్రామాదికములు	223 - 225
15.	కొన్ని తెలుగు భాణములు	226 - 236
16.	అనుబంధములు	
	(అ) ధూర్తానుభవభాణః	237 - 241
	(ఆ) కొన్ని సామెతలు – సూక్తులు	242 - 244
	(ఇ) భాణములపట్టిక	245 - 259
	(ఈ) ఉపయుక్త గ్రంథసూచి	260 - 261

రూపక పరిచయము

ఉదయించెడి సూర్యునకు, వికసించెడి కమలమునకు సమన్వయమును కలిగించి భౌతికజగత్తుకన్న, పవిత్రమైన ఆంతరజగత్తును తాత్త్వికదృష్టితో అణువణువున అన్వేషించి, అందరకు అందించిన మహనీయుల భావపుంజమే సంస్కృత సాహితీ ప్రాథమిక స్వరూపము. కనిపించెడి సత్యములకన్న, కనిపించని తత్త్వములు శాంతి సాధనకు సుమార్పిత మార్గములు. ఈ విషయమును వియత్తలము వరకు వినిపించునట్లు విన్నవించిన విన్నపములే సంస్కృత సాహిత్యములోని సూక్తి సుధాబిందువులు. భావములకు సైతము దేవతామూర్తిత్వమును కల్పించిన వేదకాలపు మనీషికిని

"వ్యతిషజతి పదార్థానాంతరః కోఽపి హేతుః।
న ఖలు బహిరుపాధీన్ ప్రీతయస్సంశ్రయన్తే ॥"

అను భవభూతికిని తాత్త్వికదృష్టిలో సమతయే సిద్ధించును. ఈనాటి సమాజమునకు సుందర స్వప్నమనిపించు సంస్కృత సాహిత్య మొకనాటి సమాజమును అస్వప్నసుందరముగ తీర్చిదిద్దినది.

విశ్వసాహిత్యములో కాలక్రమము ననుసరించి చూచినను, విషయవైశిష్ట్యము ననుసరించి చూచినను ప్రథమస్థానము గీర్వాణవాణిలోని వైదిక సాహిత్యమునకే దక్కుననుట పండితుల నిర్ణయము. భారతీయ సంస్కృతిసౌధమునకు పునాదిరాళ్ళుగ నిలిచినది వైదిక సాహిత్యమే. తాత్త్వికదృష్టికి ప్రాధాన్యమునిచ్చిన పై సాహిత్యము సామాన్యదృష్టికి అసందర్భముగ కన్పట్టవచ్చును. అందులకు కాలపరిణామమువలన నేర్పడిన కొన్ని మార్పులు కారణము కావచ్చును. కాని ఆ సాహిత్యమంతయు "మనోవిశ్లేషణ"యే పరమార్థముగ పరిఢవిల్లిన సుందర మందారము. హృదయైక రమ్యముగ నే విషయమునైన వర్ణించుట భారతీయుల ప్రత్యేకత. అది కన్నులకు మాత్రమే కన్పించదు.

వైదిక సాహిత్య మొకవైపు సమాజమును చైతన్యసంవలితము చేయుచుండగ సౌందర్యసారతను సంతరించుటకు లౌకిక సాహిత్య మావిర్భవించినది. చైతన్య సౌందర్యముల సమ్మేళనమే సమగ్రస్వరూపప్రతీక. ఉపలాలించుచు, ఉత్తేజమును కలిగించుచు ఉపదేశించుట, మానవునిలోని నిగూఢ మనస్తత్త్వములను దీప్తము చేయుట, వ్యక్తి వ్యక్తి అవగాహనను కల్గించుట ప్రధానలక్ష్యముగ లౌకిక సాహిత్య

మావిర్భవించి సమాజ సేవ చేసినది. ఎత్తువారి చేతిబిడ్డవలె అది మనీషి మనీషనుబట్టి అతనిలో విశిష్ట సంస్కారమును కల్గించుచున్నది.

వివిధ భేదములతోనున్న సంస్కృత సాహిత్య విశ్వరూపములో ఒకేమారు దృశ్యశ్రవ్యకావ్యము లావిర్భవించిన వనవచ్చును. రసనాలోలుపతను దాటిన వెంటనే మానవుడు నయనలోలుపుడే కాగలడు. ఆ పై శ్రవణలోలుపత, అందాలకు పందిళ్ళు వేసెడి ప్రకృతిని చూచి కన్నులలో కాంతులను పులుముకొనుట అలవరచుకొనిన మానవుడు, ప్రకృతిననుసరించి ఆ ఆనందమును సృష్టించుకొనుటయేగాక, తన మేధను సైతము వెలువరించినాడు. ప్రకృత్యనుకరణము పరమార్థముగ దృశ్య కావ్యములకు పునాదులు పడియుండవచ్చును. ఆ పునాదుల మీదనుండి లేచిన సౌధములే సంస్కృత రూపకములు. కేవలము దృశ్యప్రాధాన్యముగ రచన సాగినచో అభినేతలు లేనపుడు అవి బూడిదలో పోసిన పన్నీరు అగును. ఆ ప్రమాదమును గుర్తించి సంస్కృత రూపకర్తలు అభినయము లేకపోయినను, అద్వితీయముగ సాగిపోగలరీతిగ శ్లోక రచనముతోను, భావపటిమతోను, భాషాసౌందర్యముతోను లావణ్యమును రంగరించి దానిలో నిక్షేపించినారు. అందువలననే నాటికి నేటికిని అభినయమున్నను లేకపోయినను సంస్కృతరూపకములు అవిచ్ఛిన్నముగ ఆదరింపబడుచున్నవి. ఆట్లు విశేషఖ్యాతి నార్జించిన అభిజ్ఞానశాకుంతలమును, ఆ సర్వాంగసుందరరచనను లోకమున కందించిన కాళిదాసును ఒక్కమారు పరామర్శించి, భవభూతి కన్నీటిని కరాంగుళులతో తుడిచి, రూపకముల ప్రాముఖ్యమును, సాహితిలో వాని పాత్రను పరిశీలించెదము.

సాహిత్యములో రూపకముల పాత్ర :

ఆంగికం భువనం యస్య వాచికం సర్వవాఙ్మయమ్ ।
ఆహార్యం చంద్రతారాది తం వందే సాత్త్వికం శివమ్ ॥

-అని ఆంగికవాచిక సాత్త్వికాహార్య స్వరూపుడైన పరమేశుని నుతించి భరతుడు శివస్వరూప నాట్యమును సాధించినాడు. శ్రవ్యకావ్యములలో నీ అభినయము మనో నయన సంవేద్యముగ, దృశ్యకావ్యములలో నిది నయనమనోవేద్య మగుచున్నది. యథార్థమునకు సృష్టిలో మానవజీవనమున కెంత ప్రాధాన్యమో రూపకముల కంత ప్రాధాన్యము కలదు. మానవజీవితము, అందలి భావములన్నియు నటనా స్వరూపములే. ఈ విషయమున క్రింది పద్యమును గమనింపుడు.

గుండెనేపథ్య; మందులోనుండు భిన్న
భిన్న భావపాత్రలు; పనియున్నయపుడు
ప్రాణకోశమ్ము తెరచీల్చి పైకి రాగ
నయన రంగస్థలమ్మున నటన జరుగు.

-అనగ మనలోని భావ ప్రదర్శనమే ఒక నాటకమయినచో దానికెంత విలువకలదో నాటకమున కంతే విలువ. ఒకే జీవితమునుకాక సమష్టిగ ఆలోచించినను విశ్వమంతయు నొక నాటకరంగమన్న Shakespeare వాక్యము యథార్థము. ఈ నాటకమున మనిషి మనిషికి ప్రాధాన్యము లేకపోయినను సమాహార స్వరూపముగ ఆలోచించినపుడు ఎవరి విలువ వారికి లభించును. ఏ వ్యక్తి లేకున్నను సృష్టి అసంపూర్ణ ప్రతిభాసమానమే. ఆ ఆదర్శమే రూపకములముందు నిలచి పాత్ర పాత్రమునకు ప్రాముఖ్యము లేకపోయినను సమీకృత కళాసృష్టి కవకాశము నిచ్చినది. ఇట్లే మానవహృదయమున సర్వభావములు పాత్రములవలె నిలుచుననుట లాక్షణిక సమ్మతమే. ఈ మహత్తర కళాతత్త్వము నవగతము చేసికొనియే అభిజ్ఞులు "నాటకాంతం హి సాహిత్యమ్" అని ప్రశంసించుట జరిగినది. కవిసహృదయులలో ఎవరి కన్వయించినను పై వాక్యము సత్యసంగతమే.

విశ్వసృష్టి నర్థము చేసికొనిననే కవి సత్కళాసృష్టి చేయగలడు. నాటకరచయిత కా యవసరమెంతయో గలదు. గుండెల లోపల లోతులలోనికి కవి దూకగలిగిననే అది అర్థమగును. ముడులను విడదీసి అద్వైతరూపమున చైతన్యములో అంతర్లీన మయినపుడు తప్ప మరొకరీతిగ ఆ పని చేయలేడు. అట్టి ఉత్తమస్థితి కవితాతపస్సువలననే సిద్ధించును. కావున పై వాక్య మనవలసి వచ్చినది. ఆ స్థాయికి వెళ్ళిన రూపకకర్తయే భావఝంఝూవాతములకు చలింపక నిశ్చలముగ నిలిచి రచన చేయగలడు.

అంతియకాక రసాస్వాదనములో సైతము దృశ్య శ్రవ్యకావ్యముల కెంతయో భేదమున్నది. రంగస్థలమున ప్రదర్శింపబడెడి రూపకమును చూచినపుడు కలిగెడి ఆనందము చదివినపుడు కలుగదు. అనగ రూపకవిషయమున ఉపకరణముల ఆవశ్యకము తక్కువ. శ్రవ్యకావ్యమున సహృదయతా సమున్మేషితమైన భావయిత్రీ ప్రతిభ ఎక్కువపాళ్ళలో అవసరమగును. కాని రూపకమున దాని అపేక్ష తక్కువ. సమస్త జనసంవేద్యమై, సుబోధ్యమై, ఆనందానుభవమునకు దగ్గరదారి చూపునది రూపకము. అందులకు కారణము దాని తీరుతెన్నులలోని భేదము కావచ్చును.

దృశ్యకావ్యము ఆనందైక ఘనము. శ్రవ్యకావ్యము బోధలకును కొంత తావు నిచ్చును. కనుకనే ధనంజయుడు -

ఆనందనిష్యందిషు రూపకేషు వ్యుత్పత్తిమాత్రం ఫలమల్పబుద్ధిః।
యో పీతిహాసాదివదాహ సాధు తస్మై నమస్స్వాదు పరాఙ్ముఖాయ॥

అని అనవలసి వచ్చినది. అది ఆనందనిష్యంది, స్వాదుతమమును.

కవికి కల సకళ కళాప్రావీణ్యమును ప్రదర్శింపవలెనన్నను సర్వకళాసారముగ కృతిని తీర్చిదిద్దవలెనన్నను నాటక ప్రక్రియయే తగినది. పలు వన్నెలుకల జిలుగు వలువలవలె ఆకర్షించుచు, ధర్మమును ఆనుషంగికముగ బోధింపగలది రూపకమే. "సందర్భేషు దశరూపకం శ్రేయః" అని వామనుని భావనము. అది చిత్రపటమువలె విశేష గుణసామగ్ర్యము కలదను భాష్యముతో అనుసంధింపబడినది. ఆట, పాట, అందము, చందము చిందువేసెడి రమణీయరూపము రూపకమని అతని భావము.

నాటికిని నేటికిని నటులమీద సమాజమునకు చిన్నచూపు, అసదభిప్రాయము ఉన్నను నాట్యకర్తలును లక్షణవేత్తలును దానిని మహాయాగసమముగనే భావించిరి. నాట్యశాస్త్రమున భరతుడును దానిని నాట్యవేదముగనే భాషించెను. అంతియగాక అది విశిష్టక్రతువనియు అంగీకరించెను. (నాట్యశాస్త్రము - అధ్యాయము 36) ఆ విషయమును కాళిదాసు తన మాళవికాగ్నిమిత్రమున ఒక శ్లోకముతో వివరించియున్నాడు.

దేవానామిదమామనంతి మునయశ్శాంతం క్రతుం చాక్షుషం
రుద్రేణేదముమాకృత వ్యతిక రే స్వాంగే విభక్తంతథా।
త్రైగుణ్యోద్భవ మత్ర లోకచరితం నానారసం దృశ్యతే
నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాఽప్యేకం సమారాధనమ్॥ 1-4.

మేధాభేదముననే గాక అవస్థాభేదమున సైతము సర్వావస్థలవారికిని ఆహ్లాదము కలింపగలది రూపకమే. దుఃఖార్తులైనను, శ్రమార్తులైనను, శోకార్తులైనను, తాపసులైనను నిర్విరోధముగ నాటకదర్శనమున ఆనందము ననుభవింపవచ్చును. ఇట్లు ప్రధానపదవి నధిష్ఠించిన రూపకోత్పత్తి భిన్నాభిప్రాయముల కాలవాలమైనది.

రూపకోత్పత్తి

భారతీయరూపకోత్పత్తిని గూర్చి వివిధకోణములనుండి పరిశీలించుటచే వివిధాభిప్రాయములు వెలువడినవి. ప్రాధమికరూపము అలభ్యము, అదృశ్యము

నగుటచే ఊహామాత్రముచే దానిని నిర్ణయింపవలసి వచ్చుచున్నది. ఈ భావనా జన్యములయిన అనేకాభిప్రాయములను వీలయినంత సంక్షేపముగా నిట పరిశీలింతము.

సాంప్రదాయిక వాదము :

భరతుడు తన నాట్యశాస్త్రమున రూపకములకు దేవయోనిత్వమును కల్పించినాడు. కృతత్రేతాయుగముల సంధికాలమున గ్రామ్యప్రవృత్తికి లొంగి, కామలోభాదులకు వశమయి లోకులు స్వధర్మముల వీడి చరించుచుండిరి. వారిని స్వధర్మనిరతులను గావించుటకై మహేంద్రాదులు బ్రహ్మను దృశ్యమును, శ్రవ్యమును నగు క్రీడనీయకమును కోరిరి.[1]

ఆ ప్రార్థన నాలకించి బ్రహ్మ ఋగ్వేదమునుండి పాఠ్యమును, సామవేదము నుండి గీతమును, యజుర్వేదమునుండి అభినయమును, అథర్వవేదమునుండి రసములను తీసికొని నాట్యమును సృష్టించెనట.[2]

ఆ తరువాత అభిజ్ఞులు, కుశలులు అయిన అభినేతలుగా భరతపుత్రులను నిర్ణయించి, భరతునికి నాట్యప్రచారమునకై ముదల నిచ్చెనట.

ఈ దైవయోనిత్వమును గూర్చి శారదాతనయుడు తన భావప్రకాశమున మఱి యొక కథను చెప్పినాడు.

స్వాయంభువమనువు తమ తండ్రియైన సూర్యునిదగ్గరకు వెళ్ళి రాజ్య-పాలనమున పరిశ్రాంతి సమయమున దానిని తొలగించుటకు ఏదేని వినోదమును కోరెనట. సూర్యుడు మఱియొక కథను చెప్పెనట.

పై కథలలో ఏ విషయమును విశ్వసించినను, వదలినను చతుర్వేదముల నుండి పాఠ్యాదులను గ్రహించి నాట్యవేదమును నిర్మించెనను సిద్ధాంతము అనేకుల నాకర్షించినది.

---

(1) మహేంద్రప్రముఖైర్దేవైరుక్తః కిల పితామహః |
క్రీడనియకమిచ్ఛామో దృశ్యం శ్రవ్యం చ యద్భవేత్ || నా|| శాఖ ప్ర. అ.—11

(2) జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్సామభ్యో గీతమేవ చ |
యజుర్వేదాదభినయాన్ రసానాథర్వణాదపి || నా|| శాఖ ప్ర. అ.—17

వైదికోత్పత్తి :

నాట్యము వేదముల నుండి జనించినదనియు, వేదములయందే దాని కనేకాధారములు కలవని పలువురు అభిప్రాయము. ఋగ్వేదమునందలి కొన్ని సంవాద సూక్తములను [యమయమీనంవాదము(X-10), ఊర్వశీపురూరవ సంవాదము (X-10), ఇంద్రనేమిసంవాదము (VIII-100) మొదలగువానిని.] నాట్యమునకు పునాదులుగా వారు అంగీకరించుచున్నారు. ఇది ప్రధానముగా పాశ్చాత్య పండితుల వాదము, సాయణుని భాష్యము పై సూక్తములకు యాగసంబంధ మే రీతిగను లేదని సాక్ష్యము పలుకుచున్నది. కనుక ఈ సంవాదసూక్తములను యాగకాలమునందు ఋత్విజులు రెండు పక్షములుగా చీలి పఠించియుందురనియు, మధ్య మధ్య వచనములను కల్పించుకొని యుందురనియు, అర్వాచీనకాలమున వచనములు నశించినవనియు వీరివాదము.

ఈ వాదము అంత తేలికగా తీసివేయదగినది కాదు. కాని వచనభాగములను చేర్చి వారు పఠింపగా, అవి నశించిన వనవలసిన పని లేదు. ప్రాథమికదశలో నిర్వచనముగా రూపకములు సాగినవన్నను నష్టమేమియు లేదు. ఈనాడు గేయ రూపకములను నిర్వచనముగా మనము వ్రాసి అభినయించుచున్నాము గదా! అట్లే ప్రాచీనకాలమున నిర్వచనముగనే సంవాదము లుండి యుండవచ్చును. అంతేకాక ఏకపాత్రాభినయమును సైతము శ్లోకరూపమున చేసెడివారనుటకు అక్షసూక్తము వంటి (X - 34) సూక్తములు అవకాశము నిచ్చుచున్నవి.

అంతేకాక యమయమీ సంవాదులలో ఇతివృత్తము సైతము యాగసమయము లందు వానిని సంవాదాత్మకములుగా పఠించియుండెడివారనుట కవకాశము నిచ్చుచున్నది. అవి ధర్మబోధకములుగా ఎక్కువ కన్పట్టును. యాగాంతమున యాగదర్శనలాలసులైన ప్రజానీకము నుద్దేశించి అట్టి ధర్మబోధ జరిగియుండెడిదేమో! దానికై అభినయాత్మకముగను, సంవాదాత్మకముగను పఠనము జరిగియుండవచ్చును.

"క్రమపరిణామము లేదుకావున ఈ వాదము ఆదరింపవలసినది కాకపోవచ్చును. కాని ఇవి నాటకోత్పత్తికి ఏదో రూపమున బీజము లగుననుటమాత్ర మంగీకరింప వలసినదే." (శ్రీ K. V. R నరసింహంగారు) - ఋత్విజులు సంవాదసూక్తములను పఠించి రనుట కెట్టి యాధారములు లేవనినారు.[1] కాని నాట్యశాస్త్రమున భరతుని యొకమాట -

---

1. సాహిత్యదర్శనము. పుట-422

ప్రకారమేతదిచ్ఛామో భూతలే సంప్రకీర్తితమ్।

తిథియజ్ఞక్రియా స్వేవం యథా స్యాన్మంగళం శుభమ్॥ నా.శా. 36-58

అని నహుషుడు బ్రహ్మను కోరినట్లు కలదు. నహుషుని, బ్రహ్మను మనము తొలగించి, ఆలోచించినను "మంగళకరములైన తిథులందును, యాగక్రియలందును ప్రయోగము కొఱకు" అన్న భరతునిమాట సమకాలీన పరిస్థితులకు ప్రతిబింబ మనవచ్చును. కావున నీ వాదము సర్వాంగ సుందరము కాకపోయినను అస్తిత్వమునకు మాత్రము లోపము లేదు.

పౌరాణికోత్పత్తి

పౌరాణిక సూతుని కథాకథన సంవిధానమే నాట్యోత్పత్తికి మూలమని ఆచార్య ఆర్.వి. జాగీర్‌దార్ అభిప్రాయము.[1] సూతుడు శౌనకాది మహర్షులకు కథలను చెప్పుచు తాను సూత్రధారుడుగా ప్రారంభించి, ఆపై తాను తప్పుకొని పాత్రములను ప్రవేశపెట్టును. కొంతదూరము వారి సంవాదము సాగి, ఆగినపిమ్మట మరల తాను కల్పించుకొని పాత్ర పరిచయము చేసి తప్పుకొనును. సంస్కృతరూపకములలో ప్రధానములైన ప్రస్తావనా-ప్రవేశక-విష్కంభాదులను సూతుడు నిర్వహించుచున్నాడని దానినిబట్టి తెలియును. కనుక ఇట్టి సూతుని కథనమునుండి రూపకోత్పత్తియని జాగీర్‌దార్ అభిప్రాయము. కాని మహాభారతదశలోనే సూతుని ప్రసక్తి (అనగా భారతము యొక్క మూడు దశలలో చివరిది మహాభారతదశ) అనియు అది క్రీ॥శ॥ 2వ శతాబ్దికి సంబంధించినదనియు, నాట్యశాస్త్రము అంతకు పూర్వమే రచింపబడిన కారణముగను, అప్పటికే ఏవో లక్ష్య గ్రంథము లుండియుండునను సిద్ధాంతము ననుసరించి సైతము—సూతుని కథనమునుండి నాట్యోత్పత్తి నంగీకరించుట తగదని సాహిత్య దర్శనకర్త వాదము.

మతపరమయిన వాదము :

సంస్కృతమున శృంగార ప్రధానములైన నాటకాదులలోని విదూషకపాత్రము నాధారముగా చేసికొని కొందఱు మతపరముగ రూపక ప్రాదుర్భావమును నిర్ణయింప ప్రయత్నించిరి. మతపరమయిన "మహావ్రతము" అను వ్రతమునందలి బ్రాహ్మణ వటువునకును, విదూషక పాత్రమునకును సంబంధమున్నదని కొందఱి

1. సాహిత్యదర్శనము పుట-426.

వాదము. కాని ఇది యుక్తము కాదు. గ్రుడ్డివారు ఏనుగును చూచి వారు పట్టుకొనిన అవయవమునే ఏనుగుగా భావించినట్లుగా ఈ వాదము కనిపించును. యథార్థమునకు విదూషకపాత్రము వ్రతముతోను, మతముతోను సంబంధము కలదికాదు. అది కేవలము హాస్యమునకై నిర్దేశింపబడినది.

ఇంతవరకు సుదాహరింపబడిన వాదములన్నియు నొకతీరున సాగినవి. ఇక వేరొకరీతిగ సాగిన వాదములు మరికొన్ని కలవు. వాటికి లౌకికవాదములని పేరిడి వానినిగూర్చి ఆలోచించెదము.

లౌకిక వాదము:

నాటక ప్రస్తావనయందలి సూత్రధార పదము నొక్కదాని నాధారముగా స్వీకరించి Pischel మహాశయుడు బొమ్మలాటల నుండి (Puppet plays) రూపకము లావిర్భవించినవవినాడు. బొమ్మలాటలు తోలుబొమ్మలాటలు, కొయ్య బొమ్మలాటలు అని రెండువిధములు. ఈ రెండును సూత్రధారునిమీద (అనగా ఒక వ్యక్తి త్రాటితో బొమ్మలను పట్టుకొని ఆడించవలెను.) ఆధారపడినవే. కాలక్రమమున బొమ్మల స్థానమున మనుష్యులు వచ్చినను ఆ సూత్రధార పదమట్లే నిలిచిపోయినదని (పిస్కెల్) వారి అభిప్రాయము.

ఇంతవరకును యుక్తమేకాని యీ వాదమునకు సూత్రధార పద మొక్కటి తప్ప మరే యాధారమును కన్పింపవు. అంతేకాక సూత్రధారపదమునకు త్రాడు పట్టు కొనెడివారు అని అర్థముమాత్రము కాక, అది నేటి చలనచిత్రదర్శకునివలె దర్శకుడు అను అర్థమున ప్రయోగింపబడినదను పింగళి లక్ష్మీకాంతంగారి యభిప్రాయము గమనింపదగినది.[1]

పాశ్చాత్య పండితుడు లూడర్స్ (Luders) ఛాయా నాటకములనుండి (Shadow plays) నాటకము లుద్భవించెనను వాదమును ప్రారంభించినాడు. పతంజలి తన భాష్యమున వాడిన "శౌభిక" పదము నాధారముగొని ఈ మతము బయలుదేరినది. చలనచిత్ర సంబంధమైన ఈ శౌభికపదము ఛాయాచిత్రములను సూచించునది. దానినిబట్టి ఛాయాచిత్రములనుండి రూపకము లుద్భవించినవని యతని అభిప్రాయము.

---

1. సాహిత్యశిల్ప సమీక్ష. P-248.

కాని ఇదియు అంత యుక్తము కాదు. ఒక్క శౌభిక పదము నాధారముగా ఛాయాచిత్రములనుండి నాటకము లుద్భవించెననుట సమంజసము కాదు. మీదు మిక్కిలి నాటకములనుండియే ఛాయాచిత్రము లేర్పడియుండును కాని ఛాయాచిత్రములు నుండి నాటకము లేర్పడి యుండవు. ఛాయాచిత్రములు ప్రతిభా పరిణతిని సూచించెడివి. అంతేకాక పతంజలి కాలమునకు ముందే నాటకములున్నట్లు ఆధారము లనేకములు లభించుచుండగా ఒక్క శౌభికపదము నాధారముగా చేసికొని ఛాయాచిత్రములనుండి రూపకము లుద్భవించెననుట యుక్తియుక్తముకాదు.

పై వాదములన్నియు నాటకములు భారతదేశభావసారములే యను ఏకాభిప్రాయము కలిగిన వ్యక్తుల భిన్నాభిప్రాయములు. ఏకత్వములో భిన్నత్వమును సూచించెడివి. కాని ఆ భావసారమును సైతము అంగీకరింపక భావదాస్యమునకు ప్రాధాన్యమిచ్చి, విదేశీ ప్రభావమువలననే భారతదేశమున నాటకము లుద్భవించెనను వాదము మఱియొకటి కలదు. గ్రీకుప్రభావమువలన సంస్కృత నాటకోత్పత్తి యైనదని వీరి యభిప్రాయము.

గ్రీకుప్రభావ వాదము :

ఈ వాదమునకు ప్రవర్తకుడు వీబర్ (Weber). అలెగ్జాండరు దండయాత్ర ఫలితముగా భారతీయులపై గ్రీకు రూపక ప్రభావము పడినదని, గ్రీకు రూపకములకన్న సంస్కృతరూపకము లార్వాచీనములై యుండుట సైతము ఈ వాదమును సమర్థించు చున్నదని వీబర్ అభిప్రాయము. యవన, యవనికాశబ్దములు గ్రీకు ప్రభావమునకు ప్రత్యక్ష సాక్షులని వీబర్ నొక్కి వక్కాణించినాడు. విండిట్ష్ పండితుడును గ్రీకుల న్యూకామెడీశాఖ భారతీయుల రూపకోత్పత్తికి ఆధారమని వీబర్ అభిప్రాయమును సమర్థించినాడు.

అనేక విషయములలో గ్రీకు రూపకములకు, భారతీయరూపకములకు సామ్య మున్నమాట వాస్తవము. కాని ఈ రెండింటి సాదృశ్యముకన్న ప్రధానమైన వైదృశ్యమే యెక్కువ కన్పించుచున్నది. సాదృశ్యము బాహిరము కాగా వైదృశ్యము అంతరము[1]. బాహ్యవిషయములకన్న ఆంతరంగికములకే ప్రాధాన్యము కదా! పిస్కెల్, కీత్ మొదలగు పాశ్చాత్యపండితులే యీ గ్రీకు ప్రభావము నంగీకరింపలేదు. ఆ వైదృశ్యములలో ప్రధానమైన విషయముల నాలోచింతము.

---

1. తెలుగునాటక వికాసము - పేజీ 66

భారతీయనాట్యము ధర్మబోధనప్రధానముగా, వినోదము ఆనుషంగికముగా నుద్భవించినది. గ్రీకులకు వలె Tragedy పోటీలు సంస్కృతరూపకకర్తలకు పరిచితములు కావు. నాట్యశాస్త్రము అనేకనాట్యగృహముల (Theatres) ను గూర్చి ప్రస్తావించినది. గ్రీకులకు రంగస్థలము లేదు. గ్రీకురూపకములలోని ఐక్యత్రయము సంస్కృతరూపకములలో లేదు. ఇది వివిధకాల వివిధదేశములకు సంబంధించును. గ్రీకులరూపకములలో ప్రధానమైన కోరస్ సంస్కృతరూపకములలో లేదు. భారతీయ రూపకభేదములు గ్రీకురూపకములలో లేవు. గ్రీకు రూపకము లెక్కువ విషాదాంతములు కాగా సంస్కృతరూపకములలో విషాదాంతత మచ్చుకైనను కానరాదు. అసలు ఏ యవనికాశబ్దమును ప్రధానముగా గొని వాదము ప్రారంభమైనదో ఆ యవనిక (తెర) గ్రీకులరంగస్థలమున కాని, రూపకములలో కాని కనిపించదు. అది భారతీయులదే!

విషయము పరోక్షమైనపుడు భిన్నాభిప్రాయములు వెల్వడును. ఎవరి అభిప్రాయమునకు దగిన ఆధారము వారి కుండును. కాని హేతువాదమునకు, శాస్త్రీయ చర్చకు నిలవగలిగినది తాత్కాలికముగా నైన సిద్ధాంత మయ్యెడి అవకాశ మున్నది. కాని ప్రతిభావమునకు మరల ఎవరో యొకరి ఖండనము కన్పించుచునే యున్నది. కనుక లభ్యమానమయిన సాహిత్యములో (అక్షరరూపమయినదానిలో) ఏది ప్రాచీనమో దానిలో ప్రకృతవిషయమునకు సంబంధించిన మౌలికత ఎంతమాత్రమున్నను దాని నాదరించుట న్యాయము. ఆ మౌలికత ఆధారముగా రూపకము ప్రాదుర్భవించియుండ వచ్చును. లేదా సంబంధము లేక పోవచ్చును. కాని ప్రకారాంతరము లేని కాలమున మౌలికతను సైతము తృణీకరించుట మూలచ్ఛేదమే యగును. కనుక వైదిక సంవాద సూక్తములు నాట్యోత్పత్తికి మూలములనుట సమంజసముగా తోచుచున్నది.

రూపక మన నేమి ?

శాబ్దికముగ ఈ ప్రశ్నకు సమాధానమును చెప్పుకొనవలసియున్నది. 'రూప్' ధాతువుపై 'ణ్వుల్' ప్రత్యయమును చేయగా రూపకశబ్దము సిద్ధించుచున్నది. ఇది ప్రాచీనకాలము నుండియు ప్రయోగములలో కన్పించుచున్నను నాడు అర్థస్పష్టతను పుంజుకొన లేకపోయినది. ఏదేని యొక కళా ప్రదర్శనమను నర్థమున నిది ప్రాచీన కాలమున నుండెడిది. కాని దశరూపకకాలమునుండి ఆ రూపకపదము అంతవరకున్న నాట్యపదమును త్రోసిరాజని తాను అభినయజాతివాచక మయినది.

ఆధునిక కాలమున ఆ రూపకపదమును సైతము కాదని వ్యక్తివాచక మయిన నాటకమే జాతివాచకమై దశవిధరూపకములను చెప్పుచున్నది.

భరతుడు 'రూప' పదమును, విస్తృతముగా నాట్యపదమును రూపక పద పర్యాయముగా ప్రయోగించినాడు. ధనంజయుడు రూపకపదమును వాడినాడు. రూపకపదమును నిర్వచించుచు రసార్ణవసుధాకరకర్త -

యథా ముఖాదౌ చంద్రాదే రారోపే రూపకప్రథా।
తథైవ నాయకారోపే నటే రూపక ముచ్యతే॥ రసార్ణవ. 3-2.

అనగా రూపకాలంకారములను, రూపకములను పోల్చి చెప్పెను. ముఖమున చంద్రత్వము నారోపింపగా రూపక మనుచున్నాము. అట్లే నటునియందు నాయకారోపణమే రూపకమని యతని అభిప్రాయము.

అభినవభారతి (నాట్యశాస్త్ర వ్యాఖ్య) రచించిన అభినవగుప్తుడు అనుకరణ పదమును బాగుగా విశ్లేషించి కడకు అనుకరణ మనగా అనువ్యవసాయము లేక అధ్యవసాయ మని తేల్చినాడు[1]. కనుక నాయకానువ్యవసాయము కాని నాయకాధ్యవసాయము గాని చేసి అభినయించుటయే రూపకము.

రూపక ప్రాచీనత :

నాట్యవేదమును ప్రపంచమునకు ప్రసాదించిన విశ్వకర్త 'అమృతమంథన' సమవకారమును, త్రిపురదాహమను డిమమును రచించెనట. సరస్వతీదేవి 'లక్ష్మీ స్వయంవర' నాటకమును రచించెనట.

నాట్యశాస్త్రప్రణేత యైన భరతుడు 'కామదగ్న్యవిజయవ్యాయోగ'మును 'శర్మిష్ఠా యయాతి' అను అంకమును, 'కుసుమశేఖరవిజయ'మను ఈహామృగమును రచించెనట. రామాయణము నాటకీకృతముగా ఒక కాలమున నున్నట్లు హరివంశము వర్ణించు చున్నది[2]. గౌతమబుద్ధుని కాలమున సౌగంధికాపహరణమను రూపకము ప్రదర్శింపబడెనట. 'కంసవధము', 'బలిఖండము' లను రూపకములను పాణిని రచించినట్లు కలదు. వరరుచి 'ఉభయాభిసారికా' భాణమును రచించినాడు గదా!

---

1. వివరములకు చూడుడు – "నాట్యప్రక్రియ – అనుకరణవైలక్షణ్యము"
నాట్యకళ — జూలై '75

2 గీర్వాణ రూపకము - పుట 10.

దీనినిబట్టి అతి ప్రాచీనకాలమునుండియు రూపకములు, తత్ప్రదర్శనలు నుండెడివని స్పష్టమగుచున్నది.

రూపక భేదములు :

సాహిత్యముయొక్క పరమప్రయోజనము రసానందసిద్ధి - అఫలమును చేకూర్చుటకు వివిధ ప్రక్రియలను కవులు సమాదరించిరి. కవులు ఏ ప్రక్రియ ననుసరించినను సహృదయులు దాని నింద్రియముల ద్వారమున ఆస్వాదింతురు. ఆ యింద్రియములు ప్రధానముగ రెండు. 1) శ్రవణము, 2) నయనము. ఇందు శ్రవణేంద్రియ సంతర్పణ మొనర్చి హృదయగమ్యమై ఆనందప్రదమగునది కావ్యము. శ్రవణేంద్రియమునే గాక నయనేంద్రియమును సహితము తృప్తి పరచుచు సహృదయ నైవేద్యమై రసానుభూతిని కలిగించునది రూపకము. రూపకము అను పదమునందే 'ప్రత్యక్షీకరించునది' అను నర్థ మిమిడియున్నది. ఈ రూపకములను ప్రాచీనులు ఇతివృత్త భేదమును పురస్కరించుకొనియు, నాయకభేదమును బట్టియు, రసభేదమును బట్టియు పదివిధములుగ విభజించిరి. వానినే లాక్షణికులు దశరూపకములని పేర్కొనిరి. భారతీయసాహిత్యలాక్షణికులకు పరమప్రామాణికుడైన భరతుడు

నాటకం సప్రకరణ మంకో వ్యాయోగ ఏవ చ
భాణః సమనకారశ్చ వీథీ ప్రహసనం డిమః
ఈహామృగశ్చ విజ్ఞేయో దశమో నాట్యలక్షణే ॥ నా.శా. 1-86

అని దశవిధరూపకములను పేర్కొనినాడు. వీటిలో నాటక మన్నికోణముల నుండి శ్రేష్ఠమైనది. కావుననే ప్రథమస్థానము వహించినది. ఈ నాటకమందు ప్రఖ్యాతమైన ఇతివృత్తముండి, ధీరోదాత్తనాయకు నాలంబనముగ చేసికొని, శృంగార వీరరసములలో నొకటి ప్రధానముగ పోషింపబడును. ఇతరరసము లంగములుగా పోషింపబడును.

మిగిలిన ప్రకరణాదులు ఇతివృత్త, నాయక, రసాదులను బట్టి భేదిల్లినవి.

ప్రకరణమందు : ఇతివృత్తము ఉత్పాద్యము. ధీరశాంతుడు నాయకుడు. శృంగారరసమునకే ప్రాధాన్యము.

భాణమునందు : ఉత్పాద్య మితివృత్తము. ధూర్తవిటుడు నాయకుడు. శృంగార వీరములు సూచనామాత్రముగ నుండును.

ప్రహసనమందు: ఉత్పాద్య మితివృత్తము. పాషండ ప్రభృతులు నాయకులు. హాస్యరసము ప్రధానము.

డిమమునందు: ప్రఖ్యాతేతివృత్తము. దేవగంధర్వపిశాచాదులై ధీరోద్ధతులైన 16గురు నాయకు లుందురు. రౌద్రము ప్రధానముగను, శృంగార వీరములు ఆనుషంగికముగ పోషింపబడును.

వ్యాయోగమునందు: ఇతివృత్తము ప్రఖ్యాతమైనది. ధీరోద్ధతుడు నాయకుడై యుండును. వీరరసము ప్రధానముగ నుండును.

సమవాకారమునందు: కల్పితము గాని, ప్రసిద్ధము గాని ఇతివృత్తము కావచ్చును. దేవాసురాదులు 12 మంది నాయకులు. వీరరసము ప్రధానముగ పోషింపబడును.

వీథియందు: ఇతివృత్తము ఉత్పాద్యము. ధీరోద్ధతుడు నాయకుడు. శృంగారము సూచింపబడును.

అంకమునందు: ఇతివృత్తము ప్రఖ్యాతము. నాయకుడు ప్రాకృతజనుడు. కరుణరసము ప్రధానము.

ఈహామృగమునందు: మిశ్రమైన ఇతివృత్తము. ధీరోదాత్తుడు నాయకుడు. శృంగార రసాభాసము పోషితమగును.

ఈ రూపకభేదములు కాక ఉపరూపక భేదములు ననేకములు కలవు. అవి మీద ప్రకరణవశముగా వివరింపబడును.

ప్రథమ రూపకము భాణమే

పువ్వు పుట్టగనే పరిమళించుట సహజమే యైనను, పువ్వు ఆ దశకు చేరుటకు ముందు ఎంతయో క్రమవిధాన ముండును. కళాతత్త్వమైనను శాస్త్రతత్త్వమైనను క్రమవికాసము లేకుండ ఒక్కుమ్మడిగా పరిణతదశతోనే ఆవిర్భవించునను వాదమును తాత్త్వికులును అంగీకరించరు. వర్ధమానవిషయములను ప్రత్యక్షముగా పరిశీలించి నపుడు వానిలో క్రమవికానము కన్పట్టుచుండును. దీని ననుసరించి హేతుబుద్ధితో అప్రత్యక్ష విషయములందు నిత్యము క్రమవికాసమును గుర్తించుటకు మానవుడు యత్నించును. దశరూపక పరిణామమునందు సైతము ఈ క్రమవికాసము నూహించుట సమంజసము. ఈ దృష్టితో దశరూపక పరిణామమును పరిశీలించినచో అందు భాణము మొదటిదశయా అను ఊహ కలుగును. ఈ విషయమే యిట పరిశీలించబడును.

సంస్కృతమునందు, సాహిత్యముయొక్క లక్షణనిర్దేశమును, విమర్శనమును భరతునితో ప్రారంభమగును. నాట్యశాస్త్రమున భరతుడు దశరూపకములను పేర్కొని లక్షణనిర్దేశ మొనరించినాడు. కాని వాటి కుదాహరణములు సూచింపలేదు. స్థలాంతరమున సూచించిన త్రిపురదాహ మనుడిమము, అమృతమంథన మను సమవకారమును అలభ్యములు. అంతియే గాక అని దైవకర్తృకములుగా చెప్పబడినవి. కావున రూపక క్రమవికాసము కేవల మూహింపబడవలసినదే గాని ఇదమిత్థముగా నిర్దేశింప వలను పడుట లేదు.

ఆలంకారికులందఱును నాటకము సర్వరూపకములకు మూలమని భావించినట్లు కన్పట్టును. కాని అది సత్యదూర మని ఆధునికవిమర్శకుల యభిప్రాయము. కాని ఆలంకారికు లట్లనుట లోని భావము ముందు నాటక ముద్భవించి తరువాత మిగిలిన వుద్భవించిన పనుట కాదు. వారు ఆమాట నన్న తీరు, సన్నివేశము వేరు.

> జ్ఞేయం ప్రకరణం చైవ తథా నాటక మేవ చ
> సర్వవృత్తివినిష్పన్నం నానావస్థానమాశ్రయమ్. నా.శా. 20-7

ఇది నాట్యశాస్త్రమునందు భరతుని వచనము. సర్వవృత్తివినిష్పన్నత, నానా వస్థానమాశ్రయత అనునని నాటకప్రకరణములందే యున్నవని భరతుని

యభిప్రాయము. మిగిలిన రూపకము లట్టివి కావు. సర్వవృత్తివినిష్పన్నము నాటక మనుటయే నాటకము క్రమవికాసజన్యమే కాని ఒకేమారు సర్వాంగ సమగ్రముగా నావిర్భవింపలేదను విషయమును నిరూపించుచున్నది. అంతియే గాని నాటక ప్రకరణములు ప్రథమజాతము లనలేదు. వాని నట్లనుటలో గల స్వారస్యమును అభినవగుప్తుని మాటల భావమునుండి మనము గ్రహింపవచ్చును.

* దశరూపకపదమునకు వ్యాఖ్య చేయుచు దశరూపమనగా కావ్యము యొక్క పదిరూపములనియు, నాటకాదులకు చెప్పిన లక్షణములు నియతములు కావనియు, పరస్పరసాంకర్యము సంభవించుననియు, వీథ్యంగము లన్ని రూపకములందును కలవనియు, ఆకాశభాషితములందు భాణము కన్పట్టుచున్నదనియు అభినవగుప్తుడు వివరించినాడు.

ఇట్లు ఏకముఖములైన భాణాదుల లక్షణములు సమష్టిరూపమున నాటకాదులలో నుండుటచే నాటక ప్రకరణములకు భరతుడు ప్రాధాన్య మిచ్చినాడు. కాని నాటకము మొదటిదని యాతని యభిప్రాయము కాదు. నాట్యోత్పత్తి కథను వచించుచున్న భరతుని యీ క్రింది పలుకులను పరిశీలింపుడు.

మయా సమవకారస్తు యోఽయం సృష్ట స్సురోత్తమ।
శ్రవణే దర్శనే చాస్య ప్రసాదం కర్తు మర్హసి॥
పూర్వరంగే కృతే పూర్వం తత్రాయం ద్విజసత్తమాః।
మయా త్రిపురదాహశ్చ డిమసంజ్ఞః ప్రయోజితః॥ నా.శా. 4అ. 7,10

ఈ శ్లోకములను బట్టి దేవతలచే సమవకారము, డిమము అనునవియే ముందు ప్రయోగింపబడినవనియు, నాటక ప్రకరణములు కావనియు తెలియుచున్నది. భరతు డిట్లు అమృతమంథన సమవకారమును, త్రిపురదాహ డిమమును నామమాత్రముగా నిర్దేశించెనో లేక నాటి సమాజమున నున్న వాటిని నిర్దేశించెనో నిర్ణయించుట కష్టము. దీనినిబట్టి సమవకారడిమములే ప్రథమములను నభిప్రాయమును సయితము కొందరు ప్రకటింప వచ్చును. అది వేరు విషయము. మొత్తముమీద భరతుని దృష్టిలో నాటక ప్రకరణములు మూలభూతము లనుట సమంజనము కాదని స్పష్టము.

---

* చూడుడు: P 509 నా॥శా॥ గుప్త భావప్రకాశికా సహితము
by P. S. R. అప్పారావుగారు

దశరూపకలక్షణములను వచించిన యితరాలంకారికు లందరును నాటక ప్రకరణములనే ముందు తెల్పిరి. అంతమాత్రమున అవి మొదటివని వారి యభిప్రాయము కాదు. దశరూపకకర్తృవచనములను పరిశీలించిన ఈ అభిప్రాయము స్పష్టపడును.

ప్రకృతిత్వాదథాన్యేషాం భూయోరసపరిగ్రహత్ ।
సంపూర్ణలక్షణత్వాచ్చ పూర్వం నాటక ముచ్యతే ॥ ద. రూ. 3-1

సంపూర్ణలక్షణము కలిగి యుండుటచే నాటకమును ముందు చెప్పి, అంతకంటె తక్కువ లక్షణములు గల ప్రకరణాదులను తరువాత చెప్పుచున్నాడు. ఇది లక్షణకర్త ధర్మము.

సంస్కృతలాక్షణికులు లక్షణనిర్దేశమునందు సౌలభ్యమునే కాంక్షించిరి. కాని క్రమవికాసమును, కాలమును దృష్టియం దిడుకొనలేదు. "ప్రకృతివద్వికృతిః కర్తవ్యా" అను మీమాంసాన్యాయ మిప్పట్టున వీరికి మార్గదర్శకమైనది. కావుననే ధనికుడు పై శ్లోకములకు వ్యాఖ్య వ్రాయుచు "ఉద్దిష్టధర్మకం హి నాటక మనుద్దిష్టధర్మాణాం ప్రకరణాదీనాం ప్రకృతిః" అని నాటకమును ప్రకృతి యనినాడు. ఇదియు లక్షణనిర్దేశ దృష్టితో నన్న మాటయే కాని ప్రాథమ్యమును దృష్టిలో నుంచుకొని యన్న మాట కాదు.

ఈ విషయమును రసార్ణవసుధాకరకర్త ఇంకను స్పష్టపఱచినాడు. "సాక్షాదుప దేశముచే ధర్మసమన్వయము పొందుట వలనను, అంగాంగిభావరూపమున అన్ని రసములును సంసన్నములై యుండుట వలనను, ప్రకృతులు, అవస్థలు సంధులు మున్నగు వానితో కూడియుండుట వలనను, ప్రకరణాదులగు దృశ్యములు అన్నిటికి నాటకమే మూలమని పండితు లందురు. అతిదేశబలమున వచ్చిన నాటక పుటంగముల ననుసరించి యుండుటచే తక్కిన రూపకము లన్నియు నాటకము యొక్క వికారము లగుచున్నవి. కావున నాటకము యొక్క లక్షణమే తొలుత చెప్పబడుచున్నది. *- (ర.సు. బు.వేం. గారి అనువాదము P. 897).*

దశరూపక లక్షణములలో నాటకము యొక్క లక్షణములు సమగ్రములైనవి అనియు, కావున మొట్టమొదట నాటకలక్షణములు చెప్పుచున్నా ననియు ర.సు.కర్త అభి ప్రాయము కదా! అతడు ప్రథమజాతము నాటక మనలేదు. ప్రతాపరుద్రీయ కర్తయు "నాటకము సర్వప్రకృతి" యనుట లక్షణనిర్దేశదృష్టితోడనే యని గ్రహించుట సమంజసము.

అట్లు లక్షణనిర్దేశసౌలభ్యమునే ఆలంకారికులు దృష్టియం దిడుకొనిరి. కాని క్రమవికాసమును గాని, కాలము యొక్క పౌర్వాపర్యములను గాని దృష్టియం దిడుకొని రచన గావింపలేదు. ఒక దృక్పథమును బట్టి అది కొంతవరకు వారి లోపమే యనక తప్పదు. ఆ లోపమును తీర్చుటకు ఆధునికులు యథాశక్తి కృషిచేసిరి. విభిన్న కోణముల నుండి వేర్వేరు అభిప్రాయములను వ్యక్తపరచిరి. ఆ అభిప్రాయములను పరిశీలించిన భాణస్థానమును నిర్ణయింపగల్గుదుము.

ఈ విషయమున K.H.ధ్రువ యిట్లభిప్రాయపడెను. "ప్రప్రథమమున ఏకాంక రూపకమే యుండెను. ఋషులు నిత్యకర్మలు నిర్వర్తించిన పిదప విశ్రాంతి సమయములో వినోదార్థము రూపక ప్రదర్శనము విలోకించెడివారు. క్రీ॥పూ॥ 8వ శతాబ్దములో రచింపబడిన మధ్యమవ్యాయోగము కేవలము సంస్కృతభాషలోనే యున్నది. ఏకాంకరూపకమే విశేషాంకరూపకముగా పరిణమించిన పిమ్మట రూపకమే జీవికగా గల నటులు నగరములోని సహృదయుల సమక్షమున ప్రదర్శనలు చేసెడివారు. భవన ప్రదర్శనమునకు మాత్రము ఏకాంకిక సరిపోయెడిది. సంధ్యా సమయమున ప్రదర్శన లేర్పరించుటచే అనేకాంకములతోఁ గూడిన దీర్ఘ రూపకముల కవకాశము లేదు." *(గీర్వాణరూపకము పే. 82)*

వీరి యభిప్రాయము ననుసరించి రూపకములలో మొట్టమొదట పుట్టినవి ఏకాంకములు. అవి వ్యాయోగ, అంక, వీథీ, ప్రహసన, భాణములు. (వీనిలో "లటక మేళకము" మున్నగు ప్రహసనములు రెండంకములను సయితము కల్గియున్నవి.) మరల వీనిలో ఏది మొదటిది అనునది విచారణీయము. అంకములను బట్టి గాక పాత్రములను బట్టి చూచినచో "భాణ"మే మొదటిదను అభిప్రాయ మేర్పడును. వీనిలో "భాణ" మేకపాత్రప్రయోజ్యము. వీథియు ఏకపాత్రప్రయోజ్యమే కాని ఒక్కొక్కచో ద్విపాత్రప్రయోజ్యము కూడ నగును. ఈ రెంటిలో ద్విపాత్రప్రయోజ్యత ఆంతర్యమును సూచించునే కాని ప్రాథమ్యమును కాదు. ఇంతకును K.H.ధ్రువ గారి యభిప్రాయమున ఏకాంకికలు మొదటివి. ధ్రువ గారి యభిప్రాయమును ధ్రువ పరచునదీ "భాణ"ము మొదటి దను నూహ.

ఈ విషయమును సమర్థించెడి వాద మింకొకటి కలదు. అది డా॥ ఘోష్ గారి అభిప్రాయము. వారి దృష్టిలో దశరూపక పరిణామ మీవిధముగా నున్నది.

1) ఏకాంకము - ఏకహార్యము - భాణము

2) ఏకాంకము – ఏక ద్విపాత్రహార్యము - వీథి
3) ఏకాంకము – బహుపాత్రహార్యము – వ్యాయోగప్రహసనములు, ఉత్సృష్టికాంకము
4ఎ) అసంబద్ధములైన 3 అంకములు – బహుపాత్రలు – సమవకారము
4బి) అంతగా అసంబద్ధములు కాని 4 అంకములు – బహుపాత్రలు - డిమము, ఈహామృగము
5) సుసంబద్ధములైన 5 నుండి 10 అంకములు – బహుపాత్రలు – నాటక ప్రకరణములు *(తెలుఁగు నాటక వికాసము పుట 75)*

ఈ ఊహ సమంజసము, సత్యసన్నిహితముగా తోచుచున్నది. రసములను దృష్టియం దిడుకొని యూహించినను భాణమే ప్రథమ మనుట యుక్తియుక్తముగా నున్నది. రసములలో సర్వప్రాణిసహజము, స్వయంలబ్ధసామగ్రీయుతము శృంగారము. అది అనతిక్రమణీయము. కావున అట్టి శృంగారమును ప్రధానము చేసికొని ప్రథమమున ఏకహార్యము, ఏకాంకమునైన భాణ ముద్భవించిన దనుట యుక్తము. వీథి కొంచె మించుమించు అట్టిదే కావున భాణము తర్వాతిదశ వీథి యన చెల్లును. దానికి ఈ క్రింది రెండును కూడ కారణము లనదగును 1.రసార్ణవసుధాకరకర్త వీథిలో సామాన్యను గాని, పరకీయను గాని నాయికగా అంగీకరించినాడు. 2.కావ్యానుశాసనకర్త వీథియందు పాత్రసంఖ్యాభేదమును బట్టి ఆకాశభాషితమును గాని, ఉక్తి ప్రత్యుక్తులను గాని ఆశ్రయింపవలె నన్నినాడు. దీనినిబట్టి భాణము యొక్క తర్వాతి రూపమే వీథి యనిపించును. వాని నుండి జనించినది ప్రహసనము. ఇది హాస్యప్రధానము. శృంగారమునకు హాస్య మత్యంత సన్నిహితము కదా !

కాని భాణము కంటే ముందు వీథియే ఉద్భవించియుండునని డా|| రాఘవన్ అభిప్రాయపడిరి. వారి అభిప్రాయ మిది. "సంఘములోని వివిధవ్యక్తుల ఆచార వ్యవహారములను, మనస్తత్త్వములను, విశిష్టసంప్రదాయములను అవహేళన చేయుటకై వీథి మొదట ఏకహార్యముగా జనించినది. ఆపై కొంతకాలమునకు ద్విహార్య మయినది. ఏకహార్యమైన వీథినుండి భాణమును, ద్వీహార్యమయిన వీథినుండి ప్రహసనము ఉద్భవించినవి. వీథి, భాణ, ప్రహసనాదులు క్రమముగా నాటకాంగము లైనవి. వీని క్రమ పరిణామమే ప్రకరణమునకు దారి తీసినది. ఆ పై వీరతాప్రధానములైన సమవకార, ఈహామృగ, వ్యాయోగ, డిమములు క్రమముగా

జనించి తత్పుచ్ఛభూతముగా ఉత్సృష్టికాంక మేర్పడినది. తత్క్రమపరిణామమే నాటకము.”

ఇట్లు ఏకహార్యమైన వీథినుండి భాణము, ద్విహార్యమైన వీథినుండి ప్రహనసము జనించినవని చెప్పుటకంటె, మీదచెప్పబడిన ఆధారములను బట్టి వీథియందును భాణలక్షణములు కన్పించుచునే యున్నవి కాన ఏకహార్యమైన భాణమునుండియే విస్తృతస్థితిలో ద్విహార్యమైన వీథి జనించిన దనుట సత్యసన్నిహితము. రెండు పాత్రలుండుట వలన ఏకహార్యమైన భాణముకంటె వీథి అభివృద్ధిని సూచించుచున్నది.

ఈ అభిప్రాయమునే మాంకడ్ ఊహ పోషించుచున్నది. మాంకడ్ దృష్టిలో మొదటిది భాణమే. అందులకు కారణములు రెండు. 1) ఇతివృత్తము స్వల్పమగుట 2) రచనాసౌలభ్యము. ఇవి కారణములుగా ఏర్పడి భాణము ఆకాశ భాషితాదులను చేర్చికొనినది. దీని పర్యవసానముగ సంవాదాభాస సంయుక్తమైనది. కాని శ్రవ్యతాలక్షణమును సంపూర్ణముగ వీడలేదు. కావున దశరూపకములలో ప్రాచీనమైనది, ప్రథమమైనది భాణమని చెప్పుట సమంజసము. భాణమునుండి ప్రహసనము, వీథినుండి అంకము జనించినవి. ఆపై వ్యాయోగ డిమ ఈహామృగ సమవకార ప్రకరణ నాటకము లేర్పడినవి. ఇది మాంకడ్ సూచించిన దశరూపక క్రమపరిణామము.

ఉన్నంతలో వివేచనకు ఈ వాదమే సమంజసమనిపించును. దీని కుపబలకము లైన కారణము లింకను గలవు.

ఋగ్వేదములో సంవాదసూక్తములును (యమయమీ సంవాదము), స్వగత సూక్తములును (అక్ష) కలవు. ప్రథమదశలో వైదికక్రియా నిర్వహణ సమయమున వినోదముకొఱకు స్వగత ప్రధానమైన రూపకము ప్రవేశపెట్టబడి యుండును. యజ్ఞతిథులలో నాటక ప్రదర్శన మున్నట్లు సంప్రదాయము లేదని విమర్శకు లందురు. కాని భరతుని నాట్యశాస్త్రమందలి యీ క్రింది శ్లోకము ఆ యాచారమున్న ట్లూహించుటకు వీలు కల్పించుచున్నది.

ప్రకాశ మేతదిచ్ఛామో భూతలే సంప్రకీర్తితమ్।
తిథియజ్ఞక్రియా స్వేవం యథా స్యాన్మంగళం శుభమ్॥ నా.శా. 36 అ. 58

భరతుని కాలమునకు ఆ పద్ధతి లేనిచో నహుషుడు ప్రత్యేకముగ తిథియజ్ఞ క్రియలలో ప్రదర్శించుటకొఱకే దాని నభిలషించునట్లు వ్రాయవలసిన ఆవశ్యక ముండెడిదికాదు. కనుక యీ సంప్రదాయమును భరతుడు పరోక్షముగ సూచించెననుట లెస్స. దీనినిబట్టి మొదట స్వగతాత్మకములయిన రూపకములు ప్రవేశించి యుండవచ్చును. వైదిక విషయములలో పెద్దగా ప్రయోజనములేని అక్షసూక్తము అట్టి స్వగతరూపము కావచ్చును. అందలి ఇతివృత్తము కూడ ఒక కితవుని స్వగతమగుట దీనికి సమర్థకమే. ఆ స్వగతమే ఆ తరువాత ఆకాశభాషితాదులను చేర్చికొని భాణరూపమున పరిణమించి యుండవచ్చును. ఆపై సంవాదసూక్తముల మూలమున ద్విహార్యములు బయలుదేరి యుండవచ్చును.

ఈ భాణము నృత్తప్రధానమని శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరము నుడువుచున్నది. నృత్త, నృత్య, నాట్యములు క్రమక్రమముగా పరిణత స్వరూపములు. తాళలయాశ్రిత మైన నృత్తము అభివృద్ధిచెంది, భావాశ్రయ నృత్యముగా మారి, ఆపై అవస్థానుకరణ రూపమైన నాట్యమైనది. ఈ వికాసమునకు నృత్తములు మూలము. భాణము నృత్త ప్రధానమను అతని అభిప్రాయమును దీని ప్రాథమ్యమునకు పోషకమగుచున్నది.

గ్రీకు నాటకకర్తలు చెప్పిన ఐక్యత్రయము (Unity of action, unity of time, unity of place) సంస్కృత రూపకములలో కన్పట్టదు. అర్వాచీనకాలమున గ్రీకులును ఈ విషయ మంతగా పట్టించుకొనలేదు. ప్రాథమికదశకు ప్రాణమైన దీ త్రయము. ఆ ప్రాణము భాణములలో సయితము కొంతకు కొంత కన్పట్టుట భాణముల ప్రాథమికత్వమునకు సాక్ష్యమగుచున్నది. భాణములలో స్థలైక్యము (Unity of place), కాలైక్యము (Unity of time) తప్పక పాటింపబడును. వర్ణనమే ప్రధానమగుటచే, ఒకే వాటికలో వర్ణింపబడుటచే ఇందు స్థలైక్యమునకు భంగము లేదు. అట్లే ఏకాంకము ఏకదివస ప్రవృత్తము అగుటచే కాలైక్యమునకు భంగము లేదు. మూడవది కార్యైక్యము (Unity of action). ఇది పరిణత రూపకములకు ప్రధానమైన విషయము. ఈ కార్యైక్యము సువ్యవస్థితము కాకపోవుటచే భాణము అపరిమితమనియు, ప్రథమమనియు తెలియుచున్నది. గ్రీకు రూపకములకు తెర లేదు కనుక అవి ఏకాంకప్రాయములే. అట్టివానికి వారు చెప్పిన లక్షణములు భాణ లక్షణమునకు దగ్గరగా నున్నవి. కావున భాణమే ప్రథమమనవలసి వచ్చుచున్నది.

గ్రీకు విషాదరూపకములు సయితము ఏక-ద్వి-త్రి పాత్రల రూపముతో పరిణామము నొందినవే. * ఇప్సిస్ ఒక నటుని, ఇస్కిలస్ రెండవ నటుని, సోపోక్లిస్ మూడవ నటుని ప్రవేశ పెట్టిరి. కనుక క్రమవికాసములో ఏకహార్యము ప్రథమ మను విషయమును గ్రీకు విషాదరూపకములు సయితము సూచించుచున్నవి. అట్టి ఏకహార్యమగు భాణము ఇచ్చట ప్రథమము కాక పోవునా?

భాణము దృశ్యతాశ్రవ్యతల మధ్యమ స్థితిని కలియున్నది. ఈ విషయము కూడ రూపకావిర్భావములో భాణము మొదటిదనుటకు ప్రబల సాక్ష్యమగును. భాణము నిజమునకు శ్రవ్యమే అనవలెను. శ్రవ్యకావ్య పఠనమువలన పాఠకున కెట్టి సంతృప్తి, ఆనందము కల్గునో భాణదర్శనము వలన సయితము సామాజికున కదే స్థితి కల్గును. అందలి నటుడు కొంచె మించుమించుగా వ్యాఖ్యాత వంటివాడు. మన పరోక్షమున జరిగిన విషయములను వర్ణించి చెప్పువాడే కాని ప్రత్యక్షముగా అభినయించి చూపువాడు కాదు. (ఇతని అభినయము వాచికాభినయ ప్రధానమైనది. ముఖ్యమైన సాత్త్వికాభినయ మిందు కన్పట్టుట లేదు.) కావున శ్రవ్యకావ్యము దృశ్యత్వ లక్షణములను సంపాదించుకొనుటలో భాణము ప్రథమదశ యగును. దృశ్యత్వలక్షణము రమ్యతా సంపాదనార్థమే కదా! అట్టి రమ్యత్వము సంపూర్ణముగా సంపాదించుకొన్నది నాటకము. కావుననే "కావ్యేషు నాటకమ్ రమ్యమ్" అనుట. అట్టి నాటకము ప్రథమ మనుట సమంజసము కాదు. నాటకము చతుర్విధాభినయ సంయుతము. అభినయచ్ఛాయ మాత్రము కల్గినది భాణము. కాన, శ్రవ్యత్వము నుండి కేవల వాచికాభినయచ్ఛాయతో దృశ్యత్వము అలవరుచుకొన ప్రయత్నించుచు శ్రవ్యత్వ దృశ్యత్వములకు నడుమ నిలిచిన భాణము రూపకములలో ప్రథమమనుట ఔచితీ సంపాదకము.

---

* సాహిత్య దర్పణము 517వ పుట

భాణ లక్షణము

భాణ స్వరూపము :

పఠనపాఠన ప్రాచుర్యమునకు నోచుకొనని కారణముగా భాణమనినచో చాలమందికి దశరూపకములలో నొకటిగా మాత్రమే గోచరించును. కావున భాణ లక్షణమును సమగ్రముగ వివరించుటకు ముందు భాణముయొక్క స్వరూపమును స్వల్పరూపమున తిలకించుట సమంజసము. ఈ భాణములు చాలవరకు చైత్రోత్సవములలో ప్రదర్శింపబడినవి. కేవల శృంగార ప్రాయములు ఇవి యన్నియు. ఒకే మూసలో పోసిన కలశములు. రచయితలు వారి వారి ప్రతిభనుబట్టి మధువును నింపి యందింప ప్రయత్నించిరి.

ముందుగా నాందీశ్లోకము పఠింపబడిన తర్వాత సూత్రధారుడు ప్రవేశించును. చైత్రోత్సవ ప్రస్తావన మొనర్చును. ప్రేక్షకులను, నటుని, కవిని ప్రస్తుతించును. ఋతు వర్ణన మొనర్చును. పాత్ర ప్రవేశ సూచన మొనర్చి, సూత్రధారుడు నిష్క్రమించును. వెంటనే నటుడు ప్రవేశించును - ప్రవేశించుచునే ఉషోదయమును వర్ణించును - మలయ పవనాంకురములు సురతశ్రమ మపనయించుచు దంపతులకు సుఖము గూర్చుచున్నట్లు సూచించి, సూర్యోదయమును వర్ణించును - ఇంతలో చేటిగాని, వేశ్యగాని వీథివెంబడి పోవుచున్నట్లు, ఆమెతో నటుడు మాట్లాడుచున్నట్లు ఆకాశభాషిత మాశ్రయించి నటు డభినయించును - ఆమె పూర్వరాత్రి వృత్తాంతమును నివేదించును లేదా వీరిరువురి పూర్వ శృంగారమును ఆమె వర్ణించును - నటు డామె కాశీస్సు నిచ్చి, ముందుకు సాగును - ఇంతలో కక్షభాగమున పంచాంగముతో వేశ్యావాటి నుండి వచ్చు విప్రపుంగవు డెదురగును. వాని చాటు మాటు శృంగారమును గూర్చి వానితో ప్రస్తావించును. తరువాత మేష కుక్కుట యుద్ధములు కంటబడగా వానిని తిలకించి ముందడుగు వేయగా కందుకక్రీడలాడు వేశ్య కన్పట్టును. పరువెత్తుకొని వచ్చు గజకలభము నటుని దృష్టిని వేశ్య విలాసమునుండి మరల్చును - ఇంతలో మధ్యాహ్న ఘంటానాదము వినవచ్చును. దేవుని మధ్యాహ్న సేవకై, ఆంధ్రయువతులు, పాండ్యస్త్రీలు, కర్ణాటతాటంకినులు, చోళ యోషితలు, చేరవనితలు, ద్రావిడాంగనలు గుంపులుగా వత్తురు - వారి విలాసములనుండి దృష్టిని ఇష్టము లేకపోయినను మరల్పక తప్పదు నటునికి - పాములవాడు నాదస్వరము పట్టును - విప్రవినోది

ఎన్నియో వినోదముల చూపును - వీరి వినోదమును తిలకించి ముందుకు సాగగా యువతికై పోరాడు వీరుల పోట్లాట కంటబడును - వారి పోట్లాటను సమయస్ఫూర్తితో సమసింపజేసి, జారధర్మానన మధిష్ఠించి వారికి శృంగార శిక్షలు విధించును -ఇంతలో సూర్యాస్తమయ మగును-ప్రియురాలి సౌధము సమీపించును-ఆమె హావభావములతో చొక్కి ఆమెకు కళ్యాణ పత్రిక వ్రాసి యిచ్చును. దీనితో కథ కంచికి - భరతవాక్యము- ఈ భరతవాక్యము మన్మథ ప్రాభవమును సూచించును.

ఇట్లు భాణములలో ఇతివృత్త మంతయు సమానముగ నుండును - వర్ణనలలో కవియొక్క ప్రతిభా పాండిత్యములు మాత్రము భేదిల్లుచుండును - పై చెప్పిన విషయములలో ఒకటి రెండు లోపించవచ్చును. ముందు వెనుక లుండవచ్చును. కాని ఈ వర్ణనలే సామాన్యముగ కన్పట్టును. మొత్తము మీద ఇతివృత్తమంతయు వేశ్యా సంబంధియై యుండును.

భాణము – లక్షణము :

దశరూపకముల స్వరూపమును తెలిసికొనిన తర్వాత భాణలక్షణమును సంపూర్ణముగ తెలిసికొనుట యావశ్యకము. భారతీయాలంకారికులకు మునిశబ్ద వాచ్యుడు, ప్రమాణనిర్ణేతయునైన భరతుడు నాట్యశాస్త్రమున బాణలక్షణము నిట్లు పేర్కొనినాడు.

> ఆత్మానుభూతశంసీ పరసంశ్రయవర్ణనావిశేషస్తు,
> వివిధాశ్రయో హి భాణో విజ్ఞేయ స్త్వేకహార్యశ్చ,
> పరవచనమాత్మసంస్థంప్రతివచనైరుత్తరోత్తరగ్రథితై
> ఆకాశపురుషకథితై రంగవి కారై రభినయైశ్చైవ,
> ధూర్త విటసంప్రయోజ్యో నానావస్థాంత రాత్మకశ్చైవ,
> ఏకాంకో బహుచేష్టః సతతం కార్యో బుధైర్గుణైః

భాణమునందు ఒకేపాత్ర రంగప్రవేశము నొనరించి ప్రదర్శనాంతమువరకు స్వీయానుభవమును గాని, పరవర్తనను గాని సంభాషణరూపమున వివరించును. ఈ సంభాషణాత్మకత కొరకు నటుడు ఆకాశభాషితమును, ఉక్తి ప్రత్యుక్తి విధానమును ఆశ్రయించి సాభినయముగ ప్రదర్శించును. ఈ నటుడు నిపుణుడు, పండితుడునైన ధూర్త విటుడై యుండును. అతడు నానావస్థలతో పెక్కు చేష్టలు చేయుచు ప్రదర్శన

మంతయు ఒకే యంకములో పూర్తిచేయును. ఈ భరతుని లక్షణము ననుసరించి యనంతర లాక్షణికులు రసనిర్దేశాదు లొనరించిరి. వీరశృంగారములే ఇందు సూచితము కావలెనని కొందరనగా లాస్యాంగములు పది యుండవలెనని మరికొందరు వివరించిరి. ఇట్లే వృత్తులు సంధులు మున్నగువానిని నిర్దేశించిన వారును కలరు. అందరును దీనిని ఏకపాత్రాభినయముగనే పేర్కొనిరి.

వ్యుత్పత్తి ప్రదర్శకరీతి ననుసరించినను భాణశబ్దము ఏకపాత్రాభినయమునే సమర్థించుచున్నది. "భణ" అను ధాతువునుండి యీ భాణ శబ ముత్పన్నమయినది. భణ యను ధాతువునకు మాట్లాడుట యని యర్థము. ఇతర పాత్రల ప్రవేశము లేకయే ఒకే పాత్ర ఎన్నియో పాత్రలు మాట్లాడినట్లు నటించుటచే ఈ రూపక విశేషమును "భాణము" అని పేర్కొనిరి. *

ఇట్లు స్థూలముగ పేర్కొనబడిన యీ లక్షణమును సమగ్రముగను, సంపూర్ణముగను పరిశీలించుటకు 17 సూక్ష్మాంశములుగ విభజింపబడినది. అవి 1) నాంది 2) ప్రస్తావన 3) ఏకహార్యత 4) ఆకాశభాషితము 5) నాయకుడు 6) ఆత్మాశ్రయత-పరాశ్రయత 7) ఇతివృత్తము 8) ఏకాంకత 9) వృత్తులు 10) లాస్యాంగములు 11) రసము 12) అధికారులు 13) అభినయము 14) వేశ్యాప్రకృతులు 15) వాద్య విశేషములు 16) భరతవాక్యము 17) సామాన్యమిశ్ర భేదము.

నాంది:

సంస్కృతరూపకములలో మొట్టమొదట విఘ్నోపశాంతికై దైవస్తుతి పూర్వక మయిన కర్మవిశేషము పూర్వరంగ మనబడును. దానికి 22 అంగములు కలవు. వానిలో నాంది ప్రధానమయినది. ఈ పూర్వరంగాంగములన్నియు నేడు దశరూపకముల మొదట కన్పట్టవు. కాని నాంది కన్పట్టును. ఇందు దైవస్తుతి చేయబడును. కావ్యార్థ సూచన మొనర్పబడును. దీనికి పదనియమము నాలంకారికులు విభిన్నరీతుల నొనర్చిరి. పద నిర్వచనమున సహితము భేదిల్లిరి కాని పద నియమమునుమాత్రము త్యజించుట కంగీకరింపరైరి. ఈ నాంది ఆశీర్వచనయుక్తముగ కూడ నుండతగును. మంగళ ద్యోతకములగు శంఖచంద్రాబ్జాది ప్రశంసావాచకయుతము అగుట శ్రేష్ఠము. దీనిని సూత్రధారుడు మధ్యమ స్వరమున పఠించును.

---

* ఏకముఖై నైవ భాణ్యంతే ఉక్తిమంతః క్రియంతే
అప్రవిష్టా అపి పాత్రవిశేషా యత్రేతి భాణః — నా.శా. అభి.భా. అధ్యా-18

ఈ లక్షణములతో కూడిన నాందీ శ్లోకము పఠింపబడిన తరువాత సంస్కృత నాటకములందు "నాంద్యంతే సూత్రధారః" అని యుండును. రెండవ సూత్ర ధారుడు ప్రస్తావనను (స్థాపనను) నిర్వహించుటకు ప్రవేశించునని యర్థము.

కాని భాసనాటకములందు ప్రప్రథమముగ "నాంద్యంతే తతః ప్రవిశతి సూత్ర ధారః" అని యుండును. తరువాత ఒక శ్లోకమును సూత్రధారుడు పఠించును. అది నాందీశ్లోక లక్షణములు కలదై యుండును, మంగళాత్మకమై యుండును. దీనిని పండితులు ఇట్లు వ్యాఖ్యానించుట కలదు. నాంది తెర తీయకుండగనే జరిగినది. తెర తీసిన వెంటనే సూత్రధారుడు ఒక మంగళశ్లోకమును, ప్రస్తావనను పఠించుచున్నాడు అని. ఇదే సంప్రదాయము చతుర్భాణియందు కన్పట్టును. ఈ సంప్రదాయము తరువాత భాణములందు కన్పట్టదు. ఈ విశిష్ట ప్రక్రియవలననే చతుర్భాణి ప్రాచీనత స్పష్టపడుచున్నది కూడ.

"నాంద్యంతే సూత్రధారః ప్రవిశతి" అను భాసనాటకమందలి సూచనకు సంస్కృత నాటక పాఠనమున మరొకరీతియు కన్పట్టును. ఇచ్చట అంత శబ్దమునకు మధ్యము, నడుము అను నర్థములు చెప్పుదురు. పూర్వరంగాంగమగు నాంది అతః పూర్వము తెర తీయకుండగనే ప్రారంభింపబడినదనియు, అది కొంత జరిగిన పిమ్మట తెర తొలగింపబడినదనియు, అక్కడినుండి కవి యీ విధమగు సూచన చేయుచున్నాడనియు, ఇచ్చట నాంద్యంతే అనగా నాందీ మధ్యమున అని అర్థము చెప్పదగుననియు, పాఠ ప్రవచనము ప్రచారములో నున్నది.

లేదా నాందియొక్క అంతిమభాగమందు అని అర్థము చెప్పికొన్నను సమన్వయమునకు కొఱత లేదు. భాణములలో కొంతమంది నాందిగా రెండు మూడు శ్లోకములను కూడ రచించిరి. కొందరు మన్మథ స్తుతి యొనర్చిరి. మరికొందరు ఏకశరీరులైన శివ పార్వతులను స్తుతించిరి. ఇంకను కొందరు మన్మథుని తల్లి తండ్రులను స్తుతించిరి. వీరు పదనియమమును అంతగా పాటించినట్లు కానరాదు.

ప్రస్తావన

పూర్వరంగ ప్రవర్తకుడైన సూత్రధారుడు నిష్క్రమించి, ఆముఖ ప్రవర్తకుడైన సూత్రధారుడు రంగప్రవేశ మొనర్చి పరిషత్తునకు దర్శింపబోవు రూపకమును సూచించును. కథాది వైశిష్ట్యాదులను తెలుపుచు సభ్యుల నాకర్షించును. దీనినే ప్రరో-

చన, ప్రస్తావన, స్థాపనయని యందురు. సూత్రధారు డిందు భారతీవృత్తి నాశ్రయించి కావ్యార్థ సూచకముగ ఋతుగాన మొనర్చును. ఈ సందర్భమున సూత్రధారుడు నటి, మారిష, విదూషకుల సహాయమును స్వీకరించును. నాటకములయం దీ పాత్రల ప్రవేశము తప్పక కన్పట్టును. కాని ఏకపాత్ర ప్రయోజ్యములైన భాణములందు కొన్నింట కేవలము సూత్రధారుడే స్థాపనను నిర్వహించును. చతుర్భాణియందు నటి మున్నగువారి ప్రవేశము లేదు. ఏకపాత్ర ప్రయోజ్యతాలక్షణమును మనమునం దిడుకొని వా రట్లు గావించియుందురు. అర్వాచీన భాణములందు ప్రస్తావనలో సూత్రదారుడు నటి, మారిషల సహాయమును స్వీకరించును. ఇందు పాత్ర ప్రవేశసూచనము కూడ నుండుట సంప్రదాయము, ఈ సూచించు తీరులు మూడు. వానికి ఆలంకారికులు 1) కథోద్ఘాతము 2) ప్రవర్తకము 3) ప్రయోగాతిశయము అని పేర్లు పెట్టిరి. మరి రెండు పేర్లను పెంచినవారును కలరు కాని అంత ప్రచారము లేమి ఇచ్చట విడువబడినవి. దీనినిబట్టి ప్రస్తావనలో పరిషదారాధనము, కావ్యార్థ పరిచయము, ఋతుగానము, పాత్ర ప్రవేశ సూచనము అనునవి యుండునని స్ఫుటమగుచున్నది. ఈ విశేషములన్నియు భాణములలో కన్పట్టును.

ఏక హార్యత:

ఏకహార్యత అనగా ఒకే నటునిచే ప్రయోగింపబడుట.

ఈ భాణము దశరూపకములకు చెందినది. రూపకమనుటచేతనే కావ్యార్థమును ప్రత్యక్ష మొనర్చునది యను నర్థము స్ఫురించుచున్నది. కాని ఇచట ప్రత్యక్షముగా నున్నది ఒకే నటుడు. అతడు కావ్యార్థమును ప్రత్యక్ష మొనర్పవలెను. ఇందు రెండవ పాత్ర ప్రవేశము లేదు. కాని పరస్పర సంభాషణాత్మకముగ నభినయము సాగవలెను. ఈ విశిష్ట ప్రక్రియకొఱకు నటు డాకాశభాషితము నాశ్రయించును.

ఈ ఏకహార్య లక్షణము చతుర్భాణియందును, కర్పూరచరిత మందును సంపూర్ణముగ సమన్వయించును. తర్వాతి కాలములో వెలువడిన భాణములలోని ప్రస్తావనలో దీనికి కొంత సడలింపు కన్పట్టును. ఆ భాణములలో నాంది తరువాత ప్రస్తావన మొకటి చేర్చబడినది. ఇందు నటిగాని, పారిపార్శ్వికుడుగాని సూత్రధారునితో ప్రవేశింతురు. నాటకమునందువలెనే ఋతుగానాదికముతో కూడ ప్రస్తావనము గావింతురు. కొన్నిట ప్రస్తావనా లక్షణములన్నియు సంపూర్ణముగ

గోచరించును. అందును ఏకహార్య లక్షణమును సమన్వయింపపలెనన్నచో ప్రస్తావనను మినహాయించి మిగతా భాగముతో సమన్వయింపవచ్చును. చతుర్భాణియందు మాత్రము సంపూర్ణముగ సమన్వయించును.

ఆకాశభాషితము:

ఒకేనటుడు (మరొక పాత్ర లేకుండ) మరొక పాత్ర అనినట్లు ఏమి? ఇట్లను చున్నావా? ఏమంటివి? అనెడి సంభాషణమును కల్పించుకొని ఎదుటివాని భావములను, మాటలనుకూడ తానే యుచ్చరించి సమాధానముల నిచ్చును. దీనిని ఆకాశమునకు చూచి కాని, ప్రక్కకు చూచికాని అభినయించుచుండును. అందుచే దీని నాకాశభాషితమనిరి. రెండవ వ్యక్తి లేకపోయినను ఉన్నట్లు, మాట్లాడుచున్నట్లు నటించుట కుపయోగపడునదీ ఆకాశభాషితము. ఈ అభినయమునకు నటుడు మంచి నిపుణుడు కావలెను. ఈ సంభాషణమును దూరస్థాభాషణముని భరతుడు పేర్కొనినాడు.

సింగభూపాలుడు ఆకాశభాషితము నిట్లు నిర్వచించెను.

అన్యేనానుక్త మప్యన్యో వచః శ్రుత్వేవ యద్వదేత్ |
ఇతి కిం భణ సీత్యేతద్భవే దాకాశభాషితమ్ ॥

"ఇతరుడు పల్కకపోయినను వేరొకడు అతని మాటలను వినినట్లే నటించి 'ఏమి పల్కుచున్నావు?' అనుచు పలుకునది ఆకాశభాషితము."

ఈ లక్షణము సర్వభాణములకు సమన్వయించును. కాని ప్రయోగమునందు కించిద్విలక్షణత, సంబోధనమునందు వైవిధ్యము మాత్రము అచ్చటచ్చట కన్పట్టును. "కింబ్రవీషి" యని పరోక్ష వ్యక్తి యొక్క మాటలను నటుడు వచించి వానికి సమాధానప్రాయములగు సంభాషణములు చేయుచుండును. చతురాణ్భిలో గల సంబోధనములు కొన్ని విశిష్టముగ నున్నవి. పద్మప్రాభృతకమున "భోః" అనియేగాక "అంఘో" అనియు సంబోధనలు కన్పట్టును. స్త్రీల విషయమున 'వాసు' అను సంబోధనము. కన్పట్టును. (ఈ సంబోధన వైలక్షణ్యము సంస్కృతమున ఇతర రూపకములందు కన్పట్టదు. ఇది దేశీయభాషా ప్రభావమున నిట్లు వచ్చియుండును.)

భాణము – నాయకుడు :

నాటకమునందైనచో నాయకుడు సామాన్యముగ చతుర్విధనాయకులలో నొకడై యుండును. ధీరత్వము సామాన్య లక్షణముగను - ఉదాత్తత, ఉద్ధతత్వము విశేష లక్షణములుగ నాయకున కుండును. అంతియేగాక కొన్ని నాటకముల నామము ననుసరించియే యుండును, (మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వశీయము అనునవి నాయికా నాయకుల నామముల సమ్మేళనములచే నేర్పడినవి.) కాగా నాటకమునందు నాయకుడు ప్రధానపాత్ర యగుటయేగాక నాటకఫలమును కూడ ననుభవించు వాడగును. నాటకము నందు నాయకుని పాత్ర ప్రాముఖ్య మీ ఫలభోక్తృత్వమునందే ప్రతిష్ఠితమై యున్నది..

కాని భాణమునందు నాయకుడు ధీరోదాత్తుడు కాని, ధీరోద్ధతుడు కాని, ధీర-లలితుడు కాని, ధీరశాంతుడుకాని కాదు. శృంగార నాయక సహాయులైన నల్వురలో ఒకడైన విటు డిందు నాయకుడు. రూపకములలో ఇతనిని నిజమునకు నాయక సహాయుడు అందురు. ఇతర నాయికానుకూలనమునకు నాయకున కితడు సహాయ భూతుడై యుండును. కాని భాణమునందు మాత్రము విటుడే నాయకుడుగ కీర్తింపబడినాడు. అతడును ధూ ర్తలక్షణ లక్షితుడైన విటుడే కావలెను..

భాణము ఏకపాత్ర ప్రయోజ్యమైన రూపకము. రూపకములందు ప్రధానుడు నాయకుడగుటచేతను, ఇది ఏకహార్య మగుటచేతను లాక్షణికులు ఆ విటునినే నాయకునిగా పేర్కొనిరి.

భాణమునందు విటుడు స్వవృత్తమును గాని, పరవృత్తమును గాని అభినయించును. స్వీయానుభవమును ప్రదర్శించునపుడు నాయకుడని యనవచ్చునేమోగాని పరానుభవము నభినయించునపుడు విటుని నాయకుడనుట యసమంజసము. ఆతడు ఫలభోక్త కాదు, ఆట్టిచో అతనిని నటుడనియో, అభినేత అనియో లేక సంప్రయోక్త యనియో అనుట లెస్స. కవులు విటునిపేరు నాధారముగా చేసికొనియే భాణములకు నామకరణము చేసిరి. శృంగార శేఖరభాణము, శృంగార భూషణభాణము మొ|| అట్టివి. స్వీయానుభవమును ప్రదర్శించునపుడు ఇట్లు నామకరణ మొనర్చుట సమంజనము కాని, పరానుభవమును ప్రదర్శించునపుడు ఇట్లు విటుని పేరు నాధారముగ చేసికొని నామకరణ మొనర్చుట యనుచితము. పరానుభవప్రదర్శన మొనర్చినచో వానిని నాయకుడనుటయు సమంజసము కాదు. (అట్టిచో నామకరణముకూడ తగనిదనుట.)

ఇందు నాయికానివర్ణయము కూడ కష్టము. పలువురి విలాసచేష్టలు వర్ణితము లగును. ఏక నాయికాత్వమునకు తావులేదు. అదియునుగాక ఆ వేశ్యలయినను ఆకాశభాషిత సహాయమున పరోక్షముగ మాత్రమే స్ఫురింతురుగాని ప్రత్యక్షముగ రంగమున కన్పింపరు అట్టిచో వారిని నాయికలుగా నిరూపించుటయు సమంజసముగా కన్పట్టదు.

ఆత్మాశ్రయ పరాశ్రయత్వములు :

భరతుడు భాణలక్షణమును తెలుపుచు ప్రథమముననే ఈ లక్షణమును తెలిపినాడు. "ఆత్మానుభూతశంసీ పరసంశ్రయవర్ణనావిశేషస్తు." ధూర్తవిటుడు ఒకడే రంగప్రవేశ మొనర్చి స్వీయానుభవమును గాని, పరానుభవమును గాని అభినయముతో వర్ణించును.

ఈ వృత్తాంతము స్వీయానుభవమైనచో ఆత్మాశ్రయమనియు, పరకీయమైనచో పరాశ్రయమనియు నిట విభేదము లక్షణమునుబట్టి చెప్పవలయును. కాని భాణములను పరిశీలించినచో ఈ విభేదము అంత స్పష్టముగ గోచరింపదు. స్వీయానుభవమునే గాక పరకీయ వృత్తాంతమును సయితము జోడించి సంకీర్ణేతివృత్తములుగ భాణములు కూర్చబడినవి. లక్షణ సమన్వయమొనర్చుటకు ఒక విధాన మవలంబించుట సమంజసము. రూపకఫలము (అనగా వేశ్యాసమాగమాదికము) ధూర్తవిటునికి చెందినచో ఆత్మాశ్రయమనియు, ఇతరునికి చెందినచో పరాశ్రయమనియు ననుట లెస్స. కర్పూరచరితము (వత్సరాజు) మొ|| ఆత్మాశ్రయములుగను, చతుర్భాణి మున్నగునవి పరాశ్రయములుగను పరిగణింపవచ్చును. ఈ రెండింటియందును ఇతివృత్త నిర్వహణాదికమునందు ఏమియు భేదము లేదు. కాని ఫలానుభవమునందు కర్తృభేదము పొడగట్టును. ఇంతమాత్రమే భేదము.

ఇతివృత్తము – సంధులు :

రూపకములలో ఇతివృత్తములు మూడు విధములుగ నుండును. 1) ప్రఖ్యాతము 2) ఉత్పాద్యము 3) మిశ్రము. భాణములలో ఇతివృత్తము ఉత్పాద్యము. అనగా కవి కల్పితమైనది. పురాణేతిహాస ప్రసిద్ధమైనది కాదు. అంతియేగాక ఇచ్చట ఇతివృత్తము వేశ్యాసంబంధిగా నుండును. శృంగారసంబంధిగా నుండును. అదియును అధర్మావృతమై యుండును. కేవల కామపురుషార్థక ప్రయోజనమై యుండును. దీనిని Satire గా గ్రహించుట లెస్స. వ్యతిరేకలక్షణ నాశ్రయించి ఇది యుపదేశ మొనర్చుచుండును.

మఱియు నిందు నాటకాదులవలె వస్త్వైక్యము ఉండదు. వివిధ వేశ్యల వృత్తాంతము, వారి విలాసచేష్టలు, విటుల మాయోపాయములు, మేషకుక్కుటాదుల యుద్ధములు మున్నగునవి ఏకసూత్రతకు కట్టుబడక విశృంఖలమైన విధానములతో ఇతివృత్తము గోచరించును. కావున పాశ్చాత్యులు నుడివిన ఐక్యత్రయములో వస్త్వైక్యమంతగా నిందు కన్పట్టదు.

ఇతివృతము ఏకదివస ప్రవృతమైనదగుటచేత వస్తువిస్తృతికూడ స్వల్పముగా నుండును. కావున నాటకాదులందలి పంచసంధు లుండుటకు ఇందు అవకాశము లేదు. కావున ఆల్పవస్తుకములయందు సహితము ఉండతగిన ముఖ, నిర్వహణ సంధులను మాత్రమే లాక్షణికు లిందు నిర్దేశించిరి. ఏ కథకైనను ఆరంభము, అంతము లేకుండ నుండుట అసంభవము కదా! అందుచే ఆ రెండు సంధులును తప్పక ఎందైనను ఉండి తీరవలసినదే. అనగా వస్తువు చాల స్వల్పమైనదని స్పష్టపడుచున్నది. ఇంత స్వల్పవస్తువులను కలిగిన రూపకములను రసవంతముగ, ఆస్వాదయోగ్యముగ నిర్వహించుట కష్టసాధ్యము. కావుననే కవులు శృంగారము విషయమున ధర్మమును విడచి కేవల తృతీయ పురుషార్థమునకే తావిచ్చి బజారుపాలు చేయవలసి వచ్చినది.

ఏకాంకత:

దశరూపకములలో భాణము, వీథి, అంకము, వ్యాయోగము, ప్రహసనము అను ఈ యైదును ఏకాంకములు. ఇందు భాణము ఏకహార్యముకూడ. నాటకమున అంకమునకు చెప్పబడిన లక్షణములు కొన్ని ఏకాంకికలకు సరిపోవును. అందు ముఖ్యముగ 1) ప్రత్యక్షనేతృచరితత్వము, 2) రసభావసముజ్జ్వలత్వము, 3) దినైక-నిర్వర్తిత కథాభాగత్వము అనువాని విషయమున భాణలక్షణము నాటకమునందలి అంకలక్షణమునకు సరిగా సరిపోవును. కాని అంకము స్వయంసంపూర్ణము కాదు. అనేక పాత్ర ప్రవేశ ముండును. భాణమునందు ఆ లక్షణము లేదు. ఇది స్వయంసంపూర్ణము—ఏకపాత్ర ప్రయోజ్యము.

సంస్కృత భాణములన్నియు ఏకాంక నియమమును సంపూర్ణముగ పాటించినవనియే చెప్పవచ్చును. కాని ప్రస్తావనను, నాందిని నిర్వహించినవి. ఇవి ఏకాంకలక్షణమునకు భంజకములు కావు. నాటకమునందును నాందిని, ప్రస్తావనను ప్రథమాంకభాగములుగనే పరిగణించుచున్నాము గదా!

కాని ద్వ్యంక త్ర్యంక భాణములను పైతము మాతృగుప్తాచార్యకోహలులు వివరించిరని శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు తెలిపిరి. (మానవల్లి రచనలు - వ్యాసములు, పుట 338). కాని మా పరిశోధన పరిధిలో ఎక్కడను ద్వ్యంక త్ర్యంక భాణములు కన్పించలేదు. భవిష్యత్పరిశోధనలలో తేల్చవలసిన విషయమది.

వృత్తులు :

"భూయసా భారతీవృత్తిః" అని ధనంజయుడును, "వృత్తిః ప్రాయేణభారతి" అని విశ్వనాథుడును భాణములందలి వృత్తిని గూర్చి పేర్కొనిరి. ఇందు భారతీవృత్తి ప్రయోజ్యము కావలెనని యాశయము.* భారతీవృత్తి వాచికాభినయ ప్రధానమైనది. భాణము ఏకహార్యమగుటచేతను, రెండవపాత్ర రంగప్రవేశ మొనరింపకపోవుట చేతను వాగ్రూపమైన అభినయము ప్రాధాన్యము వహించును.

(వృత్తులు నాల్గు విధములు. అవి వాఙ్మనఃకాయ వ్యాపార ప్రధానములు. ఇవియే త్రికరణములు. వృత్తియే వ్యాపారము. వాగ్రూపమైన వ్యాపారము భారతీ-వృత్తి, మనోవ్యాపారము సాత్వతీవృత్తి, కాయికము, సుకుమారము అయిన వ్యాపారము కైశికము, ఉద్ధతవ్యాపారము ఆరభటి.) (చూడుడు నాట్యశాస్త్రము P. S. R. అప్పారావు—P 620.)

కొంద రీ భారతీవృత్తిని ప్రస్తావనకు పరిమితము చేసిరికాని అది సమంజసము కాదు. రూపకమంతటను భారతివృత్తి కవకాశముండును. కాని ప్రస్తావనయందు మాత్రము భారతీవృత్తి తప్పక యుండునని చెప్పుట సమంజసము.

ఈ వృత్తులు లక్ష్యములలో పరస్పర సంకీర్ణములై యుండును. వేరుపరచి చూపుట కష్టసాధ్యము. అట్టివాని కీ నిర్దేశము కేవలము ప్రాధాన్యమునుబట్టియే కలుగుచున్నది.

భాణములను పరిశీలించినచో చాలమంది ఈ భారతీవృత్తి నాశ్రయించిరి. అందును ఎక్కువగా ప్రస్తావనాంగముగా నాదరించిరి. కొందరు నామగ్రహణముతో సహితము ఆదరించిరి. నటునికి భారతీవృత్తివి, వాచికాభినయ ప్రాధాన్యమును సూచించుటకు కవులు "భారతీవృత్తిమాశ్రిత్య" అని నిర్దేశించుటయు కన్పట్టును.

---

* భరతవంశమునందు జనించినవారిచే భరతులచే (నటులచే) ప్రయోగింపబడినది కనుక భారతీవృత్తి యనబడినది.

లాస్యాంగములు:

భాణలక్షణ నిర్వచనమునందు భరతుడు లాస్యాంగములను పేర్కొనలేదు. కాని నాటకములం దుపయుక్తములగు లాస్యాంగములను పేర్కొనినాడు. ఈ లాస్యాంగముల నతడు లాస్యవిధినుండి గ్రహించినాడు. భాణాదులందు లాస్యాంగములు సంప్రయోజ్యములని భరతుడు వచించినాడు కాని తర్వాతి లాక్షణికులు భాణములకు మాత్రమే లాస్యాంగములను పరిమితము చేసినారు.

సుకుమారమైన అభినయము లాస్య మనబడును. సామాన్యముగ స్త్రీ ప్రకృతి లలితము, సుకుమారము నగుటచే స్త్రీకృతమైన యభినయమును లాస్యమనుట జరిగినది. కాని కేవలము స్త్రీకృతమైన యభినయమునే లాస్యమనుటకంటె సుకుమారాభినయము లాస్యమనుట సమంజసము. ఆ సుకుమారాభినయము స్త్రీకృతమైనను కావచ్చును, పురుషకృతమైనను కావచ్చును. ఏమైనను సుకుమారాభినయము లాస్యమనుట లెస్స. ఈ లాస్యాంగములను భరతుడు ఏకపాత్రప్రయోజ్యములని నిర్దేశించినాడు. కావుననే ఆనంతర లాక్షణికులు ఏకపాత్ర ప్రయోజ్యమైన భాణమునందు వీనిని ఆవశ్యకలక్షణములుగా పేర్కొనిరి.

లాస్యాంగమనగా లాస్యము అంగముగా కల్గిన అభినయవిధానమని యర్థము, ఇవి 10 అని భరతుడు తెలిపెను. కాని లక్షణ నిర్దేశమందు 12 అని తెలిపినారు. వానికి వ్యాఖ్య వ్రాయుచు అభినవగుప్తుడు* మిగిలిన రెండును అనావశ్యకములనియు, వాని ప్రయోజనము పదింటిచేతనే సిద్ధించుచున్నదనియు తెల్పినాడు. కావున లాస్యాంగములు పదియనియే లాక్షణికు లందరును పేర్కొనియున్నారు.

ఆ లాస్యాంగము లివి:

1) గేయపదము 2) స్థితపాఠ్యము 3) ఆసీనము 4) పుష్పగండిక 5) ప్రచ్ఛేదకము 6) త్రిమూఢకము 7) సైంధవకము 8) ద్విమూఢకము 9) ఉత్తమోత్తమకము 10) ఉక్తప్రత్యుక్తము.

---

* చిత్రపదము, భావికము.

1) గేయ పదము :

వీణావాదనముతో కూడిన నాయికయొక్క లలితగీతము గేయమనబడును. ఈ గీతము ప్రియగుణాన్వితమై యుండదగును. ఈ గీతపఠన మభినయ రహితమైనను కావచ్చును.

2) స్థితపాఠ్యము :

నాయిక కూర్చుండి వాక్యాభినయపూర్వకముగ పఠించుట స్థితపాఠ్య మనబడును. ఇది బహుచారిసమాయుక్త మగునని కొందఱు, రసోపయోగిగా ప్రాకృతమును పఠింపవలయునని మరికొందఱు అందురు.

3) ఆసీనము :

నాయిక చింతాశోక సమన్వితయై కూర్చుండి భ్రూనేత్రములయు, పాణిపాదములయు విలాసాభినయముతో పఠించుట ఆసీనము. పఠనవర్జితముగ ఆసీనురాలగుటయు ఆసీనమనబడునని భరతుడు. ఇందు ఆతోద్యము లుండవు. ఈ లక్షణము చింతాశోక సమన్వితత్వమునకు పోషకము. స్థితపాఠ్యము వాక్యాభినయ ప్రధానము. ఆసీనము భ్రూనేత్రాది విలాసాభినయప్రధానము.

4) పుష్పగండిక ;

దీనినే పుష్పగంధిక యనియు కొందరు పేర్కొనిరి. వివిధవాద్యములతో, వివిధ వృత్తములతో, నానావిధతాళలయలతో కూడిన లాస్యము పుష్పగండిక యనబడును. ఇందు స్త్రీ పురుషవేషమున చరించుటయు నుండును. ఆసీనము వాద్యరహితముగా నుండును. పుష్పగండిక ఆతోద్యసహితముగా నుండును.

5) ప్రచ్ఛేదకము :

నాయకుడు అన్యస్త్రీ సంగమ మొనర్చెనని శంకించిన నాయిక రోషకషాయిత యగును. అయ్యును చంద్రాతపాహతలైన అట్టి వనితలు తమ ప్రేమచ్ఛేదము ప్రకటించుచునే ప్రియులను కలియుట కొనర్చిన లాస్యము ప్రచ్ఛేదకము.

6) త్రిమూఢకము :

సరసములు, సరళములు నగు పదములతోడను, సమవృత్తములతోడను, అలంకృతమైనదియును, పురుషభావాఢ్యమునైన నాట్యము త్రిమూఢక మనబడును.

7) సైంధవకము :

వీణావాద్యసహితమును, దేశభాషాయుక్తమును అగుచు విభ్రష్టసంకేతము గల పాత్రతో కూడిన నాట్యము సైంధవక మనబడును.

8) ద్విమూఢకము :

గీతాంకములైన ముఖప్రతిముఖములతో కూడినదియు, చతురస్రపదక్రమమును, శ్లిష్ట (స్పష్ట) భావరసోపేతమును, చిత్రార్థాభినయాత్మకము నైనది ద్విమూఢకము. ఇది వ్యాజచేష్ట యగునని కొందఱి తలంపు.

9) ఉత్తమోత్తమకము :

వివిధరససంశ్రయమును, విచిత్రశ్లోకబంధమును, హేలాహావవిచిత్రము నైనది ఉత్తమోత్తమక మనబడును. ఇందలి అభినయము అపరిజ్ఞాతపార్శ్వస్థము, సోత్కంఠ వాక్యయుతము నగునని కొందఱి యభిభాషణము.

10) ఉక్తప్రత్యుక్తకము :

కోపప్రసాదజనితము, సాధిక్షేపపదములతో కూడినది, ప్రశ్నోత్తరరూపము నైన వాక్యము ఉక్తప్రత్యుక్తకము.

సింగభూపాలుడు లాస్యాంగములను నిర్వచించి, వీని యుదాహరణములను శృంగారమంజరి మున్నగు భాణములందు చూడవచ్చునని సూచించినాడు. భాణము లన్నిట ఈ లాస్యాంగములన్ని కన్పట్టవు. కొన్ని లాస్యాంగములు కొన్నింట కన్పట్టును. కావున ఈ లాస్యాంగములు భాణములందు వివక్షాధీనములే కాని విధియుక్తములు కావు.— అని కవులు పరిగణించుచున్నట్లు తోచును.

కర్పూరచరితము నందు ఈ లాస్యాంగములలో అనేకములను సమన్వయింప వీలు కల్గుచున్నది. దీని సమన్వయము కర్పూరచరిత విమర్శనము నందు చూడదగును.

రసము :

భాణము నందలి రసనిర్వహణమును గూర్చి భరతుడు లక్షణనిర్దేశ మొనరింపలేదు. కాని ఆనంతరలాక్షణికులు “సూచ్యేతే వీరశృంగారౌ” అని వీరశృంగారములు సూచింపబడవలె ననిరి. ఇందు రెండు రసముల కవకాశములు

కల్పించిరి. కాని బాహుళ్యమును బట్టి శృంగారమే కన్పట్టుచున్నది. వీర మెచ్చుటను కన్పట్టదు. చతుర్భాణి యందును, అనంతర భాణములందును శృంగారమే తొంగి చూచును. లాక్షణిక నిర్దేశము నందే వీరము కన్పట్టును.

ఆదియును గాక ఈ శృంగార మయినను ప్రేక్షకునకు ఆస్వాద్యమా? భాణము లందు భావములు రసస్థితిని పొందదగినంత స్థాయి కలవా? ప్రేక్షకులు వానిని రసములుగా ఆస్వాదించుచున్నారా? అనునది ఇట విచారణీయము.

సామాజికులు రసాస్వాద మొనరింపవలె నన్నచో మూడు అంశము లావశ్యకములు. 1) ముందుగా ఇతివృత్తము, తన్నిర్వహణము రసనిష్యంది కావలెను. 2) దానిని నిపుణులైన నటులు తత్తద్రసస్ఫోరకమైన యభినయముతో నటింపవలెను. 3) ఆ అభినయము నధికారులైన సామాజికులు వీతవిఘ్న ప్రతీతికముగ ఆస్వాదింప వలయును. అపుడు రసానందానుభవము కల్గును. ఈ త్రయములో మొదటిదే ఇట తగియున్నదా? అను విషయము ముందు ప్రస్తావింప దగినది, విచారణీయము. భాణము నందలి యితివృత్తము వేశ్యాసంబంధి. ఈ భాణములలో ధూర్తుడైన విటుడు స్వవృత్తమును గాని పరవృత్తమును గాని ఇతరనటాపేక్ష లేకయే అభినయించును. ఇందు వస్త్వైక్యమునకు తావు లేదు. పలువురు వేశ్యలయొక్క చరిత్రమును, వారు విటులతో నొనర్చిన క్రీడావిశేషములను వర్ణణాత్మకమైన విధానమున తెలుపును. ఈ చరిత్రము సయితము ఏకవేశ్యాసంబంధి కాకూడదు. అనగా నాయికానాయకులు వీరు అని నిర్దేశింప వలనుపడదు. విటుడు రంగస్థలముపై నుండి ఆకాశభాషిత మాశ్రయించి సామాన్యవేశ్యతో మాట్లాడు-చున్నట్లు నటించుచు ఆమె తనతో కాని, పరులతో కాని యొనర్చిన రతిక్రీడా విశేషములను, విలాసచేష్టలను సాభినయముగ వివరించును. ఈ విశేషము లన్ని పరోక్షప్రాయములే కాని ప్రత్యక్షములు కావు. చక్షుః ప్రీతికంటె శ్రవఃప్రీతి మెండుగా నుండును. హృదయతర్పణము సామాన్యమేకాని శ్రవణేంద్రియ తర్పణము కంటె చక్షురింద్రియతర్పణము శక్తిమంతము కదా! ఈ విభేదమే శ్రవ్య దృశ్యకావ్యముల ఆస్వాదనలో గల తారతమ్యమునకు కారణమైనది. అట్టి అధిక ప్రభావము కల చక్షురింద్రియసంతర్పణ మిచట నామమాత్రమే యగుచున్నది. కాని సంపూర్ణముగ కల్గుట లేదు.

అదియును గాక రసనిష్పత్తికి మూలభూతము లయిన విభావాను భావములకు, వ్యభిచారిభావములకు, స్థాయిభావములకు, స్థాయిభావ ముద్బుద్ధ మగుటకు గాని,

వ్యభిచారిభావనిరూపణమునకు గాని అవసరమైన ఉద్దీపన ఆలంబనవిభావములు గాని, వారి అనుభావములు గాని పోషించుటకు తగినసమయము సయితము శూన్యము. ఈ భాణములు ఏకదీవసవృత్తమును మాత్రమే సూచించును. ఆదియును గాక నాయికా నాయకుల అనుభావములను ప్రదర్శించుటకు వారిరువురును రంగప్రవేశమే యొనర్పరు. అట్టిచో రసాస్వాదన కవకాశమే లేకుండ పోవుచున్నది. కావున ఇతివృత్తము తన్నిర్వహణమును రసాస్వాదమున కనుకూలముగలేదు.

ఇతివృత్తమే రసస్ఫోరకము కానపుడు, తన్నిర్వహణమును అంతంతగానే యున్నప్పుడు నటు లెంత నిపుణులయినను రూపకము రక్తి కట్టదు. అయినను ఇందు నటులు అను బహువచనమే లేదు. ఒకే నటుడు సమాహారరూపమున అందరి అభినయమును చేయవలయును. నేటికాలమున సినిమాలలో ద్విపాత్రాభినయము, త్రిపాత్రాభినయము లన్నచో రెండు మూడు బొమ్మలు తెరపై కన్పట్టుచున్నవి. కాని యిందు ఒకే విటుడు అందరి అభినయము వాగ్రూపమున నొనర్పవలయును. ఆ యా రూపములు సామాజికుల హృదయయవనికలపై ప్రత్యక్షములు కావలయునే కాని చక్షుర్గోచరములు కావు. ఇట్టిచో నాయికానాయకుల విలాసచేష్టలను అనుభావములను ప్రదర్శించుటకు తగినంత యవకాశ మిందు చిక్కదు. కాని వాగ్రూపమున వర్ణించుటకు కొంతలో కొంత వీలు చిక్కును. కావుననే లాక్షణికులు "దర్శయేత్" అనక "సూచయేత్" అనుట జరిగినది.]

ఇట్లు ఇతివృత్తమునందు, తన్నిర్వహణమునందు రసవిష్యందతకు అవకాశము చాలమియు, నిపుణనటాభినయమునకు తగిన సామగ్రి చాలమియు కారణములుగ వీని యందు (భాణములందు) రసాస్వాదము కష్టసాధ్యమగుచున్నది.

అయినను ఇందు సూచనామాత్రముగ పోషించుట కవకాశము లేకపోలేదు. శ్రవ్యకావ్యములందు వలె రసపోషణకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకొంద మన్నచో ఇది దృశ్యప్రబంధమై పోయినది.

రసమా? రసాభాసమా?

అట్లని అసలీ భాణములందు రసాస్వాదమే లేదనుటయు సత్యదూరమే యగును. రసాస్వాదమే లేనియెడల ఇన్ని భాణములు వెలువడియే యుండకపోవును. ఉన్నంతలో ఆస్వాదయోగ్యము లయిన సన్నివేశములను సామాజికానురూపము

లయిన సంఘటనములను వర్ణించుచు ఔచిత్యానౌచిత్యములకు తావీయక రసాభాసమును మిక్కుటముగ వర్ణించుట కన్పట్టును.

ఆలంకారికులు రసాభాసమును సయితము రసతుల్యముగనే అంగీకరించిరి. కాక పోయినచో అనుచిత విభావాలంబనత్వమును లక్షణముగా చెప్పిరి. ప్రసిద్ధమైన రసాభాసనిర్వచనమునందు 1) ఏకత్రానురాగము 2) తిర్యఙ్మ్లేచ్ఛగతము 3) యోషకు బహురక్తి అను మూడును రసాభాసలక్షణములుగ కన్పట్టును. ఇచ్చట భాణములలో వేశ్యాశృంగారము మిక్కుటముగ వర్తింపబడుటచే దీనిని "యోషితో బహుసక్తి" అనుట లెస్స. ఒక్కొక్కచో "ఏకత్రైవానురాగము" చోటు చేసికొన్నట్లు కన్పట్టును. ఇట్లు భాణములలో రసముకంటె రసాభాసమే ఎక్కువ కన్పట్టును. సూచనామాత్రముగ వీరశృంగారములు పోషింపబడవలెనని అలంకారికులు నిర్దేశించినను దానిని మన కవులు యథాతథముగ పాటింపలేదు. వారి లక్షణనిర్దేశములోనే కొంత సడలింపు 'సూచయేత్' అనుటలో కన్పట్టును. దానిని కూడ కవులు నిర్వహించలేదు. మరింత చనువు గ్రహించి రసమును గాక రసాభాసమును పోషించిరి.

ఈ రసాభాసపోషణము శృంగారమునకే కాక వీరమునకు ప్రాకినది. ఒకే సుదతికై పోరాడు ఇరువురు వీరుల వివాదమునందును, యుద్ధమునందును, మేష కుక్కుటాదుల యుద్ధవర్ణనము నందును వీరరౌద్రముల ఆభాసమే చోటు చేసికొనినది.

అధికారులు – (ప్రేక్షకులు):

భాణములను ఏ తరగతికి చెందిన ప్రజ లానందింతురో ఎవరినుద్దేశించి ఇవి ప్రయోగింపబడునో ఇచ్చట విచారింతము. ఇవి తఱచు శృంగార హాస్యరస భూయిష్ఠములై యుండును. ఆ శృంగారమును ఆభాసప్రాయమై యుండును. ఇతివృత్తము వేశ్యాసంబంధిగా నుండును. కావున ఉదాత్తపురుషులు చూడదగునా అను శంక వొడముట కవకాశము కల్గుచున్నది. దీనికి పోషకముగ అభినవగుప్తుడు అభినవభారతిలో నిట్లు వచించినాడు. "ఉత్సృష్టికాంక ప్రహసన భాణములు కరుణహాస్యవిస్మయప్రధానములై రంజకరసప్రధానము లగుచున్నవి. అందువలననే వాని యందు స్త్రీ-బాల- మూర్ఖాదులధికారులుగా నున్నారు." (నా.శా. తెలుగు- P.S.R. అప్పారావుగారు.)

ఈ వ్యాఖ్యతో ఉదాత్తపురుషులు భాణమునకు అధికారులు కారాదని అభినవ-గుప్తుని అభిప్రాయముగా గోచరించుచున్నది. కాని అభినవగుప్తుని అభిప్రాయ మది కాదు. బాహుళ్యమును బట్టి యతడా యభిప్రాయమును వెలిబుచ్చినాడు. అంతియేకాని ఉదాత్తపురుషదూరమైనది భాణము అనుట అతని యుద్దేశము కాదు. అభినవగుప్తుని యభిప్రాయములను సహృదయతతో స్వీకరించిన హేమచంద్రుడు ఇట్లనినాడు. *బాహుళ్యమునుబట్టి ఈ రూపకము సామాన్యజనోపయోగి యైనది. కాని రాజపుత్రులు మొదలైనవారికి వేశ్యావృత్తాంతము తెలియతగినదే. ఏల యన వారు వేశ్యలచే వంచింపబడకుండుటయే ప్రయోజనము. అందుచే వారును దీని కధికారులగుచున్నారు. అంతియే గాక ఈ భాణములు చాలవరకు దేవాలయోత్స-వములలో కాని, వసంతోత్సవములలో కాని ప్రయుక్తము లైనవి. అందు ఉదాత్త పురుషులును, సామాన్యజనులును సర్వులును భేదభావము లేకుండ పాల్గొందురు. ఈశ్వరదత్త విరచితమగు ధూర్తవిటసంవాదమునందు "తస్మాదార్యజనప్రీత్యర్థం కించి న్నాటక మారభామహే" (ఆర్యజనుల ప్రీతికొఱకు ఒక నాటక మారంభింతము.) అని ప్రారంభించినాడు.

కావున భాణము సర్వజనాహ్లాదకరమును, ఉపదేశకరమును అగుచున్నది. అందుకే నాటకాదులందు అధికారులైన వారందరును ఇందును అధికారులనుట సమంజసము.

అదే కాదు. ఇందొక విశేషము కలదు. నాటకాదులందలి యితివృత్తము చాల వరకు చక్షుర్గోచరముగా నుండును. కాని బాణము లందలి యితివృత్తము భావనాగోచరమే కాని చక్షుర్గోచరము కాదు. చక్షుర్గోచరమైన యితివృత్తము నాస్వాదించుటకు సామాన్య ప్రేక్షకులు చాలుదురు, కాని భావనాగోచరమైన వస్తువు నాస్వాదించుటకు ప్రేక్షకులు సమగ్రభావుకులు కావలెను. వారికే యట్టి ప్రదర్శనము సంపూర్ణాస్వాదము కలుగచేయును. భాణమునందు దృశ్యతకంటె శ్రవ్యత ప్రధానము అగుటచే ప్రేక్షకులు సమగ్రభావుకులు అని యూహింప వలనుపడును.

భాణములలో ప్రేక్షకులు వివిధశాస్త్ర నిష్ణాతులని కవిత్వతత్త్వవేదులని మాత్రమే కాక అనంగవిద్యావిలాసులనియు పేర్కొనబడిరి.

---

* బాహుళ్యేన పృథగ్జనవ్యుత్పత్త్యుపయోగిరూపక మిదమ్, రాజపుత్రాదీనా మపి శంభలీవృతాంతో జ్ఞేయ ఏవావంచనార్థ మితి స ప్రయోజ్య ఇత్యర్థః.
(హేమ కావ్యా. అధ్యా-8)

అభినయము :

భాణ మందలి అభినయమును గూర్చి భరతుడు తప్ప ఇతరాలంకారికు లెవ్వరు ప్రస్తావించలేదు. భరతుడు సయితము సూచనామాత్రముగనే ప్రస్తావించెను. "ఆంగ వికారై రభినయై శ్చైవ" అని మాత్రమే భరతుడు సూచించినాడు. ఈ పదములు ఆంగికాభినయమును వ్యక్తపరచుచున్నవి. వాచికాభినయమునకు కూడ పరోక్షముగ తావు కల్పింపబడినది. భాణములందు భారతీవృత్తిప్రాధాన్యమును సర్వలాక్షణికులు అంగీకరించిరి. కావున వాగంగాభినయములకు భాణములందు తావు లభించినది. కాని సాత్వికాభినయమునకు తావు కన్పట్టదు. కారణము ఏకహార్య మగుటయే యనవలసి వచ్చుచున్నది. నాయికానాయకు లిరువురు రంగస్థలమున కన్పడరు కదా! వారిని గూర్చి విటుడు కేవలము వాగ్రూపమున వర్ణించుట కన్పట్టును. ఇట్లు శ్రవ్యతాలక్షణము గల అభినయముతో నటుడు ప్రేక్షకుల మనస్సులో పాత్రలను ప్రత్యక్షకల్పము లొనర్చును. ఇట్టి అభినయము మిగుల శ్రేష్ఠమయినది. "పదార్థసహాయము లేకుండ వాస్తవికతా భ్రమను గొలుపుటయే అభినయమునకు తుది మెట్టు." (సాహిత్యశిల్ప సమీక్ష P 356)

మరొక విషయ మిట గమనార్హము. విటు డొక్కడే రంగమందుండి ఇతరుల భావపరంపరలను సయితము వ్యక్త మొనర్చుచుండును కదా! అనగా శ్రవణేంద్రియ సంతర్పణమునకే వాని యభినయము పరిమితమగుచున్నది. కొన్ని విషయము లందు ఈ భాణము "రేడియో" ఏకపాత్రాభినయమును తలపించుచుండును.

వేశ్యాప్రకృతులు :

భాణము ధూర్తవిటసంప్రయోజ్యము, వేశ్యావిషయసంవలితము నగుటచే వేశ్యా ప్రకృతులిచట గమనార్హములు. వీనినిగూర్చి భరతుడు నాట్యశాస్త్రమున వివరించినాడు. వేశ్యలలోని ఉత్తమ, మధ్యమ, అధమత్వములు వారి అనునయ విధానము మున్నగు విషయములు నాట్యశాస్త్రమున వివరింపబడినవి.[1] కామతంత్ర మందలి యుపచారములను (అనునయవిధానము) చెప్పుచు కాష్టము (అరణి) నుండి అగ్ని పుట్టునట్లే ఉపచారబలముచే, విప్రలంభముచే స్త్రీల యందు కామము నిష్పన్న మగును[2] అని తెలిపినాడు. భాణములందు ఈ స్వభావమే ఎక్కువగ కన్పట్టును.

(1) నా॥శా॥ చూ॥పు॥ 693 (2) నా॥శా॥ చూ॥పు॥ 697

(-శ్రీ P. S. R. అప్పారావుగారు)

వాద్యవి శేషములు :

భాణమునందు పేర్కొనదగిన వాద్యవిశేషములను ఇతరాలంకారికు లెవ్వరును పేర్కొనలేదు. కాని భరతుడు మాత్రము పేర్కొనినాడు.[1] ఇందు మృదంగ పణమ దర్దురములను ప్రయోగింపవలెననియు,[2] రసములను, సత్త్వములను, భావములను, అభినయములను, గతిప్రచారములను గమనించి వాద్యమును ఆ యా స్థానసంయోగమున ప్రయోగింపవలెననియు సూచించినాడు.

భరత వాక్యము:

రూపకముల చివరిభాగమున సాధారణముగ కన్పట్టు లక్షణ మిది. ఇది భారతీయుల సమసమాజభావనకు, సర్వప్రాణిసాధారణమైన శుభాశంసనమునకు నిదర్శనముగ విలిచినది. “లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు” “సర్వే జనా స్సుఖినో భవన్తు” అనే మహర్షుల ఆశంసనములు భారతీయసమతాదృక్పథమును సహితము స్పష్టపరచుచుండును

ఈ భరతవాక్యము నటులచే ప్రయుక్తము. భరతులనగా భరతసంప్రదాయము నెఱిగిన నటులు. వారిచే ప్రయుక్తమగు వాక్య మగుటచే భరతవాక్య మనబడినది. అంతమందు మంగళవాక్యముగా ఇది ప్రయుక్త మగుచున్నది.

భాణములలో భరతవాక్య మొక విశిష్టవిధానమున ప్రయుక్త మగుచున్నది. భాణములలో విటుడు వేశ్యల నాశీర్వదించుచుండును. ఒక్కొక్క వేశ్యతో సంభాషణ ముగియగనే "గృహ్యతా మియ మాశీః" అని యొక శ్లోకమును పఠించును. ఇట్లే అంతమునందు సయితము శృంగార సూచకముగను శుభాశంసనపూర్వకముగను భరతవాక్యము ప్రయోగింపబడుట చాల భాణములలో కన్పట్టును. ఇతివృత్తవిధాన మీ పద్ధతికి పోషకమైనది. కొన్ని భాణములలో భరతవాక్యము సయితము మదనసంబంధిగా తోచును.

సామాన్య మిశ్ర భేదము :

ఈ భేదమును లాక్షణికు లెవ్వరును పేర్కొనలేదు. భరతుడు ఈ భావమునే వెలువరింపలేదు. కాని ముకుందానంద మను భాణమందు కవి తన రూపకమును

(1) నా||శా|| చూ||పు|| 849 (2) నా||శా|| చూ||పు|| 833

(-శ్రీ P. S. R. అప్పారావుగారు)

మిశ్ర భాణ మని పేర్కొనెను. దానిని రచించిన కవి కాశీపతి. 18వ శతాబ్ది ప్రారంభమున నుండిన మైసూరు నంజరాజు కితడు సమకాలికుడు. ఇతడు ముకుందానందభాణము నందు మిశ్రభాణముల ప్రచారము విరళముగా నున్నదనియు, అసలు మిశ్రబాణములే విరళముగా నున్నవనియు కాబట్టి నూతనముగా రచించిన యీ మిశ్రభాణము ప్రద ర్శింపదగిన దనియు ప్రస్తావనలో తెలిపినాడు. దీనినిబట్టి మిశ్రభాణములను రచించుట ముకుందానందముతో పునఃప్రారంభింపబడినట్లు ఊహింపవచ్చును. దీని లక్షణమును గూర్చి కాశీపతి ప్రస్తావించలేదు.

తరువాతి రచనలలో మిశ్రభాణ మని ప్రతిజ్ఞాపూర్వకముగ వచించి రచింపబడిన వానిలో శృంగారరసోదయభాణ మొక్కటి. దీనిని లింగమగుంట వాస్తవ్యుడైన రామ కవి రచించినాడు. అందును లక్షణమును కవి పేర్కొనలేదు. సూచన చేసినాడు. రచనావిధానమును పరికించినను అది సరియైనదే అని తోచుచున్నది. సంస్కృతం ప్రాకృతభాషలనుపయోగించి రచింపబడిన భాణము మిశ్రభాణమని, కేవల సంస్కృత భాణము సామాన్యభాణ మని సూచనము స్పష్టపరచుచున్నది. అత డిట్లు సూచించినాడు.

సుకవి ర్భభాణ భాణం
శృంగారరసోదయాఖ్య మన్వర్థమ్।
భాషాద్వయభూషిత మతి
గుణతోషిత మవశేషితోక్తిభి స్సహితమ్॥

భాషాద్వయరచనము కల భాణములు పెక్కులు లేవు. ప్రాచీనములలో కర్పూర చరితమున ప్రాకృతమిశ్రితత్వము కన్పడును. అర్వాచీనములలో కొన్నిట ఈ లక్షణము కన్పట్టును. అందుచే ఈ భాషాభేదమును పురస్కరించుకొని సామాన్య మిశ్రభేద మేర్పడినది. అయితే కాశీపతి వచించినట్లు ఈ రచన కేవల మర్వాచీనమే కాదు. కర్పూరచరితమే ఇందుకు సాక్ష్యము. ప్రాచీనకాలమున విరళము అనియే కాశీపతి వాక్యము కూడా !

భాణము – భాణిక:

దశరూపకములనే కాక సంస్కృతాలంకారికులు పెక్కురు ఉపరూపకములను కూడా పేర్కొనిరి. ఇవి రూపకము అంత నిడివి లేక సంగ్రహముగ నుండును. దీనిలో

భాణిక యొకటి. పాఠకులు నామసాన్నిహిత్యమును బట్టి భాణమును భాణికగా పొరబడుట కవకాశ మున్నది. ఆ సందేహమును నివారించుటకు, భాణలక్షణ వివరణానంతరము భాణిక లక్షణమును గూడ స్పష్టపరచుట సమంజసము. భాణికా లక్షణోదాహరణములను సమగ్రముగ ప్రదర్శించుట కిచట వ్యవధానము చాలమి సూక్ష్మరూపమున భాణికాలక్షణమును తెలుపుచున్నాము. వీని భేదము స్పష్టపరచుట మాత్రమే యిప్పటి ఆశయము.

భాణము దశరూపకములలో ఒకటి కాగా భాణిక (భాణి) ఉపరూపకములలో నొకటి. ఉపరూపకములను భరతుడు పేర్కొనలేదు. కాని నాటికను పేర్కొనినాడు. అభినవగుప్తుడు డోంబికా, భాణ, ప్రస్థాన, షిద్గక, భాణికా, ప్రేరణ, రామాక్రీడ, హల్లీసక, రాసకములను పేర్కొనినాడు. కాని వీనికి ఉపరూపకములని పేరు పెట్టలేదు. గేయరూపకములనియు, నృత్తప్రకారములనియు, రాగకావ్యములనియు నామకరణ మొనర్చినాడు. కాని మొట్టమొదట ఉపరూపకములను పేర్కొనినది విశ్వనాథుడు. వాని ననుసరించి అమృతానందయోగియు వచించినాడు. రూపగోస్వామి రచితమైన "దానకేళీకౌముది" దీనికి చక్కని నిదర్శనము. దానికి జీవగోస్వామి వ్యాఖ్యానమును సయితము వ్రాసినాడు. అందు భాణికాలక్షణము నందలి సప్తాంగములను సమన్వయపరచి చూపినారు.

అమృతానందయోగి అలంకార సంగ్రహమును బట్టి భాణిక లక్షణ మిది [1]1) భాణిక ఉదాత్తనాయికాయుతము. 2) ఏకాంకపరిమితము. 3) శ్లక్ష్ణ నేపథ్యయుత మైన మధ్యపురుషప్రయోజ్యము కాదగును. 4) కైశికీభారతివృత్తులు రెండును ఇందుండును. 5) భాణికాంగము లేదును ఇందుండును 6) ముఖనిర్వహణసంధులు మాత్రమే యిందుండును. దీనికి "కామదత్త" దృష్టాంత మనియు చూపెను.

దీనియందు 7 అంగము లుండును.[2]

---

1. అథ స్యా ద్భాణికోదా త్తనాయికైకాంకభూషితా
శ్లక్ష్ణనేపథ్యభా జ్మధ్యపురుషా చ ప్రకీర్తితా
కైశికీభారతీప్రాయా త్వంగై స్సప్తభి రుజ్జ్వలా
... ...
ముఖనిర్వహణోపేతా కామదత్తా నిదర్శనమ్.
9 పరి– 127-128 శ్లో.

2. ఉపన్యాసోఽథ విన్యాసో విరోధః సాధ్వసం తథా

1) ఉపన్యాసము 2) విన్యాసము 3) విబోధము (దీనిని జీవగోస్వామి విరోధ మనెను.) 4) సాధ్వసము 5) సమర్పణము 6) అనువృత్తి (దీనిని జీవగోస్వామి వివృత్తి అనెను.) 7) సంహారము. ఈ సప్తాంగములును ఇతివృత్తముయొక్క క్రమ వికాసమునకు, నిర్వహణమునకు ఉపకారకములగుచున్నవి. భాణమునందును భాణిక యందును లక్షణములు చాలవరకు సమానములుగ నున్నవి. కాని భాణము ఏకహార్యము. భాణిక నాయికాయుతము కూడ. అందు దశవిధలాస్యాంగము లుండును. ఇందు సప్తాంగము లుండును. భాణము విటప్రయోజ్యము. భాణిక మధ్యమపురుషప్రయోజ్యము. ఈ భేదములు మాత్రము గమనార్హములు.

శారదాతనయుడు భావప్రకాశ మందు భాణికలలో భాషాభేదమునుబట్టి మూడు భేదములను కథావస్తువునుబటి మూడు భేదములను వివరించినాడు. మొత్తము 9 భేదములను తెలిపినాడు. కేవలసంస్కృతభాషాప్రయోగము కలది శుద్ధ మనియు, సంస్కృతప్రాకృతభాషలు రెండును ప్రయోగింపబడినది సంకీర్ణ మనియు, విచిత్ర మనియు నిర్వచించినాడు. కథావస్తువునుబట్టి ఉద్ధతము, లలితము, లలితోద్ధతము అను మూడు భేదములు. వీనినిబట్టి మొత్తము 9 భేదము లిట్లు చెప్పవచ్చును.

1) శుద్ధ ఉద్ధతము	2) శుద్ధ లలితము	3) శుద్ధ లలితోద్ధతము
4) సంకీర్ణ ఉద్ధతము	5) సంకీర్ణ లలితము	6) సంకీర్ణ లలితోద్ధతము
7) విచిత్ర ఉద్ధతము	8) విచిత్ర లలితము	9) విచిత్ర లలితోద్ధతము

భావప్రకాశము నవమాధికారము
"భారతీయ సాహిత్యశాస్త్రకోశ్"
పు-858.

సమర్పణం చానువృత్తిః సంహార శ్చాపి సప్తమః
ప్రసంగాత్కార్యకథన ముపన్యాసః ప్రకీర్తితః
నిర్వేద వాక్యవ్యుత్పత్తి స్తత్ర విన్యాస ఉచ్యతే
విబోధో భ్రాంతినాశః స్యాన్మిథ్యాజ్ఞానం తు సాధ్వసమ్
సమర్పణ ముపాలంభవచః స్యాత్కోపవిద్ధయా
అనువృత్తి ర్నిదర్శన స్సోపన్యాసః ప్రకీర్తితః
సమాపనం తు కార్యస్య సంహార ఇతి కీర్తితః

9 - 130 నుండి 133.

భాణము – వీథి :

దశరూపకములలో అయిదు ఏకాంకికలు. వానిలో వ్యాయోగము, ఉత్సృష్టి-కాంకములు రెండును భాణముల కత్యంతదూరమున నున్నవి. దగ్గరున్నవి వీథీ ప్రహననములు. కనుక భాణములతో ఆ వీథీ ప్రహసనములకు గల సాదృశ్యవైదృశ్యములను సంక్షేపముగ పరిశీలింతము.

యథార్థమునకు బాణవీథులకు వైదృశ్యముకన్న సాదృశ్య మెక్కువ. ఇతివృత్త విషయమున కాని, ప్రస్తావింపబడెడి వివిధ విషయములలో కాని, రసపోషణ విధానమున కాని, వాగ్ధోరణియందు కాని భాణవీథు లొకే రూపమున నుండును. వీథిలోని నాయకుడు ఉత్తమాధమమధ్యములలో నెవ్వడైన కావచ్చును. భాణములం దట్టి యవకాశము లేదు. ఇందు ధూర్తుడో లేక విటుడో నాయకుడు కావలెను. భాణము వీరశృంగారములకు పరిమితము కాగ వీథియందు సర్వరసములకు అవకాశ ముండును. ఇది లక్షణమే కాని లక్ష్యవిషయమును పరిశీలించిన భాణములయందును ఆనుషంగికముగ నితరరసము లున్నవి. వీథియందును కొంచ మించుమించు ఇదే పరిస్థితి. ఒకే రసము ప్రధానమని నిర్ణయించుటకు ఈ రెంటియందును కథైక్యమున కవకాశము తక్కువ కదా! భాణమున భారతీవృతి ప్రధానము కాగ, వీథి కైశికితో ముడి వేసికొన్నది. భాణములోని నాయకుని యొరలో రెండవకత్తి కవకాశ ముండదు. వీథి యందు మాత్రము ఒకరు లేక ఇద్దరు నాయకుల కవకాశ ముండును. ఇట్లు భేదము అంతర్బహిర్విషయములలో కాన్పించుచున్నను నిర్వహణలో మాత్రము రెండును సరూపము లనిపించునట్లుండును.

భాణము – ప్రహసనము :

దశరూపకములలో వీథి తర్వాత భాణములతో సన్నిహిత సంబంధము కలది ప్రహసనము. రెండింటియందును కల్పితేతివృత్తము - అదియు విశేషించి ధూర్తవిట వేశ్యాసంకులముగ నుండును. వేశ్యల తత్త్వమును, వారి కువృత్తులను, వారిచే వంచింపబడు అభాగ్యులను, విటులను వారి నేర్పును, ఓర్పును వర్ణించుటలో భాణ ప్రహసనములు అహమహమికగ ముందునకు వచ్చును. ఆయా వర్ణనల ద్వారా హాస్యమును, అట్టి విషయములపై ఏహ్యమును కలిగించుట ఉభయత్ర తుల్యమే. కర్పూరచరితభాణమును, మత్తవిలాసప్రహసనమును పరిశీలించినచో వానికున్న

సాదృశ్య మెట్టిదో స్పష్టపడును. లటక మేలక ప్రహసనము వేశ్యాగృహము రంగస్థలమై రమణీయముగ సాగి భాణములలోని దుశ్చేష్టలనే తలపించుచుండును.

కాని ఇంత సాదృశ్యమున్నను ఈ రెండింటి గమ్యములో కొంత వైదృశ్యము కలదు. భాణము శృంగార ప్రధానమై యుండగ, ప్రహసనము హాస్యభాసమై యుండును. అనగ ఆ శృంగారమును సైతము ఈ హాస్య మధిగమించుచుండును. ఒక చిన్న ఉదాహరణముతో నీ విషయమును స్పష్టము చేయుదము. ఆశీస్సులు భాణ ప్రహసనములలో రెండింటియందు నున్నవనుకొనుడు. భాణములలోని ఆశీస్సు "అద్వైతం యువయోరస్తుకుచయో రివ సర్వదా" అని యుండగ ప్రహసనములలో అట్టి తావుల నివ్వవలసిన యాశీస్సు ఎట్లుండునో చూడుడు.

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ |
తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి ॥

ఈ శ్లోకము లటకమేలకకర్తచే భగవద్గీతనుండి స్వీకరింపబడినది. "శుభం పలకరా వెంకన్నా అంటే పెండ్లికూతురు ముండెక్కడ యన్నట్లు" అను సామెతను తలపించునది పై ఆశీస్సు. కనుక భాణములయందలి యితివృత్తమునే అనేకవ్యక్తుల (పాత్రల) సహకారముతో తాను స్వీకరించి హాస్యమున కంగము చేయుట ప్రహసన కర్తవ్యము. భాణప్రహసనములు రెండును ఏకాంకికలగుట లాక్షణికనిర్ణయ మైనను లక్ష్యములలో ఈ ఆంకనియమమును పాటించని ప్రహసనములు కలవు. ఇక అధిక్షేపణాత్మముగ సంఘమును ప్రతిబింబించుట రెండింటను సమమే. సమాజములో గౌరవార్హులు రహస్యముగ వేశ్యవాటికలలో విహరించుట వంటి విషయములను ప్రకటించుటలో రెండు నగ్రగణ్యములే.

భాణము – Soliloquy (స్వగతము):

సంస్కృతమునందును దాని ననుసరించి తెనుగునందును భాణము ఏకపాత్రాభినయమే యైనది. ఆంగ్లమునందు నాటకములలో Soliloquy ఉండును. వానికి భాణములకు పోలికలున్నవేమో పరిశీలింతము.

ఈ Soliloquy అనునది ఆంగ్ల నాటకములలో కొన్ని ప్రత్యేక సన్నివేశము లలో ప్రదర్శింపబడును. ఒకే పాత్ర రంగస్థలముమీద నుండును. అతడు తన మనో భావములను ప్రేక్షకులకు స్పష్టము చేయవలసి యుండును. అది కథాగమనమునకు

ఆవశ్యకమై యుండును. అట్టియెడ ఈ Soliloquy లో ఆతడు మాట్లాడును. ఈ విధానము ఆంగ్ల నాటకమర్యాద. ఈ Soliloquy ను ఎలిజిబితన్, జాకోబిన్ యుగము లందు కవులు నేర్పుతోను, విరివిగాను వాడియున్నారు.

సంస్కృతమునందును ఇట్టి విశేషము కలదు. దానిని స్వగతమని యందురు. దానిని నాట్యధర్మిగా భరతుడు పేర్కొనినాడు. ఇతర పాత్రలు రంగస్థలముపై లేనపుడు ఒకేపాత్ర రంగస్థలముపై నుండి తన మనోభావములను ప్రేక్షకులకు స్పష్టపఱచుచుండును. ఈ భావములు ఇతర పాత్రలకు తెలియనక్కరలేనివై యుండును. లేదా తెలియుట అనౌచిత్యదాయక మగును. కావున ఈ స్వగతము లవసరమైనవి. సంస్కృతనాటకములలో పలుచోట్ల ప్రయోజనమహితముగ నీ స్వగతములు పోషింపబడినవి.

కాని భాణములకు వానికి పోలికలు లేవు. ఏకపాత్రచే అభినయింపబడుట మాత్రమే సాదృశ్యము. మిగిలిన ప్రయోజనమున నవి భేదిల్లుచున్నవి. స్వగతములు, Soliloquy నాటకాంతర్గతములు, అనుషంగికములు. భాణములు ఏకపాత్రాభినయ ములే యయ్యును స్వతంత్రములు స్వయంసంపూర్ణములు. ప్రయోజనముకూడ భిన్నముగనే యున్నది. స్వగతాదులు నాట్యధర్ములు. అనేకపాత్రలలో ఒక పాత్ర తన మనోభావములను స్పష్టపరచుట కుపయోగపడును. భాణము నందట్లు కాదు. ఒకే నటుడు రూపకమునంతయు అభినయింపవలెను. వీని ప్రయోజనము సర్వులను రంజింపచేయుట. అయితే స్వగతాదుల ప్రయోజనము పరిమితమైనది. భాణప్రయోజనము విస్తృతము, విశిష్టము నైనది.

భాణము – ఏకపాత్రాభినయము (Mono-action):

ఆధునికకాలమున ఆంధ్రభాషలో ఏకపాత్రాభినయము (Mono-action) అనుపేర ఒక ప్రక్రియ విశేషముగ కన్పించుచున్నది. అది ఏకాంకికము, ఏకపాత్ర ప్రయోజ్యమునై యున్నది. అంతమాత్రమున దానిపై భాణప్రభావ మున్నదని కాని, రెండింటికిని సాదృశ్య మున్నదని కాని వచింపలేము. ఈ రెండింటికి వైదృశ్యమే మిక్కుటము. అవి ఆంగ్లభాషయందలి Mono drama, Monologue ప్రభావముచే నుద్భవిల్లినవి. "A thearitical entertainment in which there is only one character" అని Mono drama నిర్వచించబడినది.[1] A term used in a number

1. A dictionary of literary terms-P. 382.

of senses, with the basic meaning of a single person speaking alone with or without an audience అని Mono-logue వివరింపబడినది.

ఈ ఏకపాత్రాభినయములలో భాణములలోవలె ఆకాశభాషితము లుండవు. కాని కొన్నింటిలో నేపథ్యమునుండి ఇతరుల మాటలు, నటులపై వాని ప్రభావము కన్పించుచుండును. ఇది అల్పకాలపరిమితమై యుండును. వీనిలోని మరొక విశేషము శృంగారమున కివి చాలదూరముగ నుండుట. ఏకపాత్రాభినయములలో రౌద్ర, వీర, కరుణములకు ప్రాధాన్య మెక్కువ కన్పించుచున్నది. అందును విశేషించి రచనయంతయు ఒకే విషయముపై కేంద్రీకరింపబడినదియు, విశ్లేషణాత్మకమునై యుండును. కొంత కాలము పౌరాణికచారిత్రికవృత్తములకు మాత్రము పరిమితములై యున్న ఏకపాత్రాభినయములు ఆ తర్వాత సాంఘికేతివృత్తములను సైతమాదరించి స్వరూపమును విస్తృతము చేసికొనినవి. భాణములలో వలె స్థలైక్యము కొరవడుట వీనిలో కన్పింపదు. గ్రీకువిషాదాంత రూపకములలో వలె చక్కగా పురిగొన్న భావనముతో ప్రారంభింపబడి, ఆ భావనను సమగ్రముగ ప్రదర్శించి విడచుట కాని, దాని పర్యవసానమును ప్రదర్శించుట కాని ఏకపాత్రాభినయములలో ప్రాయికముగా కన్పట్టుచుండును. ఇవి ఉపదేశ ప్రధానములగుట యిందుల కొక కారణము కావచ్చును. భాణములలో ఉపదేశ మానుషంగికమే. కనుక ఏకపాత్రాభినయములకు, భాణములకు ఏకాంత ఏకపాత్ర చిత్రణములలో సామ్య మున్నను, అంతకుమించి యీ రెండింటికి సంబంధమును చెప్పలేము.

భాణము దృశ్యమా? శ్రవ్యమా?

దశరూపకములలో నొకటిగ భాణమును పరిగణించి మరల దృశ్యమా? శ్రవ్యమా? అని చర్చించుట అసందర్భ మనిపించవచ్చును. కాని దాని ఆవశ్యకము చాల కలదు. ప్రదర్శనీయమను భావమున దానికి రూపక భేదములలో పరిగణన మున్నను ప్రదర్శనీయ ప్రయోజన మెంతవరకు గలదో విచారించి ఆ కోణమునుండి పరిశీలించి దానిలో దృశ్యలక్షణము అధికములో, శ్రవ్యలక్షణము లధికములో నిర్ణయింప వలెను.

రూపకములు రసాస్వాదనమును సులభతరము చేయుట కుద్దేశింపబడినవి. సర్వవిధాధికారులకును ఆస్వాదార్హత కల్గింప వలయునను భావముతో కల్పింప బడినవి. శ్రవ్యకావ్యములు సాహిత్యైక ప్రధానములై ఉత్తమాధికారులకు పరిమితములు కాగ దృశ్యకావ్యములు సౌలభ్యైకప్రధానములై ఉత్తమ, మధ్యమాధమాధికారులకు విస్తృతము లైనవి. కనుక రూపకములలో దృశ్యమానతకెక్కువ ప్రాధాన్యము. అట్టిచో భాణములలో దృశ్యత్వమును గూర్చి చర్చ ఏల యనిపించును.

పై ప్రశ్నకు సూటిగా సమాధానము చెప్పవలయు నన్నచో - భాణములలో దృశ్యత్వము లేశమాత్రముగ నున్నది కాని రూపక పరిగణనమునకు తగినంత లేదనుట నిశ్చప్రచము. యథార్థముగ సంస్కృతనాటకములలో అనేకములను విమర్శకులు ప్రదర్శనార్హములని అంగీకరించుట లేదు. భవభూతి ఉత్తరరామ చరితమును నాటక మనుటకన్న చంపూకావ్య మనుట యుక్తమని అనేక పండితుల యభిప్రాయము. మురారి యనర్ఘరాఘవమునందు దృశ్యత్వలక్షణముకన్న శ్రవ్యతా లక్షణములు మిన్న. అట్లే భాణములలో దృశ్యమానత కెక్కుడు అవకాశము లేదు. కారణము ఏకపాత్రతయే.

కాని ఏకపాత్రత యున్నంతమాత్రమున దృశ్యమానత కేమి లోపము? అనేక నాటకములలో రంగస్థలమున నొకేపాత్ర యుండి అభినయించుట లేదా? స్వగతాదుల నట్టివి కావా ? అనేకులు విష్కంభాదులను ఏకపాత్రములుగనే ఉపయోగించుట లేదా! అని మరల సంశయము వచ్చును. నిజమే. అట్టి స్థితి యున్నచో ఏకపాత్ర మైనను దృశ్యత నంగీకరింపవలసినదే. కాని భాణమున నట్లు కాదు. భాణములలోని నాయకుడు విటుడు, ఏకపాత్రమే గాక అతని స్థాయి కథకుని స్థాయి వంటిది.

అనగా హరికథలను వినునపుడు ప్రేక్షకుల భావము లెంత దృశ్యమానతలోనికి చొచ్చుకొనునో అంతకు మించి భాణములలో దృశ్యమానత కన్పించదు. అంతియ గాదు, ఆ మాత్రము దృశ్యమానత కూడ భాణములలో లేదనవచ్చును. కథకుడు తాను అనేకపాత్రముల ననుకరించి, అభినయించి ఒకచో రసాస్వాదన కవకాశ మీయగలడు. ఇక భాణమున నాయకుడన్నచో ఆ అనుకరణమున సాత్వికాభి-నయమును చూపక వానిని వర్ణించుటతోడనే సరిపెట్టు కొనును. అనగా కవియే పలు విషయములను చూచుచు ఆశువుగ కావ్యమును రచించిన ఎంత దృశ్యమానతయో అంతే దృశ్యమానత భాణము లందుండును. కాని విటుడుసైతము తన ప్రియురాలి కొఱకు పరితపించుట మొదలగు సన్నివేశములలో నటింపక తప్పదు కదా! అది ప్రదర్శనీయమే గదా ! అని అనవచ్చును.

నిజమే! ఆత్మాశ్రయభాణములలో ఈ అవకాశము కొంతవఱకు సాధ్యము. అనగా కథాఫలమును విటుడే అనుభవించెడి సమయమున విటుడే మిత్రకార్య మనుట మాని తన ప్రియురాలికొఱకే పరితపించుచు, ఆమెను చేరెడి కథ యున్నచో దానిలో కొంత దృశ్యమానత కలదు. దాని నతడు అభినయింపక తప్పదు. కాని అన్ని భాణములు నటువంటివి కావు. కొన్ని మాత్రమే ఆత్మాశ్రయములు. ఆ ఆత్మాశ్రయములలో సైతము విటుని విలాపమో, అనుభవమో అత్యల్పకాల పరిమితమే. శేషభాణ మంతయు పరాశ్రయములలో వలె నటుడు అనేక సన్నివేశములకు కేవలము సాక్షీభూతుడుగ నుండి కవి ఆశుకవిత చెప్పినట్లు వానిని వర్ణించుటయే. ఆ యా సన్ని వేశములకు తన గళమును ఎరవిచ్చి, వానిని పలుకుట మాత్రమే. కనుక దృశ్యమానత కంత యెక్కువ అవకాశము లేదు. అందువలననే శ్రవ్యలక్షణముల కది యంత దగ్గర దనుట.

అయినను, మరియొక శంకకిం దవకాశము లేకపోలేదు. ఈ నాటి సమాజమున అంతగ కానరావు గాని కొంతకాలము క్రితము బహుపాత్రాభినయములని ఏకపాత్రాభినయముల వంటివే సమాజమున నుండినవి. అనగా, అందు ఒక వ్యక్తి అనేక పాత్రముల నభినయించును. వానిలో ప్రేక్షకులకు ఆస్వాద్యమానత సంభవించుచునే యుండెడిది కదా! వాని వలె భాణము లందును అనే త్రముల నొక్కదే అభినయించు నందురేమో! కాని దానికి దీనికి కొంత భేద మున్నది. వానిలో ఏ పాత్ర కా పాత్రను దాని స్థానమున నుండి, దాని భావములతో, దాని అభినయముతో

నిర్వహించుట సంభవించును. అనగా నాటకమును ఒకే వ్యక్తి గొంతుకలో సాత్త్విక భావమును మార్చి చదివినట్లుండును. కాని భాణ మట్లు కాదు. విటుడు అన్ని భావములను తన గొంతులోనికి సూర్చుకొని ఆ పై అందించును. అనగా "టెలిఫోన్ ఆపరేటర్" తానే విని మనకు చెప్పినట్లుండును. మధ్యమధ్యలో ఆ భావప్రవాహమునకు ఆనకట్టల వలె "ఏమనుచున్నావు? ఇదా నీ అభిప్రాయము" అని పలుకుచు మాటలను తెల్పును. నాటకములో సైతము తానే పలికి "ఇదా నీ అభిప్రాయము?" అని ప్రశ్నించినచో ఎంత దృశ్యమానతయో యిందు నంతే. కనుక నిది బహుపాత్రాభి-నయము. కాన దృశ్యమానతాలక్షణములు కలిగి యున్న దనలేము. ఈ భాణములు దృశ్యమానత కింతదూరముగ నుండవలసిన అవసర మేమందురా ?

భాణములలో కథైక్యము లేదు. ఏ నియమము లేక వ్రాసికొనుట కర్హమైన రూపకములలో ప్రధానము భాణము. సమాజములో నచ్చిన ఏ విషయమునైన ప్రశంసింపవచ్చును. నచ్చని దేనినైన నిందింపవచ్చును. అనగా భాణ మంతయు అతుకుల బొంత అన్నమాట. మీదు మిక్కిలి అందు సూచింపబడెడి సన్నివేశము లనేకములు ప్రదర్శనానర్హములు. సూచ్యపాత్రముల ద్వారా గాని, అర్థోపక్షేపకముల ద్వారమున గాని సూచింప బడవలసినవే గాని ప్రదర్శింప వీలగునవి కావు. భాణములలోని సూచ్యపాత్రములు (విటునిచే సూచింపబడివి) సైత మొక్కచో కథకలక్షణమును దాటక పోవుట గమనార్హము. కుక్కుటస్పర్ధలు, మేషస్పర్ధలు, మల్లయుద్ధములు, మొదలగు వానికి ప్రదర్శనార్హత లేదు కదా! అట్టివియే భాణములలో నెక్కువ గదా! చిత్ర ప్రదర్శనశాలలో వివిధచిత్రములను చూచినపుడు కలిగెడు అనుభూతివంటిది భాణదర్శనమున కలిగెడి అనుభూతి. కాకున్న దీనిలో కొంత చలనస్వభావ ముండును.

భాణములు అధమాధికారులు - అభినవుని మాటలలో స్త్రీబాలవృద్ధాదుల కుద్దేశింపబడినను అర్వాచీనకాలము నందలి భాణములు సాహిత్యప్రధానములై వారి కందు బాటులో లేవు. అట్లు ఉద్దేశింపబడిన వారి కందుబాటులో లేకపోవుట, ఇటు అనుద్దిష్టులు స్థాయికి రచనావిధానము ప్రసరించుట - రెండును కలసి వానిలో దృశ్యమానతాప్రాధాన్యమును కొంతవరకు పరిహరించినవి. ఇక ఇంతకుముందు చెప్పినట్లుగ భాణములు స్వభావవశముననే దృశ్యమానతకు దూరమయినవి.

ఈ భావమును కొంతవఱకు పరిహరింప వలెనను నిర్ణయముతోడనే భాణములలో లాస్యాంగముల కెక్కువ ప్రాధాన్యము లభించి యుండవచ్చును. లాస్యాంగములు ఎక్కువ ఆంగికాభినయముపై ఆధారపడినవి. కర్పూరచరిత - శృంగారమంజర్యాది భాణములలో వానిని దృశ్యలక్షణములకు దగ్గరకు తీసికొని పోవుటకే లాస్యాంగములు మిక్కిలిగా ఆదరింపబడినవి. ఆ భాణపరిమాణము లత్యల్పముగ నున్నది. కాని ఆర్వాచీన భాణములలో కవులు తమకు నచ్చిన వివిధ విషయములను వర్ణించి పరిమాణమును పెంచినారు. ఆ పెరిగిన పరిమాణములో లాస్యాంగము లున్నను ఎడారిలో నీటిబొట్ల వలె ఇంకి పోవుచున్నవి. దానితో ఆంగికసాత్త్వికాభినయములు అదృశ్యములై వాచికాభినయము మాత్రము మిగులు చున్నది. కేవలము వాచికాభినయ మెట్టిదో పైన పేర్కొనబడినది.

ఈ చర్చ యంతయు ఆంతరవిషయము లాధారముగ చేయబడినది. ఇక బాహిరములైన వర్ణనాదైర్ఘ్యాదులను ఆలోచించినచో అనేకనాటకముల నన్నట్లు వీనిని శ్రవ్యములనుట అపరిహరణీయమే. ఇతరరూపకములు బాహిరవిషయముల వలన శ్రవ్యకావ్యస్పర్శ లేశము కలిగినవి కాని భాణములు ఆంతరవిషయవశమున, బాహిర విషయవశమున సైతము శ్రవ్యకావ్యములకు ఎంతో దగ్గరైనవి.

భాణచ్ఛాయలు

ప్రాయికముగ సాహిత్యములో నే నియమమును అన్యనియమస్పర్శ లేక కన్పించదు. కేవలము ప్రాధాన్యమును బట్టి తత్త్వనిర్ణయము జరుగుచుండును. ఆ రీతిగ నాలోచించినపుడు భాణలక్షణము భాణస్వరూపము భాణైకదృశ్యము కాదు. ఇతర సాహిత్యప్రక్రియలలో పలుతావుల దాని ఛాయ లుండును. వానిలో కొన్నింటి నితర సాహిత్యప్రక్రియలతో పోల్చి పరిశీలింతము.

వైదిక సాహిత్యము:

వైదిక సాహిత్యములో సంవాదము లున్నట్లు ఇంతకు ముందే తెలుపబడినది. అంతియగాక ఏకపాత్రాభినయము వంటి సూక్తములును కొన్ని గలవు.

భాణములకు ప్రధానలక్షణము ఏకాంకత, ఏకపాత్రాభినయత, ధూర్తవిటాది కథావస్తువును కలిగియుండుట. ఆకాశ భాషిత శృంగారరసాదిలక్షణము లున్నను అవి మౌలికములు కావు. కనుక పై విషయసంవాదము కన్పించినచో అందు భాణచ్ఛాయలను మనము గుర్తించి అంగీకరింప వచ్చును.

ఋగ్వేద దశమమండలములోని అక్షసూక్తము ఒక చక్కని ఏకపాత్రాభినయము. విశేషించి నాయకుడు - వస్తువు మొదలగు విషయముల ననుసరించి ఒక చక్కని భాణము వలె భాసించును. స్వానుభూతము లేక పరానుభూతమైన ధూర్తవృత్తమును నిపుణుడు, పండితుడు నైన విటుడు వర్ణించుట భాణ ప్రాథమికస్వరూపము. ధూర్తు డనగా జూదరి – పంచకుడు మొదలగు అర్థములు కలవు గదా! ఆ జూదరి విషయమే యిందితవృత్తము. ఆకాశభాషితాదులు కన్పింపవు. శృంగార బాహుళ్యము, వీరరసము కన్పింపవు. తక్కిన వన్నియు భాణముతో సరిపోలెడి విషయములే. వత్సరాజ విరచితమైన కర్పూరచరితభాణము నందును శృంగార వీరరసముల కన్న జూదము, వంచన, మధుపానాది ధూర్తరతకే ప్రాధాన్యము. ఇట్లు ధూర్తతను వర్ణించి దానిని సమాజము నుండి తొలగించుట భాణముల ప్రధానాశయము. కనుక ధూర్తతలో ఏకదేశమైన జూదమునకు ప్రాధాన్య మిచ్చి; ఏకపాత్రముగ, ఏకాంకముగ విటు డిందు నిపుణముగ వర్ణించుటచే ఈ అక్షసూక్తమున నాంద్యాదిలక్షణములు తప్ప మిగిలిన భాణలక్షణము లన్నియు నున్న కారణముగ భాణచ్ఛాయలు గల

చక్కని రూపక మనవచ్చు. దీని మధ్య అక్కడక్కడ ఆకాశభాషితాదులను, వచనములను చేర్చిన అదే క్రమముతో నాంది ప్రస్తావన భరతవాక్యరూపమును కూడ సంతరించుకొని చక్కని భాణ మగును. ఇది అనుబంధములో మాచే కూర్చఁబడినది.
(చూడుడు — అనుబంధము ధూర్తానుభవభాణః)

అదే మండలములోని 119వ సూక్తము "సోమసూక్తము" సైతము ఒక చక్కని ఏకపాత్రాభినయము. ఇతివృత్తము ఒక త్రాగుబోతునకు సంబంధించినది. ఇంద్రుడు పెల్లుగ సోమరసమును త్రాగి, ఆ మత్తులో తన విశృంఖలవాగాడంబరమును, అంతులేని తన శక్తియుక్తులను తానే ప్రతిపాదించు కొనెడి యితివృత్త మిందు కన్పించును. త్రాగుబోతులకు భాణములలో గల ప్రాధాన్యము తెలిసినదే గదా! కర్పూరచరితమే ఒక చక్కని ఉదాహరణము. మరెన్నో కలవు. 13 ఋక్కులు గల యీ సూక్తమున అన్ని ఋక్కులకును చివర మకుటమువలె 'కువిత్సోమస్యాపామితి' అను వాక్య ముండును. "అనేక పర్యాయములు సోమరసమును త్రాగితిని కావున" అని దీని అర్థము. త్రాగుబోతుల ప్రలాపములు మనకు తెలిసినవే. మధ్యమధ్య "అరేయ్ ఎవడ్రా తాగింది – నేను - నేను తాగానురా - నా యిష్టంరా తాగుతాను - కాదనే వాడెవర" మొదలగు రీతి, నింకను హీనపదములతో ప్రలాపించుచుండును గదా! అదే పై సూకములోని మకుటము. ఈ మత్తువలన ఇంద్రుడు వేగముగ నడిచెడి రథము వలె ఊగిపోవుచు, తన వాగాడంబరమును ప్రదర్శించుచుండును. ధూర్త ప్రలాప మితివృత్త మయిన ఒక చక్కని ఏకపాత్రాభినయ మయిన కారణముగ దీనిలో భాణచ్ఛాయలు ప్రస్ఫుటము. ఇట్టివి మరెన్నో కన్పించవచ్చును. ఇది దిక్ప్రదర్శనము మాత్రమే.

లౌకిక సాహిత్యము :

ఆదికావ్యప్రఖ్యాతి నార్జించుకొనిన రామాయణమున అక్కడక్కడ ఏకపాత్రాభినయములున్నవి. విశేషించి సుందరకాండమున త్రయోదశసర్గమున సీత కనిపించని సమయమున ఆంజనేయుడు విలపించుట - తానా వార్తను మోసికొని వెళ్ళినచో జరిగెడి అనర్థాలను గురించి ఆలోచించుట ఏకపాత్రాభినయమే అయినను ఏకపాత్రత అనుట తప్ప మరే రీతిగను దానిలో భాణచ్ఛాయ లుండవు. కాబట్టి అటువంటి వానిలో భాణచ్ఛాయలు పరిశీలింపరాదు.

శ్రవ్యకావ్యములలో మేఘసందేశ మొక ఏకపాత్రాభినయమే. భాణములలో వలె ఒకేపాత్ర వివిధవిషయములను ప్రస్తావించి వర్ణించుట యిందు కలదు. కాని భాణములలో విటుడు తిరుగుచు ఆ యా విషయముల ప్రస్తావించును. ఇందు ఒకే తావున నుండి మార్గము నంతటిని ప్రస్తావించుట కన్పట్టును. అనగా యక్షుని లేవదీసి, అక్కడనుండి బయలుదేర దీసినచో మేఘసందేశ మొక ఉదాత్తభాణము. అయితే మామూలు భాణములలో ఈ ఉదాత్తత కన్పించదు.

రూపకములలో భాణములతో కొన్ని విషయములలో సంవదించెడివి వీథీ ప్రహసనములు. అవి ముందే వివరింపబడినవి. ఇక నాటక ప్రకరణాదులలో ఆకాశ భాషితాదులు- లాస్యాంగాదులు కన్పించుచున్నను అవి సర్వరూపకసామాన్యములే కనుక వానిలో భాణత్వము నారోపింప నవసరములేదు. కాని లాస్యాంగములకు భాణముల ప్రాధాన్యమును మాత్ర మంగీకరింపవలెను.

భాసుని అవిమారకములో భాణచ్ఛాయ స్పష్టముగ కన్పించును. తృతీయాంకమున ఒక చిన్ని భాగము విషయమున, విన్యాసమున, నిర్మాణమున సైతము భాణచ్ఛాయలను పుణికి పుచ్చుకొని యున్నది. అవిమారకుడు కురంగీకన్యాంతఃపురమున ప్రవేశింప దలచి ఖడ్గహస్తుడై చోరవేషమున త్రాటిని చేతబట్టి రంగస్థలమున ప్రవేశించినప్పటినుండి అంతఃపురప్రవేశము వరకు ఒక భాణమువలె నుండును.

రంగస్థలమున అవిమారకు డొక్కడే నటుడు. సమయము రాత్రి, బహుదోష విలయము, మార్గమా రాజమార్గము, అవిమారకుడు "అకటా ! యౌవనము మిక్కిలి కష్టతరము సుమా" అనుచు ప్రవేశించి ఆ కష్టములను వర్ణించును. ఆ పై కాళరాత్రి వర్ణనము. వెంటనే వీణాశ్రవణము. నెచ్చెలితో ముచ్చటల దీరు సరసుని పరిచయము. పాడున దెవరో– వీణ మీటున దెవరో నిర్ణయించుట. చూడుడు - పాడునదిమాత్ర మాడదియే. ఏలన

మెలమెల్లగ లయ కుదిరెను
జలచల్లగ మధురరీతి సాగెను నాదం
బులు, కరతాళధ్వానము
వలయక్వణగణన ద్రైఘ్యభావము వడసెన్.[1]

---

1. ఈ సన్నివేశమునందలి నాటకభాగమున కనువక్త - సూరం శ్రీనివాసులు.

ఇంతలో విటునివలె ఆటునిటు తిరిగి మఱియొక సన్నివేశమును పరికించును. అలిగిన ప్రియురాలిని అనునయించెడి సన్నివేశము. అత డెంత బ్రతిమిలాడుచున్నను, రేయి తెలవారుచున్నను ఆ కలికి కరుణింపకపోవుట. భాణములో వలె ఆ సన్నివేశ వర్ణనము. చూడుడు :-

కంటఁ దడి పెట్టి గద్గదగళముతోడఁ
బొమ్మ నేనేల యని ప్రేమపూర్తి ననుచుఁ
జెలునిఁ జేరియుఁ బ్రణయవశీకృతిఁ దరు
ణీస్వభావమునఁ బ్రతికూలనీతిఁ బలుకు.

వెంటనే గుడ్లగూబ అరుపు. దానిచే వెరపు నంది ప్రియుని కౌగిలించిన ప్రియురాలి స్థితి. ఈడునకు తగిన జోడని భావించియు, పరుల జోలి మన కెందుకులే అని మరొక వైపునకు మరలుట. అంగడిముందు బెదురుబెదురుగ మెలమెల్లగ ఎవర్తెతోనో మాటాడెడి కోడెగాని వర్ణనము. వెంటనే మేడలనుండి వెలువడెడి వెలుగును చూచి చంద్రిక అని భ్రమించి మరల యథార్థము నెరుగుట. ఆ వెలుగును తప్పించుకొని తిరిగెడి దొంగ. మరొక వైపునకు నడువగనే రక్షకభటులు కన్పించుట. తప్పించుకొనుట కుపాయాన్వేషణము. అక్కడొక కూడలి. అందు విటులు. వారిలో కలిసిపోవుట. మెల్లగా రాజకులమున ప్రవేశించుట. త్రాటి సాయమున కోటలోనికి దిగి దానిని గజశాలలో వైచి మరలుట. అంతఃపురగవాక్షమునుండి పై కెక్కుచు తన వలపును కొలుచుకొనుట.

చెలియ మీద వలపుతలపులు చెలగగ
నింతి చేరఁ గొంకు సుంత యేల?
కంటకాళిభీతి కమలినీనాళాన
దప్పి గొని సరస్సుఁ దరల డెవడు?

అక్కడనుండి ఆ మేడను వర్ణించుచు చోర వేషమును తీసి తలుపు తెరచుట. ఇంతటితో ఏకపాత్రాభినయము ముగియును. ఇందలి అణువణువును భాణములతో దగ్గర పోలిక గలదే. అనగా ఒక బృహద్భాణమునకు నిది సంక్షిప్తీకరణమని పల్కినను ఆశ్చర్యపడవలసిన అవసరము లేనంతగ భాణసాదృశ్యము కలదీ దృశ్యము.

అటు తర్వాత మునము విశేషముగ గుర్తింపవలసిన ఏకపాత్రాభినయము విక్రమోర్వశీయ చతుర్థాకమున చూపట్టుచున్నది. ఆ యంకమున పురూరవుని

పాత్రముతో కాళిదా సొక విశేషప్రయోగము చేసినాడని చెప్పవలసియున్నది. ఊర్వశీవియుక్తు డైన పురూరవుడు - పిచ్చివాడై - ఆమెను వెదకుచు పుట్టపుట్టను అడుగుచు ఉన్మత్తుడు కావున అనేకవిధముల వింతవింతనృత్యములను చేయుచు రంగస్థల మంతయు సంచరించును. ఆత డొక్కడే రంగస్థలమున నిలిచి దాదాపు అరువది శ్లోకములను మధ్యమధ్య వచనములను పలికినట్లు ప్రదర్శనయోగ్యమయిన దృశ్యకావ్యమును రచించుట చాల సాహసముతో గూడిన పని. అదియు కేవలము వాచికాభినయము కాదే! వివిధ నృత్తములను సయితము ప్రదర్శించవలసి యున్నదే. ఇట్లు కాళిదాసు విక్రమోర్వశీయ చతుర్థాంకమున చక్కని ఏకపాత్రాభినయమున కవకాశము నిచ్చినాడు.

భాణములలో విప్రలంభశృంగారరసమును సైత మంగీకరించినచో (అనేకాలంకారికులు భాణములకు రసనిర్దేశము చేయలేదనియు- విప్రలంభమును, అందందు భాణములలో నన్నదనియు మన మిట గుర్తుంచుకొనవలెను) ఇంతకన్న చక్కని భాణము, ఆత్మాశ్రయేతివృత్తము గలది - ఉదాత్తమయినది మఱియొకటి లేకపోవచ్చును. భాణమున విటుడు దృశ్యపాత్రము కాగ, ఇతరులు సూచ్యపాత్రములు. ఇందును పురూరవుని దృశ్యపాత్రముగ స్వీకరించిన నదులు, లతలు, పక్షులు మొదలగునవి సూచ్యపాత్రములు. పురూరవుడు వానితోడనే సంభాషించుచు, ప్రియావృత్తము నెఱుగుటకును - ఆమెను అనునయించుటకును చివరకు భ్రమవలన పాదములపై పడుటకును ప్రయత్నించుచుండును. కావున విప్రలంభశృంగారము ప్రధానరసముగా గల ఒక ప్రయోగాత్మకభాణమే ఈ పురూరవుని ఏకపాత్రాభినయము. ఆ సమయమున అతడు ఊర్వశిని స్మరించుచు భాణములలోని విటుడు స్మృతులు నెమరు వేసికొనినట్లు పలికిన శ్లోకరామణీయకమును ఆస్వాదింపుడు -

తిష్ఠే త్కోపవశాత్ స్వభావపిహితా దీర్ఘం న సా కుప్యతి
స్వర్గా యోత్పతితా భవే న్మయి పున ర్భావార్ద్ర మస్యా మనః।
తాం హన్తుం విబుధద్విషో పి హి న మే శక్తాః పురోవర్తినీం
సా చాత్యన్త మగోచరం నయనయో ర్యాతేతి కోయం విధిః ॥

ఆమె నాపై కోపముతో అదృశ్యమై నిలిచియున్నదా? లేదు. ఆమె కోప మెక్కువ కాలము నిలువదు. లేక స్వర్గమునకే వెళ్ళలేదు గదా! అది జరుగనిది. ఆమెకు నాపై వలపు మిక్కుటమే. కాక ఏ రాక్షసుడయిన ఆమెను మరల నెత్తుకొనిపోయెనా?

కాకూడదు. నే నుండగా ఆమె నెవడపహరింపగలడు మఱి ఆమె కంటికి కనిపించుట లేదే ? అదే విధివైపరీత్యము.

శ్రీ వేంకటనాథ వేదాంత దేశికాచార్యుల సంకల్పసూర్యోదయనాటకమున సైతము భాణచ్ఛాయలు చక్కగ కన్పించును. ఈ నాటకముననను చతుర్థాంకమున "దర్ప "పాత్ర ప్రవేశానంతరము కొంతదూరము భాణరచనారీతి యనుసరింపబడినది. మహామోహరాజాదేశముచే ఉత్తమజనులను తిరస్కరించుటకు బయలుదేరి, దేశ దేశాలు తిరిగి, తిరిగి భారతదేశము వచ్చి సంచరించుచు తన నెచ్చెలి యయిన అసూయను కలిసెడి వరకు సాగిన రచన చక్కని భాణవిధానమునకు నిధానము. అది విక్రమోర్వశీయములోని పురూరవపాత్రములో సగము పరిమాణము కలిగి యున్నది. అది ఒక విధముగ కథావిషయమున భాణములకు కొంచెము దూర మయినది. ఇది మాత్రము ఆ విషయమున కూడ భాణములతో పోలికలు గలది.

ఆకాశ భాషితముల ద్వారమన మాటాడుట - వివిధప్రదేశముల వైపు సంచరించుచు - అందు వివిధజనపదముల వర్ణించుట. ఆ యా జనపదములకు సంబంధించిన వివిధవ్యక్తులను వర్ణించుట - ఆ పై పండితనింద – సన్న్యాసిదూషణము - శ్రోత్రియదూషణ మొదలగు విషయములను తనలో నింపుకొనిన కారణముగ నిది భాణములకు చాల సన్నిహితరచనము. ఒక స్వల్పోదాహరణము :

(ఆకాశ) రే రే బాలిశ! కిం బ్రవీషి? కుత స్తవేయం శిక్షా కీదృశీ చ పరిచితి రితి (సహస్తాస్ఫాలనం విహస్య)

విధి మంతరేణ విహగేన కుతః
పయసో రశిక్ష్యత వివేకవిధిః।
కతి వా దినాని వద పర్యచినోత్
కలశీసుతః కవలయన్ జలధిమ్॥

నీ కింత నేర్పు ఎక్కడిదన్న ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు. హంసకు క్షీరనీరముల వేరుచేయు శక్తి ఎక్కడిది? అగస్త్యుడు సముద్రమును ఆపోశనము పట్టుట కెంతకాలము ప్రయత్నించినాడు? అది సహజసిద్ధమట. ఇట్లు వివిధరంగములలో నిది భాణమువలెనే సాగును. ధూర్తచరిత ప్రధానమైన యొక భాణచ్ఛాయ యిది.

ప్రకృతివర్ణనములలో భాణములది ప్రత్యేకధోరణి. వాని నన్నింటిని కవి శృంగార రసముతో ముంచెత్తుచుండును. ఆ రీతిగ వర్ణనములు ఇతరత్ర ఎక్కువ కన్పింపవు. కాని మురారి తన అనర్ఘరాఘవనాటకమున చతుర్థాంకమున మాల్యవంతుని చేత చేయించిన సూర్యోదయవర్ణనములో నిట్టి వర్ణనారీతి, భావసరణి కన్పించును.

ఈ సరణి పరిశీలించుచు పోయినచో అనేక నాటకములలో ఇట్టి భాణచ్ఛాయలు కన్పింపవచ్చును. కాని ప్రధానముగ ప్రధాన నాటకములలో కన్పించెడి భాణచ్ఛాయలే ఇందుదాహరింపబడినవి. సహృదయు లిట్లే మిగిలిన తావుల సైతము గ్రహించి ఆనందించవచ్చును.

ప్రాచీన భాణములు

చతుర్భాణి :

సంస్కృత భాణములలో కాలక్రమము ననుసరించినను, విషయోదాత్తతను దృష్టియం దిడుకొనినను ప్రప్రథమముగ పరిగణింపదగినది చతుర్భాణి. మొట్టమొదటగ దీనికి మానవల్లి రామకృష్ణకవిగారు 1922 లో వెలుగు చూపిరి.

సంస్కృత నాటక రచయితలలో అంతర్జాతీయఖ్యాతి నార్జించుకొనినవాడు కాళిదాసు. అతని నాటకముల ప్రభావము ప్రపంచములో అనేకభాషల సాహిత్యములపై ప్రసరించినది. ఇది సర్వులును ఆమోదించు విషయము. కాని ఈ క్రింది శ్లోకము తద్విరుద్ధముగ కన్పట్టుచున్నది.

> వరరుచి రీశ్వరదత్తః శ్యామిలక శ్శూద్రకశ్చ చత్వారః।
> ఏతే భాణాన్ బభణుః కా శక్తిః కాళిదాసస్య॥

చతుర్భాణిలో ఒకటైన పద్మప్రాభృతక ప్రతికి చివరగా ఈ శ్లోకము కన్పట్టు-చున్నదని మా॥రా॥ కవిగారు పేర్కొనిరి. ఈ శ్లోకములో "వరరుచి, ఈశ్వరదత్తుడు, శ్యామిలకుడు, శూద్రకుడు అను నల్వురును భాణములు రచింపగలిగినారు. కాళిదాసు కా శక్తి ఏది" అని యీ కరచయిత ప్రశ్నించుచున్నాడు. కాళిదాసుకు ఆ శక్తి ఉన్నదా లేదా అను విషయ మిట ప్రస్తావనీయము కాదు. కాని ఈ నల్గురు భాణములు రచింప గలిగిరి అను మాట శ్లోకరచయితకు చతుర్భాణిపై కల మక్కువను తెలుపును. అంతియ కాదు. నాటి సంఘములోని మాలిన్యమును సాధిక్షేపముగ, పరిహాసప్రాయముగ బయట పెట్టి నిల్వగలిగిన శక్తి వారికే కలదను విషయముకూడ బయల్పడును. ఇతరసాహిత్యమును విడిచి భాణసాహిత్యమును మాత్రమే దృష్టియం దిడుకొని పరిశీలించినచో ఈ చతుర్భాణి ఉన్నతముగను, ఉదాత్తముగను ఉన్నదను మాట నిస్సంశయము. సమకాలికజీవనమును ప్రతిబింబించుటలో కూడ ఈభాణముల పాత్ర అద్వితీయమైనది.

పాశ్చాత్యవిద్వాంసుడు Thomas ఈ భాణముల వైశిష్ట్యము నిట్లు ప్రశంసించి నాడు. "It will, I think, be admitted that these compositions, in spite

of the unedifying character of their general subject and even inspite of occasional volgarities have a literary quality. They display a natural humour and a polite, intensely Indian irony which need not fear comparison with that of Ben Jonson or Moliene,"

(Centenary Suppliment of J.R. A S. 1924 Page 235)

లోపము లున్నను ఉత్కృష్టతలు కూడ కలవని అతని అభిప్రాయము. ఇట్లు భారతీయుల చేతను, పాశ్చాత్యుల చేతను కొనియాడబడినవి ఈ నాల్గు భాణములును. వీని వైశిష్ట్యమును స్థూలముగ పరిశీలింతము.

ఉభయాభిసారిక – వరరుచి :

చతుర్భాణిలో కాలక్రమము ననుసరించి ఉదయాభికారిక మొట్టమొదటిదిగా కానవచ్చుచున్నది. దీని రచయిత వ్యాకరణవార్తికకారుడుగా సుప్రసిద్ధుడైన వరురుచి. ఇతడు విక్రమార్కుని ఆస్థానమున నవరత్నములలో నున్నట్లు కథ కలదు గాని, ఆది విశ్వసనీయము కాదని పరిశోధకుల తలంపు. కథాసరిత్సాగరమున వరరుచిని గూర్చిన విశేషము కొంత తెలియును. ఇతడు పాణినికి సమకాలికుడు, సహాధ్యాయి. పాణిని మగధ నేలిన నందరాజులలో చివరి రాజుకు సమకాలికుడు. వరరుచి చిన్నతనముననే తండ్రిని కోల్పోయెని. వ్యాడి యకు నతడు ఈతనిని ఉపాధ్యాయులకు పరిచయ మొనర్చెను. ఈ విషయమునకు పోషకముగ వరరుచి జన్మస్థలము గోదావరి తీరమనియు, తల్లి పేరు సాత్రాయణి యనియు, ఆమె కాత్యాయనుని కూతు రనియు దండి ఆవంతీసుందరీ కథాసారమున తెలిపినాడు. వరరుచి వ్యాకరణ వార్తికములనే గాక జ్యోతిషధర్మశాస్త్రగ్రంథములను, కంఠాభరణ మనెడి కావ్యమును రచించినట్లు రాజశేఖరుని వలన తెలియుచున్నది. పరిశోధకుల తలంపు ననుసరించి యాతడు క్రీ॥పూ॥ 300 నుండి క్రీ॥శ॥ 100 సం॥ మధ్యకాలము వాడయి యుండును.

ఇందలి కథాంశ మిది. సాగరదత్తశ్రేష్ఠి పుత్రుడైన కుబేరదత్తునకు, అతని ప్రియురాలు నారాయణదత్తకు ప్రణయకలహము సంభవించినది. అంతట విరహ సంతప్తుడైన కుబేరదత్తుడు సహకారకు డనెడి పరిచారకునితో వైశికాచలునకు (విటుడు) ఇట్లు కబురంపినాడు. "నారాయణదేవుని ఆలయములో జరుగు మదనోత్సవములో సంగీతనాటకములో రసానుగుణముగ అభినయించుచున్న

మదన సేనను నేను ప్రశంసించితిని. నారాయణదత్త ఆ సన్నివేశమును చూచినది. నేను మదనసేనను మోహించితి నని అనుమానపడినది. కోపన యైనది. పాదముల మీద పడినను నన్ను చూడక వెడలిపోయినది నారాయణదత్త. ఆమెమీది అనురాగముతో పరితపించు నా హృదయమునకు ఈ రాత్రి వేయిరాత్రులవలె నుండి గడచుట లేదు. అందుచే నగరమున కంతకును వసంతప్రాయుడైన వైశికాచలుని మా యిరువురకు సంధి చేయు మని కోరుచున్నాను."

ఈ ఆహ్వానము నందుకొని పైశికాచలుడు ఉదయముననే బయలు దేరినాడు. కుసుమపురవీథులను, ఆపణములను, ప్రాసాదములను వర్ణించుచు ముందుకు సాగును. రాజోద్యోగులు మున్నగు వారిని తప్పించుకొని పోవుచున్న వైశికాచలుని దృష్టిని చరణదాసి కూతురు అనంగదత్త ఆకర్షించును. ఆమె ప్రణయపరిశ్రమచే అలసినది. ఆ శకునము తన కార్యసిద్ధిని సూచించునని సంతసించినాడు. ఆమె మహామాత్యపుత్రుడగు నాగదత్తుని ప్రాసాదము నుండి వచ్చుచున్నట్లు, ఆమె ధనమును గాక ప్రాయమును, సౌందర్యమును మాత్రమే వలచి నిర్ధనుడై నను నాగదత్తు నింటికి వెడలి వచ్చుచున్నట్లు, ఆమె సంభాషణవలన తెలిసికొనును. సంతోషించును. ఆమె నాశీర్వదించి ముందుకు సాగును. ఇంతలో విష్ణుదత్తుని కూతురు మాధవసేన కన్పించును. ఈమె పై అనంగదత్తకు సరిగా వ్యతిరిక్త. ఆమె తల్లి కిష్టము లేకపోయినను రూపవంతుడైన ప్రియుని కలిసినది. ఈమె తన కిష్టము లేక పోయినను, కురూపియై కుబేరుడైన సముద్రగుప్తుని కలిసినది. వీరికి గల భేదమును సూచించినాడు. ఆమె నాశీర్వదించి ముందుకు సాగినంతనే విలాసకౌండిని యను పరివ్రాణిక కన్పట్టినది. ఆమెతో వ్యంగ్యసంభాషణ మొనర్చి, ఆమెలో కుతుకమును రేపి, ఆమెను సాగనంపును. వెంటనే చరణదాసితల్లి రామసేన కంట పడును. ధనికుని యింటికి వెళ్ళిన కూతురు చరణదాసిని ఏదో నెపముతో కొనివచ్చుటకే బయలుదేరిన దని ఆమె సంభాషణవలన తెలియును. ఇప్పట్టున వేశ్యలను, వేశ్యామాతలను వర్ణించును. తరువాత రాజుగారి బావమరిది రామ సేనుని యింటినుండి వచ్చుచున్న సుకుమారిక కన్పించును. ఆమెతో సంభాషణము త్వరగా ముగించుకొని, ముందుకు సాగినప్పటికీ పార్థకశ్రేష్ఠి పుత్రుడు ధనమిత్రుడు కన్పట్టును. అతడు వేశ్యలచేత వెడలగొట్ట బడినాడు. వేశ్యల మోసముల నతడు వివరించును. దగాపడిన యాతనిని సాంత్వన వచనములతో సత్కరించి సత్వరమే ముందుకు సాగి ప్రియంగుసేనను దర్శించును. ఆమె రూపమనందు యౌవనమునందు, అభినయమునందు దేవదత్త కంటె మిన్న యని ప్రశంసించి, ఆమెను సాగనంపును. ఇంతలో అసలువ్యక్తి

కన్పించును. ఆమె నారాయణదత్త చేటిక కనకలత. ఆమెవలన విషయ మంతయు తెలిసికొనును వైశికాచలుడు. విరహతప్త యైన నారాయణదత్త ఆశోకవనమున నుండగా ఎవరో పాడిన రెండు శ్లోకములను వినినది. వెంటనే ప్రియునిపై కోపము తగ్గి నారాయణదత్త కురదత్తుని యింటికి పరిచారికతో బయలుదేరినది. అట్లే కుబేరదత్తుడును నారాయణదత్త ననునయించుటకై నారాయణదత్త గృహమునకు బయలుదేరెను. ఇద్దరును వీణాచార్యుడైన విశ్వావసుదత్తు ఇంటిదగ్గర కలిసికొనిరి. వా రిరువురిని విశ్వావసువు చూచి తన గృహములోనికి కొనిపోయెను. తెల్లవారి చేటికను పిలిచి నారాయణదత్త వైశికాచలుని పిలుచుకొని రమ్మనెను. ఈ విషయమునికై కనకలత యరుదెంచినదని తెలిసికొని వైశికాచలుడు కనకలతతో కలిసి విశ్వావసు నింటిలో ప్రవేశించును. ప్రేయసీప్రియుల నాశీర్వదించును. వారి సల్లాపములకు విఘాతము కల్గింపరాదని భరతవాక్యము పలుకును. నిష్క్రమించును.

ఇట్లే కథాభాగ మంతయు కేవలము వేశ్యాసంబందిగ నుండును. అయినను శ్రుతి మించలేదు. ఉదాత్తతాపరిధి సతిక్రమింపలేదు. విశృంఖలత్వము లేదు. నాయికానాయకు లిర్వురును ఒకరి నొకరు అభిసరించుటచే ఇది ఉభయాభిసారిక యైనది. రూపములో చిన్నదైనను గుణములో మిన్న యనియే చెప్పవలెను.

ఒక్క విషయమిట ప్రస్తావించుట యప్రస్తుతము కానేరదు. ఏ సాహిత్యము నందైనను తొలికావ్యమునందు కావ్యశోభలు అంతగా కన్పట్టవు. ఇది ఆధునిక దృక్పథము. కారణము తొలికావ్యమున క్రమవికాసమునకు అవకాశము లభించదు. ఎక్కువ పూర్వకావ్యచర్వణమునకు కవికి తావు మృగ్యము. కావున తొలిదశకంటే తర్వాతిదశలలో సాహిత్యము సుసంపన్న మగునని నవీనుల తలంపు. ఈ అభిప్రాయమునకు విరుద్ధముగా నిలిచినది సంస్కృతసాహిత్యము. ఆదికావ్యమైన రామాయణమునందు గల కావ్యశోభలు మరెందును లేవనియు, అందలి రచనాసారళ్యము, స్పష్టమైన అభివ్యక్తియు, రసానందజనకత్వమును నాన్యతో దర్శనీయము అనియు దాని కెంతయో ప్రచారము లభించినది.

ఇట్లే తెలుగున కాదికావ్యమైన నన్నయ మహాభారతమునకు ఎనలేని ఖ్యాతి కల్గినది. ఇదే విధమున రూపక సాహిత్యములో భాణము మొదటిదని విశ్వసించు చున్నాము కదా! ఆ భాణసముదాయములో కాలక్రమము ననుసరించి మొదటిదైన ఉభయాభిసారిక క్రమవికాస సిద్ధాంతమును త్రోసిరాజని తన వైశిష్ట్యమును, వ్యక్తిత్వమును నిలుపుకొనినది. ఇతర భాణములలో శృంగారము అశ్లీలముగ మారినది

కాని ఇందా ఛాయలే కన్పట్టవు. సభ్యసహృదయులకు సంతోషజనకముగ మాత్రము నిల్చినది.

ఇందలి విశేషములను కొన్నిటి నిట చవిచూతము. విద్వత్కవులే కవులని ఆలంకారికుల అనుశాసనము. కవిత్వమునకు పాండిత్యము తోడైనచో పసిడికి పరిమళ మబ్బినట్లే యుండును. వరరుచి పాండిత్యముచే ప్రసిద్ధి వహించినాడు. కేవలవ్యాకరణముందే కాక ధర్మజ్యోతిషములందు ప్రసిద్ధుడు కదా. ఈ భాణములో ఒకచో సాంఖ్యపరిచయముకూడ ప్రకటింపబడినది. విలాసకౌండిని అనెడి పరివ్రాజిక వైశికాచలునితో సంభాషించు నపుడు వైశేషిక సాంఖ్యముల ప్రస్తావన వచ్చినది.* శాస్త్ర పాండిత్యమే కాక యీతనిలో చక్కని కవితాప్రాగల్భ్యము, చిక్కని సాహిత్య శాస్త్ర మార్మికత కన్పించును.

సాహిత్యముయొక్క పరమప్రయోజనము రసానందసిద్ధి. ఈ రసశాస్త్ర విషయమున మన యాలంకారికులలో ఆద్యప్రవక్త భరతుడు. అతడు "విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తిః" అని నిర్వచించి విభావ మనగా హేతువు, కారణమని సూచించెను. దాని ననుసరించి ఇతరాలంకారికులు ఉద్దీపనవిభావము, ఆలంబనవిభావము అను భేదము నేర్పరచి వానిలో ఆలంబనవిభావము సమవాయకారణమనియు, మిగిలిన యుద్దీపనవిభావములు కారణజాత మనియు పేర్కొనిరి. దీనిని విమర్శించుచున్నట్లున్నదీ క్రింది శ్లోకము, ఇది లోకమును, అనుభవమును దృష్టిలో నిడుకొని చెప్పిన సత్యము.

ఉద్యానాని నిశా శ్చ చంద్రసహితా వీణా శ్చ రక్తస్వరాః
గోష్ఠీ దూతిజనో విచిత్రరచనో నానావిధా శ్చర్తవః।
నైతత్కామి జనస్య సంగమవిధౌ సంజాయతే కారణం
హ్యన్యోన్యస్య గుణోద్భవై రకృతికై రాగోచ్ఛ్రయః కారణమ్॥

ఇది కేవలము శాస్త్రవిమర్శనము కాదు. కథాగతిలో మిగుల అవసరమైనది. కాని శాస్త్రమును Satire గా విమర్శించుచున్నట్లున్నది. ఉద్యానము, వెన్నెలరాత్రులు మున్నగునవి కామిజనుల సంగమమునకు కారణములు కావనియు, ప్రధాన కారణము వేరుగ నున్నదనియు, అది నాయికానాయకుల సద్గుణములవలన కల్గిన పరస్పరానురాగమే ననియు శాస్త్రమును తత్త్వగర్భముగ విమర్శించినాడు. ఇట్టి శాస్త్రవిమర్శలు భాణము నందచ్చటచ్చట కన్పట్టును.

* "అలేపకోనిర్గుణః క్షేత్రజ్ఞః పురుష ఇతి" P-8.

భాణవచనమం దితనిలో ఒక కవితాశిల్పము గోచరించును. అది ఇతర భాణ రచయిత లెవ్వరును గ్రహించినట్లు కన్పట్టదు. నాంద్యంతమున సూత్రధారుడు ప్రవేశించును. స్వల్పమైన స్థాపన గావించును. సభ్యులకు విన్నవింప దలచుచుండగా నేపథ్యమునుండి ఏదియో శబ్దము వినవచ్చును. ఆ శబ్దమిది.

వసన్తప్రముఖే కాలే లోధ్రవృక్షో గత ప్రభః।
మిత్రకార్యేణ సంభ్రాంతో దీనో విట ఇవ స్థితః॥

(మిత్రుని కార్యముచే దీనుడైన విటునివలె వసంతకాలమున లోధ్రవృక్షము కాంతి తరిగియున్నది.)

ఈ శ్లోకము నేపథ్యమునుండి వినపడును. సూత్రధారుడు నిష్క్రమించును. వెంటనే విటుడు ప్రవేశించును. పై శ్లోకమునందు "విటఇవస్థితః" అనునది పాత్ర ప్రవేశమును సయితము సూచించును. ఈ ప్రక్రియను తర్వాతి కవులు చాలమంది అనుసరించిరి. అంతియగాదు. ఇందు మరొక విశేషమును కలదు. ఇందు వైశికాచలుడు విటుడు. ఈ భాణము పరాశ్రయ మైనది. అనగా కథాఫలము పరులకు చెందినది. ఇతడు కేవలము సాక్షీభూతుడు. ఈ విషయమును భాణముయొక్క మొదటలో సూచించును. ఇది ఒక విధముగ కావ్యార్థసూచనము. ఈ విటుడు గతవయస్కుడు.[1] కావుననే లోధ్రవృక్షమువలె గత ప్రభుడు, మిత్రకార్య విభ్రాంతుడు, దీనుడు. ఈ దీనత్వమునే భాణము చివరను వైశికాచలుడు ప్రదర్శించును. నాయికా నాయకు లిర్వురును ఒకరినొక రభిసరించి, విశ్వావసుగృహమున కలిసికొనినపుడు వారి సంభాషణాదికమునకు విఘ్నము కల్గింపరాదని నిష్క్రమింపదలచి ''ఆత్మగుణగర్వితేన వసంతే నాహ మపి వంచితః, యతో యువయోః సమాగమ బహిష్కృతః" (ఆత్మ గుణగర్వితుడైన వసంతునిచే నేను కూడ వంచింపబడితిని. మీ సమాగమువలన నేను బహిష్కృతుడనే కదా!) అని కథాసూత్రమును ముడివేయును. ఈ మాటలు మొట్టమొదటి నేపథ్యగానశ్లోకమునకు వివరణప్రాయములు. వసంత కాలమందు లోధ్ర ద్రుమమే గతప్రభమై యుండును. అట్లే ఈ విటుడు గత ప్రభుడై వసంతవంచితుడైనాడు.

1. అస్మద్వయః ప్రమాణమగణయంత్యాऽఽత్మ యౌవనావస్థా మేవ చింతయత్యాస్మ దేహిన్యాన్యథాశంకమానయా నివారితోస్మి P. 2.

ఇట్లు ఆరంభములో, అంతములో పరస్పరపోషకములైన సరసములైన భావములను గ్రథిత మొనర్చి కృతినిర్మించుట ఒక శిల్పము. ఈ శిల్పమును గమనించినవారు భాణరచయితలలో అరుదు. కావుననే రూపమున చిన్నదయినను గుణములో మిన్నయయినది ఉభయాభిసారిక.

పద్మప్రాభృతకము – శూద్రకుడు :

కాలక్రమము ననుసరించి చతుర్భాణి రచయితలలో రెండవవాడు శూద్రకుడు. మృచ్ఛకటికమును రచించిన శూద్రకుడే యాతడని పండితుల తలంపు. శూద్రకుని గూర్చిన ప్రస్తావనలు అనేకగ్రంథము లందు కన్పట్టును. వానిలో రామిలసోమిలులచే రచితమైన శూద్రకకథ, అజ్ఞాతకవి రచితమైన విక్రాంతశూద్రక మనెడి నాటకమును పేర్కొనదగినవి. పద్మప్రాభృతకము నందు శశుడనువాడు విటుడు. దేవదత్త నాయిక. ఆమె చెల్లెలు విపుల. కర్ణీసుతుడు నాయకుడు. వీరి ప్రస్తావనము శ్లేషరూపమున బాణుని కాదంబరిలో వింధ్యాటవీవర్ణనము నందు కన్పట్టును. “కర్ణీసుతకథేవ సన్నిహిత విపులాచలా శశోపగతా చ”. పద్మప్రాభృతకము నందలి ఒక శ్లోకము హేమచంద్రుని కావ్యానుశాసన మందును, మరికొన్ని శ్లోకములు నీలకంఠుని కావ్యోల్లాస మందును ఉదాహరింపబడినవి. సుభాషిత రత్నావళిలో ఇందలి మొదటి శ్లోక ముదాహరింపబడినది. ఇట్లు పలుతావుల వీని ప్రసక్తి కన్పట్టును. శూద్రకుని గూర్చి, అతని కాలమును గూర్చి పండితులు పలు అభిప్రాయములను వెలిబుచ్చిరి. అవి యన్నియు నిట ప్రస్తావింప పనిలేదు. మొత్తముమీద మృచ్ఛకటిక పద్మప్రాభృతకము లను రచించిన వాడొకడే యనియు, ఆ శూద్రకుడు సుమారు క్రీ॥శ॥ గాని క్రీ॥పూ॥ గాని ఒకటవ శతాబ్ది వాడయి యుండునని యూహ.

ఈ పద్మప్రాభృతకములో కథావస్తువు ఉభయాభిసారికలోని ఇతివృత్తము వంటిదే. నాయకుడైన కర్ణీపుత్రునకు, నాయిక సోదరి దేవసేనపై మక్కువ కల్గి యామెను వశపరచుకొనుటకు శశు డనెడి విటుని ఆమె కడకు పంపును. అతడు వేశవాటి గుండా పోవుచు, విభిన్నవ్యక్తులతో సంభాషించుచు చివరకు దేవసేనను చేరి యిరువురికి రాయబారము నడిపి, దేవసేన కానుకగా కర్ణీపుత్రున కిమ్మని పద్మమును శశున కీయగా, అతడు దానిని తీసికొని మిత్రునికడకు పోవును. ఇట్లు వారిరువురిని కృతకృత్యులను చేయుట యిందలి యితివృత్తము కావుననే పద్మప్రాభృతకమని తన భాణమునకు నామకరణ మొనర్చినాడు. ప్రాభృతకమనగా కానుక. కావున తామరపువ్వు కానుక

అని అర్థము. ఇతివృత్తము సామాన్యమే యయినను ఇందు కవితాసామగ్రి, ప్రాగల్భ్యము పుష్కలముగా కన్పట్టును. వసంతఋతువర్ణనమును శశు డిట్లొనరించును. "రమణీయం ఖలు తావదిదం శశిరజరాజర్జరస్య సంవత్సరవిటస్య హిమరసాయనోపయోగా త్పునరావృత్తం వసంతకైశోరక ముపోహతి".

శిశిరఋతువుతో ముసలివాడైన సంవత్సర మనెడి విటునకు హిమరసాయన-మును సేవించుటచే మరల వసంతకిశోరత లభించినదట. నాటి సంఘమును వ్యంగ్య ధోరణితోను, హాస్యగర్భితముగ విమర్శించుచు సరసమైన వర్ణన మొనర్చుట కవి ప్రతిభకు నిదర్శనముగ నున్నది.

నాగరికకూతురైన శోణదాసి తన ప్రియుడైన చంద్రధరుడు ప్రణయ కలహముచే దూరమైనాడని విరహసంతప్తురా లయినది. చంద్రధరుని తాను త్రోవకు కొనివత్తునని హామీ యిచ్చి, ఆమెకు అప్పటికప్పుడు నవ్వు పుట్టించినాడు విటుడు. ఆ సమయములో ఆమె నవ్వును, అశ్రులను కలబోసి ఒలకబోసినది. దానిని శూద్రకు డెట్లు చమత్కరించెనో చూడుడు. "కథమనవసిత బాష్పయైవ స్మిత మనయా, ఇదం ఖలు వర్షర్తుజ్యోత్స్నాదర్శనమ్."

ఆమె అశ్రులతోడనే నవ్వినది. ఆ దృశ్యము వర్షర్తువులోని వెన్నెలవలె నున్నదట. కవియొక్క ఊహ, సమయోచిత ప్రజ్ఞ అనుపమాన మనుట కిట్టివి ఎన్నో భాణమున కన్పట్టును.

తరువాతి భాణములలో అవశ్యవర్ణ్యముగా పరిణమించిన కందుక క్రీడావర్ణనము ఈ భాణము నందే ప్రారంభమయినది. ఈతడు దీని వర్ణనములో చూపిన నేర్పును ఇతరులు అనుకరింపజాలరైరి. అందరును కందుకక్రీడలో యువతి స్తనములను వర్ణించిరే కాని ఈతని చమత్కృతిని గ్రహింపజాలక పోయిరి.

స్వభావరమణీయముగ వారు బంతియాట నాడుటను వర్ణించుచు పంచ భూతములలో ఒకడైన, మహాబలుడుగా ప్రసిద్ధి కెక్కిన వాయువు సయితము మోహవిహ్వలు డైనట్లు వర్ణించినాడు. "కింబహునా శంకీ పరివర్తన నివర్త నోద్వర్తన పర్యాధ్మాత వసనాంతర ప్రవేశకుతూహలో వాయు రప్యేనా మధికామ్యోనుభ్రమతి." వాయువు కూడ ఆమె వస్త్రములలో చొరబడుటకు కుతూహలపడుచున్నాడని నేర్పుగా వర్ణించి, వాల్మీకిని తలపింపచేయుట శూద్రకుని పూర్వకవితా చర్వణమున కొక దృష్టాంతము.

తాను పూర్వకవితాచర్వణ మొనర్చుటే గాక తన వాక్కులలో మధురములైన వాని నితరులకు వితరణ మొనర్చి యశస్సు నార్జించినవాడు.

సూర్యం యజన్తి దీపైః సముద్ర మద్భిః వసన్త మసి పుష్పైః |
అర్చామో భగవన్తం వయ మపి వాగీశ్వరం వాగ్భిః ॥ పుట-6.

ఈ పలుకులకు సంవాదప్రాయములైన శంకరుని పలుకులను వినుడు-

ప్రదీపజ్వాలాభి ర్దివసకర నీరాజన విధిః
సుధాసూతే శ్చంద్రోపలజలలవై రర్ఘ్యరచనా ।
స్వకీయై రంభోభి స్సలిలనిధిసౌహిత్యకరణం
త్వదీయాభి ర్వాగ్భి స్తవ జనని వాచాం స్తుతి రియమ్ ॥

సౌందర్యలహరి-100 శ్లో.

ఇట్లతడు ఇతరుల కాదర్శప్రాయుడగుటయే కాదు, కవిత్వమునుగూర్చి తన యభిప్రాయమును వ్యక్త మొనర్చినాడు. రసానుగుణమైన వర్ణ సంయోజన ముండవలె నని రసవంతముగ వైయాకరణులను నిరసించినాడు.

స్వైరాలాపీ స్త్రీవయ స్యోపచారే
కార్యారంభే లోకవాదాశ్రయే చ ।
కస్సంశ్లేషః కష్టశబ్దాక్షరాణాం
పుష్పాపీడే కంటకానాం యథైవ ॥ ప.ప్రా. పు-9,

ఇట్లు కావ్యసౌందర్యమును, లోకజ్ఞానమును సమ్మిళిత మొనర్చుచే గాక హాస్య గర్భితమైన యధిక్షేపణను సయితము శూద్రకుడు తన భాణమున మేళవించినాడు.

ధూర్తవిటసం వాదము – ఈశ్వరదత్తుడు :

చతుర్భాణిలో మూడవది ధూర్తవిటసంవాదము. ఈశ్వరదత్త విరచితము. ఈతడు బహుశః మగధదేశీయుడై యుండునని మానవల్లి రామకృష్ణ కవిగారి యూహ. ఈతడు తన రాణ మున కుసుమపురమును విస్తృతముగ వర్ణించుటయే పై యూహకు కారణమై యుండ నోపును. భోజుడు శృంగారప్రకాశమునందును, హేమచంద్రుడు కావ్యానుశాసనము నందును దీనిని పేర్కొనినారు. కావ్యోల్లాసము నందు నయితము

నీలకంఠుడు ఇందలి చాలశ్లోకముల సుదాహరించినాడు. దీనినిబట్టి ఈతడు భోజునకు పూర్వుడని మాత్రము చెప్పవచ్చును కాని నిశ్చితముగ ఈతనికాలము నిర్ధారింపలేము.

ధూర్తవిట సంవాద రచనకు ఇతరఖాణములకు మౌలికముగ ఒక భేదము కన్పట్టును. లక్షణాదికములందు భేదము లేకపోయినను ప్రస్తావింపబడిన విషయము నందు మాత్రము విశేషము గోచరించక మానదు. ఈ విశేషము భాణమునకు నామ కరణ మొనర్చుటలోనే వ్యక్తమగును. ఇందలి విటుడు దేవిలకుడు. అతడు కుసుమపుర వీథులలో నుండి వేశ్యావాటికను ప్రవేశించి, చాలమందితో సంభాషించి, చివరకు విశ్వలకు డనెడి ధూర్తుని గృహము ప్రవేశించి, అచ్చట అతనితో కామ సంబంధ మయిన విషయమును గూర్చి సంభాషించును. విటుడు, ధూర్తుడు వీరిరువురి మధ్య కొనసాగిన సంవాదమగుటచే నీ నామకరణ మన్వర్థమైనది. సగమువరకు భాణము వలెనే గోచరించును కాని, సంవాదము ప్రారంభమైనప్పటి నుండి కేవలము సరస ప్రసంగము వలెనే తోచును. ఈ ప్రసంగములో విశ్వలకుని శంకలకు దేవిలకుడు సమాధాన మిచ్చుచున్నట్లుండును. ఈ సంభాషణము ప్రథమసమాగమవిశేషములు, అనునయవిధానములు, స్త్రీవశీకరణపద్ధతులు, దక్షిణనాయకుని మనఃప్రవృత్తి, వేశ్యల ఉపచారములు, గోత్రస్ఖలనాదికములు, అభిసారికలు మున్నగు విశేషములు చెప్పుట మాత్రమే. స్వర్గ సౌఖ్యములను నిరసించి, వేశ్యాసౌఖ్యమును ఆహ్వానించును. అప్సర స్సంభోగము సనాతన వృద్ధవనితల సంభోగమువలె అనపేక్షణీయమని తారతమ్య నిరూపణ చేయును. ఇటు వారిరువురి సంభాషణతోనే భాణము ముగియును. చివర భరతవాక్యము కూడ ఇతర భాణములకంటే విశిష్టముగ నున్నది. హద్దుమీరక కడలి వెలుగొందుచున్నట్లే రాజు సయితము సముద్రమేఖల యయిన భూమిని హద్దుమీరక పరిపాలించుగాక యని యాశించి నిష్క్రమించును.

ఇట్లు కథానిర్వహణమునందు నవ్యతను ప్రదర్శించిన ఈశ్వరదత్తుడు కవితా ప్రవాహమునందును చమత్కారములను, సంస్కారపూరితభావములను ప్రదర్శించక పోలేదు. నాందిని ఇతర రచయితలందరును సంప్రదాయబద్ధముగ చేసిరి. శివపార్వతులను కాని, రతీమన్మథులను కాని, లక్ష్మీనారాయణులను కాని స్తుతించిరి. కాని యితడు కొంత అభ్యుదయవాదివలె, హేతువాదప్రభావితునివలె కన్పట్టును. ఏ దైవమును నాంది యందు స్తుతింపక ధర్మప్రస్తావ మొనర్చినాడు.

విద్యయా ఖ్యాపితా ఖ్యాతిః సజ్జనారాధనం ధనమ్।
తేషాం ప్రీత్యా భవేద్ధర్మ ఇత్యస్మాక ముపక్రమః॥

(విద్యచే వచ్చినదే సరియైన కీర్తి, సజ్జనారాధనమే ధనము. ఆ సజ్జనుల సంతోషముచే నేర్పడునది ధర్మము, అని మా ఉపక్రమ విధానము) ఉపక్రమ విధానము నందు స్వోపజ్ఞాసూచకముగ నున్న యీ శ్లోకము కవియొక్క అభ్యుదయ వాదమునకు ప్రతీక యనఁ జెల్లును. సమాజమునం దే కాలమున కా కాలమునందే నవ్యతను, సంతరించుకొనవలెనను సంస్కారభావములు పొడచూపుచుండునని యాతడు స్ఫురింప జేసినాడు.

ఇట్లభ్యుదయభావ పదానువర్తియైన యీతడు లోకమునంతయు నాకళించు కొన్న వ్యక్తి వలె పొడసూపును. అక్షములను వర్ణించుచు "అక్షాశ్చ నామానభిజాతే శ్వరా ఇవ న సర్వకాల సుముఖా భవన్తి" అని ఆభిజాత్యములేని రాజులవలె సుముఖములు కావని తెల్చినాడు.. "అనవస్థిత చిత్తానాం ప్రసాదోపి భయంకరః" అను సూక్తిని తలపించుచు, కవియొక్క లోకజ్ఞతకు నిదర్శనప్రాయములైన యిట్టి వర్ణనలు ఇందు పెల్లుగ నున్నవి.

హాస్యగర్భితమైన సంభాషణ మొనర్చుటలో ఈ కవి మానావమానమలను సయితము లెక్కింపడు. పాత్రపోషణమును, ఔచిత్యమును మాత్రమే గణించును. వేశ్యాలోలుడైన జీవత్తాతపాదునకు తన్ను నిరోధించు తండ్రిపట్ల ఎంత వైముఖ్యము, క్రోధము నుండునో తెల్పు నీ క్రింది పల్కులను గమనింపుడు.

> యత్తుదాస్యాః పుత్రాః పితరః స్వయమప్యననుభూతయౌవనా ఇవ
> ధనకుప్యార్థే వేశవధూభ్యః పుత్రాన్ ధారయన్తి; అత్రమేఽద్య
> గృహీతపరశోర్జామదగ్న్యస్య రామస్య క్షత్రియవధోద్యత స్యేవ
> లోకమపై తృకం కర్తుం మతిర్జాయతే!

పాత్రౌచిత్యమును మాత్రమే దృష్టియం దిడుకొని యీత డభ్యుదయమార్గము నధిగమించి, దిగంబరధోరణికి సయితము మార్గదర్శకుడైనా డనిపించుచున్నది.

భాణములు శృంగార ప్రధానము లగుటచే చాలమంది ప్రస్తావనలో వసంతర్తు వర్ణన మొనర్చినారు. కాని యీతడు వర్షర్తువర్ణన మొనర్చినాడు. అయ్యును ఇతరుల వలె విటునితో సామ్యమును చెప్పుట మాత్రము వదలలేదు.

> జలధర నీలాలేపః తటిత్సమాలభన విహ్వాలద్గాత్రః।
> వికసిత కుటజనివసనో విటో యథా భాతి ఘనసమయః॥

వర్షర్తువర్ణనము హృద్యముగ నొనర్చిన పూర్వకవులలో నితడు పేర్కొన దగినవాడు, వర్షము ముగిసిన పిమ్మట ఉదయపు టెండను సేవించుచున్న స్త్రీని "సందష్టోపవీణీ వియుక్త విరలతంత్రీ శీత వాత వేపితేవ కామినీ బాలాతసమా సేవతే వీణా" అని వర్ణించుట యీతని యూహావైభవమునకు నిదర్శనము.

ఈ కవి ప్రాప్తకాలజ్ఞుని వలె తోచును. ఉన్నదాని ననుభవింపవలెనను ఊహకల వాడు. ఎప్పుడో కల్గు అప్సరస్సంభోగమునకై వేశ్యాసంగమమును విడనాడుట యవివేక మని యీతని యభిప్రాయము. విరహములేని యప్సరసల ప్రణయము మధురము కాదట. విరహము, అసూయ మున్నగువానితో కూడిన వేశ్యాసంగమము అప్సరస్స-మాగమమును మించినదట. "న వినా విప్రలంభేన సంభోగః పుష్టిమశ్నుతే" అను ఆలం-కారిక వచనమునకు బాట వేసెనా అనిపించునట్లు ధూర్తవిట సంవాదమును తీర్చి దిద్దినాడు.

పాదతాడితకము – శ్యామిలకుడు :

నను భవదీయదాసుని మనంబున నెయ్యపుఁగిన్కఁ బూని తాఁ
చిన యదినాకు మన్ననయ; చెల్వగు నీపద పల్లవంబు మ
త్తను పులకాగ్ర కంటక వితానము దాఁకిన నొచ్చునంచు నే
ననియెద; నల్క మానవుగదా ! యికనైన నరాళకుంతలా!

(పారిజాతాపహరణము 1-123)

ముద్దుపలుకుల ముక్కు తిమ్మనార్యుని చేతిలో మెలగిన రసికావతంసుడు కృష్ణుడు సత్యభామ ననునయించిన ప్రసిద్ధ పద్యమిది. కోపనయైన స్త్రీ ప్రణయ కలహమున నాయకుని పాద తాడన మొనర్చుటయు దానితో కోటి వైభవములు చేకూరినట్లు నాయకుడు భావించుటయు భారతీయ సాహిత్యమున ప్రాచీనకాలము నుండియు గానవచ్చు చున్నది. ముక్కుతిమ్మన ఒకేఘట్టము నిట్టు శృంగార భూయిష్టముగా తీర్చిదిద్దినాడు. కాని శ్యామిలకుడు తన భాణమునంతయు నిదే ఘట్టములతో కూర్చినాడు. నామకరణము నందును దానినే స్ఫురింపజేసినాడు. పైగా కృష్ణుడు ధర్మపత్నిని అనునయించుటకై యింత పాటుపడినాడు కాని శ్యామిలకుని భావములో విటుడు వేశ్యాపాద తాడితమును మన్ననగా భావించినాడు. పారిజాతాపహరణకర్త పై భావమును ఇందుండియే గ్రహించినట్లు గోచరించును. "ఈక్షణం చాపోహ్య వినీత చక్షురసీత్యుక్త్వా పాదమాక్షిప్యోరసి మాం తాడితవతీ, తతో రోమాంచకవచ కర్కశత్వచా మయోక్తా" p-35. అశోకము చరణాహతినే

మన్ననగా భావించి వికసించునట. ఇటి రసవత్తర సన్నివేశముల కాకరమైన పాడతాడితకమును శ్యామిలకుడు రచించినాడు.

ఈతని రచన నుండి కావ్యోల్లాసము మున్నగు నలంకార గ్రంథము లుదాహరణములను స్వీకరించినవి. అభినవభారతి, ఔచిత్య విచారచర్చ, వక్రోక్తి జీవితము మున్నగు గ్రంథములలో శ్యామికులకుని శ్లోకము లుదాహరింపబడినవి. ఈతడు మహిమ భట్టునకు గురువై యుండుననియు, కావున క్రీ.శ. 800-900 మధ్యకాలము వాడై యుండుననియు మాసవల్లి వారి యభిప్రాయమును.

చతుర్భాణిలో కాలమును బట్టి ఇది చివరదిగా కన్పట్టును. వీనిలో ఇది మిక్కిలి పెద్దది కూడ - 133 శ్లోకములును, వచనములును గల యీ భాణమునందు వేర్వేరు దేశస్థుల ప్రస్తాననమున్నది. సార్వభౌమ నగరమును గూర్చి వర్ణించుచు -

శకయవన తుషార పారశీకై
ర్మగధ కిరాత కలింగ వంగ కాశైః।
నగరమతి ముదాయుతం సమ న్తా
న్మహిషక చౌళక పాండ్య కేరళైశ్చ॥ (పాదతాడితకము 24 శ్లో)

రాజధానికి వేర్వేరు దేశములనుండి సామంతులేగాక ప్రజాసముదాయము కూడ వచ్చుచున్నట్లు వర్ణింపబడినది. వేశ్యావాటికను వర్ణించుటలో ఈత డర్వాచీనులకు మార్గదర్శకుడై నాడు. ఆచట జరుగు క్రియాకలాపమునంతయు కనులకు గట్టినట్లు వర్ణించినాడు... "ప్రజ్వాల్యన్తే దీపాః, ఉచ్యతే స్వాగతం, ముచ్యతే యానం, దృశ్యతే విభ్రమః, ఉపగీయతే గీతం, ఉపవాద్యతే వాద్యం, దీయతే హస్తః, కథ్యతే శ్లక్ష్ణం, ఆలింగ్యతే స్నిగ్ధం, అవలంబ్యతే సప్రణయం, అవనమ్యతే సవినయం....... పరిహాస్యతే విటైః, ప్రతిగృహ్యతే విలాసినీభిరితి."

సరళరచనముతో సరసహృదయముల నాకట్టుకొను నేర్పు ఈ కవికి మిక్కుటముగ గలదు. భాణసాహిత్యమున పుష్పాపణ వర్ణనమీ కవితోడనే ప్రారంభ మయినది. చతుర్భాణిలో నిది కాలమునుబట్టి కూడ చివరిదగుటచే పూర్వభాణముల లోని భవ్యభావము లిందు నవ్యసంభావనతో స్వీకరింపబడినవి. శూద్రకుని పద్మప్రాభృతకము నందలి

రత్యర్థినీం రహసి యః సుకుమార చిత్తాం
కాన్తాం స్వభావ మధురాక్షరలాలనీయామ్।

వాగర్చిషా స్పృశతి కర్ణవివేచనేన
రక్తాం సవాదయతి వల్లకీముల్ముకేన.

అను శ్లోకమునందలి భావమును యథాతథముగ ఎట్లు గ్రహించెనో చూడుడు... "అయే! వైయాకరణ ఖసూచిన్! సుమనసో ముసలేన మా క్షౌత్సీః, వల్లకి ముల్ముకేన మావాదీః, వాక్ క్షురేణ కిసలయక్షౌమం మాలౌత్సీః" -

ఇట్లని స్వతంత్ర శక్తిలేనివాడనరాదు. పూర్వకవితా చర్వణము కూడ కవులకు అనుసరణీయమే కదా! ఉపజ్ఞాస్ఫోరకలైన వర్ణనల విషయమున ఈతని ప్రతిభ అనుపమమయినది. కథోచితమైన వర్ణన చేయుటయేగాక, సహజసుందరముగ మలచుట యీతని కలవాటు. చంద్రోదయమును సరళపదజాలముతో నెట్లు హృద్యముగ వర్ణించినాడో చూడుడు —

విరచయతి మయూఖై ర్దీర్ఘి కాంభ స్సు సేతుం
విసృజతి కదలీషు స్వాః ప్రభాదండరాజీః।
పునరపి చ సుధాభి ర్వర్ణయన్ సౌధమాలాః
క్షరతి కిసలియేభ్యో మౌ క్తికానీవ చంద్రః॥

ఇట్టి చతురవర్ణనలకు నిలయమైన యీ భాణమునందు దేశభాషా ప్రసంగములు కూడ కలవు - అన్నియు రసవంతముగ కూర్చినాడు - నామకరణమే రసవంతముగ కూర్చినాడు... విషయమును నయితము తదనుగుణముగ కూర్చుటలో నాశ్చర్యమేమి విటలక్షణమునే యిట్లుపదేశించుట గమనార్హము.

చరణకమలయుగ్మై రర్చితం సుందరీణాం
సమకుట మివ త్రుట్యా యో విభ ర్త్యుత్తమాంగమ్
సవిట ఇతి విటజ్ఞైః కీర్త్యతే యస్య చార్థాన్
సలిలమివ తృష్ణా రా పాణియుగె గెరరని. – శ్లో. 17

కర్పూరచరితమ్ – వత్సరాజు :

భాణలక్షణములను ప్రయోగాత్మక దృష్టితో పరిశీలించి ప్రదర్శనాత్మకముగ రచింపబడిన ప్రాచీనభాణము కర్పూరచరితము. రచయిత వత్సరాజు. పరమర్థిదేవుని ఆమాత్యుడు. సంస్కృత సాహిత్యములో భాసునితరువాత వివిధరూపక ప్రక్రియలను

ప్రయోగాత్మకముగ అనుసరించినవాడు వత్సరాజు. కిరాతార్జునీయ వ్యాయోగము - కర్పూరచరితభాణము - రుక్మిణీపరిణయేహామృగము - త్రిపురదాహడిమము- హాస్యచూడామణి ప్రహసనము - సముద్రమథన సమవకారము నితని కృతులు. పై ప్రక్రియ లన్నియును ఏ కొద్దిమంది కవులచేతనో మాత్రమే ఆదరింపబడినవి. విరళ ప్రచారము కలిగినవి.

పై రూపకములలో కిరాతార్జునీయము తప్ప మిగిలినవన్నియు పరిమర్ధిదేవుని ఆధ్వర్యమున ప్రదర్శించబడినవి. కిరాతార్జునీయవ్యాయోగము మాత్రము అతని కుమారుడైన త్రైలోక్యవర్మదేవుని ఆధ్వర్యమున మొట్టమొదటగా ప్రదర్శింపబడినది. పరమర్ధి దేవుని కాలము క్రీ.శ. 1163 నుండి క్రీ.శ.1203 వరకు.[1] అతని కుమారుని కాలమును ఆ తర్వాత కొంతవరకు అగును. కనుక వత్సరాజు శ్రీ శ. 12వ శతాబ్ది చివరన క్రీ. శ. 13వ శతాబ్ది ప్రారంభముననను జీవితము గడిపినట్లు నిర్ణయించ వచ్చును.

భాణములన్నిటిలోను మిక్కిలి చిన్నదీ భాణము. భాణము ఇట్లుండుటయే సముచితము. కారణము ఇది ఏకహార్య మగుటయే. ఒకే నటుడు ఎంతోకాలము రంగ స్థలముపై నుండి ప్రేక్షకుల నానందింపజేయుట కష్టసాధ్యము. అందుచే భాణము లెంత చిన్నవిగానున్న అంత మేలు. ఈ విషయమును అర్వాచీనులు కొందరు గ్రహింపక భాణములను బండ్లకెత్తుట శోచనీయము.

“భాణస్తు ధూర్తచరితమ్” అను లక్షణ మిందు చక్కగ సమన్వయించును. శృంగారము, వంచన, జూదము, కల్లు అంగడి మొదలగు విషయములు ఇందు ప్రధానములై ధూర్తత్వమును నిరూపించుచున్నవి. కర్పూరకు డిందు నాయకుడు. అతడు ద్యూతశాలకు బయలుదేరి, మిత్రుడైన చందనకుని కలిసికొని, అతనికి తన ప్రణయోదంతమును వివరించును. విలాసవతి నాయిక. కర్పూరకుడు విలాసవతి పరస్పరము ప్రేమించుకొందురు. కాని విలాసవతిని మంజీరకుని కీయవలెనని ఆమెతల్లి ఆశ. అతడు ధనవంతుడు మరి. కర్పూరకుడు చంద్రసేన చీనాంశుకము నవహరించి దానిని విలాసవతి పంపినట్లుగ మంజీరకునకు కానుకచేసి, అతనిపై చౌర్యదోషము నంటగట్టుటకు అవకాశమిచ్చును. చంద్రసేన హరదత్తుడను ధనికుని ధనముమీది ఆశతో చందనకుని ధనహీనునిచేసి, తిరస్కరించి యుండును. ఇప్పుడు దీనితో ఆనందించిన చందనకుడు చంద్రసేన సంపద యింకను నశింపపలెనని కోరుకొనును. హారదత్తుని నాశనమును సైత మభిలషించును.

---

1 Introduction—P VII రూపక షట్కమ్

ఆ సమయమున కర్పూరకుడు మణిభద్రుడను మాంత్రికుని యొద్దకు వెళ్ళి యుండగ హారదత్తుని పరిచారకుడు వచ్చి, హారదత్తుడు జూదములో గెలుచుటకు కారణము మణిభద్రుడేనని అతనికి కొంతధనము కానుక చేసి, దేశాంతరగతుడైన నిపుణకుడు (హారదత్తుని చిట్టితమ్ముడు) తిరిగి వచ్చినచో ఇంకను కానుకల నిచ్చెదమని వెళ్లును. దానిని విన్న కర్పూరకుడు నిపుణకుడుగ నటించుచు హారదత్తుని యొద్దకు వెళ్ళి అతని ధనమంతయు అపహరించును. విలాసవతికి, కళావతికి మధ్య అంతఃకలహములు కల్పించి, కళావతిని విలాసవతిచే గెంటింపించును. ఆపై కర్పూరక విలాసవతుల కలయిక ఆటంకములు లేక సాగిపోవును. ఇత్యాదిగ ఈ కథయంతయు ధూర్తాచార ప్రధానమైనది.

ఈ కవి శైలి, కవితారీతి హృద్యము, సహృదయసంవేద్యము. సన్నివేశోచిత భావగుంఫనము, భావోచిత శబ్దసమ్మేళనము ఈ కవికి కరతలామలకములు. భాణ ప్రారంభమున సైతము నాందిలో ద్యూతప్రసంగము, వంచనాప్రస్తావనము చేసి ధూర్త చరిత ప్రాశస్త్యమును చెప్పకయే చెప్పినాడు. ఏకపాత్ర పరిమితమయిన ప్రస్తావనను అల్ప వ్యవధితోడ ముగించినాడు. ఈ భాణమున ప్రాకృతపు పాళ్లుకూడ నధికముగా నున్నవి.

ధూర్తులను చూచి దేవతలును భయపడుచుండగ ఇక మానవుల విషయమును వివరింపవలెనా? అని ప్రస్తావనలో నీ కవి రచించిన శ్లోకమును పరికింపుడు.

> ఉత్సంగే సింధు భర్తు ర్వసతి మధురిపు ర్గాఢ మాశ్లిష్య లక్ష్మీ
> మధ్యా స్తే విత్తనాథో నిధినినహ ముపాదాయ కైలాస శైలమ్ |
> శక్రః కల్పద్రుమాదీ న్కనక శిఖరిణోఽధిత్యకా సు న్యధా సీ
> ద్ధూర్తేభ్య స్త్రాస మిత్థం దధతి దివిషదో మానవాః కే వరాకాః ॥

(కర్పూరచరిత - 6 శ్లో)

ధూర్తులను చూచి భయపడుటచేతనే విష్ణువు లక్ష్మిని గాటముగ కౌగిలించి సముద్రమును, కుబేరుడు తన ధనమంతటిని తీసికొని కైలాసమును, ఇంద్రుడు కల్పద్రుమాదులను వదలి మేరుపర్వతమును ఆశ్రయించినారట. తెనుగులో

> చాకివానితోడ జగడాలు పడలేక
> సిరిగలాడు పట్టుచీర గట్టె
> శివుడు తోలుగప్పె 'ఛీ'యని మదిరోసి
> భైరవుండు చీరపారవైచె –

మొదలగు చాటువులు ఈ బాణీని అనుసరించి వచ్చినవే.

విలాసవతీ కర్పూరకుల ప్రణయ మిందు అతి రమణీయముగ వర్ణింపబడినది. ఒక శృంగార ప్రధానమైన కావ్యమునందువలె చక్కని భావములతో, చిక్కని కూర్పుతో ఆ సన్నివేశము అల్పపరిమాణము కలదైన అధికానందమున కాస్పదమగుచున్నది. కర్పూరకుని విప్రలంభమును వర్ణించెడి ఈ శ్లోక మెంత సుందరమో చూడుడు -

అహరహరనుభూతా అప్యపూర్వాయమాణా
నిరుపధి మధురా స్తాస్సుభ్రువః ప్రేమలీలాః।
కృతనిబిడ సమాధి ర్భావ య న్నంతరాత్మా
పరిశిథి లితవృత్తి ర్వర్తతేఽన్య క్రియాసు॥

రోజురోజు అనుభవింపబడుచున్నను, మరిమరి క్రొత్తగ కన్పించుచు, నిష్కారణ మధురములైన ఆమె ప్రేమలీలలను తదేకభావనతో భావించుచు... ఇతర విషయములలో వ్యాపృతిని సడలించుచుండును కదా! అని కర్పూరకుడు వియోగివ్యవస్థను వర్ణించినాడు.

నాయకుని పేరు కర్పూరకుడు. ప్రతినాయకుడు మంజీరకుడు. నాయిక విలాసవతి, ఆమె మంజీరకుని తిరస్కరించు శ్లోకమును శ్లేష నుపయోగించి కవి రచించిన తీరు, చమత్కార సుందరము, హృదయ ప్రస్పందకము,

వాచాలత్వం పదాలగ్నః మంజీరః కురుతాంచిరాత్।
కర్పూర ఏవ సర్వాంగసంగ సౌభాగ్యభాజనమ్॥

మంజీర(కుడు)ము కాళులబడి నిరతము శబ్దించిన శబ్దించుగాక. సర్వాంగ సంగసౌభాగ్యమున కర్హమైనది కర్పూర(కుడే)మే అని విలాసవతి మృదువుగ, వాడిగ మంజీరకుని ప్రణయమును తిరస్కరించినది.

ఏకపాత్ర ప్రయోగమగుటచేతనే దాని ప్రదర్శన క్లేశమును గుర్తించి ఆలంకారికులు భాణములలో లాస్యాంగములకు ప్రాధాన్యమిచ్చినారు. వత్సరాజు తన కర్పూర చరితమన ఆ లాస్యాంగములలో అనేకములకు స్థానమును కల్పించినాడు. వానిలో కొన్నిటిని చూడుడు...

గేయపదము :- వీణాదివాదనతో కూడిన నాయికా గీతము.

రతిరమణప్రియ సుహృదా శశాంక సుభగేన నిర్వృతికరేణ।
కర్పూరేణ వియోగో భగవతి! రుద్రాణి! మాభవతు ॥ (శ్లో 11)

ప్రచ్ఛేదకము :- నాయిక కుపితయయ్యు చంద్రాతపాదులచే బాధింపబడి లాస్యము ప్రకటించుట.

అన్యోన్యం కరతాడనేన హనతు స్వచ్ఛన్ద మాలీజన
స్త్యక్త్వా మానకథా కృతాంజలి రసా నంగీకృతం లాఘవమ్ |
ఆగశ్శల్యపరంపరా సుభగ యాశ్చిత్తే మమ త్వత్కృతాః
సర్వాస్తా శ్శశిబింబ చుంబకశిలాలోకేన దూరీకృతాః ॥ (శ్లో-3)

స్థితపాఠ్యము :- వాక్యాభినయపూర్వకముగ నాయిక పఠించుట

అర్హతి న తత్ర ధూర్తే వ్యాపారః కోఽపి ఇతరదూతీనామ్।
ఆనయ స్వప్నే తం మాం నిద్రే నిర్దయా భవ॥ (శ్లో.-10)

త్రిమూఢకము 1. సమవృత్తాలంకృతము, పురుష భావాఢ్యము.

ఉచ్చై ర్గాథాపరనమశుభం శ్రోత్రయోరాత్మగీతం
హస్తాఘాతై రురసి తరలై ర్మౌరజీవాద్య విద్యా।
భూయో భూయః కరరుహపదోత్సంగితే దృష్టిరంగే
కర్తుం శక్తః క ఇవ యది వా తస్య దుశ్చేష్టితాని ॥ (శ్లో-36)

ఇట్లే ఇతర లాస్యాంగములును కొన్ని యిందు కన్పించుచున్నవి. లక్షణ విభాగములో లాస్యాంగములు సమగ్రముగ వివరింపబడినవి గాన ఇక్కడ దిక్ప్రదర్శన జరిగినది.

విటనిద్రా బాణము – –? –

ప్రాచీనభాణములలో విటనిద్రాభాణ మొకటి. బహుశః కేరళనుండి వెలువడిన భాణములలో నిది తొలిది కావచ్చును. దీని ప్రతి త్రివేంద్రమున కలదు.* దీని రచయిత ఎవరో తెలియవచ్చుట లేదు. గ్రంథపాతము అధికముగ నున్నవి. కాని ఇది ప్రాచీన మనుటకు ఇతడు చేసిన పూర్వకవిస్తుతి కొంత ఆధారమగుచున్నది. చూడుడు –

* Tri_Vol_8_No-130.

సకల నిగమవిద్భ్యః సంగృహీతార్థ శబ్ద
స్స్నుత సకలరసేభ్యః ప్రాక్తనేభ్యః కవిభ్యః।
భవతు శివ మశేషప్రాజ్ఞహృత్పుండరీకో
చ్ఛ్వసనదినమణిభ్యో భాణకృద్భ్య శ్చతుర్భ్యః॥

ఇట్లు పలువురు భాణ రచయితలను ఆనాడే నలుగురని పేరుపెట్టి స్మరించె నన్న బహుశః వారు చతుర్భాణి రచయితలు కావచ్చును. లేదా మరెవరైనను కావచ్చును. కాని యితని ప్రాచీనత అంగీకార్యమే. భరతవాక్యమున నీకవి రామవర్మను ఆశీర్వదించును. ఇత డే రామవర్మయో తెలియదు.

ఈతని కవిత చమత్కారభరితమనుట కొక యుదాహరణమును పరిశీలించె-దము, విటుడు ఒక కాంతతో మాటాడెడి మాట యిది..

తలోదరి! తవాపాంగైః క్రీత మేకం జగత్త్రయమ్।
త్వాం వినా స కు కన్దర్పః కం దర్ప మనలోకతే॥

ఆమె చూపులచే ముల్లోకములును జయింపబడినవట. కన్దర్పపదమును ఆశ్రయించి సభంగశ్లేషతో పై పద్యమున చక్కని చమత్కృతి సాధింపబడినది. నీవు లేనిచో కన్దర్పుడు - కం దర్పం - ఎవనిని దర్పముతో చూడగలడని భావము. ఈతని కవిత యంతయు నిట్టిడే యయి యుండిన అది కీటదష్టమగుట కవిని గూర్చి తెలియకుండుట దురదృష్టము.

అర్వాచీన భాణములు

(ఆంధ్రుల గ్రంథములు)

ఆంధ్రులు – భాణములు :

సంస్కృత సాహిత్యము వైదిక సాహిత్యము, లౌకిక సాహిత్యము అని రెండు భాగములుగా చీలినది. రెండింటను ఆంధ్రులు తమ ప్రతిభను, ప్రత్యేకతను ప్రకటించుకొనిరి. సుస్వరమైన వేదోచ్చారణమందు ఆంధ్రులు అగ్రేసరులు. ఆసేతు హిమాచలమును ఆంధ్రుల యుచ్చారణస్పష్టత, స్వరమాధుర్యము నిస్తులమైనవి. కేవల ముచ్చారణమందే గాక వేదభాష్యరచనమందును ఆంధ్రులే ముందంజవైచిరి. విద్యారణ్యానామముతో (మాధవ) వేదభాష్యమును వ్రాసిన "సాయణుడు" ఆంధ్రుడగుట ఆంధ్రులకు గర్వ కారణమనక తప్పదు. వైదిక కర్మాచరణమునందు సూత్రకర్త యగు ఆపస్తంబుడును ఆంధ్రుడని యూహింపబడుచున్నది.

లౌకికసాహిత్యమందు సయితము ఆంధ్రులు తమ ప్రత్యేకతను నిలబెట్టుకొనక పోలేదు. శాస్త్రరచనములందు అన్నంభట్టు మున్నగువారును, అలంకారశాస్త్ర రచనమందు విద్యానాథ, జగన్నాథాదులు ఆంధ్రుల కీర్తి నినుమడింప చేసిరి.

ఇట్లే రూపకసాహిత్యమునందును, మనవారు తమ వైశిష్ట్యమును, వైలక్షణ్యమును ప్రకటించుకొనిరి. భాణరచనమందు ఎక్కువ దక్షిణదేశస్థులు ముందంజ వేసిరి. తమిళ, కేరళ దేశస్థులతోఁబాటు ఆంధ్రులును తమ ప్రత్యేకతను నిలబెట్టుకొనిరి.

ఆంధ్రుల శృంగారరసికత నిత్యజీవనమునందును ప్రతిబింబించును. శాసనము లందు సయితము ఆంధ్రుల శృంగారజీవనము ప్రస్తుతింపబడినది.

> హేలిక స్త్రీ కటాక్షాణాం కాంతా గళితచేతనా ।
> న జానంతి కృషిం యత్ర కేచి త్కృషికనందనాః ॥

(హనుమకొండ...సిద్ధేశ్వరగుట్ట శాసనము)

ఇట్లు నిత్యజీవనములో రసికతను రంగరించుకొనిన ఆంధ్రులు శృంగారైక ప్రాయములయిన రచనమందును స్వీయప్రతిభను ప్రకటించుకొనిరి.

భాణములను వ్రాసిన తెలుగువారు సుమారు 60 మంది ఉన్నారు. మొత్తము భాణరచయితలు 190 కి మించి యుండగా అందు కుమారు 3 వ వంతు ఆంధ్రులే యాక్రమించిరి. వారి గ్రంథములలో మా కుపలబ్ధమైన వానినిగూర్చి యీ ప్రకరణమున వివరింతుము. స్పష్టముగా ఆంధ్రులని మా యూహకు అందినవారిని గూర్చియే ఇందు ప్రస్తావించితిమి. శంకాస్పదులైనవారిని గూర్చి "ఇతర భాణములు" అన్న ప్రకరణమున వివరించితిమి.

మొత్తముమీద ఈ భాణసాహిత్యము ఉత్తరభారతమునందుకంటే దక్షిణ భారతదేశమునందే విరివిగా కన్పట్టును – చతుర్భాణి, కర్పూరచరితముతప్ప మిగిలిన వన్నియు (ప్రాచీనములలో) దక్షిణభారతసంబంధులే.

శృంగార శేఖర భాణము:

శృంగార శేఖర భాణరచయిత అభినవకాళిదాసు మోక్షగుండం అక్కయసూరి శిష్యుడు. సంస్కృతసాహిత్యములో అభినవకాళిదాసు లనేకులున్నారు. వారిలో ప్రస్తుత భాణకర్త వెల్లాల ఉమామహేశ్వరుడని బిరుదరాజు రామరాజుగారు తెలిపి యున్నారు. ఈతని అన్న సాహిత్యభూషణుడు. ఈ వెల్లాల ఉమామహేశ్వరుడు 14వ శతాబ్దివాడు కావచ్చును. ఈతడు కాశ్యపగోత్రుడు. ఇతని కృతులు - తత్త్వచంద్రికా - నిరోధవరూధినీ – అద్వైతకామధేనుః - వేదాంత సిద్ధాంతసారః - భాగవత చంపూః – శృంగారశేఖరభాణః – అభినవభారతరంపూః - భగవత్పాదసప్తతి - కలివిడంబనమ్.

శృంగారశేఖరభాణము కాంచీపురములోని ఏకామ్రేశ్వరుని వసంతోత్సవాలలో ప్రదర్శించుట కుద్దేశించినట్లు ప్రస్తావనలో సూత్రధారుని వచనము ద్వారా తెలియును. ప్రస్తావన నటీమారిషాదుల నెవ్వరిని ఆపేక్షింపక ఒక్క సూత్రధార పాత్రము తోడనే సాగింపబడుట ఈ భాణముయొక్క ప్రాచీనస్థితికి నిదర్శనము. అనగా ఇది మధ్య కాలీన భాణములలో ఒకటనవచ్చును. ప్రస్తావనలో ప్రరోచనము సైతము కలదు.

అనంగమేఖల కుమార్తె అయిన ఉత్పలమాలికాదర్పణపరిణయనోత్సవమును సందర్శించుటకై శృంగారశేఖరుడను నాయకుడు ప్రాతఃకాలముననే బయలుదేరి సంధ్యాసమయమునకు అక్కడకు చేరుట ఇందలి ఇతివృత్తము. మధ్యే మార్గమున అత డనేక సత్కార్యములు కావించును. మిత్రపరామర్శ, వేశ్యావాటికా సౌభాగ్యవిమర్శ, తలిదండ్రు లార్జించి పెట్టిన పొలములను, సంపదలను పొంది గణికా ధర్మచారిణిలో సురత యాగమును చేయుచున్న యువకాభినందన, ప్రణయ కలహముల తీర్పు,

కోడిపందెములు, జూదములను దర్శించుట, ఒక ప్రియురాలికై ఖడ్గయుద్ధము చేయుచున్న ప్రేమికుల అభిశంసనము, ద్యూత ధర్మపత్రములను వ్రాయించుట, ఉజ్జయిని నుండి ఒక సతిని లేపుకొని వచ్చిన మిత్రుని కభినందనలు చెప్పుట, కాదంబరీరామర్శ, వసుమతీ కుశలప్రశ్నలు ముగియగనే సాయంతన వర్ణనయు, పరిణయనోత్సవముతో గ్రంథము ముగియును.

దర్పణపరిణయనోత్సవము ఇతివృత్తము కాబట్టి దానిని ధ్వనింపజేయుచు వ్రాసిన నాందీశ్లోక మిందు రమణీయమైనది -

యమాలోక్య స్వస్మి న్మణి ముకుర భాసి స్తనతటే
స్ఫురద్వక్రాకారం కరరుహపదాశంకిహృదయా।
సలజ్జా హస్తాభ్యాం స్థగయతి నవోఢా ముహురుమా
స బాలేందుః క్లాన్తిం హరముకుటవాసీ హరతు వః॥

ప్రథమశ్రేణికి చెందిన కవితా విలసన మీ కృతిని తక్కువని శ్రీ రామరాజుగారి యభిప్రాయమైనను ఇది అంత అప్రౌఢకృతి కాదు. హృదయమును స్పందింపజేయ గల భావములు లేకపోలేదు. వారే మహాకవి కాళిదాసు ఋతుసంహారము, మేఘ సందేశముల ఛాయలు, అనుసరణములున్నవనిరి.

భర్త్రా ప్రవాళమణిరేష సఖి ప్రయుక్తః
కందర్పతంత్ర నిపుణేన కపోలియోస్తే॥
ఆభాతి కించిదవలంబిత పాటలాగ్రః
కల్హారకుట్మల ఇవ శ్రవణావతంసః॥ (23 శ్లో)

మధ్యః ప్రసాదదళితో యది కోమలాంగ్యా
వల్గత్కుచేన పురుషాయితసంభ్రమేణ।
సద్యోనివాససలిలాంజలిరేవ దేయో
దేవస్య పుష్పధనుషో భుజవిక్రమాయ॥ (50 శ్లో)

ఇది శృంగారప్రధానమగు కృతియైనను "సూచయే ద్వీరశృంగారౌ" అనినట్లు మధ్యలో వీరరసమును కూడ కవి పోషించెను. మలయవతికై చంద్రసేన సుందరకుల యుద్ధవర్ణన ఘట్టమది. గేయపదాది లాస్యాంగములును ఇందు వర్ణితములే. కందుక క్రీడ - తామ్రచూడ సంఘర్షణవర్ణన - సాంఘికస్థితిగతులు ఇందు వర్ణితములైనవి.

మదనవిలాసభాణము:

అనపోతనాయకుని ఆస్థానకవియు శాసనకర్తయు నగు పశుపతి నాగనాథుడు మదనవిలాస భాణకర్త. ఇతడు చమత్కార చంద్రికాకర్త అయిన విశ్వేశ్వరుని శిష్యుడు. పశుపతి పండితుని కుమారుడు. 14 వ శతాబ్దమున నివసించిన ఈ కవి విష్ణు పురాణమును సహితము ఆంధ్రీకరించెను. 'అనవోతానాయకీయమ్' అను సంస్కృత రూపకమునకును ఇతడే కర్తయని ఊహించుచున్నారు.*

కళ్యాణనారాయణుని వసంతోత్సవ సందర్భమున ప్రదర్శించుట కీ భాణ ముద్దేశింపబడినది. ఈ భాణము 'Descriptive Catalogue' లో సమగ్రమని వ్రాయ బడియున్నను (R 1876 B-T. C. II 2619) తాళపత్రమున మాత్ర మసమగ్రముగనే యున్నది. లభించెడిదానిలో కూడ శైథిల్యమెక్కువ.

ఆతని కవితారీతి కొక ఉదాహరణ

పాదపతనేన భగవాన్ ప్రసాదముసనయతి పద్మినీం తామ్ ।
ప్రాలేయబాష్పకణికా పరివాహముఖామ్బుజం దధతీమ్ ॥

పద్మిని మంచుబిందువులనెడి కన్నీటిప్రవాహముగల ముఖపద్మమును ధరించి యుండగా కమలాప్తుడు కాళ్ళపై బడి ఆమె ననునయించుచున్నాడు. ఇందలి రూపకము మనోహరమయినను ఇతని కవితాతత్త్వమును సమ్యగ్దర్శనము చేయుట సంపూర్ణప్రతి లభించువరకు కష్టమే.

శృంగారభూషణభాణము :

శృంగారభూషణభాణకర్త వామనభట్టబాణుడు. ఇతడు సాహిత్యచింతామణి, సంగీతచింతామణి మొదలుగాగల అనేక సంస్కృతగ్రంథముల రచించిన పెదకోమటి వేమారెడ్డి ఆస్థానములోనివాడు. క్రీ.శ. 1402 వ సం|| న పెదకోమటి వేమారెడ్డి కొండవీటి సామ్రాజ్యము నధివసించెను. కనుక అతని ఆస్థానకవియైన వామనభట్ట బాణుడు 15వ శతాబ్దివాడనుట సంగతమే. ఇతడు వరదాగ్నిచిత్తుల మనుమడు. కోమటి యజ్వకుమారుడు. విజయనగరస్థాపన గావించిన విద్యారణ్యుని శిష్యుడు. కనకలేఖాకళ్యాణము, ఉషాపరిణయము, పార్వతీపరిణయము (నాటకములు) -

---

* రెడ్డియుగమున ఆంధ్ర గీర్వాణ సాహిత్యవికాసము - పుటలు-SL-82.

శృంగారభూషణ భాణము (భాణము), నలాభ్యుదయము, రఘునాథ చరిత్రము (కావ్యము) వేమభూపాలచరితము (ఆఖ్యాయిక) - శబ్దరత్నాకరము, శబ్దచంద్రిక (నిఘంటువు) లితని కృతులు.

పద్యే పటీయాన్ కిల కాళిదాసో
గద్యే పటీయాన్ కిల భట్టభాణః।
పద్యేచ గద్యేచ పరం పటీయాన్
వత్సాన్వయో వామనభట్టభాణః॥

అని పద్యగద్యములయందు తాను కాళిదాస, బాణులవంటివాడనని ఈతని సగర్వోక్తి.

శృంగారభూషణభాణ మితర భాణములవలెనే విలాసశేఖరుడు కనకమంజరీసుత యైన అనంగమంజరి ప్రథమార్తవ మహోత్సవ సందర్శనమునకై ఉదయమే బయలు-దేరి సంధ్యాసమయమునకు అక్కడకు చేరుట ఇతివృత్తముగా గలది. ఇది విరూపాక్షుని చైత్రయాత్రామహోత్సవ సందర్భముగా అభినయింపబడినది. ప్రస్తావనలో ఈతడు ఆత్మశ్లాఘాత్మకముగా చెప్పుకొన్న శ్లోకము ఈతనిని "సాహిత్యచూడామణి" బిరుద భాక్కును చేయును.

సౌభాగ్యస్య నిధిః శ్రుతస్య వసతి ర్విద్యావధూనాం వరో
లక్ష్మ్యాః కేళిగృహం ప్రసూతిభవనం శీలస్య కీర్తేః పదమ్।
నిస్సామాన్యవికాసయా కవితయా జాగర్తి వత్సాన్వయః
శ్రీమాన్వామనభట్టభాణసుకవిః సాహిత్యచూడామణిః॥

ఇందు సూత్రధారునితోఁ బాటు పారిపార్శ్వికుడును ప్రస్తావనలో నుండును. ప్రస్తావనలో ఈ కవి ప్రరోచనను పలుకుటలో శ్రీహర్షుని అనుకరించెను.

వాచ స్తస్య కవేః ప్రసన్న మధురా దక్షాః ప్రయోగే వయం
వైదగ్ధ్యాః ప్రథమావతారసరణిః సామాజికానాం మనః।
కాలః కోకిలకణ్ఠ రాగవిలసత్కందర్పదర్పోదయః
శృంగారోపి రసః స ఏష మిళితో దిష్ట్యా గుణానాం గణః॥
శ్రీహర్షో నిపుణః కవిః పరిషదప్యేషా గుణగ్రాహిణీ
లోకే హారి చ సిద్ధరాజచరితం నాట్యే చ దక్షా వయం।
వస్త్వేకైక మపీహ వాంఛితఫలప్రాప్తేః పదం కిం పున
ర్మద్భాగ్యోపచయా దయం సముదిత స్సర్వో గుణానాం గణః॥ (నాగా)

శ్రీహర్షుని గుణాలకు అపరిహరణీయములైన కాల- రసములను సైతము చేర్చి భట్ట బాణుడు సొంపు వెదచల్లెను.

కృతిలో ప్రధానరసము శృంగారము కావున తదనుగుణముగా* వసంతర్తు వర్ణన ప్రస్తావనలో నీ కవి చేయును. (శరత్సంగ్రామవిషయే వివాహే గ్రీష్మమాధవా - సాహిత్యదర్పణమ్.)

విలాస శేఖరుడు అనంగమంజరీప్రథమార్తవమహోత్సవదర్శనార్థియై బయలు దేరి, మధ్యేమార్గమున గంధసారానురక్తయైన మలయవతికి ఆశీస్సు నిచ్చి, కమలవతిని పరామర్శించి, మాధవసూనుడైన మందారకునితో ముచ్చటించి, హిత ముపదేశించి, రత్నావళితో వాదించి, పాదములపై బడి కనకలతాకామందకుల సల్లాపాలలో పాలు పంచుకొని, ఇందుమతి కందుకక్రీడను తిలకించి, వాసంతికతో భాషించి, కలకంఠ ధనమిత్రుల ప్రణయకలహమును తీర్చి, నాట్యాచార్య గణదత్తునితో మాటాడి, డోలాక్షక్రీడల వర్ణించి, చంద్రవతి మందిరోద్యానములో మధ్యాహ్న వేళ విశ్రమించి, మాధవసేన చంద్రసేనుల తగవు తీర్చి, క్షేత్రవతీమాధవదత్తుల కళ్యాణపత్రమును విని, దినపరిణామమున కామమంజరీగృహము ప్రవేశించును.

అలంకారపోషణలో, భావ రామణీయక కల్పనలో, శబ్దసారళ్యములో, శైలీ మాధుర్యములో నీత దందెవేసిన చేయి. తాను ఆత్మప్రత్యయముతో చెప్పికొన్న మాటలు వమ్ము కాదు. ఒక రూపకాలంకారమును చూచినచో - వేశ్యామాతను వర్ణించిన తీరులో – విశదమగును.

> రసజ్ఞలోకై రభినందితానం వారాంగనాచందనవల్లరీణామ్
> ముహు ర్వమన్త్యే గరళం ముఖేన స్వమాతరః కాలభుజంగ్య ఏవ ॥ (24)

అట్లే ఒక కల్పితోపమలో - చంద్రవతిని వర్ణించుచు —

> ముగ్ధే! ముఖకమలం తే మౌక్తికనాసావిభూషణా దధరమ్
> అంకురితామృతబిందో రిందో రివ బింబ మాతనోతి ముదమ్ ॥ (65)

కల్పితోపమయే గాక "అంకురితామృతబిందో!" అనునది చక్కని పదబంధము. అయితే "ముఖకమలం" అనుచు చంద్రబింబముతో పోల్చుట పరిశీలనార్హము. భావమును అధ్యవసాయము ద్వారా వ్యక్తీకరించుట యీ కవికి అత్యంత మభీష్టము.

---

* శృంగార భూషణభాణము 7.

నాంది యందే ఆ పదతిలో "యోషితాం వీరాయితం" అని పురుషాయితమును వర్ణించుటలో అట్టి అభేదాధ్యవసాయమును కవి ఆదరించినాడు. (చూ-శ్లో-2) కవి సమయాలను, శాస్త్రీయవిషయములను మనోహరముగా వాడుకొని, శేషతో జోడించి చమత్కరించిన మరొక చక్కని శ్లోకము -

వాచాలమంజీరమనో హరేణ సాదేన పద్మోదరకోమలేన।
వక్షస్థలే తాడన మాచరన్త్యా వరాంగి సోయం క్రియతా మశోకః॥

ఇందు ఒక్క అశోకపదమే శ్లిష్టమై శ్లోకమున కంతటికిని రామణీయకమును సంపాదించి పెట్టుచున్నది. పద్యభావ నిర్మాణముననే కాక గద్యనిర్మితియందును ఈతని శైలి భావగర్భిత మైనది. "సాధుతరసంగ్రామే చాపస్య జ్యాభంగః" (పుట 11) తాను చుంబించునంతలో విధి యంతరాయము కలిగించెనని ధనమిత్రుడు పలికిన శ్లోకమును విన్న తరువాత అనిన మాట ఇది. ఆ శ్లోకము ఇది

తైస్తై ర్వచోభి రనునీయ కథంచి దేనాం
లీలాకృతి స్తనయుగాం తరలాయతాక్షీమ్।
ఆలింగ్య గాఢ మధికం న పిబామి యావ
త్తావ చ్చకార హత దుర్విధి రంతరాయమ్॥ (45)

ఈ శ్లోకము కాళిదాసును తలపించును.

ముహు రంగుళిసంవృతాధరోష్ఠం ప్రతిషేధాక్షరవిక్ల బాభిరామమ్
ముఖ మంసవివర్తి పక్ష్మలాక్ష్యాః కథ మప్యున్నమితం న చుంబితం తు॥
(శాకుంతలం)

కాని కాళిదాసుని శ్లోకములోని ఆ ఉత్సుకత, ఆ నిస్పృహ - ఈతని శ్లోకములో లేవు. బహుశః ఇది భాణ మగుట కారణమేమో!

ఇందు సామాన్యభాణములలో వలె శృంగారాభాసమే గాక వీరాభాసము సైతము వర్ణింపబడినది. (ఉదా : మాధవసేన చంద్రసేన కలహము) ఇక కందుక క్రీడ – డోలాక్రీడ - అక్షక్రీడల వర్ణనమును, మేషస్పర్ధ - కోడిపుంజుల పోరాటము - మల్ల యుద్ధ వర్ణనములను రమణీయములై యున్నవి. గాన నాట్యప్రశంస - తద్ద్వారా లాస్యాంగపోషణమును ఈత డాదరించినవే.

ఇది భాణ మైనను, ఒక రమణీయాకృతి ధరించి, ప్రకృతి కద్దముపట్టిన కృతి యనుటలో అత్యుక్తి లేదు. వామనభట్టబాణుని కీర్తిపతాకమున ఒక వర్ణముగా నిలుచునదే గాని వివర్ణతను గల్పించునది కాదు.

శృంగారభూషణభాణము – అనంతాచార్యులు :

గద్యపద్యములలో పటిష్టమైన కవిత్వమును చవిచూపిన వామనభట్టబాణుని భాణమును, పేరును కూడ విడువకుండ అనుకరించినవారు కొంతమంది కలరు. ఈ అనుసరణము అనుకర్తకు మూలకర్తపై గల అభిమానమును, అభిరుచిని ప్రస్ఫుట మొనర్చుచుండును. అట్లే మూలకర్త యొక్క ప్రభావము కూడ ప్రకటితమగు చుండును. ఆయా కాలములలో ఆయా రచనలకు గల ప్రాధాన్యమును, ప్రాచుర్యమును ఆధార -ములుగా చేసికొని ఇట్టి అనుసరణములు బయలుదేరుచుండును. తెలుఁగు సాహిత్యము నందు పిల్లవసుచరిత్రలు ఈ కోవకు చెందినవే. సంస్కృతమున రఘు వంశమును బట్టి యదువంశమును, మేఘసందేశము ననుసరించి హంససందేశము వగైరాలు వెలువడినవి. ఈ ఛాయలలోనే అనంతాచార్యుని శృంగారభూషణమును ప్రవర్తిల్లినది. ఈతని గృహనామము 'వింజమూరు' వారు. కాంచీపురనివాసి యగు ఈతడు సకల తంత్రవేత్తయై, శృంగారకోవిదుల కుతూహలము కొఱకీ "శృంగార భూషణము" రచించినట్లు ప్రస్తావనలో చెప్పుకొనినాడు. ఇతివృత్తములో క్రొత్తదన మేమియు కన్పింపదు. అయినను రచన సరసము, సరళము నగుటచే గ్రంథమంతయు విసువు జనించకుండ పఠియింపదగియున్నది. ప్రస్తావనలో నీత దండటివలెనే వసంత ఋతు వర్ణన గావించినాడు. కథాభాగమును సూర్యోదయముతో ప్రారంభించినాడు. ప్రభాత మందానిల వర్ణనము రసవంతముగను, సహృదయ హృదయావర్జకముగను చేసినాడు.

మాకందద్రుమమంజరీమధుఝురీ మాధుర్య ముద్వేలయన్
మందం మంద ముదారముగ్ధసుదృశాం మానం సమున్మీలయన్।
మాసఽయం మధు రుల్లసత్పరిమళా నుల్లాసయ న్పల్లవాన్
మర్యాదా మతిలంఘ్య మోహయతి మాం మందానిలస్పందనైః॥

కుక్కుటయుద్ధము, పాములవాని వర్ణనము, అతిబలమహాబలయుద్ధములు సంప్రదాయసిద్ధముగా జరిగినవి.

ఉపాధ్యాయుడు శిష్యులకు పాఠప్రవచనము చేయు సందర్భము సముచితముగా, సమయోచితముగా వర్ణింపబడినది. ఇదికూడ శృంగారసూచికగా నుండుట గమనార్హము. చూడుడు –

ప్రథమాధ్యాయే అనంగదేవస్య సర్వోత్కృష్టతా ప్రతిపాదనం
ద్వితీయాధ్యాయే తదుపాసకస్య కామపురుషార్థ హేతుత్వబోధనమ్
తృతీయాధ్యాయే తరుణజనప్రశంసా
చతుర్థాధ్యాయే కామినీవైభవ ప్రకాశనమ్
పంచమాధ్యాయే పతివ్రతాదోషనిరూపణమ్ ॥

ఈ పై ప్రవచనమును బట్టి వేశ్యాలోలత్వము తరతమభేదము లేక సంఘము నందు సర్వులకును సంక్రమించినట్లు కన్పట్టును. ఈ భాణమునందు విలాస రసికుడు (విటుడు) శృంగారవల్లికకు కళ్యాణపత్రికను వ్రాసి యిచ్చును. దీని రచయిత పంచబాణ శాస్త్రి యనియు, సాక్షులు కందర్పమిత్రుడు, మనోజభట్టు అనియు వచించుట ఔచితీ శోభితమై యున్నది. ఈత డీ భాణమును మిక్కిలి చిన్నవయసులో వ్రాసినను సంస్కృత రచనమున సిద్ధహస్తుడే యనిపించుచున్నది.

శృంగార భూషణ భాణము – వేంకటాచార్యులు :

ఇదియును వామనభట్టబాణుని శృంగార భూషణమునకు అనుసరణప్రాయ మైనది. దీని రచయిత వేంకటాచార్యులు. శ్రీశైలవంశమునకు చెందినవాడు. తండ్రి పేరు చంద్రగిరి వేంకటాచార్యులు. వేదాంతద్వయమును అధీత మొనర్చిన చంద్రగిరి శ్రీనివాసాచార్యులు వీరి తాతగారు. దీని ప్రతి ఒకటి మద్రాసు అడయారు లైబ్రరీలో కలదు. ఈతని కవితాధోరణి తెలియుట కీ క్రింది నాందీశ్లోకమును పరిశీలించుడు.

కృష్ణః కంస విమర్దనః కృతరుచిః గోపీకుచాలింగనాత్
తద్వక్షస్థలబాహుమూలవిగలత్ కాలేయపంకాంకితమ్।
వక్షో వీక్ష్య నిజం ముదా మురరిపుః ఖేలన్ననర్త స్వయం
లోకానా మపి నాయకో యదువరః క్రీడానటః పాతు నః ॥

శృంగారమంజరీ భాణము – గోపాలరావు :

క్రీ. శ. 16వ శతాబ్దమున శ్రీకృష్ణదేవరాయల సేనానులలో నొకడైన వీర కృష్ణా రెడ్డి కడపమండలములోని జనుంపల్లి నుండి - కృష్ణాతీరము నందలి పేపర్ల గ్రామమునకు వచ్చి స్థిరపడి, అక్కడి కిరాతులను జయించి రాజ్యపాలన గావించెను. ఆ వంశము నందలి ఏడవరాజు అష్టభాషా బహిరీ గోపాలరావు. ఇమ్మడి వెంకటరెడ్డి

కుమారు డితడు. గోపాలరావు అష్టభాషాపండితుడు. అది అతని బిరుదుగా నిలిచి పోయినది. క్రీ.శ.1648న శ్రీరంగపురమున శ్రీరంగనాథు నితడు సందర్శించె నట. శ్రీరంగనాథుని స్వరాజ్యమున ప్రతిష్ఠింపగోరి గరుడాద్రిపై ఆలయనిర్మాణము గావించినా డీతడు.

"రామచంద్రోదయ" మను యమకమహాకావ్యము, "శృంగారమంజరీభాణము" ఈతని రచనలు. తన కావ్యమునకు "విజ్ఞేయార్థదర్పణ" మను వ్యాఖ్యానమును సైతమీతడు రచించెను.

వసంతకలికా - శృంగారతిలకుల ప్రథమసంభోగశోభనమహోత్సవదర్శన లాలసుడై, లీలావసంతుడు ప్రయాణమై, మధ్యేమార్గమున వేశవాటిలో ప్రవేశించి, బృందారికా కాశ్మీరమంజరులతో మాట్లాడి, శృంగారవల్లి చంపకమాలలతో సంభాషించి, వివిధ వినోదముల బరిశీలించి - వసంత కలికాగేహమును చేరి, అక్కడ నుండి ముందు చేసి కొన్న నిర్ణయప్రకారము మంజుభాషిణిని కలియబోవుట యిందలి కథ.

ఈ భాణమును, ముకుందానందభాణమువలె విస్తృతిలో పెద్దది. ఇందులో 349 శ్లోకములు సుమగుచ్ఛమువలె కూర్పబడినవి. ఇది యింత విస్తృతమైనను ఇందలి పాత్రములు అనేకేతర భాణములతోఁ బోల్చినచో సంఖ్యలోఁ దక్కువవి చెప్ప వచ్చును. ఒక చంపకమాలాకథ - ఒక మీనాక్షికథ మాత్రమే సంక్షేపముగా నున్నవి. ఇక వినోదములకు కొదవ లేదు. పెట్టుబడి, లాభనష్టములు లేని ఆశీర్వచనముల నందించుటలో చతుర్భాణి కిది తీసిపోదు. కోడిపందెములు, పొట్టేళ్ళ పందెములతోఁ బాటు దున్నపోతుల కొట్లాటను సైత మీతడు వర్ణించినాడు. మదనవిజయభాణకర్త ప్రస్తావించిన భల్లూకపు పట్టు నీతడూ విడువ లేదు. కాని తెలుగుపల్లెలకు సుపరిచితములై, చక్కని సరదాను కలిగించు గంగిరెద్దులను స్పృశించిన భాణక ర్త శ్రీ గోపాలరావు తప్ప మరెవ్వరును మా పరిశోధనలో కాన్పించలేదు.

ఆంధ్రసాహిత్యప్రభావము, ఆంధ్రప్రబంధసమకాలీనత యితనిచే పుష్పలావికల వర్ణనను చేయించిన వైనము చూడుడు.

> కున్దాఽళిం దర్శయాళి ! ప్రథయితు ముచితా నాగ్రత స్సా మధుశ్చ్యు
> ద్భున్ధాకచ్ఛాదితా తద్దిశ కి మసులభం తత్ప్రకామార్థలభ్యమ్ ।
> క్రీణే తద్వోరుమూల్యం దిశ తదపి దదే నైవ పుష్పేషుదాస్యం
> పుష్పాణి క్రీణతేఽమూ ర్యువజన మితి నర్మోత్తరై ర్మోహయన్త్యః ॥

కుందములు చూపవా ? (నవ్వవా) "లేదు, అవి తేనెవారెడి బంధూకముల వెనుక నున్నవి" (పెదవులని భావము). అయిననేమి చూపించలేవా ! "అవి చాల వెలగలవి ?" అయినను కొనగల మీ రీతిగా వారి మాటలు సాగుచున్న వట. పుష్పలావికల వర్ణనలోనే కాక ఒంటరిగా వచ్చిన విరహిణితో పలికెడి శ్లోకములో రామరాజభూషణుని ప్రభావ మెంత కలదో చూడుడు.

ఆస్థానీ మదనస్య కానన మిదం హన్త! త్వ మేకాకినీ
ముగ్ధే నిర్దయతద్బలాభిచరితా మేనాం ప్రవిష్టా కథమ్
ప్రాణేశానుపగూహితా మిహ రహ స్త్వాం ప్రేక్ష్య కోపా త్వరం
సోఢారః కథ మాతతాయిన ఇమే క్షుద్రాః పికాళ్యాదయః ॥

ఈతని రచనలో కాళిదాసుపట్లు కూడ కొన్ని కన్పించుచున్నవి. స్త్రీరత్న సృష్టి రపరా ప్రతిభాతి సా మే (శాకుంతలము-ద్వితీయాంకము) అని కాళిదాసనగ, ఈతడు "మన్యే కిమన్య దపరాంవిధిస్సృష్టి మేనామ్" (శృంగారమంజరి-112 శ్లో) అని గొంతు కలుపును. దుష్యంతునకు సహకరించిన తుమ్మెదను అప్పటినుండియు చిరంజీవిని చేసి మరుల తాను విటునకు సహకరించునట్లు చేసినాడు. ఈ కవి స్వతంత్ర భావములకు కూడ తక్కువ లేదు. ఒక ముచ్చటయిన భావమును పరిశీలించుడు. ఆ కాంత ఎంత వేగముగ లతలనుండి పువ్వులను త్రుంచునో - అంత వేగముగ కుసుమ శరుడు ఆ పూవులనే తీసికొని ఆతని మనస్సును నలుపుచున్నాడట చూడుడు.

యదా యదా సా కుసుమాని యాని
ద్రుతం లతానా మబలా వ్యలావీత్ ।
తదా తదా హన్త మనో మనోభూ
స్తై రేవ మే జర్జరితం వ్యతానీత్ ॥ (శృంగారమంజరి—122)

స్నుషాబాధలను వర్ణించుటలోను, సూర్యాస్తమయవర్ణనమునందును, అతిశయోక్తి - ఉత్ప్రేక్ష మొదలగు అలంకారపోషణము చక్కగా నున్నది. శబ్దాలంకార విషయమున సైతము యమకానుప్రాసములు విశేషముగ నాదరింపబడినవి. ఒక తెలుగు నానుడి "ఆడవా రబద్ధ మాడితే గోడ కట్టిన ట్లుంటుంది. మగవా రబద్ధ మాడితే తడిక కట్టినట్లుంటుంది" – ఇది ఎప్పటినుండి యున్నదో గాని దీనికి సంస్కృతీకరణ మీ భాణమున గలదు—

యది వదన్తి మృషాగిర మంగనా
మతిమతా మపి సా భువి భిత్తివత్ ।
యది పునః పురుషాః ప్రవదన్త్యమూం
యవని కేవ భవే దియ మావృతిః ॥ (279)

బహుశః దీని అనువాదమే లోకమున వ్యాపించెనేమో తెలియరాదు. సంస్కృత సాహిత్యమునకు అప్పయదీక్షితుల కువలయానందములో నుదాహరింపబడి పరిచయమైన ప్రపల (చలివేంద్రముల) విషయమును ఈ కవి విస్తృతముగ ప్రస్తావించును. దానిపై శ్లోకరచనయు జేసెను. మొత్తమునకు అనేక కుసుమములతో పసందుగ కూర్పబడిన ఇది శృంగారమంజరియే.

పంచబాణభాణము – భట్టి వేంకటేశుడు :

దీనిని రచించినది మధ్వుడు, మహారాష్ట్ర బ్రాహ్మణుడు నగు భట్టి వేంకటేశుడు. 'కోలారు'లో 17 వ శతాబ్దమున నివసించెను. ఇతని గురువు నృకంఠీరవుడు, ఇతని కృతులలో కొన్నిటి కీతని మనుమడే వ్యాఖ్యానము చేసెను. ఇతని ఇతరకృతులు - అభినవచంపూరామాయణము, అభినవభాగవతము, శ్రీనివాసవిలాసచంపువు, ఆనందతీర్థవిజయ శ్లేషకావ్యము మున్నగునవి. శ్రీనివాసవిలాసచంపువు ముద్రితము. ఈ కవి వేంకటగిరి వేంకటరాయలచే పోషింపబడెను.

పంచబాణభాణ మొక శ్లేషభాణము. ఇది చింతామణి ఆంజనేయస్వామి ఉత్సవములలో ప్రదర్శింపబడినది. ఈ భాణమున రసిక శేఖరుడు నాయకుడు. కృష్ణవేణియం దనురక్తుడయిన ఈతడు ఆమె తన సతిగృహమున కేగునని మరల సంయోగము దుర్లభమని విచారించుచు ప్రవేశించి, చంద్రాస్తమయాది వర్ణనలు చేసి, తన మిత్రుని మధుకరుని కలిసి - ఆతని వృత్తాంత మరసి శుభశకునములు కన్పింప ప్రియాసమాగమ మేర్పడునని భావించి - దానికై భగవతి యగు చంద్రికను ప్రార్థించి, ఆమెద్వారా కృష్ణవేణీప్రయాణమును నివారించి ఆమెను పొందుట ఇతివృత్తము.

శ్రుణు తావత్ భూతవృత్తాంతమ్. జానాసి కిం అస్యాః పుర్యాః బాహ్యోపవనస్య నాతిదూరే చండికాయతనమ్. యా తు నితంబినీ సంచారస్థలీ. తత్ర పూర్వేద్యు రహం గగనమధ్యదేశ మలంకుర్వతి భగవతి కర్మసాక్షిణి పుష్పాపచయార్థం గతవా నస్మి. యదృచ్ఛయా తత్ర కస్యచిత్ అతిప్రమాణస్యఫలాశినః స్కన్ధదేశే సజ్జితకరా పీనపయోధరాకారా రోషితాక్షీ రక్తాకర్షణనిపుణా సుమహాస్యా కాచన వ్యక్తిః మా

మాలోక్యైకాకినం మయి మందం కటాక్షగతిం వ్యాపారయామాస. తదను సా సుందరతాసు గ్రహణ రుచిః క్షణ మివ ధ్యాత్వా మత్సమీప మాగతవతీ సఖే! మురమథన సత్యం జానీషి యస్యాః అంగజాతే స్ఫురతి కనకమృగతృష్ణేతి....

.... సా మదుక్త మాకర్ణ్య జీవనాదానార్థ మితి వ్యావృత్త్యానుపదమేవ సరభసం మదీయం కంఠగ్రహం జగ్రాహ".... మొదలగు రీతి. ఈ పద్ధతితోడనే అనేక వృత్తాంతములు శ్లిష్టములు. సభంగాభంగశ్లేషలు రెండును వాడబడినవి. కవితా శైలికి ఒక ఉదాహరణము__

సతతసురాజీవిన్యః నలిన్యః ఏతా ఇమేఽలినో మధుపాః।
దైవాయోగ్య స్సంగః శివశివ వికచా అపీహ జాతాస్తాః॥

ఇందలి పాత్రము లన్నియు భావములకు ప్రతీకములు. ఇందు బిందుమతి పాత్ర సిద్ధికి ప్రతీక. కలకంఠుడను మిత్రుని వృత్తాంతము రమణీయము.

సరసకవికులానందభాణము – వెల్లాల రామచంద్రకవి :

శ్రీపురి యందలి చంద్రశేఖరుని వసంతోత్సవ సందర్భమున రంగస్థలమున కెక్కిన ఈ భాణమును రచించిన వెల్లాల రామచంద్రకవి 18వ శతాబ్దమువాడు కావచ్చును.[1] ఇతని తండ్రి చంద్రశేఖరుడు. ఇతడు షడ్భాషాపండితుడు. షట్తంత్ర నిష్ణాతుడు. [2] ఈ రామచంద్రకవి శ్రీకృష్ణ విజయమను వ్యాయోగమును రచించినట్లు తెలియుచున్నది.[3]

అమాత్యకళానిధి కనిష్ఠసుత కామలతను భుజంగశేఖరుడు పొందుట ఇందలి ఆధికారికవృత్తము. కనుక నిది ఆత్మాశ్రయమైన భాణము. కాని ఇందు భుజంగ శేఖరుడు విటు డగుటవలన, అన్యకాంతాసమాగమమును ఇతడు వర్ణించుటవలన రసాభాసమే ఇందు ప్రధానము కాని రస మనలేము.

భాణము రజనీవర్ణనముతో ప్రారంభ మగుట ఇందలి విశేషము –

శోకే చ వావదూకే కోకిలలోకే సకాకలీకేఽస్మిన్।
రజనీ ప్రభాతకల్పా యస్యాః కల్పాయతే కలాఽల్పాపి॥ (పుట–3)

---

1. Andhra's Contribution to Sanskrit Literature-160 P.
2. సరసకవికులానందమ్ ప్రస్తావన-పుట-2.
3. Andhra's Contribution to Sanskrit Literature-160 P.

రజనీవర్ణనతో ప్రారంభమైన ఈ భాణము ఏకాహవృత్తపరిమితమై సంధ్యాకాలముతో ముగియును. ఈ కవి తన బాణములోని లక్షణములనుగా సూత్రధారునిచేత పారిపార్శ్వకుని గూర్చి చెప్పించిన శ్లోకమును చూడుడు.

మృద్వీ శయ్యా లలితలలితా వ్యాహృతైః కాపి రమ్యా
వృత్తి ర్ముక్తాఫలకలితసర శ్శ్రీసగంధోపి బంధః।
యస్మి న్నాద్యః స జయతి రసః ప్రౌఢిమా కో ప్యసీమా
తత్వం యత్నా దభినయజగద్వ్యాపకం రూపకం సః॥ (పుట 2)

పై లక్షణములు ఈతని కవితలో ప్రస్ఫుటములు. మృదుశయ్య, లలితలలిత ఫణితి, రమ్యవృత్తి, ముక్తాఫలసదృశబంధము శృంగారరసము అన్నియు సంగతములే.

ఈ కవి రచనావిధానముపై ప్రాచీనకవుల ప్రభావము అధికముగా కన్పట్టు చుండును. ఆయినను తాను స్వతంత్రతను కోలుపోడు. కాళిదాస - భవభూతి - భట్ట నారాయణ - బాణుల ప్రభావ మెక్కువ. పదబంధముల యందును, మందాక్రాంతా రచనమందును కాళిదాస ప్రభావ మనంతము. "చమత్కృతి చాటూక్తిభిః... కథం కథ మపి స్పృశ న్నధరచుంబనా ద్వంచితః" (పుట 15). మున్నగునవి కాళిదాసుని, అట్లే "కిమపి కిమపి వారం వార మాలోకయన్తీ" (42 పుట) మొదలగు పదబంధములు భవభూతిని తలపించును. "చంచద్భుజభ్రమితపట్టసకోటి" మొదలగునవి (32 పుట) "చంచద్భుజభ్రమితచండగదాభిఘాత" మొదలగునవి భట్టనారాయణుని వేణీసంహార మందలి పదబంధములను తలపించును.

అట్లని పదబంధముల చమత్కృతులలో ఇతనికి స్వతంత్రత లేదనలేము. — యువలోక నేత్రయుగళీ పుణ్యం - మొదలగు పదబంధములకు, భక్షితేపి లశునే న రోగశాన్తిః (32 పుట) మొదలగు ఆమెతలవంటి సామెతలకు, కింశుకకుసుమై రలంకృత మివాభాతి తే వపుః (33 పుట) మొదలగు చమత్కార సంభాషణలకు ఇందు కొదవ లేదు. నర్మగర్భభాషణములకు, అందు సహకరించెడి శ్లేష చమత్కృతులకు తక్కువ లేదు.

పై కవుల ప్రభావముతో బాటు వచనరచనలో ఇతనిపై బాణుని ప్రభావ మెక్కువగా కన్పట్టును. ఈ కవి కవితావిన్యాసము శబ్దములపై అనంతముగా సాగును. అట్లని భావ సౌందర్య ముండదని కాదు, భావసౌందర్యము రాజ్యముచేయు-చున్నను ఒకచో శబ్దసౌందర్యము దానిని అధిగమించునట్లుండును. చూడుడు—

కలరవకలరవముఖరైః హర్మ్యే రమ్యేఽత్ర నివసంతః।
కాంతాభి ర్న రమంతే కాంతాః కాంతాలకాంతాభిః॥ (3-37)

మొదలగు యమకములు -

కేళీకాసారపాళీపరిసరవిలసచ్చారునాళీకనాళీ
మాద్యత్కేళీమరాళీ గళరవతరళీభూతదిక్చక్రవాళః।
రారాజద్రాజరంభాఫలభరభరితైః ఫుల్లమల్లీమతల్లీ
వేల్లల్లోలంబకోలాహలలలితలతాకుంజరమ్యై ర్వనాంతః॥

మొదలగు అనుప్రాసములు-

మహేశ్వరవర్ణనలో ముక్తపదగ్రస్తము మొదలగునవి కలవు. ఈ శబ్దాలంకా- రములు లేశమాత్రములుగా ఉదాహృతములే కాని రచనలో అనంతములే. అట్లని చక్కని భావనలు లేవనలేము. భావనలు చెక్కిన చక్కని శ్లోకముల చూడుడు.

కూజత్కోకిలజాలో నిజఘనమకరందపంకిలాలవాలః।
విజయతి రసాలసాలః కూలే సరసః కదాపచేయఫలః॥
లోచనయో స్తారళ్యం వక్షోరుహయో ర్వైరళ్యం।
సారళ్య మంగకే ష్వపి చిత్తే చాపల్య మున్మిష త్యస్యాః॥ (39 పుట)

మనోహరభావములను రసనీయమైన శ్లేషతో జోడించి అమేయానందమును కల్పించ గల నేర్పు సైత మీకవి కున్నది. కవిసమయసిద్ధవిషయముల నూతన భావములను కూర్పగల నేర్పితని యందున్నది. చంద్రునిలోని కళంకమును వర్ణించినపు డీత డుత్ప్రేక్షించిన తీరు చూడుడు

నాయం విధు స్ఫటికభాజన మేవ యేన హాలాహలం పరశివేనపురా నిపీతమ్।
కాకోలలేపన మిదం న చ లక్ష్మ తస్మిన్నోచే త్కథం స్వమృతదీధితి రీదృశః స్యాత్॥

ఈ భాణములో వివిధకాంతల వర్ణనయు కన్పించును. ఘూర్జర-కర్ణాట-కేరళాది స్త్రీల వర్ణన మిందు కన్పట్టును. అంతేకాక నాటి సాంఘికస్థితులను బట్టి శ్రోత్రియమ్మన్యుల దూషణ, తండ్రి యాగమునకై దాచిన ధనమును స్మరయాగదీక్షితులైన సుతులు రహస్యముగా తెచ్చి వెచ్చించుట మొదలగు విషయము లందు సమాజమున కద్దము పట్టును.

సామాన్యభాణములలో వలె రౌద్రాభాస – వీరాభాసము లిందు భాసించు చుండును. కందుక క్రీడ - అక్షక్రీడ లున్నవి. అందు పణమను, కళత్రపత్రమును వ్రాయించుట తప్పదు. గేయాదిలాస్యాంగములు నుండును. జాంగలిక-సర్ప-కుక్కుట-మేష-కీర-మల్లయుద్ధాదులు విధిగా రంగమున ప్రస్తావించబడును. పుష్పాపణవర్ణనము ఇందు విశేషము. ఇతడు శబ్దశక్తి, భావశక్తి రెండిటిని కలిపి, కరిగించి, మూసపోసి చైతన్య సంపుటమును ఘటించిన ఒక పద్యమును చూడుడు.

> యః పూర్వం మదన స్స ఏవ సమభూ న్మార స్తథై వాశుగో
> జాతో గంధవహోఽమృతాంశు రభవ న్నక్తంచరః కేవలమ్।
> మేదస్వీ మధునా బభూవ సురభిః పుంస్కోకిలః పంచమా
> భిఖ్యాం స్వాం ప్రకటీకరోతి తదిత స్తేషాం ప్రియం మా కృథాః॥

భరతవాక్యములో కవి కోరుకొనినట్లు (గురుదరణకటాక్షా త్స్యా త్కవిః పూర్ణ కామః) - కవి పూర్ణకాము డయ్యును గాకున్నను ఈ భాణము మాత్రము సంపూర్ణ కామమే యనుట కేవలము సత్యసంగతమే.

ముకుందానందభాణము – కాశీపతి

నంజరాజు ఆస్థానమున గల కాశీపతి 'ముకుందానందభాణము'ను రచించి-నాడు. కౌండిన్యగోత్రుడైన ఇతడు రామపతి పుత్రుడు. తనభాణము మిశ్రభాణమని ఇతడు చెప్పుకొనినాడు. ఈతని నివాసమును గూర్చి నిశ్చయముగా చెప్పలేము. కాని కర్నూలు మండలములోని బంగనపల్లిలో క్రొత్తపేట ఇతని నివాసమని కొందఱు తలంతురు. 18వ శతాబ్ది ప్రారంభములో నుండెనని పరిశోధకుల యూహ. నాటకములలో అభిజ్ఞానశాకుంతలమునకు ఎట్టి ప్రఖ్యాతి గలదో భాణములలో నీ ముకుందానంద భాణమునకు అంతటి ప్రఖ్యాతి, ప్రాచుర్యము కలవని కొందఱి తలంపు.

దైవస్తుతులలో మిగుల ప్రచారమును బొందిన

> వన్దే వందారుమందార మిందుభూషణనందనమ్।
> అమందానందసందోహబంధురం సింధురాననమ్॥

ఈ శ్లోకము ఆంధ్రులైన పండితుల జిహ్వాగ్రములపై పరంపరగా నటించి చుండును. ఈ శ్లోకము ఈ భాణము నందలి ప్రథమశ్లోకము. దీనినిబట్టి కూడ ఈ

భాణము యొక్క ప్రాచుర్యమును మనము ఊహింపవచ్చును. నూతనపురమునకు పరిసరమున నున్న బధిర పర్వతముపై వెలసియున్న చూడేశ్వరుని వసంతోత్సవ మందు ఈ భాణము ప్రదర్శింపబడినది.

అప్పటికి మిశ్రభాణములు అరుదనియు, కావున మిశ్రభాణదర్శనకుతూహలముతో నున్న సామాజికులను సంతోషపరచుటకు ఈ భాణ ముద్దేశింపబడిన దనియు, తర్క కర్కశము, వక్రోక్తినిష్ఠురమునైన తన వాణి అవసరము ననుసరించి మృదులము, కోమలము కూడ నగునని ఆత డిట్లు చెప్పుకొనెను.

తర్కే కర్కశవక్రవాక్యగహనే యా నిష్ఠురా భారతీ
సా కావ్యే మధురోక్తిసారసురభౌ స్యా దేవ మే కోమలా ॥
యా ప్రాయః ప్రియవిప్రయుక్తవనితాహృత్కర్తనే కర్తరీ
ప్రేయోలాలితయౌవతే న మృదులా సా కిం ప్రసూనావళిః ॥

విరహ మందున్న వనితల హృదయములను భేదించు పుష్పబాణములు ప్రియోపలాలితలైన యువతుల పట్ల కోమలములై ఉండును కదా! అని తన విద్వత్కవిత్వములను ప్రకటించుకొనినాడు. ఇతని కవిత్వము భావగర్భితము ప్రకృత్యుచితమునై శోభిల్లుచుండును.

వీరాయితేషు మృగశాబవిలోచనానాం
(?) కంఠోదితాంన్యచరమమ్ కలకూజితాని।
ఆమ్రేడయద్భి రథ సౌధగతైః కపోతైః
శంకే గృహీత ఇతి సంప్రతి శిష్యభావమ్ ॥

భాణములలో శృంగారము పడకటింటి నుండి వేశ్యాగృహములకు, పరవనితల శయనగృహములకు ప్రాకుటకు గూడ వెనుకాడలేదు. (వేశ్యా)వనితల శృంగారము బజారుపాలు చేయుటే కాక కామసంతృప్తులు గాని కులస్త్రీల గూఢశృంగారములను సయితము బయల్పరచుటకు ఇతడు వెనుకాడలేదు. పైగా సంప్రదాయము చేసి ప్రకటించినాడు.

ఘూర్జరీణాం కులాచారక్రమోయం య ద్గృహే గృహే
పౌరాణికః పురోధా వా భృత్యో వా గూఢవల్లభః ॥

అచ్చుటచ్చుట అర్థాంతరన్యాసముల విన్యాసము పాఠకులకు ఆకర్షకమై అస్వాదయోగ్యముగా నుండును. భుజంగశేఖరుడు మల్లిక యొక్క కందుకక్రీడను వర్ణించుచు చెప్పిన శ్లోకము.

గుణిన మపి సువృత్తం కందుక మాలోక్య తాడితం తన్వ్యాః।
పరిన్నృత్యతి కుచభారః కర్కశవృత్తస్య కుత్ర కారుణ్యమ్॥

విస్తృతిలో పెద్దదైన ఈ భాణమును తెలుగులోనికి శేషయ్యశాస్త్రి గారనువదించిరి.

శృంగారరసోదయభాణము – లింగమగుంట రామకవి :

మిశ్రభాణములలో ముకుందానందము తరువాత పేర్కొనదగిన రసవత్తరభాణ మీ శృంగారరసోదయము. దీనికర్త లింగమగుంట రామకవి. కాశ్యపగోత్రజుడును, రాజశేఖరయతీశ్వరుని శిష్యుడు నగు ఇతడు లింగమగుంట పుర వాస్తవ్యుడు. చదల-వాడలో వెలసియున్న శ్రీరామచంద్రుని వసంతోత్సవసమయమున సమాగతులైన విద్వన్మణుల ముందిది ప్రదర్శింపబడినది. పద్మగంధి సరసశేఖరులు ప్రణయ మిందలి యితివృతము.

తన భాణము నీతడు మిశ్రభాణమని స్పష్టముగా చెప్పికొనినాడు. భాషాద్వయ భూషిత మని ప్రస్తావనలో నిట్లు తెల్పినాడు. (చూడుడు - వెనుక - భాణలక్షణము మిశ్రభాణము) భిన్నరుచులైన వారికి భాణ మాస్వాదయోగ్యమని ఇత డిట్లు మనోజ్ఞముగ వివరించినాడు.

కేభ్యశ్చి ద్భువి రోచతే సుకవితా కేభ్యః పరం నాటకం
కేభ్యో న్యాయపురాణనీతినిచయోఽన్యేభ్యశ్చ వైశేషికమ్।
యద్యప్యద్య సుధాబ్ధిబంధురతరంగాభంగపారంపరీ
వాక్యాడంబరగుంభనేన నితరాం సర్వాన్ సమానందయే॥

వాచాం విలాసో మధుపూరహారీ
శృంగారసారాగమనానుసారీ।
కేషాం న ధత్తే మనసి ప్రహర్షం
కస్తూరికా మోదసరిత్ప్రవాహః॥

కస్తూరీపరిమళము ప్రహర్షదాయకము కాకుండునా? యనుటతో తృప్తి పడలేదు, రూపకములలో భాణము సముజ్జ్వలమైనది అని ఎలుగెత్తి చాటినాడు.

కవి శ్చే త్కుశలో భాణో రూపకేషు సముజ్జ్వలః।
సౌలభ్యేస రసజ్ఞో హి సభాదేవోఽపి మామకః॥

ఈ కవి రచనము ధారాళముగ మైదానముపై ప్రవహించు గంగాప్రవాహము వలెనున్నది. కందుక క్రీడను వర్ణించిన శ్లోకమును గనుడు.

మణికందుక ఖేలన మాతనుతే
నటరే కుటిలం వలతే వలయమ్।
హసనేన సుధాధవళేన ధర
త్కుచపాళి మలంకురుతే వనితా॥

తోటకశ్లోకగమనము కూడ కందుకక్రీడను తలపించుచు సమయోచితముగ నున్నది. జాతీయములతో కూడిన రచనమిది. అనేకదేశముల స్త్రీల వర్ణన మిందుండును. వారి వేషభాషలను కవి వర్ణించినాడు. అంతటితో నాగక వారి వారి సురతానుభవములలోని సౌలభ్యకాఠిన్యములను సైతము సకారణముగ వర్ణించినాడు.

మధుపూరహారియైన ఈతని రచనము నందు అచ్చటచ్చట శ్లేషాశ్లేషములు, విరోధాభాసబంధములును కన్పట్టును. సమవేతమైన విద్వత్సభను వర్ణించిన "వింధ్యాటవీప్రదేశే నేవ సద్వంశ ప్రభవేణ; శివప్రతాపే నేవ నిర్జితకామేన; వాసరేణేవ మిత్రప్రవర్తినా; గృహీతగరుడమంత్రేణాపి భుజంగసహవాసభయవతా, అర్థకామపరేణాపి ధర్మమోక్షానువర్తినా ....".

ఈ రచనమున కాదంబరీరచన జ్ఞప్తికి వచ్చును. అష్టభాషాకవిత్వవైభవము కల ఈత డింకను ఇతరభాషలలో నేమి రచించెనో తెలియరాకున్నది.

రసోదారభాణము – సురపురం అణయాచార్యులు :

కడపజిల్లాలోని బుక్కపక్కణమునుండి సురపురం జమీందారీకి వచ్చి స్థిరపడిన అణ్ణయాచార్యులు సంస్కృతాంధ్రములలో శతాధిక గ్రంథములను రచించి వినుతి కెక్కినవాడు. క్రీ.శ. 1704వ సం॥న పుట్టిన ఈతడు వాజపేయ, పౌండరీకాది క్రతువు లొనర్చి అణ్ణయదీక్షితులుగా పేర్వడిసిన వాడు. సంస్కృతమున "తత్త్వగుణా దర్శనము"ను (సవ్యాఖ్యానముగా) రచించినాడు. ప్రస్తుతరసోదార భాణమును శృంగార తిలకునకు వసంతమంజరి యందు గల ప్రణయమును 246 శోకములలో చెప్పినాడు. ఇంకను ఇందులో గద్యములు కలవు. ప్రస్తావనలో తన వంశమును

గూర్చి విస్తారముగా చెప్పికొనినాడు. తన భాణము యొక్క సాహితివిశేషములను సూత్రధారముఖముగా ఇట్లు ప్రకటించినాడు.

భావః స్పష్టానుభావో మృదు పదఘటనై రద్వితీయా చ శయ్యా
పాకో ద్రాక్షావిపాకః ప్రథమరసవిదాం మాధురీ సా ధురీణా।
సర్వం నిర్వ్యాజ మేవ గ్రథిత మభిమతప్రాపకే రూపకేఽస్మిన్
అస్మ త్పుణ్యైరగణ్యై రహహ సుకవినా సాహితీశ్రీహితేన॥

(అముద్రితమైన ఈ భాణము యొక్క ప్రతి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంధ్ర శాఖాధ్యక్షులైన శ్రీ బిరుదరాజు రామరాజు గారి కడ గలదు.)

రసికజన రసోల్లాసభాణము – కామసముద్రం వేంకటాచార్యులు :

కౌండిన్యగోత్రజుడును, అక్కమాంబ వేదాంత దేశికుల పుత్రుడు నైన ఈతడు శ్రీనివాసాచార్యుల కడ సాహిత్యవిద్య సభ్యసించినాడు. ఈ శ్రీనివాసాచార్యు లణ్ణయాచార్యుని సోదరుడు. క్రొత్తదన మేమియు లేని ఈ భాణమునందు విటుడు వసంత తిలకుడు. ఇది పద్మావతికి అంకితము.

భరతవాక్యము తరువాత తన వంశమును గూర్చి చెప్పుకొనినాడు. తన భాణము శృంగారవీరకరుణాదిరసానుకీర్ణమని వీరకరుణములను గూడ జేర్చుటకు వెనుకాడలేదు. భరతవాక్యమున –

ద్రాక్షఫలక్షరిత పుష్పరసానుసారి
వాచా విచారకలితా లలితం మనోజ్ఞమ్।
శృంగారవీరకరుణాదిరసానుకీర్ణం
గృహ్ణంతు పండితజనాః ప్రమదేన భాణమ్॥

ప్రతిజ్ఞాప్రాయములైన పై శ్లోకమునందలి వచనములు ఎంత సత్య సన్నిహితములో పాఠకులకే విడుచుచున్నాము.

లీలాదర్పణభాణము – పద్మనాభుడు :

లీలాదర్పణము, మదనలీలాదర్పణము అను రెండు పేర్లతో పేర్కొనబడిన ఈ భాణమునకు రచయిత వెంకమాంబా లక్ష్మణుల కుమారుడు పద్మనాభుడు. తన సోదరుడు సుబ్రహ్మణ్యము వద్దనే విద్యాభ్యానము పూర్తి చేసెను. బడబానలము

కర్కశజ్వాలలతో సాగరమున మండుచున్నను మధురము, ఆస్వాదనార్హమైన అమృతము కూడ అందే పుట్టుచున్నది. తాను కర్కశుడైనను, కవిత సుధామధురమే నని కవి ప్రకటించి భాణ ప్రారంభము కావించినాడు.

సుధాసమానములైన కవి వాక్కులును, కొంత విలాసములును, మృద్వీక రసమును ఎవ్వరి మనమున కానందము కిలిగించనవి ఈ కవి ప్రశ్నించెడి ఒక చక్కని శోకమును చూడుడు -

సుధాసధ్రీచీనాం జగతి కవివాచాం విలసితం
విలాస కాన్తానా మసమశరలీలావశజుషామ్।
సముద్యన్మృద్వీకామధుమధురతాముఖ్యనిలయం
న కేషా మాద త్తే మనసి పరితోషం రసవిదామ్॥

ఇటువంటి శ్లోకములకు మూలముగా అభినవగుప్తుడు చెప్పిన శ్లోకము నిక్కడ మనము స్మరించుట సాహితీసమారాధనలో ఒక భాగమే నేమో !

న తేషాం ఘటతేఽవధిః న వా భవన్తి కథమపి తే పునరుక్తాః।
యే విభ్రమాః ప్రియాణా మర్థా వా సుకవివాణీనామ్॥

లీలావతీప్రథమరంగమహోత్సవమునకై లీలాశేఖరుడు వెడలుట, వారి ప్రేమ - ఇతివృత్తముగా గల యీ భాణము కాశియందలి శంకరుని చైత్రోత్సవ సందర్భమున ప్రదర్శించుటకు వ్రాయబడినది.

ఇది తాళపత్రములలో అసమగ్రముగా కన్పట్టుచున్నది.

ఈ కవిరచనలో శ్లోకముల సంఖ్య ఎక్కువ. తక్కువగానున్న గద్యభాగములు కూడ అతిదీర్ఘములు. ఏమైనను, గద్యమైన, పద్యమైన గాని ఈతని వర్ణనములు సుదీర్ఘములు. ఇక శైలి అర్థములకన్న శబ్దముల కెక్కువ ప్రాధాన్యము నిచ్చినది. మారుతవర్ణనము చేయుచు ఈ కవి పదములను దూదిపింజలవలె నెగురకొట్టిన ఈ శోకమును చూడుడు.

ప్రఫుల్ల హల్లకావళీ సముల్లస న్మహోత్పల
ప్రభాత ధూళి పాలికా ప్రకప్త భిన్నరూపకః।

పటీర భూమిభృత్తటే కుటీరత స్స్మర న్మరుత్
ఝురీహరీతి చోరవ న్మనో మనోభవాజ్ఞయా॥

"కామి గామి మోక్షగామి కాదు" అని పెద్దలమాట కాగా, "కామి కూడ మోక్ష కామి కాదె ?" అన్న భావనతో కాబోలు ఈతడు లీలాదర్పణములో దేవ ప్రార్థనకు కూడ చోటిచ్చినాడు.

పద్మసౌధములో నిద్రించెడి భద్రదేవిని మేల్కొలుపుటకు సూర్యుడు బయలు-దేరగనే మధుకరములు తానమును, కోకిలలు గానమును ఒనరించినవట. ప్రభాతవర్ణన చేయుచు, ఆ భావన నెట్లు బంధించెనో చూడుడు

పాథోజసౌధతలనిద్రితభద్రదేవ్యా
బోధోదయాయ హి హరా వుదయం ప్రయాతే।
తానాయితం మధుకరాయతకూజితేన
గానాయితం చ కలకోకిలకూజితేన॥

ఇది తీసివేయదగ్గ భాణము కాదు గాని శబ్దాడంబరములో అర్థ గాంభీర్యము అంతర్లీనమైన భాణములలో ఒకటి.

శృంగారరస భృంగారము – ఇంద్రగంటి కొండయ :

లింగాహ్వయుని పౌత్రుడును, నారాయణుని పుత్రుడు నగు కొండయ రసజృంభణముగ, రసిక మోహనముగ రచించిన భాణ మిది. ఇది ప్రప్రథముగ శ్రీశైలమున మల్లికార్జునస్వామి యుత్సవములో ప్రయోగింపబడినది. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున R 2309 సంఖ్యగల ప్రతిలో కొంత గ్రంథపాతము కలదు. ఈకవి కవితాధోరణికై ఒక్క శ్లోకము -

కైలాసం పరిహృత్య శైలసుతయా సాకం గణైశ్చ స్వయం
శ్రీశైలేఽత్ర హి మల్లికార్జున ఇతి ఖ్యాతో స్తి సర్వేశ్వరః।
తత్రైవార్థ (త్సేవార్థ) మిహాసతే చ విబుధా వృక్షాశ్చ వల్ల్యాత్మనా
భూపాలా స్సకలా ద్విజాశ్చ సకలా విద్వజ్జనా శ్చాపి తే॥

శారదాతిలక భాణము – శేషగిరికవి :

18 వశతాబ్దమునకు చెందినవా డీకవి. భాగీరథీ శేషగిరీంద్రుల కుమారుడితడు. ఆంధ్రప్రదేశము నందలి రాళ్ళపల్లి ఈతని నివాసస్థలము. ఈ కవి పై భాణమునే గాక కల్పనాకల్పకమను మరియొక రూపకమును సైతము సంతరించెను. ఈ రెండు

రూపకములును శ్రీరంగపట్టణమున ప్రదర్శింపబడినవి. ఈతడు 18 వ శతాబ్దమున మైసూరుప్రభువుల ఆస్థానముననుండి 2వ కృష్ణరాయల గురుస్థానము కూడ స్వీకరించెను.

చాతురీ చంద్రిక – వేంకటార్యులు :

తెలుఁగుదేశము నందలి కవులు తమ సంస్కృతాభిమానమును బ్రకటించు కొనుటకై తమ నామమును, గృహనామమును సంస్కృతసంధితో కలిపి ప్రకటించు కొనిరి. కాకునూర్యప్పకవి పేరిట్టిదే. మరికొందరు మరొక మెట్టు పైకి పోయి, తెలుఁగు లోని తమ గృహనామములను సైతము సంస్కృతీకరించుకొనిరి. అట్టివారిలో ఈ భాణ రచయిత చిలకమర్తి వేంకటార్యు లొకరు. ఈతడు తన యింటిపేరును "శుకబహు పాద"గా సంస్కృతీకరించెను. ఇతడు సరస్వతీశరణ్యపాదుల కుమారుడు. కందాళ రంగవర్యుని శిష్యుడు. ఈ భాణము మొట్టమొదట తిరుపతి వేంకటాద్రినాయకుని చైత్రోత్సవసమయమున నభినయింపబడినది. చతురశేఖరునికి, చమత్కారమంజరికి గల ప్రణయ మిందలి యితివృత్తము. ఇతివృత్తములో విశేషము లేకపోయినను శైలీ విన్యాసములో సుభగత్వము కాన్పించును. భాణములలో నుండవలసిన కుక్కుట యుద్ధము, వృషభ క్రీడ, ఆహితుండికుని వర్ణనము, కళత్రపత్రము మున్నగు సంప్రదాయము లితరభాణములలో వలెనే యున్నను సమయానుకూలముగా నీతడు తన భక్తి భావము ప్రవచించిన స్థలము కూడ లేకపోలేదు. ఇతరభాణములలో లేని దండకరచనమును ఈత డొనర్చినాడు. తిరుపతి వేంకటేశ్వరునిపై దండకమును రచించి తన భాణమునకు నవీనత్వమును, తన భావమునకు ప్రస్ఫుటత్వమును సంతరించుకొనినాడు. విప్రవినోదులను వర్ణించి పాఠకులను వినోదభరితుల జేసినాడు.

> మేరూకరోతి తృణమేవ కరే గృహీత్వా
> సంగృహ్యా మేరుగిరి మేవ తృణీకరోతి ।
> నిష్కీకరోతి నవతాళసువర్ణ ఖండం
> లోకే నిమేష మపి పశ్యతి విప్రనన్దీ ॥

ఈతని రచనలు చాలవర కలంకారసహితములై కన్పట్టును. నటికి కవిత్వమునకు నభేదము చెప్పుచు –

> సువర్ణాలంకారా సుభగపదవిన్యాసచతురా
> మహారాగోన్మేషా మహితరససౌకర్యరుచిరా ।

లసద్వృత్తాయత్తా లలితగుణరీతిప్రకటితా
కవే శ్చేయం సూక్తిః కలయతి యథా సంప్రతి నటే॥

అను శ్లోకముతో తన కవితాప్రాగల్భ్యమును వ్యంగ్యరీతిలో చెప్పుకొనినాడు. ఈ భాణప్రయోగముచే ప్రేక్షకు లందరుసు, అమందానందహృదయులై వెడలిరని అంతమున చెప్పికొనుట నూతనమై కన్పట్టుచున్నది.*

శృంగారమంజరి – విశ్వనాథుడు :

"అందరికీ శకునం చెప్పే బల్లి కుడితి తొట్లో పడింద"ని చక్కని తెలుగు సామెత కలదు. అందరి భవిష్యత్తును పూసగ్రుచ్చినట్లు చెప్పగల జ్యోతిష్కులు తమ గురించి ఆలోచించలేరు. "ఆకాశములో తార చంద్రునితో కలసినదా? లేదా? అని గుణించెడి సిద్ధాంతి పాపము తన ధర్మపత్ని ఎవనితోనో లేచిపోవుట గుర్తించలేదట." ఈ సత్యమును మనకు శృంగారమంజరిలో విశ్వనాథుడు ఒక చక్కని శ్లోకములో వివరించినాడు -

ఆకాశసీమ్ని చరతాం గ్రహతారకాణాం
మూఢాః కథం ను కథయంతి శుభాశుభాని।
క్షోణీతలే నిజగృహే నిజధర్మపత్నీ
మన్యాభిసారణరతాం న విజానతే యే॥

వల్లభరాయుని చైత్రోత్సవసమయమున శ్రీకాకుళమున ప్రదర్శింపబడిన ఈ భాణరచయిత దువ్వూరివంశమునకు చెందినవాడని, రామచంద్రరాజకుమారుడైన వేమయమంత్రి ఆస్థానకవి యని తెలియుచున్నది. [1]

తాళపత్రములలో నింకను తలదాచుకొనియున్న ఈ భాణము చక్కని కవిత్వ మునకు వసతి. భావన – భాష - శైలి ముప్పిరిగొని ఆనందతంతువును అలరించగల సొంపు ఈతని కవిత్వములో గన్పించును. సంపూర్ణముగా లభించెడి యీ గ్రంథ మక్కడక్కడ కీటకదష్టమైనది. మిత్రకార్యమును సాధించుటకు కలకంఠుడు బయలుదేరి దానిని పూర్తిచేయుట ఇందలి యితివృత్తము. కందుక క్రీడ - బొమ్మలపెండ్లిండ్లు చండికాయతనవర్ణన - భైరవవర్ణన - దేవాలయద్వారవర్ణన - ఆపణవర్ణన మొదలగు

* ఇతి యథాయథం సర్వేపి యయు రమందానందహృదయానందాః ||

1. శృంగారమంజరీ-ప్రస్తావన

వానితోబాటు పాచకవర్ణన ఈతని ప్రత్యేకత. చంద్రుడు కాంచనాద్రికటకముల యందు సంచరించుటకు గల కారణము నీకవి యెట్లుత్ప్రేక్షించునో చూడుడు

కాంచనాద్రికట కేషు చంద్రమాః
సంచర త్యనుదినం ససంభ్రమమ్ ।
కామినీవదనసామ్యకారకం
కంచి దౌషధవిశేష మీక్షితుమ్ ॥

శశాంకుడు నెరజాణల నెమ్మోములతో పోలికను కల్గించెడి ఏ మందునో వెదకుకొనుటకై బంగారుకొండపై తిరుగుచున్నాడట.

చంద్రునికి, కమలమునకు బద్ధవైర మని విదితమే. కాని యీ కవి చంద్ర మండలమునకు, పద్మమునకు పోలికను చెప్పెను.

దీర్ఘ కేవ గగనం విభావ్యతే
ఫేనరాశి రివ తారకావళిః ।
పుండరీక మివ చంద్రమండలం
మత్తభృంగ ఇవ తత్ర లాంఛనః ॥

ఆకాశము దిగుడుబావి వలెను, తారకలు నురగల పోగుల వలెను, చంద్ర మండలము పద్మమువలెను, చంద్రునిలోని మచ్చ పోతుతుమ్మెదవలె నున్నదట.

ఇట్లీకవి కవిత సహృదయహృదయరంజకమై ఆలోచనామృతమగుటయే కాక ఆపాతమధురముగ కూడ నుండును. కాంతల సౌందర్యమును వర్ణించుటలో కవుల పోకడ లనేకములు. ఆ కాంతావర్ణనతో ఈ కవి కవితాకాంతలోని కాంతత నాస్వాదించుచు శృంగారమంజరిని బంగారు తొడుగుతో కప్పెదము.

చరణకమలకాంత్యా దేహళీమర్చయన్తీ
కనకమయకవాటం పాణినా కంపయన్తీ ।
కువలయమయమక్ష్ణా తోరణం పూరయన్తీ
వరతనురియ మాస్తే మన్దిర స్యేవ లక్ష్మీః ॥

శృంగార సుధార్ణవభాణము – కోరాడ రామచంద్రశాస్త్రి :

కోరాడ రామచంద్రశాస్త్రి ఈ భాణరచయిత. వీ రాంధ్రదేశమున ప్రసిద్ధులైన పండితులు. లక్ష్మణశాస్త్రి, సుబ్బమ్మల కుమారులు. క్రీ.శ.1816 లో జన్మించి ఆ

శతాబ్దము తుదివరకు నివసించిన పండిత ప్రకాండులు. మచిలీపట్టణము నందలి 'నోబుల్ కళాశాల'లో వీరు పండితపదవి నలంకరించి యుండిరి. ఈ భాణము కాక కమలానంద భాణము కూడ ఏతదుపజ్ఞాకల్పితమే.

శృంగారసుధార్ణవభాణమున భుజంగశేఖరుడు నాయకుడు. భద్రాచలము నందలి శ్రీరామవసంతోత్సవసందర్భముగ నిది ప్రదర్శింపబడినది. వేశ్యావృత్తాంతముల నీ కవి కళ్ళకు కట్టినట్లు వర్ణించెను.

ఈ భాణములనే కాక కుమారోదయచంపువు, దేవీవిజయచంపువు, శృంగార మంజరి, మంజరీసౌరభము, మృత్యుంజయకావ్యము మొదలుగా గల అనేక సంస్కృత కృతుల రచించి సాహితీసమర్చనము గావించినా డీకవి.

మదనాభ్యుదయభాణము – శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి :

సంగీతసాహిత్యముల రెంటను అసమానప్రతిభతో, అశేష శేముషీ విలసనముతో ప్రవర్తిల్లినవాడు శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి. తెలుఁగువారికి సుపరిచితుడే. ఈ భాణము కూర్మపుర మందలి కూర్మనాయకుని చైత్రయాత్రారంభమున తొలిగా ప్రదర్శింపబడినది. ఇందు మదన శేఖరుడు విటుడు. తన అభిరుచులకు అనుగుణముగా ప్రస్తావనలో సభను వర్ణించుచు శబ్దాలంకారప్రీతిని ప్రకటించినాడు.

సాహిత్యసాహిత్యమనోజ్ఞ లీలా
సంగీత సంగీతకలాకలాపా।
సారస్యసారస్యనిధాన మేషా
సారజ్ఞసారజ్ఞ సభా విభాతి॥

అన్ని భాణములకు వలెనే ఇందలి కథ సూర్యోదయముతోనే ప్రారంభ మగును. కాని ఇతర భాణములు వేశ్యాసంగమమున కెక్కువ ప్రాధాన్య మీయగా నిందది పరస్త్రీ సంగమమున కబ్బినది. పరస్త్రీని వశపరచుకొనుటలో మాయోపాయములు, ధూర్త చేష్టలు వర్ణింపబడినవి. మధ్యాహ్నసూచకముగ సామాన్యముగ ఘంటారావము వినబడును. కాని ఇందు మధ్యాహ్న శంఖధ్వని విన్పట్టును.

ఆంధ్రప్రదేశమునకు, ఘూర్జర దేశీయులు వచ్చి వాణిజ్యాదికములు కావించు కొనుచు జీవనము సాగించుచుందురు. ఘూర్జరయువతులు సౌందర్యవతులు. వారు కామపురుషార్థవిషయమున అసంతృప్త లనియు, మదనార్త లనియు ఆంధ్రదేశమున

కొన్ని పుక్కిటి గాథలు వినిపించును. దీనినే స్ఫురింపజేయు ఒక సన్నివేశమునిం దీతడు వర్ణించినాడు. ఇట్టి సన్నివేశములు కేవలము వ్యభిచార పోషకములుగా నుండుట శోచనీయము. దోషాచరణమునకు కవులు దోహద మగుట సమంజసము కాదు కదా! ఈతడు కవితాపాటవమునే కాక, శాస్త్ర పాండిత్యమును కూడ జోడించి రచించినాడు. కామశాస్త్రవిశేషములను చెప్పి, యందు బాహ్యాభ్యంతరసురతములను వర్ణించినాడు.

R 2114 సంఖ్య గల, మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమున గల ఈ ప్రతిలో భరత వాక్యము కొఱవడినది. చివరి యాకులు ఖాళీగా నున్నవి.

"సంతోషతరంగితం మదంతరంగం" అని చివరివాక్యము కన్పట్టుచున్నది.

మదనమంజరీ భాణము – వేంకటేశకవి :

పట్టన వంశస్థుడును, లక్ష్మణాచార్యుని తనూజుడునైన శ్రీవేంకటేశకవిచే రచింపబడిన మదనమంజరీభాణము ప్రపథమముగా శ్రీకూర్మనగరమున శ్రీకూర్మ నాయకుని బాలభోగసమయమున ప్రయోగింపబడినది. ఈతడు తన భాణము 'సరసులచే అభినందనీయ' మయిన దని పేర్కొనినాడు. ఈ వాక్యమును సార్థక పరచునట్లున్న దీతని కవిత్వము. భరతవాక్యమును పరికించుడు -

> శ్రీకూర్మనాథపుర వీథి విహారశాలి
> లీలావతారనిపుణో భగవాన్ ముకున్దః।
> జీయా ద్రమాధరసుధారసలాలసోఽసౌ
> నిత్యాదృతః కుశలకర్మణి సజ్జనానామ్॥

మదనవిజయము – విక్కిరాల శేషాచార్యులు:

ఆమనిలో చివురు తొడిగిన గున్నమావిని చూచి ఒంటె మూతిముడుచుకొని పోవును. కాని కోయిల దాని అందమును గుర్తించి ఆస్వాదించి పరవశించి పోవును. ఆ పోలికతో కురుకాపురీ వరదాచార్యులు ఒక భాణమును ఈ క్రింది విధముగా ప్రశంసించిరి.

> ఉదాస్యతాం నామ రసా నభిజ్ఞై రయుం తు భాణ స్సరసైః ప్రశస్యః।
> క్రమేళకైః పల్లవితో రసాల స్త్యక్తః పికానాం న ముదే ధరిత్ర్యామ్ ?॥

ఈ ప్రశంసకు నోచుకొన్నది మదనవిజయభాణము. కర్త ఎక్కిరాల శేషా చార్యులు. వీరు కవికంఠీరవులు. శ్రీనగరసంస్థానాధీశులైన శ్రీరాజా బహదర్

చెలికాని వేంకటగోపాలభూపాలుర ప్రోత్సాహముచే నిది 1894లో ముద్రితమై ప్రకటింపబడినది.

మదనమంజరి ప్రథమరంగాధిరోహణదర్శనమునకై పల్లవ శేఖరుని ప్రయాణము - ఆతడు గమ్యము చేరుట - మార్గమధ్యము నందలి విషయములు - ఇందలి యితివృత్తము. కవులు ప్రాయికముగ భాణముల నెన్నుకొనుటలోని యాంతర్యము ఈ భాణములో స్పష్టపడును. ఇది రూపకమే కాని - భాణమే యథార్థమునకు సమగ్ర రూపకమని అనిపించుకొనదుగదా - లక్షణములలో మరీ ఎక్కువగా శ్రవ్యత కని పించును. పద్యరచన సాగించినను - గద్యరచన సాగించినను సుదీర్ఘత ప్రథమ స్థానము నాక్రమించును. ప్రారంభమున రాజుగారి వర్ణనమును దీర్ఘ గద్యలో చేయుట, వెంటనే ప్రస్తావనయందే వసంతమును దాదాపు మూడుపదుల శ్లోకములతో వర్ణించుట యిందులకు నిదర్శనము. ఇట్టివి మరెన్నో కలవు.

సామాన్యముగనే - పళత్రపత్రములు - కుక్కుట, మేషస్పర్ధలు - మల్లయుద్ధ, సర్పఖేలన, కందుకక్రీడలు - వాని కోలాహలములతోఁ బాటు కవి ఆధునికతను సూచించును. – కోతిని, ఎలుగుబంటి క్రీడను సైతము వర్ణించినాడు.

నస్యోతాన్ దృఢలోహశృంఖలగణై ర్బద్ధా న్నిసీలచ్ఛవీన్
భల్లూకాన్ భయదాస్యఘుర్ఘరరవై రాపూరితాశాంతరాన్।
మ్లేచ్ఛా వారవధూ రివాద్య జనతా మోదాయ నానర్తయం
త్యేతే తాళనతిం చ లోహవలయైః కుర్వం త్యదూరస్థితాః॥ (93)

వారవధువువలె జనతామోదము కొఱకు ఎలుగుబంటిని మ్లేచ్ఛు లాడించు-చున్నారట.

కవుల భావములకు పుట్టినిల్లు ఉత్ప్రేక్ష, ఇందు కవులు చూపని చమత్కార ములు - వారి కందని ఆలోచనలు కానరావు. ఒకసారి రోమరాజిని కవి ఎట్లుత్ప్రేక్షించెనో చూడుడు—

వక్షోజకుంభభాస్వరతారుణ్యగజాధిరాజస్య।
నాభిహ్రదే ప్రవిష్టః కర ఇవ రోమావళి స్తవాభాతి॥ (124)

వక్షోజములు అను కుంభస్థలముతో ప్రకాశించెడి యౌవము అను ఏనుగట. అది నాభి అను మడుగులోనికి తన తొండమును చాచినదట. అదే నవరోమరాజి యట.

ఈ కవిరచనలో ఎక్కువ భాగము ఆలోచనామృతము, ఉత్ప్రేక్షాప్రధానమైన రామరాజభూషణుని భావధోరణి సంస్కృతాంధ్రములలో పండితులైన ఈ కవిరచనపై చాల కనిపించును. వచనరచనలోను, అక్కడక్కడ శైలినిన్యాసములోను భట్టబాణుని కాదంబరీ ప్రభావము కూడ ఎక్కువగానే ప్రత్యక్షము. రామరాజభూషణుని ప్రభావ మెంత ఎక్కువగా నున్నదనగా అతని పదబంధములు కొన్ని, పద్యములు కొన్ని యథాతథముగా ఈ భాణములో సంస్కృతభాషలో చోటు చేసికొనినవి.

"వలమానమీనమిథునోసమే" క్షణా - (మదన విజయభాణము)

ఓ "వలమానమీనమథునోపమ"లోలవిలోచనాంతకాంతా (వసుచరిత్ర)

ఇటువంటివి ఉన్నంత మాత్రాన అనుసరణ మనలేము. కాని క్రింది పద్యములో యథాతథముగా అనువాదమును చూడుడు.

ప్రాతఃకాలకృషీవలేన గగన క్షేత్రోడుసస్యావళేః
పక్వాయా నితరాం చ కాంతికణిశే చ్ఛిన్నే చ పూతీకృతే।
తత్పూతచ్ఛవివద్విభాతి సుషమా ప్రాచ్యాం రవే స్సారథేః
దూరే తిష్ఠతి తత్పలాలనికరాకారః ప్రతీచ్యాం శశీ॥ (49)

యాంత్రీం పద్మగృహం క్రియాం ద్విజరవైః పుణ్యాహ మాతన్వతి
ప్రాంచత్పల్లవహస్తనిస్రుతహిమోద్రైః కుర్వతి ప్రోక్షణమ్।
వానస్పత్యగురౌ స్వయం ద్విజతయా తత్కాలసందర్శనం
నైకస్యార్హ మితీవ మంజులరవం కోకద్వయం దృశ్యతే॥ (48)

తారాసస్యము పండినన్ గగన కేదారంబునం జద్రికా
నీరంబారగ గోసి తద్రుచిఫలానీకంబు ప్రాతర్మహా
సీరగ్రామణి తూరుపెత్తె ననఁ దోచెం దూర్పునం దెల్పు త
ద్దూరన్యస్తపలాలరాశిక్రియ నిందుం డేగె నిస్సారుడై.

సిరి నెత్తామరయింటికిన్ ముగుడిరాఁ జెంతన్ ద్విజారావమా
ధురిఁ బుణ్యాహముఁ దెల్పుచున్ గురుతరుల్తోడ్తో నటత్పల్లవా
ధరనీహారజలంబు చిల్కగ నయుక్తం బొంటిమై నుండ నం
చు రథాంగంబు ద్విజాతిగానఁ గవయై చూపట్టె నప్పట్టునన్॥

(వసుచరిత్ర 4-ఆ-130-31)

ఈ రెండు పద్యములే గాదు, పల్లవ శేఖరుడు ప్రవేశించిన వెంటనే చేసిన ప్రాతఃకాల వర్ణనమంతయు కొంచె మించుమించు (10 శ్లో॥) వసుచరిత్రము నందలి చతుర్థాశ్వాసమునందలి ప్రాంతఃకాల వర్ణనమున కనువాదమే. అతని ప్రభావము గాఢముగా నుండి స్వయముగా రచించిన శ్లోకమును చూడుడు -

నాళీకాస్యా శఫరనయనా చక్రవాక స్తనీయం
కంబుగ్రీవా పులినజఘనా చారుశైవాలకేశా।
భాస్వద్వేణీ కమఠచరణా మిత్రనంది న్యగాథా
నూనం తన్వీ జగతి యమునానామధేయం బిభర్తి॥ (132)

ఇది స్త్రీకి నదితో కల్పింపబడిన సామ్యము. వసుచరిత్రలో బాలభాగము ఆ వర్ణనలతో సాగిపోయినదే కదా ! ఇంత మాటాడిన పిదప నీతనికి స్వతంత్రకల్పనా శక్తి లేదందురేమో! అటు శంకింపఁ బనిలేదు. తన సహజధోరణిలో చక్కని శ్లోకరచన చేయగలరని తెలియుట కీ క్రింది శ్లోకమును చూడుడు.

తరుణీపదపల్లవప్రహార స్తరుణానందకరః కథంను న స్యాత్ ।
యదశోకతరుః పదాహతోఽపి స్మిత మావిష్కురుతే సుమచ్ఛలేన॥ (139)

ఏది ఎట్లున్నను వరదాచార్యులు గారన్నట్లు ఇదంతయు ననువాదమేకదా! అని ఎవరైనను వైరస్యము పొందిన వారు క్రమేళకములనుట అన్యాయము. కాని ఇతర ప్రభావము, స్వతంత్రకల్పన - రెండు కలపోతగా గల చక్కని భాణ మిది యనుట యుక్తము.

విలాసభూషణభాణము – వేంకటకృష్ణుడు :

భారద్వాజసగోత్రుడైన వేంకటకృష్ణుడు శ్రీరామసంసేవనముచే పూర్ణ కాము డయినాడు. ఈతని భాణము గోదావరీతీరమందలి భద్రాచలములో రామచంద్రుని పరిణయ మహోత్సవమునందు మొదటగా ప్రయోగింపబడినది. ఇందు వసంతశేఖర, వసంత కలికల ప్రణయము ప్రధానేతివృత్తము. ప్రస్తావనమునందు శ్రీహర్షుని తలపించుచు తన వినయమును, దైవభక్తిని ప్రకటించుకొనినాడు.

రఘూద్వహో రాజకులాగ్రగణ్యః
శ్రోతా చ నేతాఽసురవీరజేతా।
సమాజ మేత త్సరసాశ్రయం తత్
సమంజసం దైవవశా త్సమస్తమ్॥

ఈతడు కథావశమున సీతారాముల వర్ణనము, మంటప - ఉత్సవముల వర్ణనము కావించుటే కాక ఆ తిరునాళ్ళకు వచ్చిన ఆంధ్ర, పాండ్య, కర్ణాట, నేపాల వనితలను మనోజ్ఞముగ పరిచయ మొనర్చినాడు. తిరునాళ్ళలో సంచరించు రక్షకభటుల వర్ణనము ఇందు నవీనతాపాదకముగా నున్నది.

పటీరపంకరూషిత ప్రకోష్ఠబద్ధకంకణం
కచోల్లసద్వలక్షవస్త్రఖండలంబితాంచలమ్ ।
చలత్కృపాణపాణికం ప్రబద్ధమధ్యబంధనం
భటాగ్రగణ్యబృంద మత్ర భాతి దృశ్యతా మితః ॥

శృంగార సంజీవని - శరజిత్కవి :

వేంకటపండితుని పుత్రుడును, వీరరాఘవుని పౌత్రుడు నగు శరజిత్కవి భారద్వాజ గోత్రోద్భవుడు. వీరు పూర్వము కాంచీపురనివాసులు. ఇతని తండ్రి పశ్చిమ గోదావరి జిల్లాలోని గూటాల వచ్చి స్థిరపడెను. ఈ భాణము ఏలూరులోని సంతాన గోపాల స్వామివారి చైత్రమహోత్సవమున నభినయింపబడినది. ఈ భాణమును పింగళనామ సంవత్సరమున రచించినట్లు కని పలికినాడు. R 2229 సంఖ్యతో (ప్రా. లి. పు. భా- మద్రాసు) దీని ప్రతి కలదు. భరతవాక్య మిట్లున్నది.

శ్రీమా నేలాపురీశో విజయతు భువి సంతానగోపాలదేవః
తద్భక్తాః సర్వవర్ణాః స్థిరతరవిభవా దీర్ఘమాయు ర్భజంతు ।
సంత శ్చైతే నరేంద్రాః కవి రయమపి సంతూర్జితా ఏష వాణీ
జీయా దాచంద్రతారం వయమపి రసికాహ్లాదిన స్తేన సాకమ్ ॥

పల్లవీపల్లవోల్లాసము - మంజులాచార్యులు :

R 2115 సంఖ్యతో మద్రాసు ప్రాచ్యలిఖిత - పుస్తకభాండాగారమున గల ఈ పల్లవీపల్లవోల్లాసము ఆద్యంతములు లేక శిథిలమై యున్నది. కవిని గూర్చి కూడ అంతగా తెలియదు. దీని చివర

ఉదగ్రజనతాదృతే ....
....
అహో ! బత ! తతస్తతో ఝుటితి సన్నిషణ్ణా అపి

అను శ్లోక మున్నది,

శృంగారదీపకభాణము – వింజమూరి రాఘవాచార్యులు :

19వ శతాబ్ది చివరి భాగమున నున్న శ్రీ వింజమూరి రాఘవాచార్యులు ఈ భాణమును రచించెను. ఇతడు విజయవాడ ఉన్నతపాఠశాలలో పని చేసినాడు. ఇతని యితరరచనలు రామానుజశ్లోకత్రయి, నరసింహస్తోత్రము, మానవసందేశము మున్నగునవి.

ఇందు రసిక శేఖరునకు శృంగారచంద్రికకు గల ప్రణయము, సమాగమము వర్ణితములు. విటుని పేరు అనంగశేఖరుడు. శ్రీరంగము, కంజీవరము మున్నగు వాని వర్ణన మిందు కలదు. కాంచీపుర మందలి వరదరాజస్వామివారి చైత్రోత్సవమున ఇది మొట్టమొదటగా ప్రదర్శింపబడినది.

పెద్ద విశేషము లేవియు లేని యీ భాణము వేంకటాధ్వరి భాణమున కనుసరణ-ముగా కన్పట్టును. కవితాధార సరసము ధారాళమునై యున్నది. చూడుడు -

సోయం చారుసుధారసప్రతిమవాగాసారపూర్ణః కవిః
భాణః సద్గుణలాలనీయలలితః శృంగారసంపూరితః।
సేఽయం సారవిదాం వ్రజేన మహతా మధ్యాసితా రంగభూః
సర్వం నః సదనుగ్రహేన మహతా సంజాత మద్యాన్వితమ్॥

కామినీకాముకోల్లాసభాణము – విశ్వనాథుడు:

ఆత్రేయగోత్రుడై దువ్వూరి వంశమునకు చెందిన విశ్వనాథుని రచనముగా కామినీకాముకోల్లాస మను మఱియొక భాణము లభించుచున్నది. ఈ రచయిత సూర్య ప్రభువు అస్థానములో నుండెనట. ఈ భాణము అసంపూర్ణముగా అస్తవ్యస్తముగా నున్నది. ప్రారంభభాగము మాత్రము R 1876 సంఖ్యతో ప్రాచ్యలిఖిత పుస్తకభాండా-గారమున (మద్రాసు) కలదు.

ఇందు నాంది రెండుమార్లు కనిపించుచున్నది. రెండుమార్లును మొదటిశ్లోక మొకటే ఆ తర్వాత భిన్న భిన్న శ్లోకములు కన్పించుచున్నవి. వైష్ణవవర్ణనాత్మక మయిన ఒక శ్లోకము. మరికొంత మాత్రము లభించుచున్నది.

మనోజకదనోద్భ్యక్తజనసంతోషదాయకః।
అభాణి భాణి స్తేనాయం శృంగారరసజృంభితః॥

అని కవి మదనకదనోద్యుక్తులయిన వారికి ఆనందమును కల్గించుటకే తన భాణమని ఉటంకించినాడు. ఈ రచయిత రచనా శైలి ధారాసారసమాన మైనది. ఒక ఉదాహరణను చూడుడు -

శ్రేయో మే విదధాతు సుందర దర గ్రీవాభిరామోజ్జ్వల
స్ఫారా మోదవిరాజమానసుమనోదామాభిరామాకృతిః।
నీహారద్యుతిహార నిర్ఝర సరిన్నీహారధారామరా
హారాసారపటీరహారసురరాణ్మాతంగరుక్ శారదా ॥

సంపూర్ణముగా ప్రతి లభించినప్పుడు కాని ఈ భాణముయొక్క బాగోగులను చర్చించి నిర్ణయించలేము.

కన్దర్పదర్పవిలాసభాణము – బెల్లంకొండ రామారావు :

రసికహృదయరంజనను గోరి కొందరు కవిత్వమును వ్రాయగా స్వపాండితీ ప్రాకటప్రకటమునకై మఱికొందరు వ్రాయుదురు. కావ్యమునుబట్టి రచయితను "కవి పండితుడా ?" "పండితకవియా?" అని నిర్ణయించు పద్ధతి నేర్పరచినచో కన్దర్పదర్ప విలాసధాణకర్త పండితకవి యని చెప్పవలసివచ్చును. కవితలో కవితకన్న పాండితి మిన్నగా నుండుటయే దీనికి కారణము.

బెల్లంకొండ రామారావు ఆధునిక సంస్కృతకవులలో, పండితులలో నగ్రగణ్యులలో నొకడు. ఆంధ్రదేశమున జన్మించి అఖండఖ్యాతి నార్జించిన మనీషి. తండ్రి మోహ నారాయణుడు, తల్లి హనుమాయమ్మ. 1875లో జన్మించి 1914లో దివంగతుడైనాడు. భారద్వాజ గోత్రజుడు. గుంటూరు జిల్లాయందలి పమిడిపాడు ఇతని జన్మస్థలము.

సంస్కృతవాణిలో 143 కృతులను రచించిన ఘనత ఆధునికులలో వీరికే దక్కినది. ఆ రచనలు ఒక శాఖకే పరిమితములు కాక అనంతముఖప్రసారితము లగుట వీరి నికషోపలపాండిత్యమునకు గుర్తు. కవిగా రచన చేయుటే కాక వ్యాఖ్యాతగా వ్యాఖ్యానములనుగూడ వెలయించిన ఘనత వీరిది.

వీరి కన్దర్పదర్పవిలాసము ప్రౌఢ మయినది. "అవధరిత బాణాది విద్వత్కవి సూక్తిజాలై స్సూక్తిజాలై ర్గ్రథితః కన్దర్పదర్పవిలాస ఇతి సభాజనరసభాజనభూతః కశ్చిన భాణప్రబంధః" - అని ప్రస్తావనలో తనను గూర్చి చెప్పుకొనిన వాక్యము సర్వాత్మనా సత్యము.

బాణ కాళిదాసాది కవివరుల సూక్తిబిందువులు ఈతని భాణములో ముక్తా ఫలములైన వనిపించును. ప్రత్యేకించి ఇతని రచనలో బాణుని పోకడ అచ్చుగ్రుద్ది నట్లు కన్పించును. ప్రస్తావనయందే ఆ శైలిని రుచిచూపించిన విధానమును పరికించుడు-

సపక్షమైనాక క్షితిధరపతి ప్రతిపక్షలక్షణీయ వక్షస్థలసముత్క్షిప్యమాణ కనక కమలహారలక్ష్మీవిలాస లక్ష్మీవిలాసానుమితపారదైవత్వస్య, ద్వాదశ చిత్రభానుచి భాను కదంబకరమ్బిత కనకకూటానుమీయమానసుమేరు ధీరత్వస్య, ... కుమార జనక స్యాపి అవిరూపాక్షస్య; ససర్వమంగళస్యాపి అనుగ్రస్య; విధో రపి చక్రప్రియస్య.. సరస ఇన హంసపరివేష్ఠితస్య; కుబేరనిధే రివ ముకున్దనామధేయస్య ... వాయో రివ సదాగతేః ....

ఈ భాణమునందలి ఇతివృత్తము సైతము కథాప్రధానము కాదు - రతిసన్తానస్య సముపక్రాంతో దర్పవిలాసోత్సవః తదహ మప్యద్య తద్దర్శన సఫలితనయన యుగళో భవామి - ఈ సూత్రధారుని వచనమును బట్టి దర్పవిలాసోత్సవమే భాణేతివృత్తము. ప్రస్తావనమిందు ఏకహార్యమే.

సామాన్యభాణముల వలెనే ఇందును కందుకక్రీడ - స్త్రీవర్ణన - డోలావర్ణన మొదలగున వన్నియు కన్పట్టుచుండును. సరససుందరనారీవర్ణన మీ కవి చేయ విధానము చూడుడు —

> కర్ణి కారకృతకర్ణికా బ్రుడధమర్ణికా విజితకర్ణికా
> చూర్ణికాతిపరమర్ణికా హసితవర్ణికా కలితకర్ణికా।
> స్వర్ణికాయ్యతనువర్ణికా మదనపూర్ణికాశముఖజర్ణికా
> జూర్ణి కాలలదపర్ణికా భువికపూర్ణికా కుచగపర్ణికా॥

ఇందు శృంగారాననుగుణమైన రేఫమూర్ధన్య (ణకార) సంయోగము దప్ప ఝుడితి స్ఫురించున దేదియు లేదు.

డోలావర్ణనమునను -

> అలికా మరాలికా కరాలికాధుతాలికా
> పాలికా మధూలికా కణాలికా దమాలికా।
> కాలికా సుశైలికా రమాలికా మరాళికా
> కాలికాభచూలికా విధాలికా కునీలకా॥

శబ్దవిన్యాసవైచిత్రి డోలావర్ణన కనుగుణముగా డోలాయమాన మైనను - భావముకూడ డోలాయమాన మగునట్లు రచించుట ఔచితీసంపాదనార్థమేమో !

ఇందు పండితమ్మన్యాధిక్షేపణులును కన్పట్టును. భాషావిషయమునకు వ్యాకరణ పాండిత్యప్రదర్శమునకు ప్రభాతకాలశ్లోకమును గనునించుడు -

చరీకరోతు శంహవి ద్దరీకరోతు కంజనః।
బరీబరీ త్వముం హరి ర్వరీవరీతు భాణకః॥

ఇట్లు కమనీయవర్ణ నాకలితత్వమే కాక స్వాదుసూక్తిమరందుతుందిలత్వము సైతము ఈ భాణమున కన్పట్టును. క్రింది సూక్తిని పరికించుడు.

గుణౌ బుద్ధి స్సతాం నైవ బాన్ధవే న చ గౌరవే।
పశ్య హాలాహలం హిత్వా చన్ద్రం గృహ్ణాతి సాగరః॥

ఇతని రచనలో శ్లోకములు సంభాషణాత్మకముగా సైత ముండును. పాద పాదమునకు వక్త మారుట కాని పాదార్ధముననే వక్త మారుట కాని కనిపించును. ఒక ఉదాహరణ -

కుతో ను చలి తేంబుజే తవ సమీక్ష్య కుంభౌ భియా
కుత శ్చలతి పల్లవః నను సమీక్ష్య కృష్ణం భియా।
కుత శ్చలతి లోచనం తవ సమీక్ష్య మధ్యం భియా
కుతస్త్వమివ కంపసే తవ సమీక్ష్య నాసాంభియా॥

చివరిగా నొక్కమాటలో చెప్పవలసి వచ్చినచో నిది "వ్యాఖ్య లేనిచో అర్థము కావి ఒక గాఢ ప్రౌఢభాణము."

వసంతమిత్రభాణము – మంగళగిరి కృష్ణద్వైపాయనాచార్యులు :

ఇతడు సంస్కృతాంధ్రఘులలో ననేకరచనలు కావించినాడు. 20వ శతాబ్ద ప్రథమభాగమున నివసించినవాడు. విజయనగరనివాసి. శ్రీకృష్ణచరిత్రము మున్నగు కావ్యములను, శ్రీకృష్ణదానామృతము మున్నగు నాటకములను రచించినాడు. కౌశిక గోత్రుడైన ఇతడు వేంకటరమణార్యుని పుత్రుడు. మంగళగిరినగర మందలి నృసింహస్వామిమందిరమున దేవదాసి అయిన మాధవి సోదరి ప్రథమరంగాధిరోహణ సమయమున విటుడు మంగళగిరి వీథుల వెంట వెడలుచు శృంగారాత్మక చర్చ చేయుట యిందలి యితివృత్తము.

వృద్ధపతిని విడనాడి వారవృత్తిని చేపట్టిన కోకిలవాణి మున్నగు వారాంగనల వృత్తాంతములును, పతిదుశ్చేష్టలకు భయపడిన కులస్త్రీల దుశ్చేష్టలును ఇందు వర్ణితములు. ఇందు కొన్ని మత్తుపదార్థముల వర్ణనము కూడ కలదు. ఇందలి భాష అచ్చటచ్చట హిందీ పదములతోను - ఆంగ్ల పదములతోను కూడి ఉన్నది. అనేక రాష్ట్రయువతుల వేషభాషలు ఇందు వర్ణితములు. కంచిలోని గరుడోత్సవవర్ణన మిందలి విశేషము. దీనిని గురించి విస్తృతపరిచయము 1974 వ సం||ము నందలి "The Mysore Orientalist" అను పత్రికలో ప్రకటింపబడినది.

సమాజమునకు దూరముగా సంస్కృతకవులు లేరు అని నిరూపించుటకు ఈ కవి విధవావివాహమును వ్యంగ్యముగా సమర్థించుట ఒక ఆధారము.

మదనానందభాణము – భట్టర్ పార్థసారథి అయ్యంగార్:

కవి విశ్వమంతయు విహరించినను అతని విహారపరిధికి కేంద్రము సమకాలీన సమాజమే. అతని భావనలు విశ్వజనీనము లైనను పరిసర సమాజమునకు పట్టము కట్టవలసినదే. ఈ నియమములకు లొంగి సంస్కృతకవులు సయితము సమకాలీన సమాజమున కద్దము పట్టుటకు ప్రయత్నించినా రనుటకు ప్రబల నిదర్శనము మదనానందభాణమే.

నూజివీడు సంస్థానము నందుండి వేంకటాద్ర్యప్పారాయలచే గౌరవ సత్కారముల నందిన వైయాకరణపంచాననులైన భట్టర్ పార్థసారథి అయ్యంగార్ రచించినదీ మదనానందభాణము. వల్లీపురవాసుడైన రఘునాథచక్రవర్తి ఇతని గురువు. 1921లో ఇది ముద్రించబడినది.

ఈ కవి ప్రస్తావనలో వంశవర్ణనకు కూడ తావిచ్చెను. చంద్రశేఖరశాస్త్రి కుమారుడైన మదనానందుడు శృంగార లీలా ప్రథమ ర్తుమహోత్సవదర్శనార్థము బయలుదేరి గమ్యము చేరుట ఇందలి యితివృత్తము. తాను ఆధునికుడైన కారణమున తన కావ్యమును సైతము "ఫాషనబుల్ "గా చేయుదునని ఈ కవి మనకు హామీ యిచ్చును - అధునాతనవర్త్మనా - అని ప్రసావన యందును, అభినవరూపం శ్రీ నామ మదనానంద భాణః - అని అంతమునను పలికి ఆ ప్రతిజ్ఞను నిలుపుకొనినాడు.

భారతదేశము బ్రిటీషు పాలనకు లోనయిన తరువాత భారత దేశమునందు, ప్రపంచ దేశము లందును జరిగిన మార్పులు, విజ్ఞానశాస్త్రములో జరిగిన ప్రగతి అనంతము. అవన్నియు ఈ కవి మన ముందుంచును. 'డల్హౌసీ' 1853 సం||న

భారతదేశమునకు రైళ్ళను పరిచయము చేసినాడు. కాని మదన విజయభాణకర్త విక్కిరాల శేషాచార్యుల కాలమువలకు వాని నేభాణకవియు గుర్తించినట్లు లేదు. వారు కూడ నామమాత్రముగ దీనిని ధూమశకటమని నిర్దేశించిరి. కాని ప్రస్తుత మదనానంద భాణకర్త మాత్రము, సైకిల్లు – బస్సులు – రైళ్లు - సిగ్నల్సు - మహామారులు – ఆరోగ్యశాఖలు - వాటిలో అన్యాయములు- పోస్టుమార్టమ్లు - పోలీసుల రైడింగులు - అధికారదర్పములు - వారిదూషణలు-విమానములు మొ॥వాని నన్నింటిని తన కృతిలో నిలుప గలిగినారు. ఇది భాణమా ? విశాలవిశ్వమా అనునట్లు చేసినారు.

ఈ కవి ధూమశకట మను పేరుతో రైలును వర్తించుట చూడుడు.

ఏకత్ర తాడ్యతే ఘంటా. స్తంభాగ్రస్థోఽపి ధ్వజపక్షః అవనామితః. మన్యే తథాయం ధూమశకటాగమనకాలః –

శ్రేణీభూయస్థగితనిగలా ఘట్టనా ద్యాన్తి పశ్చా-
ద్ధూమోద్గారిజ్వలనజఠర స్యానసోనాం స్యమూని।
సంలక్ష్యన్తే విబుధవిముఖం ధుర్యవాప్యావనీపం
పశ్చా దేష్యత్ప్రతిత పురుషాః కల్పకానీవ మహ్యామ్॥

ఇంతేకాక మూఢ విశ్వాసములపై నీతడు కొంతలో కొంత ధ్వజమెత్తినా డన వచ్చును. వాని నాధారముగ చేసికొని సాగు మోసములను ఈ కవి గట్టిగా దుయ్యబట్టెను. కపట సన్న్యాసులను వారు విధవలకు సంతానము ననుగ్రహించుటను తీవ్రముగా గర్హించును. ఆ సన్న్యాసి అనుగ్రహమును కోరిన విధవను శోభనపు రాత్రి అలంకరించి నట్లు అలంకరించి పంపవలెనట. ఆ విషయము నెట్లు వర్ణించెనో చూడుడు –

నానాలంకరణైః ప్రసాధిత తనుశ్చామీకరామత్రకే
సూనస్రఘ్నసార చందన ఫలాన్యా హృత్యశుద్ధాశయా
ప్రేయాంసం, ప్రథమోప భోగసమయే కాంతా యథా సంసరేత్
ఐకాగ్ర్యేణ తథా శయీత విజనే దేవాలయే సుందరీ. (87)

మరునాడు ఉదయము దేవాలయపు తలుపులు తెరిచిన తరువాత ఆమె వెనుకకు వచ్చునట. ఈ మధ్యకాలములో జరుగునదేమియో ఆ దేవునికే ఎఱుక. ఆ విషయముపై లోకులు పలురకములుగా పలుకుట, వదంతులను సైతము ప్రతిబింబించును.

ఈ కవి వైయాకరణపంచాననుడైనను - న్యాయపాండిత్యమేమియు తక్కువ కాదు. తెలుగుకవి యగు చేమకూర సామెతలను చెప్పినట్లు ఈ కవి న్యాయములను,

సామెతలను గుప్పించును. రేఖాగవయన్యాయము- బ్రహ్మాస్త్రన్యాయము – భ్రష్టావసర న్యాయము - దండాపూపికాన్యాయము మొదలగునవెన్నో గలవు. ఇక బుభుక్షా హి తితిక్షాయాః పరీక్షా – స్థితస్య గతిశ్చింతనీయా – శప్యమానస్య యత్పాపం శపన్తమదిగచ్ఛతి - మొదలగు సామెతలు దర్శనమిచ్చును. ఈ కవి పై చెప్పినవిధమున అనేక విధములుగా ఆధునిక భావములను, ఆధునిక సమాజమును స్పష్టముగా ప్రతిబింబించినను భాష మాత్రము ప్రౌఢమైనది. వ్యాకరణ పాండిత్యశబలితమైన భాషయే సాహిత్య ప్రాధాన్య-మును అక్కడక్కడ మ్రింగివేయును. రచయిత తనంత తానుగా అనేక పదముల కర్థములను - వివరణములను అధో జ్ఞాపికలతో వ్రాసియుండుటయే యిందలి భాషాప్రౌఢిమను స్పష్టపరచును. తెలుగుకవులలో పెద్దనమండి క్షీణయుగ కవులవరకు అనేకులు ఆదరించిన అహల్యా-సంక్రందనులయు, తారాశశాంకులయు ధర్మనిర్ణయ సమయములను ఉదాహరణముగా జబ్బపుచ్చుకొని ఈ కవి యీడ్చుకొని వచ్చును.

అహల్యామింద్రోగా ద్విధురపి చ తారామశరణాం
జహార ప్రాసభ్యాదవనితనయాం కర్బురపతిః।
ముకుందో ప్యాభీరీస్సతి యువతివారేష్వతి తరా
మధీనే సౌభాగ్యం కిమపి పరదారేష్వనుమితమ్॥ (79)

అనేక విషయజాతకవలితమై విమర్శాప్రధానమైన యీ కవిత భావనావిరహిత మని సంశయింపవలసిన పనిలేదు. భావనలయందు సైతము ఈ కవి ఇతరుల కన్నా తక్కువ వాడేమి కాదు. చంద్రునిలోని మచ్చను చాలమంది చాలరకాలుగా ఉత్ప్రేక్షించి-నారు. మచ్చఅని - బురదఅని – జింకని - భూమినీడ అని - రాత్రి చంద్రుడు త్రాగివేసిన చీకటి అని - పోల్చినారు. ఈకవి ఆ విషయము నెట్లుత్రేక్షించునో చూడుడు —

సస్పర్ధే ముఖమండలేన సహయ స్తన్వ్యా తవ ప్రేయసి
ప్రాప్తస్సన్నిధి ముత్కటామృతమయై స్సమ్మోహితో వీక్షణైః।
త్వద్వక్షోరుహకాంచనాద్రి పతిత స్తత్పాతజాతవ్రణ
స్సోయం దుస్సహవంచనాం విషహతే చంద్రః కలంకీత్యహో॥

ఆమె మోముతో సంఘర్షణను పెట్టుకొని, ఆమె చూపులతో వంచింపబడి, కాలు జారి ఆమె కుచములనెడి కాంచన శైలముపై బడి గాయము చేసికొనెనట. ఆ కలంకము గాయమయిననేమి చంద్రు దదృష్టవంతుడే సుమా !

ఇట్లీకవి ఆధునాతనవర్త్మనా అని అభినవరూపకమని పాఠకుల కిచ్చిన మాట నిలబెట్టుకొని ఈ భాణరచన సాగించినాడు. యథార్థముగా నిది సాంఘిక విషయానుశీలనమే ప్రయోజనముగా గల భాణమగుట - ఆ లక్షణమే భాణరచన అభివృద్ధికి కారణమగుట - అభినందింపవలసిన విషయమే.

అఖిలజనమనోహర భాణము – శ్రీమాన్ విక్రాల శేషాచార్యులు :

సుగృహీతనామధేయులు, విద్యారణ్యపంచానన బిరుదాంకితులు నగు విక్రాల రామచంద్రాచార్యులవారి ద్వితీయపుత్రుడు శ్రీమాన్ విక్రాల శేషాచార్యులవారిచే ఈ భాణము రచింపబడినది. వీరు ఆంధ్రగీర్వాణములలో 262 గ్రంథములను రచించిరి. చిత్ర, గర్భ, బంధకవితా ప్రణయన ప్రతిష్ఠులు. ప్రస్తుతము కలికివాయ గ్రామమున నివసించుచున్నారు. ఈ భాణమింకను ముద్రితము కాలేదు. ఇందు లక్షణము ననుసరించి శృంగార మధికముగనే కానవచ్చును. మధ్యమధ్య మల్లయుద్ధము, కుక్కుటయుద్ధము, విప్రవినోదము, జూదము, మద్యపానము మున్నగువాని వర్ణనము కలదు. దేవుని ఊరే గింపు సైతము సరసముగా వర్ణింపబడినది.

ఈ భాణమునందు ప్రస్తావనలో కవియొక్క పితృపితామహాదుల వైదుష్యమును కవి యభ్యసించిన శాస్త్రములును, నటీనటుల సంభాషణమువలన తెలియును. గ్రంథము పాండితీస్ఫోరకముగా నుండును. నాందీశ్లోకములలో రెండవది

బాలోప్యహో బహుబలాఢ్య ఇతి స్మృతో యః
గోపాంగనాభిరసకృత్కృత మైథునాభిః।
దైత్యైః ప్రహారసమయేషు హతైశ్చ తద్వ
త్సర్వ క్రియైకకుశలోఽవతు మాధవోస్మాన్॥

గోపాంగనలును, దైత్యులును కూడ బలాఢ్యుడని కృష్ణుని కీర్తించిరి — అట్టి సర్వక్రియాకుశలుడైన మాధవుడు రక్షించుగాక అనుట శృంగార వీర స్ఫోరకము.

అర్వాచీన భాణములు

(ఆంధ్రేతరుల గ్రంథములు)

మహిషమంగళభాణము – నారాయణకవి :

16వ శతాబ్ది మధ్యకాలమున నుద్భవించిన నారాయణకవి రచించినదీ మహిషమంగళభాణము. ఇతడు కేరళదేశస్థుడు. బృహస్పతి యపరావతార మని ప్రఖ్యాతి చెందిన శంకరు డీతని తండ్రి. శంకరుడు గణితశాస్త్రము నందును పేర్వడసిన విద్వాంసుడు. తండ్రికడ నారాయణుడును గణితశాస్త్ర మభ్యసించినాడు. కొచ్చిన్ ప్రభు వగు రాజరాజు నాస్థానమున పండితుడుగ నున్నవాడు. అతని ప్రార్థనవలననే భాణమును రచించినాడు. ఈత డింకను భాషానైషధచంపువు (మలయాళము), ఉత్తర రామచరిత చంపువు మున్నగు గ్రంథములను రచించినాడు. 613 మందాక్రాంతా శ్లోకములలో గోపీకృష్ణుల రాసలీలావిలాసములను వర్ణించినాడు.

ఈ భాణమున అనంగకేతు, అనంగపతాకల ప్రణయము వర్ణింపబడినది. అన్ని భాణముల యితివృత్తముల వంటిదే యిందలి యితివృత్తమును. కాని కేరళ దేశమున దీనికి విశిష్టప్రచారము కలదు. త్రిచూరు (Trichur) నందలి రామవర్యర్ అను నతడు దీనికి మలయాళమున వ్యాఖ్యానమును సయితము వ్రాసినాడు. భాణములకు వ్యాఖ్యానములు వ్రాయుట ఎక్కడో కాని కానము.

కేరళదేశ మందిప్పటికిని లోకుల జిహ్వాగ్రముల యందీ శ్లోకము నటించుచుండునట. అందలి వ్యంగ్యచమత్కారములే దీనికి కారణము.

కుటిల మసిత మేఘ చ్ఛాయ మాభోగభారమ్
చికురమధిక దీర్ఘం లంబమానం వహంతీ।
పరిలఘుయతి పశ్చా ద్భాగకాంత్యాపి ధైర్యం
న హి గులగులికాయాః క్వాపి మాధుర్యభేదః॥

సరోవరమునకేగు సుందరి వర్ణనము సరసమనోహరముగా నున్నది.

ఆర్ద్రా లక్ష్యమనోహరోరుయుగళం నాత్యాయతం బిభ్రతీ

వాసః ప్రోషిత భూషణైరవయవైః కాంతిం కిరంతీం పరామ్।
తైలాభ్యక్త తనుర్నిబద్ధచికురా తాంబూలగర్భాననా
వాపీంస్నాతుమితో నిజాన్నిలయనాన్నిర్యాతి శాతోదరీ॥

భరతవాక్యమందు కవుల వాక్కును గూర్చి చెప్పిన శ్లోకము పరికించదగినది.

వీతాసూయైర్విపశ్చిద్భిః సాధుశోధితరీతయః।
అసంప్రాప్తఖలశ్రోత్రాః సంతు కావ్య కృతాం గిరః॥.

అరసికాయ కవిత్వనివేదనం
శిరసి మాలిఖ మాలిఖ మాలిఖ

అనెడి సూక్తిని తలపించు నీ శ్లోకము.

వసంతతిలకభాణము – వరదాచార్యులు :

'వివిధ రసభావ భావన వీథి లెస్స' అని క్రీడాభిరామకర్త వీథిని దశరూపకములలో ఉత్తమముగా పరిగణించినట్లు, 'భాణశ్చేద్దశ రూపకేషు మధురః' అని వ్యవహరించిన వ్యక్తి వసంతతిలక భాణకర్త. దీనికే 'అమ్మ' భాణమనికూడ ప్రతీతి. వరదాచార్యులు లేక అమ్మలాచార్యులు వసంతతిలకభాణమును వసంతతిలకముగనే రచించెను.

ఈ వసంతతిలకభాణము లేక అమ్మభాణమును చూచియే రామభద్రదీక్షితుని శృంగారతిలకభాణము రచింపబడినది. అతడు 17వ శతాబ్దివాడు. కావున ఇతడును 17వ శతాబ్దివాడనవచ్చును. కాని అంతకన్న 16వ శతాబ్దపు చివరికాలముననో, మధ్యకాలముననో ఇతడు నివసించి యుండెననుట యుక్తము. కువలయానందాది గ్రంథకర్త అయిన అప్పయ్యదీక్షితుని కాలము క్రీ. శ. 1554–1626 ప్రాంతము[1] అతని కువలయానందములో వసంతతిలక భాణమందలి పద్యము లుదాహరింప బడినవి.[2] కాబట్టి వరదాచార్యులు అప్పయ్యదీక్షితులకు ముందువాడు కాని, సమకాలీనుడు కాని కావలసివచ్చును కనుక 16వ శతాబ్దము చివర ఈతని వసంతతిలకభాణ గ్రంథరచన జరిగియుండి యుండవచ్చును.

మనకు లభించు చక్కని భాణములందు వసంతతిలక మొక్కటి. భావనల యందేమి, పదప్రయోగమునందేమి, నుడికారములందేమి, వర్ణనవైచిత్ర్యమునందేమి,

ధ్వని వైభవమున దేమి - ఏ కోణమునుండి చూచినను ఇది వసంతతిలకమే. అంతియ కాదు. 'భాణ శ్చేదశరూపకేషు మధురః' అను వాక్యమును సైతము ఈ భాణము ద్వారా ఇతడు నిజమనిపించినాడు. ఇంతయేల ప్రాయికముగ ఏ భాణమునకు దక్కని గౌరవము - ఆలంకార గ్రంథములలో ఉదాహరింపబడుట, సమకాలముననే ఇతని గ్రంథమునకు లభించుటయే ఈ భాణముయొక్క వైశిష్ట్యమును తెలియచేయును.

వసంతర్తువును వర్ణించుచు కవి వ్రాసిన ఒక చక్కని శ్లోకమును చూడుడు.

అంగారక్రియ మాతనోతి నితరా మాపాటలం పల్లవం
ధూమశ్రేణి విడంబినీ పునరసౌ నిర్యాతి భృంగావళిః।
పుష్పాణ్యత్ర చ సంలుఠంతి కతిచి త్పృష్టాని మందానిలైః
శంకే దగ్ధు మసౌ జగంతి మదన స్సంతాపయ త్యాశుగాన్॥ 18శ్లో.

మదను డీలోకములను దహించుటకు తన బాణములను వేడిచేయుచున్నాడట. ఎంత చక్కని యుత్ప్రేక్ష. పల్లవములు నిప్పులట. తుమ్మెదలు పొగవరుస అట. పువ్వులు కొన్ని వానిపై గాలిచే రాల్చబడి పడుచున్నవట. ఇదంతయు చూచినచో మదనుడు తన బాణములు వేడిచేయుటను కాదనగలమా ?

తన 'భాణము'[1] మగవాడైనను నుదుట తిలకమును పెట్టియే వెలువరించిన యీ కవి స్త్రీలనుదుట తిలకము లేకుండ చూడలేదు. అందుచే ఈ కవి సామాన్యముగ నారీవర్ణన చేసెడి సమయములో కుంభ స్తనములకు, విపుల శ్రోణులకు ప్రాధాన్యమీయక నుదుటనున్న తిలకమున కెక్కువ ప్రాధాన్యమునిచ్చి వర్ణనము చేయును. ఆ తిలక వర్ణనమే అప్పయ్యదీక్షితులను సైతము ఆకర్షించినది. క్రింది వర్ణనలో అతని తిలక ప్రియత్వము బాగుగ తెలియగలదు.

లోకే కళంక మపహాతు మయం శశాంకో
జాతోముఖం తవ పునస్తిలక చ్ఛలేన।
తత్రాపి కల్పయసి తన్వి! కళంకరేఖాం
నార్యః సమాశ్రిత జనం హి కలంకయంతి॥

1. నాట్యశాస్త్రము అనుబంధము – 2 పుట 890.
2. వసంతతిలకభాణము శ్లో 35, 83.

భాణము లెంతవేశ్యా విశిష్టములు, విటభూయిష్ఠములు అయినను ఆ సంయో-గములు, ఆ శృంగారములు వారాంగనా సంబంధమయినచో సుఖము. కాని పర స్త్రీ రతి

యయినచో అది చాల కష్టములనే కల్గించును. ఈ విషయమును ఈ కవి చెప్పిన తీరు చూడుడు.

దిగంతా న్పశ్యంతీ దిశతి న ముఖే చక్షురమృతం
న విస్రబ్ధా కించిత్కథయతి న చాకర్ణయతి చ ॥
రతారంభే భూయోజిగమిషతి సాశాపి సుతరాం
తథాప్యేషా భావైస్తరళయతి చేతః పరవధూః ॥

ఈ విషయము నాంధ్ర సాహిత్యములో నింతకు ముందుగ చవిచూపినవాడు తిక్కన. కీచకుడు సైరంధ్రిపై మనసు పడినపుడు సుధేష్ణచేత నీ విషయమును సకారణముగా చెప్పించును.

పతి యెఱింగిన తన ప్రాణంబుపై వచ్చు
    నను భయంబున నుల్లమదరుచుండ
జనులు గాంచిన మానుషము దూలుఁ దనకను
    పుయిలోటమున మోము పుల్లగిలగ
బోటికిఁ దోచినఁ బొలియుఁ దేకువ యను
    వెగడునఁ జెయ్వులు వీడుపడగ
బంధులకగపడ్డఁ బాయు నన్వయమను
    కలకమై చెమటలు క్రమ్ముదేర
గ్రీడదెసఁ గౌతుకంబురియాడు రతుల
చవుల గొనియాడ నేరని జారపొందు
హృదయమున కెంపు చేయమి——

1. "భాణః" అని భాణశబ్దము సంస్కృతమున పుంలింగము,

అయితే మహర్షితుల్యుడు తక్కన ఆడదానిచే చెప్పించెను కావున ఇంపు చేయదనెను. వరదాచార్యులుగారు విటునిచే చెప్పించిన కారణముగ "అయినను సరే చూపు మనస్సును కలచివేయుచున్నద"ని పలికించిరి.

కర్ణాట, పాండ్య-ఆది స్త్రీ వర్ణనలు, వివిధ క్రీడలు, వినోదములు, చక్షురపిధాన క్రీడ, కళత్రపత్రములు ఇందు సహజములే. అయినను వర్ణనవైచిత్ర్యములో తన వ్యక్తిత్వమును నిలుపుకొందురు. గజ కోలాహల సన్నివేశమునందు ఇతడు మఱి కొంత చమత్కరించును. ఒక కాంత నడివీధిలో నడచుచున్నదట. పాపము ఏనుగు ఆమెను తన హస్తినిగా భావించి వెళ్ళుచున్నదట. గమనించుడు.

కుచకలశ విలాసైః కుంభలీలాం వహంతీం
విరచితకరశంకా మూరుణా మన్దరేణ |
మదపరవశమస్మిన్ చత్వరే సంచరన్తీ
మనుసరతి గజస్త్వామాత్మనో హస్తినీతి ॥ వ॥ లి॥ శ్లో - 61

అట్లు అనుసరించెడి ఏనుగును పట్టుకొనుటకు వాడిన సాధనములు సైతము సుందరములే. వారు సింహపు బొమ్మలను చూపించి, బెదరించి, ఏనుగును పట్టిరట. కామినీ కుచ సౌభాగ్యచోరుని ఏనుగును బంధించుట యుక్తమే యని విటుని తీర్పు కూడ దాని కొక జోడింపు.

అన్యాపదేశముగ విటుల నాహ్వానించి స్వేచ్ఛగా చరించు కామినులకు నేర్పు చాల కావలసియుండును. అంతంతమాత్రపు నేర్పు కలవారికది సాధ్యముకాదు. ఇంటి వారందరు ఎచ్చటికో వెళ్ళిరి. అవకాశముల నుపయోగించుకొనవలెను కదా! ఆమె దేవుని అడ్డుపెట్టుకొని విటు నాహ్వానించు పద్ధతిని కవి వర్ణించిన తీరు చూడుడు.

నాథో మే విపణిం గతో న గణయత్యేషా సపత్నీ చ మాం
త్యక్త్వా మామిహ పుష్పిణీతి గురవః ప్రాప్తా గృహాభ్యంతరమ్ ।
శయ్యామాత్ర సహాయినీం పరిజనశ్శ్రాంతో న మాం సేవతే
స్వామిన్నాగమలాలనీయ రజనీం లక్ష్మీపతే రక్ష మాం ॥ శ్లో॥ 83

అయిన ఇట్టి శ్లోకములుంచుటచే ఇది దుర్విషయబోధకమని తలచుట నేరము. కళాత్మను చూడగల్గుట బహుపుణ్య పరిపాకఫలము అది లవ మాత్రమైన లేనపుడు కళవైపున కీదృష్టిని మరల్చుట తప్పు "తస్మై నమః స్వాదుపరాఙ్ముఖాయ".

వషట్కార పూర్వకమయిన "కూర్చేణ నిహత్య – త్వద్భగినీ మేవ గచ్ఛ - త్వజ్జననీ మేవ గచ్ఛ" మొదలగు జాతీయములు నిందాత్మకములుగ ఇందు చక్కగ రాణించినవి. విస్తృత ప్రణాళికతో రచన సాగించినను అన్వయ కాఠిన్యము కాని, కుంటువడిన శైలి కాని ఎక్కడను కనిపించదు. భాణములో 'తిలక' మాత్రమైన కళంకము తప్ప మరే కళంకములకు నవకాశము లేదు. శైలీసారళ్య, అన్వయ సారళ్యములను సూచించుటకొక శ్లోకము.

అంభోజ బంధురితి భాను మిమాం చ భూమిం
సర్వంస హేతి కథయంతి మృషైవ లోకాః।
వక్త్రాంబుజం గ్లపయితి ప్రథమో వధూనా
మాసాం వరా న సహతే చరణార్పణం చ॥ వసంతతిలక శ్లో॥ 68

ఎండలో నడచెడి కాంతలను వర్ణించుచు ఎంతచక్కని శ్లోకములను రచించెనో చూడుడు. ఈ శ్లోకముపై కాళిదాసప్రభావము కన్పట్టును.

తవ కుసుమ శరత్వం శీతరశ్మిత్వమిన్దోః
ద్వయమిదమయథార్థం దృశ్యతే మద్విధేషు
విసృజతి హిమగర్భైరగ్ని మిన్దుర్మయూఖైః
త్వమపికుసుమబాణాన్ వజ్రసారీ కరోషి॥ శాకుంతలము – 2 అంకము.

అక్కడక్కడ శ్రీహర్షుని పోకడలును, బాణుని గద్యవిన్యాసమును హృద్యములై పొడకట్టును. ఏదిఏమైనను భాణములపై సదభిప్రాయము కలిగింపగల రచన యిది.

శృంగారతిలకము – రామభద్రదీక్షితులు :

"స్పర్ధయా వర్ధతే విద్యా" అనుసూక్తికి నిదర్శనప్రాయములైన రోజులవి. భాణముల విషయమునకూడా ఇట్టిది యొకచో కన్పట్టును. వసంతతిలకమను భాణమును వరదాచార్యులు ఇతః పూర్వమే రచించినాడు. దానికి అమ్మభాణమని

ప్రసిద్ధి లభించినది. దీనితో పోటీపడి శిష్యుడైన రఘునాథుని ప్రార్థనచే రామభద్రదీక్షితులు శృంగారతిలకమును రచించినాడు. దీనికి అయ్య భాణమని ప్రసిద్ధి లభించినది. శృగారమునకు వసంత ముద్దీపకమైనట్లు శృంగారతిలకమునకు కూడ వసంతతిలకమే యుద్దీపకమగుట ఔచితీ సన్నిహితము.

రామభద్రదీక్షితుని తండ్రి రామయజ్ఞ దీక్షితులు. గురువు నీలకంఠమఖి. (ఇతడే నీలకంఠ విజయం నిర్మాత). ఈతని భార్య చొక్కనాథమహీంద్రుని పెద్ద కుమార్తె. చొక్కనాథుడు తనకుమార్తెనే కాక పదవిద్యను సైతము రామభద్రదీక్షితునకు సొంతమొనరించినాడు. దక్షిణదేశమున కుంభకోణనగరమునకు కొద్దిదూరమున నున్న కందరమాణిక్యాగ్రహార మీతని యూరు. నీలకంఠమఖికాలము క్రీ॥శ॥ 17వ శతాబ్దమని అతని నీలకంఠ విజయము సాక్ష్యము పలుకుచున్నది. అతని శిష్యుడైన ఈ రామభద్ర దీక్షితుడును ఆ శతాబ్ది యుత్తరభాగమున నుండెనుట యుక్తియుక్తమే గదా! శహాజరాజ పురమను పేర గ్రామమును నిర్మించి శాహాజిరాజు సన్మానించిన కవులలో ఇతడొకడు. శహాజిరాజు 1684 - 1711 వరకు రాజ్యముచేసెను. దానిని బట్టి చూడ నీకవి. 17వ శతాబ్ది యుత్తరార్ధము వాడగుటకు విప్రతిపత్తి లేదు. ఈకవి ఇతర రచనములు అష్టప్రాసము, జానకీ పరిణయము, చాపస్తవము, పతంజలిచరితము, పర్యాయోక్తి నిష్యందము, ప్రసాదస్తవము, భాణస్తవము, విశ్వగర్భస్తవము మొ॥నవి.[1]

పువ్వుపుట్టగనే పరిమళించునట్లు ఈ భాణము నాందీశ్లోకముతోడనే సహృదయుల హృదయములు నాకట్టుకొనును.

> పాణిగ్రహావసర ఏవ దృఢోపగూఢా
>   రాగస్పృశా రఘుపతేర్నయనాంచలేన ।
> లజ్జావశాన్నవ వధూరివ సంకుచన్తీ
>   దృష్టిర్మహీదుహితురస్తు విభూతయే వః ॥ [2]

పెళ్ళి పీటలమీదనే అనురాగమునిండిన రాముని నయనాంచలముచే గట్టిగా కౌగలింపబడి, సిగ్గుచే ముడుచుకొనిపోవు సీతాదేవి చూపులు పాఠకులకు సంపద నిచ్చునని యాశీస్సు. ముందుగా పెళ్ళి పీటలమీదనే కౌగిలింత అని చెప్పి, వెంటనే నయనాంచలేన అనుట ఒక్కసారి పాఠకుని గిలిగింత పెట్టును.

ప్రస్తావనానంతరము హేమాంగీ వియుక్తుడైన భుజంగశేఖరుడు - గతరాత్రి ఏర్పడిన ప్రణయములోని ప్రళయమును తలచుకొనుచు వేదిక నెక్కును. మందారకుని మంత్రాంగముతో పనులన్నియు చక్కబెట్టుకొని సాయంకాలమునకు హేమాంగిని కలిసికొనెడి యదృష్టమును పొందును. అది భాణములోని కథ. మధ్య సన్నివేశము లన్నియు మామూలు ధోరణిలో నడచినవి.

ఈ కవి రచనలో మంచి చేయితిరిగిన వాడని శ్లోకములు నిరూపించును. వర్ణనలో గాని, స్వభావ పరిశీలనలో కాని, చమత్కార సారమును గుప్పించుటలో కాని, భాణమును ఒక సెటైర్ (Satire) గా తీర్చుటలోకాని ఈతడు మంచి నేర్పు చూపినాడు. ముగ్ధాప్రౌఢల రతిక్రీడలలోని భేదములకు వర్ణించి యువతరమునకొక సందేశము నందించును.[3] ఆ సందేశ మిది.

రతక్షమాయాః ప్రౌఢాయాః వరం ముగ్ధా రతాక్షమా।
యతో భోగః క్రమాల్లభ్యః ప్రౌఢా మధ్యమయో రపి॥ 125 శ్లో.

ఈ కవి రచన చదివినచో అనేక ప్రాచీన కవుల శ్లోకములు మన స్మృతి పథమున మెదలును. కాళిదాసు[1], హర్షుడు[2] [నాటకకర్త], బాణుడు[3] మొదలగువారు. అంతేకాక తిక్కన విరాటపర్వములోని సూర్యోదయవర్ణన భావ మీతని రచనలో కన్పట్టుట యాదృచ్ఛికసామ్యము. లేక తెనుగు నేర్చినవాడేని కాదగును.

... ... రవేః ,
బిమ్బం పద్మవనీతపః ఫలపరీపాకః సముజ్జృంభతే – శృం. తి. 40

నీరజాకరములు నిష్ఠమైజేసిన భవ్యతపంబుల ఫలమనంగ
విరాట – ద్వితీయ 241

తన కావ్యములలో "గారడి" "ని వర్ణించినది చాలక తనరచనలో సైతము గారడీ చేయుట యీ కవికి సరదా. నేర్పరియైన విటుడు జూదమందు పందెము కట్టుచున్నాడు. ఈతని వర్ణనాచమత్కృతికై అతిశయోక్త్యుత్ప్రేక్షలతో కూడిన క్రింది శ్లోకము పఠనీయము.

ఆసే కుత్ర చిదమ్బరం హిమకరః కాదమ్బనీ చ క్వచి

1. శృంగారతిలేక పీఠిక = పుట 1
2. శృంగారతిలక శ్లో 1.
3. శృంగారతిలక - 37, 38 పుటలు.

> ద్వాపీక్వాపి చకాస్తి మీన విథునం కోకద్వయం చాన్యతః।
> కించాధః పులినోచ్చయస్య కదలీకాండావవాగ్రోపితౌ
> తన్మన్యే చతురస్య పుష్పధనుషః సర్గోయమన్యాదృశః॥ శ్లో – 228

ఈరచన సైతము పై సృష్టివలె వింతవింత భంగిమలు గలది. “వాపీ కాపి స్ఫురతి గగనే” అను ప్రసిద్ధశ్లోకమును తలపించుచున్నది.

అంతయు సమకూడి అధరపానసమయమున విఘాత మేర్పడినదనుటకు వామనభట్టబాణుడు “సాధుతరే సంగ్రామే చాపస్య జ్యాభంగః” అని వ్యాఖ్యానింపగా నితడు మరింతకోమలముగ సముచితముగ వ్యాఖ్యానించినాడు.

> కోవా ప్రాదుర్భావసమయ ఏవ నవనీతస్య భగ్నవాన్ దధిస్థాలీమ్॥

వెన్నపడుచున్న సమయమున దధి పాత్ర భగ్న మొనరించుట అనుటలో అధరామృతమునకు సామ్యము సూచ్యమగుచున్నది కదా!

ఇట్లు పాఠకులను చమత్కారపురస్కారముతో నలరించిన రామభద్రదీక్షితుని కృతియగు నీ శృంగారతిలకము భాణసాహిత్యమునకు తిలకాయమానమే యగును.

మదనగోపాలవిలాసము – గురురామకవి :

> స్వేచ్ఛా కేసరిణం స్వచ్ఛస్వచ్ఛాయాయాసితేందవః।
> త్రాయంతాం వో మధురిపోః ప్రపన్నార్తిచ్ఛిదో నఖాః॥

అని గోళ్ళలోని గొప్పతనమును గుర్తించి ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకము నారంభించినాడు. ఆ నఖములకు కొంత రాగమును కూడ పూసి గురురామకవి క్రింది శ్లోకమును వ్రాసినాడు.

> లక్ష్మీకుచాంకాలంకారకారిణో దైత్యవైరిణః।
> నృహరేః పాన్తు శృంగారవీరోద్గారశిఖా నఖాః॥

---

1. శృంగారతిలక శ్లో. 75
2. ” శ్లో. 27.
3. ” వచనము పుట 56.

ఇది మదనగోపాల విలాసముయొక్క నాంది. వేంకటగిరిశృంగసౌధాధిరూఢు డైన గరుడధ్వజుని భాద్రపదోత్సవముల యందు ప్రదర్శించుటకై యుద్దేశింపబడిన దీ భాణము. ఇతని తండ్రి స్వయంభూనాథ దేశికుడు (1607) సుభద్రాధనంజయ నాటకము, కృష్ణవిలాసము, శంకరానందచంపువుల నితడు రచించెను.

ఈ భాణమందు శిథిలభాగ మధికము, కళత్రపత్ర, కుక్కుటస్పర్ధాదు లిందు కన్పింపవు. కందుకక్రీడ మాత్రము విడువలేదు. డోలావిహారమును వర్ణించు శ్లోక మొకటి.

ప్రతిభాతి విభ్రమనదీప వన మివ ముదాధిరూఢ ఫలకేయమ్।
అనీతేవ తులాఘట మమరీభి స్తులయితుం మనోజేన ॥

ఆ కాంత ఉయ్యాల నెక్కి యుండగా, అమరకాంతలతో తూచుటకు మదనుడు తెచ్చిన త్రాసుపై నున్నట్లున్నదట. ఇట్టి శ్లోకము లక్కడక్కడ కన్పించును. చంద్ర వర్ణన మందు అతనిపై అనేకారోపణములు చేసిన ఈ శ్లోకమును చూడుడు.

కందర్భప్రణిధి ర్ముఖప్రతినిధిః కాంతాజనస్యాబ్జినీ
సౌభాగ్యవ్యవధిః సుధాజలనిధిః శ్యామారథీసారథిః।
ఉన్మీల త్యయ మోషధీకులనిధిః ధ్వాంత ప్రబంధావళీ
సౌందర్యాభినిధి శ్చకోరపరిషత్సర్వాతిథిశ్చన్ద్రమాః ॥

మదనగోపాలనామముతో నాతడు జగన్నాటక సూత్రధారి యని కవికి స్ఫురించినదేమో కాని ఇందు ఇత దంతర్నాటకమును కూడ కల్పించినాడు. అసమగ్రగుణకలిక మైన భాణములో సమగ్రలక్షణోపేతమైన నాటకమును పరామర్శించుట భాణములలో కనిపించెడి అనేక వినోదస్థానములలో నొకటి.

"విశ్వభావనజనస్య పావనం - శశ్వదస్తు వచసాం నిగుంభనమ్" అను భరత వాక్యము ననుసరించి యీతని వాక్కులు నేటికిని విగుంభనముగనే వ్రాతప్రతులలో నిలచియున్న విసుమా !

శృంగారదీపభాణము – వేంకటాధ్వరి :

విశ్వగుణాదర్శముతో శాశ్వతఖ్యాతి నందిన వేంకటాధ్వరి లేఖినినుండి వెలువడిన దీ శృంగారదీపభాణము. కాంచీనగరమున వేంచేసి యున్న యథోక్తకారి మురవైరి యాత్రోత్సవమున ప్రదర్శించిన భాణము. రూపమున అసమగ్ర మయినను గుణమున సమగ్రము, సుందరము నగు నీ భాణమునందలి యితివృత్తము సామాన్యమే, కాని ధీమాన్యులను కూడ తల లూపింపచేయు కవితాప్రాగల్భ్యమును కలిగియున్నది.

అష్టాదశవర్ణనములలో జలక్రీడావర్ణన మొకటి. దీనిని సంస్కృతాంధ్రకవులు వివిధరీతులలో వర్ణించిరి. కాని అవి సరసమనోజ్ఞముగ లేవేమో యని యనిపించును. జలక్రీడలాడుచున్న నాయికను సరస్సు నిస్సపత్నముగ అనుభవించుచున్నదను ఇతని శ్లోకమును చూడుడు

తీరోత్సృష్టనిచోలచేల ముదకే లీలాజుషాం సుభ్రువాం
సర్వాంగాని నిగూహనం రతికథాప్రాయో..... కర్ణనమ్।
ఆమృష్టస్తనకుంకుమాదివహనం వీచీభుజాస్ఫోటనం
స్వచ్ఛం సంప్రతి నిస్సపత్న మఖిలం లీలాసరః సేవతే॥

పుంలింగ మగు సరశ్శబ్దమును ప్రయోగించుటయే కాక లీలా శబ్దముతో సమసింపచేయుట కవి యొక్క ఔచిత్యపోషణమునకు, సాహిత్యపౌరోహిత్యమునకు నిదర్శనము.

మదనలేఖ వీణను వాయించుట నీతడు రాగసహితముగ సూచించినాడు. దీనినే ఇతరులు, అర్వాచీనులు ఆదరించిరి.

శ్రీరాగో భైరవీ తోడీ కాంభోజీ మధ్యమావతీ।
నారీ వరాళీ పున్నాగవరాళీ గీయతే కలమ్॥

ఇట్లు సరాగముగ సరాగమును ప్రకటించినది మదనలేఖ. అంతటితో నాగక ప్రాకృతమున కూడ గానము చేయును. చివరకు తాంబూల మర్పించును. రసికుల కమృతాయమానమైనది తాంబూల సేవనము. ఈ తాంబూలవర్ణనము పెద్దన కందమును తలపించుచున్నది.

మృగమదసౌరభవిభవ

ద్విగుణితఘనసారసాంద్రవీటీగంధ
స్థగితేతరపరిమళమై
మగువ పొలుపుఁ దెలుపునొక్క మారుత మొలసెన్.   మనుచరిత్రము 2 ఆ.

కర్పూరసురభి ర్వీటీద్విగుణిత సౌరభ్య మాననాంభోజమ్।
ఆచుంబితం మయా చే దిదమపి తాంబూల సేవనం సఫలమ్॥

వర్ణన విషయమున వేంకటాధ్వరిది ఒక విశిష్టమైన బాణి. సమకాలిక జీవనమును, దేశ పరిస్థితులను, ఆచారవ్యవహారములను ఇతని వర్ణనలు ప్రతిబింబించుచుండును. ఆంధ్రయువతుల నీతడు వర్ణించినతీరు చూడుడు.

ఆపాదలంబివసనా నిస్తులవక్షోజనమ్రమధ్యలతా।
ఆంధ్రీ భాతి వధూటీ తాళీదలక్లృప్తముగ్ధతాటంకా॥

ఆంధ్రపురంధ్రులనే గాక, ఘూర్జరాంగనలను, మరాటీవనితలను, కర్ణాట యోషలను వర్ణించినాడు. అందరి వర్ణనముతో ఆనందమును అందించుటే గాక వేశ్యాగమనము వలదని యుద్బోధించినాడు.

వేశ్యాజనేభ్యో ద్రవిణం వితీర్ణం
ఋణం చ దత్తం నిరపత్రపేభ్యః।
దత్తా చ తస్తాయని వారిధారా
పునర్గ్రహీతుం పురుషై ర్న శక్యమ్॥

నరేంద్రవర్ణనము, కుక్కుటయుద్ధము మున్నగునవి ఇతర భాణములతో సమానమే. రసవంతమయిన యీకృతి చివరివరకు లభించలేదు. తరుణ మయూరముల నృత్తముతో మిగిలిపోయినది.

ప్రాసాదాగ్రప్రచుర విలసత్పద్మరాగేంద్రనీల
చ్ఛాయాస్రోతశ్శబలితతనౌ శారదే నీరదేపి।
సంతుష్యంత స్తటిదభివృతశ్యామజీమూతబుద్ధ్యా
చంచత్పింఛా స్తరుణశిఖినో నృత్తరీతిం భజన్తే॥

మదనభూషణభాణము – అప్పాయజ్వ:

క్రీ||శ|| 1684–1711 మధ్య తంజావూరును పరిపాలించిన శాహజీమహారాజు ఆస్థానవిద్వాంసులలో అప్పాయజ్వ ఒకరు. తంజావూరు సమీపమున గల కెలియూరు అగ్రహారము ఇతని నివాసము. తండ్రి చిదంబరేశ్వర దీక్షితులు. ప్రఖ్యాత విద్వాంసులు. ఈతడింకను 1) శృంగారమంజరీశాహరాజీయము 2) గౌరీమాయూరచంపువు 3) ఆచార నవనీతము మున్నగు గ్రంథములను వ్రాసినాడు.

ఈ మదనభూషణభాణము గౌరీమాయూరనాథుని వసంతోత్సవములో ప్రదర్శించుట కుద్దేశింపబడినది. ఇందు మదనభూషణుని చరిత్ర వర్ణింపబడినది. మదన మంజరి పుత్రిక అయిన వకుళమంజరి ప్రథమరంగాధిరోహణసమయమున మదనభూషణుడు ప్రాతఃకాలముననే బయలుదేరి, నగర వీథులలో పయనించుచు, ఆమెను కలసి కొనుట యిందలి ప్రధానేతివృత్తము. మధ్యలో కనకవల్లి సోదరి చంపకమాలతోను, విశ్వనాథభట్టుతోడను సంభాషించుచు, చంద్రకళ అను వేశ్యయొక్క కందుక క్రీడను వర్ణించును. వేశ్యమాతను జుగుప్సావహముగ వర్ణించి, ఆమె భూతపూర్వశృంగారమును సయితము వివరించును. ఆహితుండికుని వర్ణనములో వాని చేతిలో నున్న కోతిని సయితము వర్ణించెను.

ఐంద్రజాలికుని వర్ణనము, కుక్కుటయుద్ధమును, వేశ్యల నాట్యవిద్యాభ్యాసమును తిలకించును. మల్లయుద్ధమును వర్ణించును. ఇతర భాణములందు లేని విశేష మిందొకటి కన్పించును. ఇందలివిటుడు ద్యూతమును నిందించు విధము విశేషముగ గుర్తింపదగినది.

నలో నష్టశ్రీకః సపది స పున ర్ధర్మతనయో
వియు క్తః స్త్రీపుత్రై రపిచ సహజై ర్బంధునికరైః।
కలే రక్షాస్థానం కమలభవనే నైవ విహితం
తతో నింద్యం సద్భిః విటజనవిలాసాస్పద మిదమ్ ॥

ప్రాయికముగ భాణము లన్నియు శృంగారరస (ఆభాస) భూయిష్టములు. కాని ఈ భాణము హాస్యరససమ్మిళితమై యొప్పుచున్నది. కవియే స్వయముగ

"కాలో వసంతః ప్రథమో రసానాం హాస్యేన యస్మిన్ ప్రతతేఽభినేయః" అని పలికినాడు.

సమాజప్రతిబింబములుగా వెలువడి, వ్యంగ్యరూపమున నుపదేశమిచ్చు నీ భాణములలో అచ్చటచ్చట ప్రత్యక్షోపదేశము లుండుట గమనార్హము.

"సర్వాసా మేక ఏవ నియతః పతి రంగీకరణీయో న సర్వః"

ఇట్లుపదేశానందములు రెంటిని జోడించి సమర్పించుటచేత ఇతడు "సభాజనవశీకరణప్రవీణు" డైనాడు.

శృంగార సర్వస్వభాణము – నల్లాదీక్షితుడు :

"రసే సారః చమత్కారః"[1] అని నిండుగ నవ్వగల మనస్సుల నభినందించిన విశ్వేశ్వరుని వచనము బహుధా ప్రశంసనీయము. సామాన్యముగ భాణము లన్నియు చమత్కారములే. అయినను శృంగార సర్వస్వభాణమునందు చమత్కార సార మంతయు నెలకొన్నది. ఈ పేరుతో నాలుగు భాణము లున్నను నల్లాదీక్షితుడు రచించిన భాణము ప్రథమగణ్యము. ఈతని తండ్రి బాలచంద్రదీక్షితులు. ఈతడు పదునేడవ శతాబ్ద్యంతమందు కాని, పదునెనిమిదవ శతాబ్దపూర్వభాగమున కాని నివసించి యుండ వచ్చును. కౌశిక గోత్రుడు. కుంభకోణనగరమునకు దగ్గరనున్న కందర మాణిక్యాగ్రహార మీతని జన్మస్థలము.[2]

మధ్యార్జుననగర మందలి మహాలింగేశ్వరుని వసంతోత్సవమునందు ప్రదర్శించుటకు తనమిత్రుని (వైద్యనాథుని)చే ప్రేరేపింపబడి కవి ఈ భాణమును రచించెనని ప్రస్తావన చెప్పుచున్నది.[3] ఈతడు సుభద్రాపరిణయనాటకము, చిత్తవృత్తి కల్యాణము, జీవన్ముక్తి కల్యాణము[4], అద్వైతమంజరి, పరిమళాఖ్యమను వ్యాఖ్య మున్నగు వానిని రచించెను.

ఆనందశేఖరుడను విటుడు కనకలతావియుక్తుడై విరహము ననుభవించుచు రంగస్థలమున ప్రవేశించును. ఇతని కనంగ శేఖరుడనియు పేరు. కనకలత సఖియైన చంద్రముఖి సహకారముతో కనకలతను కలియుటతో రూపకము ముగియును. మధ్యమధ్య అనేక చమత్కారములను, సత్కార్యముల నీ భాణము లెస్సగా నిముడ్చుకొన్నది.

ఇది కొంతవరకు కులకాంతలపై, వారి గేహపంజరబంధనముపై సానుభూతి చూపును. మధ్యలో వీని కనుబంధముగ గాజులవాళ్ళు కాంతలకు గాజులు వేయుట మున్నగు చమత్కారములును కలవు. వివిధక్రీడ లందు కలహించిన ప్రేయసీ ప్రియుల

1. చమత్కార చంద్రిక.
2. శృంగార సర్వస్వభాణము - శ్లో6.
3. శృంగార సర్వస్వభాణము ల్లో 10.
4. సాగరిక - 14-3-256.

కలహములు తీర్చుట కేర్పడిన న్యాయస్థానదృశ్యము కూడ కన్పించును. ఆ పై ఉండూరు పండితుని దేశాంతరప్రణయగాథ, చివరగా తన్నుగూర్చి ఆలోచన. ఈ భాణమందు భాషా, భావచమత్కారము లెన్నియో కలవు.

సంస్కృతకృతులు వ్యవహారమునకు, గుడికి బారెడు దూరముననుండునని యనేకుల యభిప్రాయములు. కాని ఈ కవి పలుతావుల తన ప్రయోగములతో వ్యవహారమును సంస్కృతమునకు పరిచయము చేయును. కుంచిత పంచాంగులిప్రయోగః (పుట 15); కిం వక్ష్యే తం మహాభారతమ్, జీర్ణశూర్పేణ సంతాడ్య (పుట 19); కిం సర్వో ప్యనంగశేఖరః (పుట 19) మొదలగు ప్రయోగములు వ్యవహార భాషాభావమునకు చక్కని ఉదాహరణములు. నానుడులతో పాటు సామెతలకు కూడ ఈ భాణమందు లోటులేదు. "మార్గే గచ్ఛతో మందిర నిర్మాణం సుకరం భిభ్రతః ఖలు భారః" (పుట 26), ఆలయఘంటామణినాశేపి అర్చకస్య కా హానిః (పుట 27), కి మిదానీ మాపణనాలికేరం అధ్వవినాయకస్య ప్రహరసి (పుట 27) మొదలగు సామెతలు రమణీయములు.

ఈతని శైలి చాల మృదువైనది. అనంగశేఖరుడు కనకలతతో విరహముతో బాధపడునపుడు విప్రలంభశృంగారమున కనుగుణముగ అలతి అలతి పదములతో వైదర్భీరీతిలో ప్రసాద, అర్థవ్యక్తి గుణములలో రచించిన శ్లోకమును పరిశీలింతము.

శకలయతి మనో మే శంబరారి శ్శరౌఘైః
శిథిలయతి శరీరం శీతలో గంధవాహః।
ప్రబలయతి పికానాం పంచమః కామరోగం
ద్విగుణయతి చ తాపం దారుణ శ్చన్ద్రపాదః॥ [1]

రత్నచూడుడు, కంబుకంఠి 'సరిబేసుల' ఆటయందు కలహించి, అనంగశేఖరుని యొద్దకు వచ్చి, వారి వాదనలను వినిపించుటలోని ఒక సన్నివేశము తల లూపించును. రత్నచూరుడు నిష్కారణముగ తన కుచభరమున చేయివేసెనని కంబుకంఠి యారో-పించినపుడు అతని సమాధాన మందెంత చమత్కారము దాగియున్నదో చూడుడు.

ముక్తాఫలం కిరన్త్యాః ముగ్ధదృశః స్తనధరేణ మదపాంగః।
గ్రస్తస్తా ముపదాతుం న్యస్తో హస్తో మయా తత్ర॥

ముక్తాఫలములను విరజిమ్మెడి ఆమె స్తనభారముచే ఈతని చూపు మ్రింగివేయ బడ్డదట. తిరిగి దానిని తీసికొనుటకు అత డక్కడ చేయి పెట్టినాడట. సంభాషణలను

1. శృంగారసర్వస్వ – శ్లో 18

ఇంకను అద్భుతముగ ఉత్తరోత్తరచమత్కారస్ఫూర్తితో రచించగల నేర్పు ఈతనికి వెన్నతో పెట్టిన విద్య. తగవులు, తీర్పులు ఎక్కువగుటచే ఆ శక్తిని ప్రదర్శించుటకు ఇతనికి మరింత అవకాశము కలిగినది. వాదిప్రతివాదుల ఆరోపణలు విను కొలదీ నోరూరుచుండును.

లోకమున తెలివితక్కువ వానిని మందుడని యందుము. అతడు మందప్రజ్ఞుడని, మందబుద్ధి యని యందుము. అతడు మాన్యుడు కాడని లోకమున రూఢి. దాని నీతడు తిరస్కరించి చమత్కరించును.

కథ మేషా మద్వచన మనాదృత్య మందపవన మే
వాభినందతి – హన్త! మందోపి కశ్చి త్క్వాచి న్మాన్య ఏవ –
ఉత్పులకగండభరయా నముదితసీత్కారధారయా సుదృశా।
సంప్రాఘ్రతో యువత్యా సాదర మాలింగ్యతే పవనః॥ 54 శ్లో॥

పవనవిషయమున మందత్వము మాన్యమే కదా! 'పిల్ల'గాలి ఉల్లమునకు చల్లదనము కలిగింపకుండునా?

సాహిత్యప్రస్థానమున ప్రధానమైన ధ్వనిప్రస్థానమున నీతడు నల్లేరుపై బండి నడక సాగించినాడు. ఏ భావమును ఎంతవరకు చెప్పవలెనో ఈతనికి బాగుగా తెలియును. ఉదాహరణగా ఒక అర్థాంతర సంక్రమిత వాచ్యధ్వనిని చూడుడు.

ఉత్సంగే భవతీం నిధాయ సరసం సంలాప మభ్యస్య చ
ప్రేమ్ణా తే ముఖవీటికావినిమయవ్యాజా ద్గృహీత్వాధరమ్।
పాణిభ్యామపి తే పయోధరభరామర్శం విధాయ స్వయం
కామప్యద్య కృతిం కయాపి విధయా కర్తుం మనః కాంక్షతి॥

ఏదో పనిని ఏదో రీతిగా చేయవలెననెడి ఆ మనస్సులోని ఔచిత్యము అపారము గదా! ఇంతేగాక పలువిధముల ఆటలు, ఆ ఆటలలో గొడవలు మొదలగు అనేక చమత్కారములకు ఈ భాణ మాటపట్టు. ఈ భాణము నితడు లేతవయసులో రచించినను సాహిత్యలోకమున సహపంక్తియందు పెద్దపీటకు నోచుకున్నదే "మధ్యేశ్యామ స్స్తన ఇవ భువః శేషవిస్తారపాండు"[1] అన్న కాళిదాసభావమును అనుసరించిన ఇతని శ్లోకమును చవిచూచి కడసారి కైమోడ్పు లర్పింతము.

ప్రాచీకుచ ముదయాద్రిం పరిరభమాణైః కర్త స్తపనః।

కంచనవికాసయోగం కురుతే సరసీముఖాబ్జేషు ॥ 24 శ్లో.

మదనసంజీవనభాణము – ఘనశ్యాముడు :

1729 నుండి 1735 వరకు తంజావూరును పరిపాలించిన తుక్కోజీ ఆస్థానమున మంత్రిపదవి నలంకరించి "ఇదం బ్రాహ్మ్య మిదం క్షాత్రమ్" అను సూక్తికి నిదర్శనప్రాయుడైనవాడు ఘనశ్యాముడు. ఈతడు సుమారు 1700 ప్రాంతమున జనించి యుండవచ్చును. వీరి వంశము విద్వద్వంశము. ఈతడు కేవలము సరస్వత్య-వతారమని లోకప్రసిద్ధి.[2] ఈత డనేక ప్రక్రియలను చేపట్టి కృతులను రచించినాడు. నాటకము, బాణము, సట్టకము, చంపువు, అన్యాపదేశశతకము, ప్రహసనము మున్నగు వానిని రచించెను. లభ్యములైన రూపకములలో కుమారవిజయనాటకము, అనుభూతిచింతామణి, మున్నగునవి పేర్కొనదగినవి. ద్వాదశవర్షప్రాయముననే యితడు యుద్ధకాండ చంపువును రచించెనట. ఈతడు మొత్తముమీద 64 సంస్కృత గ్రంథములను, ప్రాకృతాదీతర భాషలలో 20 గ్రంథములను రచించెనట. నవగ్రహ చరితమందలి యీ క్రింది శ్లోకము వీరి మానసిక ప్రవృత్తిని పట్టియిచ్చును.

దత్త్వా గ్రామాన్ ద్విజేభ్యః కృతమఖబుధ సాత్కృత్య దంతావలేంద్రాన్
కృత్వా శ్రీపౌండరీకం రచితవనసరః సత్రదేవాలయాదిః।
నీత్వా ఖ్యాతిప్రబంధాన్ ప్రథితరణయశా న్యస్య రాజ్యేషు పుత్రా
నంతే సంన్యస్య శంభో త్వయి హృదివపుర్గాంగ నీరేర్పయామి ॥

జీవించినంత కాలము సత్కార్యముల నాచరించి, సన్యసించి, లోకశంకరుడైన శంకరుని ధ్యానించుచు, అంతకాలమున జీవములతో నుండగనే శరీరమును గంగా జలమున నర్పించుట యాచారముగ కానవచ్చుచున్నది. అపరిమిత భూతదయ, ఇక పనికిరాని శరీరముతో జలచరములకు తృప్తికలిగించుట యిందలి ఆశయము.

ఇట్టి సదాశయము కల ఘనశ్యాముడు ఒకపూటలో వ్రాసిన కృతి యీ మదన సంజీవనభాణము. పుండరీకపురము(చిదంబరము)న కల కనకసభాపతి ఆర్ద్రాదర్శన మహోత్సవసమయమున నిది ప్రయోగింపబడినది. కులభూషణుడను నాయకుడు చిత్రలేఖ యను నాయికను కలిసికొనుట, ఆమెకొఱకై బయలుదేరి వేశ్యవాటికను, మల్లయుద్ధము, మేషయుద్ధము, కందుక క్రీడ మున్నగువానిని తిలకించుట, చివరకు

1. మేఘసందేశము - ప్రథమసర్గ,
2. సరస్వతీఘనశ్యామో ఘనశ్యామః సరస్వతీ

దేవాలయమున దైవధ్యాన మొనర్చుట, వెంటనే మనోరథసిద్ధి యగుట యిందలి కథాంశము. పాములవాని వర్ణనము సమగ్రముగ చేయబడినది.

వ్రాసినది భాణమైనను భక్తి భావమును, ఆధ్యాత్మికభావనను వీడని కవియొక్క వ్యంగ్యరచనావైభవమును చూడుడు. శ్రీకంఠుని ఘంటానాదమేమని ఘోషించుచున్నదో!

> పుత్రాః కే దయితా చ కా జనయితా కః కస్య మాతా చ కా
> త్రాతా కస్య చ క స్తదేత దఖిలం హంతేంద్రజాలోపమమ్।
> సంసారో జలధి స్తమః కిల నిశా మాయాఖిలం విష్టపం
> సాధో జాగృహి జాగృహీతి రణతి శ్రీకంఠఘంటామణిః ॥ 18.

ఇట్లు వేదాంతబోధ మాత్రమే కాక విభిన్న సంప్రదాయము లెట్లెట్లు భ్రష్టము లగుచున్నవో తెలిపినాడు. వ్యంగ్యరూపమున నుపదేశమిచ్చుచు వేశ్యలను గూర్చి "కుశలః కిల దిగంబరమపి నగ్నయితుం వేశ్యాజనః" అనుట కవితాచమత్కృతికి భావతీవ్రతకును నిదర్శనమనక తప్పదు.

శృంగార సుందర భాణము – ఈశ్వరవర్మ:

ఇది ఈశ్వరవర్మ విరచితము. కవి తనను గూర్చి ప్రస్తావనయందు రెండు శ్లోకములు చెప్పెను (ప్రస్తావన 4, 5). ఆ రెండు శ్లోకము లాధారముగ అతడు బింబలీ వాసి యనియు, అతని గురువు వ్యాఘ్రనగరవాసియైన ద్విజరాజశిరోమణి[1] నంబూద్రి అనియు తెలియుచున్నది. ఈ గురువు బహుశః పులియనూరుకు సంబంధించిన వాడని డా॥ కుంజుణ్ణిరాజాగారి అభిప్రాయము.[2] ఈ కవి కాలమునుగూర్చి మనకు నిశ్చితముగా ఏమియు తెలియదు. కాని గ్రంథ సంపాదకులు శ్రీ కె. రాఘవన్ పిళ్ళైగారి అభిప్రాయ మిట్లున్నది.[3]

However, since the author did not mention any king of Bimbali, we may conjecture that he might have lived after the annexation of that state by king Marthandavarma of Travancore about 1750 A.D.... possibly he was Patronised by a king of cochin to whom he refers as the king of Keral. (కేరళాధీశ్వర–42 P)

1. Preface Page-3.
2. The Contribution of Kerala to Sanskrit Literature
3. Preface page-4.

ఈ రచయిత తెరవెనుక, తెరముందును మంగళశ్లోకములను పాడించి రూపక మారంభించును. తెరవెనుక నాందియైన పిదప మరల సూత్రధారుడు ప్రవేశించి ఆ శ్లోకములు పఠించును. ఈ ప్రస్తావన ఏకహార్యమే. నేపథ్యముననుండి నటి సహకరించును. ప్రస్తావనాంతమున అభిరాముడను విటుడు రంగస్థలమున ప్రవేశించుటతో భాణమారంభమగును

భ్రమరకుని యందనురక్తయైన కేసరమాలికను బృహద్వసుకుమారుడైన మహా వసువు బంధించును. అతని కామెయందు వైరాగ్యమును కలించుటకు హేమమాలికను నియోగించిన అభిరాముడు రంగస్థలమున ప్రవేశించును. అతడు మార్గమధ్యమున అనేకులను పరామర్శించి, తుదకు సంధ్యాసమయమున మహావసుపు మందిరమును సమీపించి, అక్కడ హేమమాలిక, కేసరమాలికలతో కలసి ఉపాయ మాలోచించి.. దాని ననుసరించి కేసరమాలికను మహావసువునుండి వేరుచేసి, భ్రమరకునితో సంయోగించుట ఇందలి ఇతివృత్తము.

ఏ కోణమునుండి పరిశీలించినను ఈ భాణము మనోహరముగా కన్పట్టును. సామాన్యముగా భాణములలో కథైక్యము కన్పట్టదు. కాని ఈ భాణ మీభావమున కప వాదము. సన్నివేశముల ఏకసూత్రత విషయమునను, కథైక్యవిషయమున ఈతడు ప్రదర్శించిన నేర్పు ప్రశంసనీయము. కథలో బీజము, నిర్వహణము అద్భుతముగా జరుగును. రూపకమధ్యమునను సన్నివేశములలో నొకదాని కొకదానికి సంధానము కూర్చి వర్ణించును.

అంతియగాక ఇది ఆత్మాశ్రయపరాశ్రయములకు రెండింటికి సంగమస్థానము. భాణమందు అన్యకార్యసాధనార్థియై ఆ యా వ్యక్తుల ప్రణయాది విషయములను వర్ణించుచు పరాశ్రయ కవితానాయకుడు అగును. కాని మధ్యమధ్యన ప్రణయ వచనములనే కాక తన విరహావస్థను కూడ ప్రదర్శించును. ఆ సమయమున అది ఆత్మాశ్రయకోటిలోనికి చేరును. ఇందు నాయిక స్వీయ, ముగ్ధ అగుట గుర్తింపవలసిన గుణము.

ఇక రసవిషయమున అనేక భాణములలో రసాభాసము ప్రధానమైనట్లు ఇందు రసాభాసము ప్రధానమై లేదు. స్వచ్ఛమైన ప్రణయము, నిష్కల్మషప్రేమ ఫలించుట ఇందలి కథాఫలమై శృంగారరసము నిందు ప్రధానము చేయుచున్నది. నాటక మధ్యమునను రసాభాసము అత్యల్పముగనే వర్ణింపబడును. వర్ణనములును

శ్రుతి మించక రమణీయములై ఆ రసాభాసమును ప్రధాన శృంగార రసాంగము చేయుటలో సహకరించును

ఇందలి శారికాప్రసంగము, రతిచిత్ర వర్ణనము, లీలాశుక ప్రస్తావనము, కుముదామోదిని అభిరాముని కన్నులుమూసి పేరు అడుగుట, కోకీశృంగారవర్ణనము మొదలగునని చక్కని సన్నివేశములు. కుముదామోదిని కన్నులు మూసినపుడు గుర్తింపుగా చెప్పిన శ్లోక మొక చక్కని రచన.

తత్సౌమ్యాంగి స్మరసి ను రతేః ప్రక్రమే తత్ర యత్తే
క్షౌమం హృత్వా ద్రుతముపవనే పుష్పవృక్షే మయాస్తమ్।
క్రీడా హేతో స్తదను విరతావప్యదానేన తస్య
త్వం మద్వాసః పృథునిజఘనే యద్దధానా రుషాగాః॥ 106

ఈ కవియందు గుర్తింపవలసిన మరొక గుణము శైలీసారళ్యము, మృదుభావ ప్రదర్శనము. వైదర్భీరీతి ప్రధానమై అర్థవ్యక్తి గుణభాసితమైన రచన ఎక్కువ పాళ్ళలో కనిపించును.

శైలీసారళ్యము.

క్షరన్మరందాన్యురు సౌరభాణి
నై వాస్య పుష్పాణ్యళయో లిహన్తి।
గుణాభిరామా అపి కేచిదర్థాః
ప్రాయేణ కేషాంచన సస్త్యనిష్టాః॥ 91

భావములందలి వైచిత్ర్యమునకు ఒక ఉదాహరణ.

స్త్రీపుంసానాం త్రిజగతి కఠోరాణి చిత్తాని భే త్తుం
భూయోభూయః కుసుమవిశిఖా నిక్షుధన్వా విముంచన్।
భగ్నౌ భగ్నౌ ధనుషి సపది ప్రగృహీతుం తతోన్యత్
గౌణీకూలే కిల విచరతి స్ఫీత నీలేక్షుజాలే॥ 41

పై పద్యమందు ప్రథమపాదమున యతి భంగ మేర్పడినది. అయినను భావ మాధుర్యము ఆ దోషమును అణిచివేయును. 'ఏకో హి దోషో గుణసన్నిపాతే నిమజ్జతి'.

ఈ కవి ఔచిత్యమును పాటించుటలో సిద్ధహస్తుడు. భ్రమరకవిరహ వర్ణనలో శ్లోకమును సగము మాత్రమే పలికి మూర్ఛనందుట, ఆ శ్లోకమును అపరిసమాప్తిగనే యుంచుట చక్కని ఔచిత్యపాలనము.

అలంకారపోషణలో నిత డెక్కువ ఉపమోత్ప్రేక్షలను ఆదరించినాడు. సామాన్యముగా వర్ణన అవసరమైనపుడు ఈ రెండు అలంకారములలో ఏదేనొకటి ఎక్కువ భాగము కన్పట్టును. ఒక ఉదాహరణ.

మనో జనానాం మధురాభిరామైర్గుణైర్హ రంత్యో గణికా నికామమ్ ।
విభాన్తి సాక్షిప్రతివల్లభస్య శృంగారలీలా ఇవ మూర్తిమత్యః ॥ 26

ఈ కవి రచనలో అనేకసూక్తులు సంస్కృతిని, సంస్కారవిశేషములను నిరూపించగలవి కన్పట్టును. చిన్న ఉదాహరణ :

ఉభయోర్గూఢ మన్యోన్యం వదతోర్యో నరోస్తికమ్ ।
వినా కారణ మభ్యేతి తం ద్విపాదం విదుః పశుమ్ ॥

ఇట్లు చెప్పుకొనుచు పోయిననో ఉటంకించవలసిన రమణీయశ్లోకము లీ భాణములో మిక్కిలిగా కలవు. సామాన్యభాణములందు వలె సంభాషణాత్మక శ్లోకములు, లాస్యాంగములైన పాఠ్యనాట్యసంగీతాదులు, వేశ్యావర్ణనలు ఇందు లేకపోలేదు. ఇట్టి ఈ భాణ మనేక శిథిలభాగములతో నిండియుండుట శోచనీయమైన విషయము. ఇన్ని గుణములున్న ఈ భాణమందు భరతవాక్యము లేదు. మనకు లభించు భాణములలో చక్కని రచనగా గుర్తింపవలసినవానిలో ఇది యొకటి. అనేక భాణముల వలె నిది పఠనవేళ విసువు జనింపజేయకుండుట విశేషము. చివరగా ఒక చక్కని విశేషములతో కూడిన పద్యము

భ్రమరక ఇతినామన్యస్య సంకీర్తితేపి
శ్రుతిపథ ముపయాతే తాం దిశం వీక్షమాణా ।
అవిరతపరిపాతాముత్సృజన్త్యశ్రుధారాం
జనయతి జలముచ్చైః పశ్యతాం చేక్షణేషు ॥ 16

కామబాణభాణము – నారాయణకవి :

'వైదికునిచేతి విడెమాయె వనిత బ్రతుకు' అని ఒక తెలుగుకవి వాపోయెను. ఆ భావము దేవవాణిలో ఇంకను విపులముగ ఇట్లు సాక్షాత్కరించును.

ఇష్టేః కాలోఽయమస్మ త్ప్రతృదినమథ సంక్రాంతిరద్య ప్రదోషో
జన్మర్షం పౌర్ణమాసీ ప్రతిపదమథకుహూ స్త్వ ద్వదేకాదశీతి।
ఇత్థం త్యాజ్యా నిషేకే పునరపి దివసా దూషితాశ్చాపి మూఢైః
త్యక్తస్తే శ్రోత్రియైస్తత్ కులతరళదృశాం యౌవనం నష్టమేవ॥ [1]

ఇంత చక్కగా ఆ భావములను ప్రతిబింబించిన ఘనత నారాయణకవిది. ఆ వనితల స్థితి వైదికుని చేతి విడెమయినట్లు ఈ భాణముకూడ నేటివరకు వ్యర్థముగ తాళపత్రగ్రంథములలో తలదాచుకొని గుంభనముగ కాపురము చేయుచున్నది.

ఈ నారాయణకవి భారద్వాజ గోత్రుడు. ఇతని తండ్రి సుబ్రహ్మణ్యుడు. కోయంపురి నివాసి. వైద్యజ్యోతిర్మంత్రాదివిద్యలందు ఈ కవి ప్రవీణుడు.[2] పశ్చిమ చిదంబర నర్తనకేశీ విహారరసికుడైన గోష్ఠీశ్వరుని నవ్యభవ్యమహోత్సవవేళలో నిది ప్రయుక్తము. కందర్పమంజరీవిరహార్తుడైన కందర్ప సుందరుడు రంగస్థలమున ప్రవేశించి, కందర్పమంజరిని కలిసికొనుటతో భాణము సమాప్తమగును.

నిర్ఝరప్రవాహము వలె సాగిపోవు శైలి ఈ భాణములో పద్యగద్యముల రెండింటి యందు మనకు కన్పించును. ఇతర భాణములలో వలె పద్యములు మిక్కుటములు. అట్లే కవి దీర్ఘ గద్యములను సైతము వ్రాయక పోలేదు. ఆ గద్యశైలిలో బాణుని అనుసరణము లేకపోలేదు. ప్రారంభముననే విటుని ప్రవేశమును సూచించుచు దీర్ఘమైన వచనరచన కన్పించును. గద్యయందే కాదంబరి శైలిని చూడుడు.

"కందర్ప ఇవ అఖిలాలంకృతిసుందరాకృతిః, నర్తనమండపః కామసిద్ధాంతస్య కేసరికిశోర ఇవ అతిగంభీరదృష్టిః, దశరథ ఇవ రామావలోకనకుతుకః, ఈషదున్మీలిత కంధరోఽపి అధురంధరః"[3]

ఈ కవి పద్యగమనము కూడ దీర్ఘ సమాసములతో, అలతి అలతి పదములతో కూడ స్వేచ్ఛగా సాగిపోవును. వారాంగనలు కేవలము ద్రవ్యార్జనకే ప్రాధాన్య మిచ్చుచు ప్రవర్తించి, రసికులను సైతము నిర్లక్ష్యము చేయు విషయమును ఎంత చక్కని శైలిలో రచించెనో గమనించుడు.

సత్కారస్వాత సారసారససరోహంసాభ విద్వాంస మ

1. కామబాణభాణము-అముద్రితము Adayar Library పుట 43b..
2. కామబాణభాణము. - ప్రస్తావన. 3. కామబాణభాణము 68 పుట.

ప్యాపద్భూరికృతోపకార మతిసౌందర్యం లసద్యౌవనమ్।
శూరం సత్కులసంభవం పరిచితం త్యక్త్వా విధీర్యాన్వహం
ద్రవ్యాప్త్యై ధనినం కురూపిణ మపి ప్రార్థ్యన్తి వారాంగనాః॥ [1]

ఇంత చక్కని శైలిని వశపరచుకొని ఈ కవి కథావిషయములో మాత్రము యథాతథముగా భాణముల స్వభావమును అనుసరించినాడు. వివిధ నారీ వర్ణనము, వారితో విటసంభాషణములు, వీణావాదన, డోలావిహారములు, పండితపుత్రులు, కందుకక్రీడ అన్నియు సాక్షాత్కరించును.

కాని ఇతని స్వభావ పరిశీలనాశక్తి మాత్రము మనోహరముగా నుండును. వేశ్యాతత్త్వమును, నారీమనస్తత్త్వమును నిరూపించుటలో కూడ మిగుల నేర్పు చూపినాడు.

ఆయాతే రతిగేహ మాత్మదయితే వ్యాజేన వా కేనచి
న్నిర్యాతా బహి రన్య మన్య దసకృత్ సంప్రీణయన్త్యో రతైః।
శ్రాంతారం త ముపేత్య చాత్మసదనం వారాంగనా ద్యూతసం
గీతాలాపకథా ప్రసంగకలహవ్యాజైర్నిశాం నేష్యతి॥ [2]

తన భర్త శయనమందిరమున ప్రవేశింపగా ఆమె ఏదో సాకుతో వెలికి వెళ్ళి, ఉపపతిని ప్రకారాంతరమున సంతోషింపజేసి, అలసి మరల తన సదనమునకు వచ్చి, ద్యూతము, సంగీతములతో కాలక్షేపము చేయునట. ఇది వారాంగనాతత్త్వము. వారాంగనలకు భర్త ఏమిటని ఆశ్చర్యపడవలసిన అవసరము లేదు. విటులు వేశ్యలకు కళత్రపత్రములను వ్రాసి యిచ్చి కొంతకాలము భార్యలవలె చూచుకొందురు. అయితే ఈ కవి వేశ్యచేత విటునకు కూడ ఇట్టి పత్రమును వ్రాయించి యిచ్చినాడు.

ఉద్యానవర్ణనమునకు సంబంధించి వృక్షదోహదాలను వర్ణించినాడు.

శింజన్మంజీరవాదారుణచరణసరోజాహతిప్రాప్తమోదాః
దూరీకుర్వన్త్యశోకాః శుచ మతిశిశిరచ్ఛాయయా మంజుసూనైః।
మోహం మోదం పరాగై రపి సుమనికరై స్తన్వతీ మద్య మాద్యం
నారీ గండూష సేకై ర్వకుళతరుగుణశ్లాఘనీయాః కృతజ్ఞైః॥ [3]

---

1. కామబాణభాణము -178 పుట.
2. కామబాణభాణము - తాళపత్ర ప్రతి, (అడయార్ లైబ్రరీలోని దీని ప్రతికి కాపీ ఒకటి మాకడ కలదు.)
3. కామబాణభాణము - 486 పుట

ఆశోకమునకు పాదతాడనము, వకుళమునకు గండూషము వృక్షదోహదశాస్త్ర నిర్ణీతములైన దోహదములు.

ఉద్యానవర్ణనముతో పాటు నగర వర్ణనము కూడ ఈ కవి చేసెను. అంతియ కాదు. వర్ణనలో పూర్వకవ్యనుకరణ కన్పించును.

యత్రౌధాగ్రతటీకుటీర వివిధస్తమ్భాగ్రజాగ్రద్దవత్
చంద్రాశ్మప్రతిమామనో హరవపుఃప్రస్యంది పారంపరీ।
ఆదిత్యేన్ద్రపురోత్సవాయ లభతే గంగే త్యభిఖ్యాం తతో
గంగాయాం తు భువం భగీరథముదే సంప్రాప్తవత్యా ధ్రువమ్॥ [1]

అనంతభట్టు చంపూభారతములోని ఈ క్రింది శ్లోకముతో తులనాత్మక పరిశీలన చేయుడు.

యంత్రాంగనావదనయామవతీశహృష్య
చ్ఛంద్రాశ్మసౌధగలితాః సలిలప్రవాహాః।
బృందారకేంద్రనగరీబృహదుత్సవాయ
మందాకినీతి లభతే మహతీ మభిఖ్యామ్॥

చక్కని శైలి, నిశితభావములు, మనోహరవర్ణనలు గల యీ భాణము ముద్రణార్హమైనది.

తరుణభూషణభాణము – శఠకోపకవి :

కవులు చాలమంది శృంగారరసాధిదేవత అయిన మదనుని ఆశ్రయించి, యితరుల శృంగారమును వర్ణించిరే కాని అనంగుదని కాబోలు అతనిని నిర్లక్ష్యము చేసిరి. ఆ లోటు తీర్చిన భాణరచయితలలో ఒకడు శఠకోపకవి, తన తరుణభూషణ భాణమున అనంగుని శృంగారమును నాందిగా స్వీకరించినాడు.

రత్యానుభూయ రతికేళి మశేషయూనాం
తత్తాదృశం మహ మహర్నిశ మాదధానః।
ప్రేమాదృతై శ్చ మిథునై ర్విదిత ప్రభావో
మీనధ్వజో విజయతే జగదేకవీరః॥

ఇట్లు మీనధ్వజుని జగదేకవీరు డన్నచో కాదనగలమా ?

నగరనివాసరసికుడైన శ్రీనివాసుని అభినవోత్సవ సేవకు సమాగతులైన సభాసదుల సమక్షమున ప్రదర్శించుట కుద్దేశింపబడిన దీ భాణము. ఈ కవి శ్రీవత్స గోత్రసంభవుడైన శ్రీనివాసగురుని యనుగ్రహమునకు పాత్రుడు. ప్రస్తావనములోని ఒక నుడిని బట్టి కవి బాల్యములోనే ఈ భాణము రచించియుండు ననిపించుచున్నది. మదనశేఖరు డిందు నాయకుడు.

మనోహర వర్ణనలతోను, చక్కని శైలితోను, ఈ బాణము తరుణభూషణమే యగుచున్నది. వనశోభలో వనదేవతాత్వము నారోపించిన తీరు గమనార్హము. పువ్వులే నవ్వులు, తిలకమే తిలకము, పూలగుత్తులే వక్షోజములు, తేనెతో తడిపిన పుప్పొడియే చందనము, చివురే వాతెర, కింశుకములే ఆభరణములు, షట్పదశ్రేణి వేణి, వసంతుడే కాంతుడు, ఇంత భావమును గుప్పించిన శ్లోకము చూడుడు —

> ఉన్మీలత్కుసుమస్మితం సతిలకం విస్తార్య గుచ్ఛస్తనీ
> మాధ్వీసిక్తసరాగచందనవతీ బాలప్రవాళాధరా।
> భ్రాజత్కింశుకభూషణా మధుకరశ్రేణీలసద్వేణికా
> కాంతం ప్రాప్య వసంత మద్భుతగుణా రేజే వనశ్రీ రియమ్ ॥

నారాయణకవి కామబాణభాణమునకు దీనికి సాదృశ్య మెక్కువ. కామబాణ భాణమున “భోభో! రాజహంస పద్మినీ మిమాం త్యజ యాహి వేగాత్ సంప్రాప్తో యం విష... స్తటిత్వాన్” అని వచనరూపమున నున్న పదజాలము ఇతని వలన

> హే రాజహంస! నళినీం త్యజ యాహి వేగాత్
> సంప్రాప్త ఏష విషమూ ర్తి రిహ తటిత్వాన్ ॥

అని శ్లోకరూపము నందినది. కామబాణభాణమున వేశ్య వ్రాసియిచ్చిన సమ్మతి పత్రము శార్దూలమున నుండగా కొంచె మించుమించు అదే వసంతతిలక

మైనది*. ... పౌర్వాపర్యములు విచారణీయములు కాన ఎవ...

* అన్యేనాపి కేనచి ... స్యాం ...
భూయో ద్రవ్య ... మేకం వినా |
దత్త్వా త్వత్ప్రతిపాదితం తదఖిలం ప్రేమానురక్తా పునః
మాసం త్రిష్వపి సత్కళత్రపదభాక్ సద్యో భవేయం తవ || కామబాణభాణము.

అన్యేన కేనచి దహం యది సంగతా స్యా
మేకం వినా మదనశేఖర మేకవారమ్ |
దత్త్వా గృహీత మఖిలం పున రేకచిత్తా
మాసత్రయం తవ కళత్రపదా భవేయమ్ || (తరుణభూషణభాణము)

1. చంపూభారతము- ప్రథమస్తబకము,

సూర్యకాంతులు ప్రాతఃకాలమున దిగంతముల వ్యాపింప, దిశారమణులు దినపతియైన సూర్యునకు నీరాజనముల నిచ్చినట్లున్నదని క్రియోత్ప్రేక్షతో చేసిన పద్యము చూడుడు.

పర్యాయతః ప్రసరదాతపసాంద్రభీత్యా
దీవ్యద్దివాకరమణిజ్వలనప్రభాభిః।
పూర్వాద్రిశేఖరమణే ర్దివసేశ్వరస్య
నీరాజనం విదదతీవ దిశారమణ్యాః॥

శారదానందనభాణము (మిశ్రభాణము) – శ్రీనివాసాచారి :

హిందూసమాజములో అతిభయంకరాచారముగా నున్న బాల్యవివాహములను ఖండించి, ప్రమాదవశమున అట్లు జరిగినచో విధవావివాహములను ప్రోత్సహించిన కాలములో సమకాలీన సమాజమును పరామర్శించుచు బాలవిధవలకును తన భాణమున స్థానమిచ్చిన కవి కౌశిక గోత్రుడు, వరదాచార్యుని కుమారుడైన శ్రీనివాసాచారి. రసిక శేఖర ఆనందలతల ప్రణయము ఇతివృత్తముగా కలిగిన దితని శారదానందనభాణము. శరత్కాలమును, నాయికను తలపింప చేయుచు భాణమునకు నామకరణ మొనర్చుట సమంజసముగా నున్నది. శ్రీ పెరుంబుదూరునందు కార్తీకోత్సవములలో ప్రదర్శించుట కుద్దేశింపబడిన యీ శారదానందనభాణము నందు కవి విధవాసమాజము నెట్లు వర్ణించెనో చూడుడు -

అతివిపులనితంబాశ్రాంతమంద ప్రయాతం
గురుతరకుచకుంభాభోగభారాపహాంగమ్।
కలశజలధిధౌతాపాండురక్షామహృద్యం
విలసతి విధవానాం బృంద మిందూపమాస్యమ్॥

పై వర్ణనములో విశేష మేమియు లేదనిపించు అవకాశ మున్నది. కాని ఆదే అందలి చమత్కారము. వర్ణించిన లక్షణములలో ముప్పాతిక భాగము ముత్తైదువు లకు, విధవలకు సమానమే, కాని అట్లు ముత్తైదువులవంటి లక్షణములే కలిగిన

వ్యక్తికి 'విధవ' అని ముద్రపడగానే ఆ వ్యక్తిపై కలిగెడి జాలి అత్యధికము. ఆ సానుభూతికి పాత్రతను చేకూర్చెడి దీ శ్లోకము.

భావావేశవర్ణనలో ప్రశ్నల పరంపరను శరపాతములో కురిపించుట వచనరచనలో బాణుని కలవాటు. ఇతనిపై కూడ ఆ ప్రభావము కన్పించును. "కిముపదర్శికే కాలమార్గే కిం ప్రదర్శితః క్రియాభేదః? కిమంగీ కృతాన్యంగాని? కిం గ్రాహితం గ్రహత్రైవిధ్యం? కిం నిరూపితా జాతయః? మొదలగునవి. వచనరచనలో కాక శ్లోక రచనమున సైతము ప్రాచీనుల ప్రభావము అక్కడక్కడ ఇతని భావములందు కన్పించును.

సంగతాని మృగాక్షీణాం తటిద్విలసితా న్యపి।
క్షణద్వయం న తిష్ఠంతి ఘనారబ్ధా న్యపి స్వయమ్॥

అనెడి శ్లోకప్రభావ మీతనిచే నాందీ శ్లోకమును రచింపజేసినది.

సౌహార్దం వారనారీణాం సౌభాగ్యం తటితామపి।
సంపద శ్చావినీతానాం తత్క్షణైక మనోహరాః॥

వారకాంతలతో స్నేహము, మెరుపుల సొంపు, అవినీతుల సంపదల పెంపు క్షణ కాలమే మనోహరము లగునట.

స్వతంత్రరచనావిన్యాసమున సైతము ఈ కవి కవిత రమణీయభావ సన్న్యాసము కలది కాదు. ఒకనారిని 'మదనవిజయశ్రీని'గా వర్ణించిన శ్లోకమును గమనింపుడు.

గురుశ్రోణీభారా వలనవిషమై రంచితతమైః
పదన్యాసై శ్చంచన్మణినివహమంజీరముఖరైః।
ముహు శ్చేతోవృత్తిం మమ కలుషయంతీ నమయతే
భువం ప్రాప్తా సాక్షా న్మదనవిజయశ్రీ రిహ సఖీ॥

ఏ వయస్సునకు ఆ ముచ్చట కావలెనని యీ కవి చెప్పిన మాటను తలచు కొనుచు ముందుకు సాగిపోదము.

శంబరారిసమారాధనే తారుణ్యాపనయనమ్
చరమవయసి శంకరానుకీర్తనమ్ –

కామవిలాసభాణము – ప్రధాని వేంకప్ప :

రామభక్తుడైన వేంకప్ప సర్వభాషా విశారదుడై పుంభావ సరస్వతిగ సమకాలిక కవులచే స్తుతింపబడినాడు. బాబాంబికాహంపార్యుల పుత్రు డీతడు. శ్రీరామపుర వాస్తవ్యుడు. మైసూరు కృష్ణరాజునకు, చామరాజునకు ప్రధానిగా వ్యవహరించినవాడు. సర్వతంత్ర స్వతంత్రుడైన యీతడు రచించినదీ కామవిలాసభాణము. ఇత డింకను దశరూపకముల కోటికి చెందిన ఇతరరూపకముల నన్నింటిని రచించినాడు. కుక్షింభర భైక్షవమను ప్రహసనము, మహేంద్రవిజయడిమము, వీరరాఘవవ్యాయోగము, లక్ష్మీ స్వయంవరసమవకారము, సీతాకల్యాణ వీథి, రుక్మిణీమాధవ-అంకము, ఊర్వశీ సార్వభౌమమను ఈహామృగమును రచించినాడు. ప్రస్తుతభాణమును తన ప్రౌఢావస్థలో రచించినాడు. చంపకలతాపల్లవశేఖరుల ప్రణయ మిందలి యితివృత్తము. చంపకలతా వియోగపీడితుడైన పల్లవశేఖరుడు రంగపురమును వర్ణించుచు చివరకు చంపకలతను చేరుట ప్రధానవిషయము. కర్పూర మంజరి, కుముద్వతి, మణిమంజరి మున్నగువారి విశేషము లానుషంగికములు. వేశ్యావనితలు పల్లవుల హృదయముల నెట్లాకర్షింతురో చెప్పుచు కవి పాఠకహృదయముల నాకర్షించును.

> ఏకం భ్రూవలనైః స్మితై స్తదితరమ్ దృష్ట్వా పరం దీర్ఘయా
> వాచాన్యం కుచయో స్తటేన చ మనాక్ సందర్శనే నాపరమ్।
> కించిత్కించిదుదంచితాంశుక రుచి ప్రత్యంచితోరుశ్రియా
> సంప్రాప్తాన్ గృహ మేకదైవ గణికాః సమ్మోహయన్తే విటాన్॥ 57

సూర్యాస్తమయచంద్రోదయవర్ణనలు, వసంతవర్ణన మున్నగునవి సమయోచిత స్థానము లాక్రమించినవి. పండితులును రసాస్వాదసమ్మోహితు లగుదురని కవి పల్కిన పల్కులు నీటిమూటలు కాకుండ తేటిపాటలుగా రూపొందించి వాసి గాంచినాడు.

> సమ్మర్దేన రసస్య సౌఖ్యలహరీ ముద్వేల మాతన్వతః
> ఖ్యాతః కామవిలాస ఇత్యభినవో భాణో ధురీణో గుణైః।
> మాద్యంతే ప్రథియోపి యత్ర చ రసాస్వాదాయ సోఽధీయతే
> మంజర్యా మిన మంజుతాయుత మధుస్యందాన్ మిళిందా ఇవ॥ 8

శృంగారసర్వస్వభాణము – వేదాంతాచార్యులు :

వేదాంతాచార్యవిరచితమైన శృంగార సర్వస్వము తిరుపతిలోని శ్రీనివాసుని వసంతోత్సవమున ప్రయోగింపబడినది. దీని రచయిత 16వ శతాబ్ది ప్రారంభమున మధురలో నివసించినట్లు తోచును. ఈతడు సూర్యనారాయణుని శిష్యుడు. ఇత డష్టావధాని యగుట గమనార్హము.

శృంగారస్తబకభాణము – నృసింహుడు :

హారీతగోత్రజుడును, వైదికసార్వభౌముడు నగు నృసింహునిచే రచించబడిన యీ శృంగారస్తబకభాణము మధురాపురిలోని రామభద్రుని గ్రీష్మసమయయాత్రలో ప్రదర్శింపబడినది, తంజావూరు లైబ్రరీలో 4623 సంఖ్యతో దీని ప్రతి ఒకటి కలదు.

రసికతిలకభాణము – ముద్దు రామకవి :

జానకీరఘునాథాధ్వరుల తనయుడైన ముద్దురామకవిచే రచింపబడినది రసికతిలక భాణము. ఈ కవికి కవిరాక్షసుడను నామాంతరము కూడ కలదని క్రింది శ్లోకము సాక్ష్యమిచ్చును.

రఘునాథాధ్వరివరతనయస్య జానకీ గర్భజన్మనః।
కవిరాక్షసాపరనామధేయస్య ముద్దురామకవేః కృతిః॥

ఈతడు కౌండిన్యగోత్రజుడు, శాహజీ మహారాజుకాలమున నున్నవాడు. అనగా 17వ శతాబ్ది అంతమున, 18వ శతాబ్ది ఆరంభమున నున్నవాడు.

లోకానంద మమంద మాకలయతా మేకాధిప స్యాత్మజః
శ్రీశాహక్షితిపాల శేఖరమణిః శృంగారిణా మగ్రణీః।
రాజ్యం ధీసచివాదిసంభృత గుణోత్కర్షం తదస్యైధతా
మచ్ఛిన్నైః కుల మస్య తన్తుభి రనుస్యూతా ముపైతు శ్రియమ్॥

శృంగారవిలాసభాణము – సాంబశివశాస్త్రి :

మానవిక్రమమహారాజు ఆస్థానములోని మరొక విద్వాంసుడు సాంబశివశాస్త్రి. శ్రీవత్సగోత్రజుడైన యీతడు గోపాలసముద్రనివాసి. స్వామిశాస్త్రి శిష్యుడు. కనక సభాపతి కుమారుడు. మానవిక్రమమహారాజు విద్వత్సభలో నిది ప్రయోగింపబడినది.

ఈ కవి 18వ శతాబ్దివాడు. తన కవిత్వమును గూర్చి యిత డిట్లు చెప్పుకొనుట గమనార్హము.

> మనోజధను రాహితస్ఫుటసరోజగర్భస్ఫుర
> న్మరందఝురధోరణీ సరసమాధురీ సోదరీ
> సువృత్తిరసరీతిభాక్ సరసశబ్దవత్యుజ్జ్వలా
> కవే ర్జయతి సాంప్రతం జగతి తస్య సాహితీ ॥

అనంగవిజయభాణము – జగన్నాథుడు :

అనంగవిజయభాణమును కావల వంశమునకు చెందిన జగన్నాథుడు రచించినాడు. తంజావూరు శరభోజీ కడ మంత్రిగా నున్న శ్రీనివాసుని తనయు డీతడు. ఈతడుకూడ రాజ్యతంత్రములందు పాల్గొనుచుండెడివాడు.[1] శరభోజీ పాలనకాలము క్రీ.శ. 1711-1728 అగుటచే ఈతడు 18వ శతాబ్ది పూర్వభాగమున నున్నట్లు చెప్ప వచ్చును. ఇతడు శృంగారతరంగిణి యను మరియొక భాణమును రచించినట్లు ఈ గ్రంథాంతమున చెప్పికొనినాడు. ఈత డందరికిని మార్గదర్శకుడుగా నుండెడివాడని "శైలశృంగనిహితదీపో హి జగన్నాథో నామ" అను వాక్యము తెలుపును.

ఈ భాణముయొక్క ప్రథమాభినయము తంజావూరు నందలి ప్రసన్న వేంకట నాయకుని వసంతమహోత్సవమునందు జరిగినది. ఈ కవియే సూత్రధారు డగుట యిందలి విశేషము.

శృంగార సర్వస్వభాణము – అనంత నారాయణసూరి :

భారద్వాజగోత్రికుడై న అనంతనారాయణసూరి విరచిత మీ శృంగార సర్వస్వభాణము. ఈతని నివాసము పాండ్యదేశమందలి చోరవనము. క్రీ.శ.1743 ప్రాంతమున నివసించినాడు. మానవిక్రమమహీపాలునిచే ప్రార్థితుడయి మాఘోత్సవ యాత్రలో ప్రదర్శించుటకొరకీ భాణము నీతడు రచించినాడు.

ఇతని రచనము రసవంతముగ కన్పట్టును.

> ప్రస్తకచం మగ్నకుచం శ్లిష్టభుజం కించిదుచ్చలితనితంబమ్ ।
> ఉపరిరతం భువి సుదృశాం కలమణితం జయతి కామసామ్రాజ్యమ్ ॥

శారదాతిలకము – శంకరకవి :

భారద్వాజగోత్రుడగు శంకరకవి శారదాతిలకమును రచించెను. ఇతడు మహారాష్ట్రీయుడు. క్రీ.శ. 1780 ప్రాంతమువాడు. ప్రద్యుమ్న విజయనాటకము, గంగావతారచంపువు, శంకరచేతోవిలాసచంపువు ఇతని ఇతరకృతులు. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమున D19314 సంఖ్యతో గల ప్రతి అసంపూర్ణముగ నున్నది. తన్ను గూర్చి యాత డిట్లు చెప్పుకొనినాడు.

శంకరః సకలసత్కవిమాన్యః
సాహితీసరసకావ్యవిలాసః।
శారదాతిలక ముజ్జ్వలరీత్యా
కోమలం ఖలు బభాణ స భాణమ్॥

శారదాతిలకము – చామయమంత్రి :

క్రీ. శ. 1799 వ సంవత్సర సమీపమందు నివసించిన మైసూరు రాజగు కృష్ణరాజున కీతడు దత్తుడు. శృంగారరాజతిలకభాణకర్త యగు అవినాశీశ్వరున కీతడు సమకాలికుడు. శ్రీరంగపట్టణ నివాసి. హైదర్‌నవాబు సభను, వాని దేశవిజ-యాదికములను వర్ణించినాడు. శఠకోపయతి యీతని గురువు. వారి కృపా వశముననే ఈ భాణమును రచించినట్లు తెలిపికొనినాడు.

త త్తాదృ గ్యతిపతే ర్దివ్యకృపాభవశంవదః।
కరోతి సరసం భాణం శారదాతిలకాభిధమ్॥

శృంగారసుధాకరభాణము – రామవర్మ :

భాణములలో సర్వకృత్యములను, సర్వప్రకృతిని శృంగారపరములుగ వర్ణించు-దురు. ఆ సంప్రదాయము ననుసరించి అచేతనములను సయితము చైతన్యవంతము చేయుటేకాక రసికకల్పముల నొనర్చిన ఖ్యాతి శృంగారసుధాకరభాణకర్తయైన రామవర్మకు దక్కినది.

ఆలింగంతి సలీల మంగలతికాం చుంబంతి గండస్థలీం

1. "నిరవధిరాజతంత్రవ్యాపృతనిజమతికౌశలస్య" - అనంగవిజయభాణము.

నీవీం విశ్లథయన్తి కున్తల మిహ వ్యామిశ్రయన్తి స్ఫుటమ్।
సీత్కారం రచయన్తి పల్లవకవ న్మృద్నన్తి వక్షోరుహౌ
వుల్లోలల్లలనాజనస్య సలిలే వ్యాతన్వతః ఖేలనమ్॥

అని జలక్రీడను సయితము శృంగార క్రీడగా వర్ణించిన ఇతడు కేరళ దేశస్థుడు. రవివర్మ కుమారుడు. సంగీతసాహిత్యముల రెంటను సవ్యసాచి. కథాకళి కోటికి చెందిన కంసవధమును మళయాళమున రచించినాడు. 18 వ శతాబ్ది ఉత్తరార్ధమున నున్న ఈతడింకను రుక్మిణీపరిణయము, కార్తవీర్యవిజయ ప్రబంధచంపువు మున్నగు గ్రంథములను రచించినాడు. ఒక మిత్రుని ప్రార్థనపై రచితమైన ఈ భాణము పద్మ-నాభుని చైత్రోత్సవసమయమున విద్వాంసుల సమక్షమున ప్రదర్శింపబడెను. ఇందు రతిరత్నమాలికా శృంగారశేఖరుల ప్రణయము వర్ణింపబడినది. మాధవుడు విటుడు. రచన సరళము, అలంకారసంయుతము నగుటయే కాక ఔచితీపోషకముగ కూడ నుండును. కావుననే భాణసాహిత్యములో శృంగారసుధాకరము ఉత్తమస్థాన మాక్రమించె నని పండిత విమర్శకుల తలంపు.

పంచబాణ విజయము – వాధూల రంగార్యులు :

"భాణముల పేరెత్తినంతనే పాఠకులకు వసంతతిలక భాణము, పంచబాణ విజయమును స్మృతికి వచ్చును. అందుకు తగిన గుణమందు కలదు కావుననే యవి లోకమున నెక్కువగా వ్యాపించినవి." ఇది మల్లాదివారు పంచబాణవిజయమున కిచ్చిన ప్రశంసా పత్రము.[1] అట్టి పెద్దల ప్రశంసకు నోచుకున్న ఈ పంచబాణవిజయకర్త వాధూల రంగార్యుడు. వాధూల రంగాచార్య అని డా|| వీరబాలశర్మ.[2] వారిది విద్వద్వంశము. వాంశికు లందరును షడ్దర్శనపండితులే. తండ్రి శ్రీమాన్రామానుజుడు, సోదరుడు రాఘవార్యుడును మహాపండితులే.

ప్రస్తావనయందే తాను రచింపదలచిన భాణముయొక్క స్వరూపము నిట్లు విస్తరించినాడు.

శృంగారరసభూయిష్ఠం కుసుమాయుధజీవితం।
రూపకం రసికానందజనకం రూప్యతా మితి॥ (పుట 2)

.... శ్రీరంగార్యకవి ర్భభాణ లలితం శృంగార శృంగాటకం

భాణం కంచన పంచబాణవిజయారంభ ప్రియంభావుకమ్ ॥ 3

సుదీర్ఘముగా వసంతర్తువర్ణన మయిన తరువాత ప్రవృత్తకము[3]తో పాత్ర ప్రవేశము. రసమంజరి ప్రథమర్తుమహోత్సవదర్శనలాలసుడైన రసిక శేఖరప్రవేశముతో రూపకారంభము. ప్రభాతశోభావర్ణనము మామూలే. కాని అందు చక్కని శ్లోక మొకటి మెచ్చుట కర్హమైనది.

కల్హారంతి కచాంతరే కిసలయస్తోమంతి కర్ణాంతరే
సిందూరంతి చ నీలనీరజదృశాం సీమంతసీమాంతరే।
కాశ్మీరంతి కుచాంతరే కురవకం త్యేతే కరాభ్యంతరే
యావంతి ప్రపదాంతరే కమలినీజానే స్త్విషా మంకురాః ॥ పుట–7.

కవి తన ప్రజ్ఞను ఈ భాణములో సాధించినాడని చెప్పుట కనేకాధారములు కలవు. శృంగారరసభూయిష్టత, కుసుమాయుధజీవనత తప్ప మరేమియు ఈ భాణము నందు కన్పించవు. కథకు ఎక్కడ ఐక్యము కాని, ఏకసూత్రత కాని కన్పట్టదు. ఎక్కడికక్కడ చెదురుమదురుగా సాగిపోవు వృత్తాంతములు మాత్రమే కన్పించును. మధ్యమధ్య భాణములందు తప్పనిసరి కావున కుక్కుటస్పర్ధ, మల్లయుద్ధ, మదేభాది వర్ణనలు కన్పించును. కాని ఈ భాణములో పందెములు పెట్టుకొనుటలో ప్రత్యేకత కలదు. ఒక కోతినికూడ ఈతడు వెంట తెచ్చును. ఇతరభాణములలో అక్షక్రీడలో అధశ్శయనములు పందెములు. కాని ఈ భాణము మరికొంత ప్రగతిని సాధించినది. ఓడిపోయినవాని భార్యను గెలిచినవాడు అనుభవించుట. ఇది ఈ భాణములో కుక్కుట స్పర్ధలో పెట్టిన పందెము. ఇది ప్రగతియో, అధోగతియో పాఠకులే యూహింతురు గాక!

ప్రాచీనభాణముల ప్రభావము ఇందు కన్పట్టును. శ్రోత్రియమ్మన్య - పండిత బ్రహ్మచారీ - దుష్పుత్రాదిదూషణము వారి పాత్రలు ఇందెక్కువగా కన్పించును. ఒక్కమాటలో చెప్పవలెనన్నచో ఇందు పైన చెప్పిన ఉత్తమవంశజాతులు అధములైనట్లు వర్ణించుట, స్త్రీల అవయవవర్ణనములు, సంభోగాదివర్ణనములే ప్రధానవిషయములు.

1. సంస్కృత వాఙ్మయచరిత్రము పుట 422.
2. సంస్కృత్ మే వికాంక రూపక్ పుట 22.
3. కాలసామ్యసమాక్షిప్తప్రవృత్తిః స్యాత్ప్రవృత్తకమ్ - దశరూపకము
-తృతీయ ప్రకాశము

కందుక క్రీడ - గానము - డోలావిహారము మొ॥ ఈ శృంగార వర్ణన కనుకూలములే కదా! కందుకక్రీడలో మరీ ఎబ్బెట్టుగా కన్పించెడి శ్లోకమును చూడుడు

తరలాక్షి! తావకీన స్తనకందుక పరిమాణతారతమ్యజ్ఞం।
కలయతి రయా దిదానీం కండూలం మామకీనకరకమలమ్ ॥ పుట-29.

కర్ణాట, ఘూర్జర, చోళాది వివిధనారీవర్ణన మిందు కమనీయములు. మధ్వకాంతా వర్ణనము -

గాఢబద్ధతపనీయకంచుకా గూఢతుంగకుచకుంభభాసురా |
ప్రాంజలి ప్రసృతపాదపల్లవా వందతే సపరి మధ్వసుందరీ ॥

చక్కని భావగర్భితములైన చాటూక్తులు ప్రకృతివర్ణనలలో అందమైన అతిశ-యోక్తులు, ఉత్ప్రేక్షలు, స్వభావోక్తులు, భావచమత్కృతులు ఈతని రచనలో కన్పట్టును. విటుడు కుపిత ననునయించెడి చాటుపద్యరచనను పరిశీలింపుడు.

కాచం కాంచనసన్నిధౌ కమలినీధౌరేయబింబాంతికే
ఖద్యోతః కలహంసికాపరిసరే లోలా బలాకావళిః।
కాకానాం నికరః కుహూముఖకులోపాంతే సరోజేక్షణే
త్వద్వాచాం పురత శ్శుకస్య ఫణితిః న శ్లాఘ్యతాం విందతి ॥ పుట-31.

శైలీవిషయమున దీర్ఘ సమాసరచన, శబ్దాడంబరము, వచనరచనలో కాదంబరీ ప్రభావము ఎక్కువ. భాషావిషయకముగ యఙ్ లుక్ ప్రయోగము అధికములు. నానుడులు, జాతీయములు, సామెతలు అక్కడక్కడ తొంగిచూచుచుండును. "కరతల బదరికాయమాణ'' - 'ఏకస్స్వాధు న భుంజీత' 'సర్వమిదం జగ న్నారీమయం". మొదలగు సూక్తులు, శబ్దప్రధానశైలి కన్పట్టును.

తారావళిప్రసవనారాచ కేళివనరారాజితో రుకదళీ
దోరాగవాకలనధారాయుతో రుయుగవీరాయితాతిచతురే।
తారాధిరాజముఖిచారాయితాక్షినవధారాధరాభకబరీ,
భారావలగ్నకులహారాళిలోక మిమ మారాధయాక్షివలనైః ॥

భాణరచన చక్కని 'సెటైర్' (Satire) వంటిదను విషయమునకు ఈ పంచబాణ విజయమును ఉదాహరణముగా చూపవచ్చును. సాలగ్రామములైన అమ్మి అప్పు

తీర్చుటకు సిద్ధపడుట మొదలగు విషయములు సమాజపరిస్థితులకు చక్కని వ్యంగ్య చిత్రణములు. ఈతని రచనలోని చివరి చమత్కారము. భరతవాక్యమును పరిశీలింపుడు.

అద్వైతం యువయో రస్తు కుచయో రివ సర్వదా।
మాభూ ద్భ్రువో రివద్వైతం కదాచిదపి చేతసోః॥

రససదన భాణము – యువరాజకవి :

తిరుణాళ్ళనగానే తెలుగువారికి పోయిన ప్రాణము లేచి వచ్చును. షోకిలా రాయుళ్ళ సరసాలు, కన్నెపిల్లల కవ్వింపులు, చాటుమాటు శృంగారాలు ఒక వైపు రక్తిని పుట్టింపగా భక్తుల దండములు, కొబ్బరికాయలు, దేవుళ్ళు వేరొక వైపు భక్తిని కలిగింపగా, రంగులరాట్నాలు (వ్యవహారనామమిది), గారడీలు, మరొకవైపు అద్భుతములో ముంచెత్తుచుండగా, కఱ్ఱలతో, కత్తులతో సాముగరిడీలు సాగిపోపుచుండగా నవరసాలు రాజ్యము చేయుచున్నట్లు కన్పించెడి తిరుణాళ్ళకు తెలుగువారి గుండెలలో ప్రత్యేక స్థానము ఉన్నది. తెలుగువారే కాక యావద్భారత దేశములోను ఒకరికొకరు తీసి పోకుండ, పోటీపడుచుందురు. ఆ తిరుణాళ్ళను యథాతథముగ సంస్కృతవాణిలోనికి రప్పించిన ఘనత యువరాజకవికి దక్కును. రససదనభాణ మనుపేర చక్కని కృతిని రచించి యిచ్చిన ఈ కవి కేరళదేశస్తుడు, కోటిలింగపురవాసి, శక్త్యుపాసకుడు.[1] నాందీ శ్లోకము, మరికొన్ని శ్లోకములు[2] కూడ ఈ విషయమును స్పష్టపరచుచున్నవి. 19వ శతాబ్దమునకు చెందినవాడు. ఈతని ఇతరరచనలు త్రిపురదహనచరితము, దేవదేవేశ్వరాష్టకము, మురరిపుస్తోత్రము, రామచరితము, శ్రీపాదసప్తకము, సదాశివసుధానందలహరి, హేత్వాభాసోదాహరణ శ్లోకాః అనునవి.

ఈ భాణము శ్రీభద్రకాళి కేళీయాత్ర యందు ప్రదర్శించుట కుద్దేశింపబడినది.[3] సూత్రధారుడు రంగమును ప్రవేశించకముందు, ప్రవేశించిన తరువాతకూడ ఈతడు శ్లోకములతో దీవెనల నిప్పించును. ఇతడు తన గురించి ప్రశంసాపూర్వకముగ చెప్పుకొను శ్లోకములలో నొకటి

శాస్త్రేషు శాతతమశాస్త్రసమాపి బుద్ధిః
కావ్యేషు నవ్యనళినాధిక సౌకుమార్యా।

యస్యాస్య తామరసలాస్యరసా చ వాణీ
హర్షం న కస్య కురుతే యువరాజ ఏషః ||[4]

యదార్థముగా నీతని వాణి, బాణికూడ హృదయాహ్లాదమును కలిగించునవే. ప్రకృతభాణమున విటుడు తన మిత్రుడైన మందారకుని సుందరిని, మిత్రుని కిచ్చిన మాటప్రకారము తిరునాళ్ళకు కొనిపోయి విశేషములను దర్శింపఁజేసి, మరల మధ్యాహ్నకాలమున తన కార్యమును నిర్వ ర్తించుకొని, విశ్రమించి, తిరిగి తిరునాళ్ళ విశేషములను చూచుచు మందార గృహమున కేగి నిష్క్రమించుట యిందలి యితివృత్తము. అనేక భాణములలో వలె ఒకటి, రెండు అతిథిసన్నివేశము లున్నను ఏకసూత్రబద్ధముగనే కన్పించును. అది ఒప్పుకొనదగిన విశేషమే.

ఈతని శైలియేగాక, ఆలోచనాసరళి కూడ మనోహరముగ సాగును. ప్రాభాతిక వర్ణనలందు ఈత డొనర్చిన చక్కని ఉత్ప్రేక్షను చూడుదు -

నగ్నాం వీక్ష్య నభఃస్థలీం విగళిత ప్రత్యగ్రధారాధర
శ్రేణీశ్యామలవాససం పతి రసౌ రక్తః స్వయం ముంచతి।
ఇత్యంత శ్చిర మాకలయ్య నళినీ శోకాతిరేకా దివ
వ్యాదాయాంబుజ మాననం విలపతి వ్యాలోలభృంగారవైః॥ 22

కారుమేఘము లనెడి నల్లని వలిపము తొలగుటచే నగ్నమైన నభస్థలిని చూచి, రక్తుడై సూర్యుడు తనను వదలుచున్నాడని తలచి, నళిని బాధతో ముఖపద్మమును వికసింపఁజేసి, తుమ్మెదల ఝుంకారములతో ఏడ్చుచున్నదట. ఇట్టి సమాసోక్తులు కవి సహజములే యైనను అందలి మార్దవము నాస్వాదింపక తప్పదు కదా! కేవలము వర్ణనలే కాక మనస్తత్త్వవిశ్లేషణను కూడ ఈతడు చక్కగా చేసెను. మనస్తత్త్వములోని ఒక సున్నితమైన ముడి నీతడు విప్పిన విధమును గమనింపుడు—

ప్రేమ్ణః ప్రాప్నోతి యః స్త్రీణా మతిమాత్రస్య పాత్రతామ్।
స ఏవ కోపవిషయో నాన్యః సాధారణో జనః॥ 51

1. రససదనభాణ – శ్లో 3
2. గ్రంథకర్తృప్రశస్తి (భాణము చివర)
3. రససదన పుట-3
4. ‖ (12 శ్లో)

స్త్రీమనస్సును చాలసున్నితముగా విరియఁ జేసినను, అన్ని భాణములందువలె స్త్రీ దూషణ కూడ నిందుకలదు. అంతియ కాక ఉత్సవసమయమందు కన్పించెడి పుంశ్చలీతత్త్వమును, శృంగారమును వర్ణించుటలో నీతని నేర్పిది.

కర్ణే జపన్నిన మంత్రయతే కృశాంగ్యాః
కశ్చి ద్యువా కిమపి సా చ సరోషదృష్టిః।
ఏవం నిరస్యతి తతో వసనాగ్రబద్ధం
రూప్యం స దర్శయతి సస్మిత మీక్షతే సా॥ 74

ఒక కోడెగాడు తిరుణాళ్ళలో లతాంగిచెవిలో జపము చేయబోయెనట. ఆమె కన్నెఱ్ఱచేసి యాతనిని తిరస్కరించినది. అతడూరుకొనక కొంగునున్న కాసు చూపినంతనే యామె చిరునవ్వులు చిందించినది. నిజమునకు కొందరికి తిరునాళ్ళు చూచుట కిష్ట ముండదు. అన్ని వినోదములు మనకు నచ్చక వానిని తీక్షణముగ ఖండింతుము. కాని వాని నీత డనేకవ్యక్తుల కనేకాభిప్రాయములుండునని సమర్థించును.

భాషకు ప్రాణములైన జాతీయములను, సామెతలను ఈతడు చక్కగ నాదరించును. సున్నితముగ సంస్కృతి స్ఫోరకములైన భావములు కవిహృదయమునుండి వెలువడక మానవు. సర్కస్ చేయు అమ్మాయిని వర్ణించుచు, "గ్రీవామంగళతంతుమాత్రసుభగా" అనుట, ఇంటిముందు గొబ్బిళ్ళను చూచి స్మరశరములవలె ఉత్ప్రేక్షించుచు వర్ణించుట మున్నగునవి కవి నభినందనార్హుని చేయును.

పారిభాషికపదములను చక్కని వర్ణనలకు ఉపయోగించుకొనుట ఈతని యందలి నేర్పు, ఒకకాంత మోముతో పున్నమిని, కపోల కాంతితో దశమిని, నుదుటితో పంచమిని, నఖక్షతములతో పాడ్యమిని, సోగవెంట్రుకలతో అమావాస్యను ఊహించుట గమనింపదగినది.

రాకాముఖేన దశమీ చ కపోలకాన్త్యా
ఫాలేన పంచమతిథిః ప్రతిపన్నఖాంగైః।
ఏషా కుహూరపి కచప్రకరేణ ధత్తే
ప్రాయః సమస్తతిథిసంగ్రహభాజనత్వమ్॥ 45

అంతియకాక వ్యాకరణపాండిత్యము నుపయోగించి శ్లోకరచన చేయుటకూడ ఈతనికి వినోదము. గుణ, భవ, దృద్ధి పదములను వాడక వాని సంజ్ఞల నుపయోగించి యితడు చమత్కరించుచున్నాడు.

అదేజ్ సంజ్ఞాభి రస్యూనాం దృష్ట్వా సర్వాద్యుపోత్తమామ్।
ఆదైచో రాశ్రయన్ సంజ్ఞాం కామః పీడయతే భృశమ్॥ 169

ఈతని రచన అందక్కడక్కడ కాళిదాసరచనాప్రభావము కన్పించుచుండును. సంగీతశ్రవణానంతరము సూత్రధారవచనములందు అనుకరణ కన్పించును. అంతియకాక భావదీప్తియందును అట్టి పోకడ అక్కడక్కడ కన్పించును. వివిధ వృత్తములను వాడుటయందు కవి చక్కని రాగానుకూలతను సాధించినాడు.

ఇతరభాణములందువలె పురుషాయితవర్ణనము, మేషకుక్కుటాదిస్పర్ధలు (నిష్కారణముగ), వీరాభాసములు, కళత్రపత్రలేఖనాదులు ఇందు కన్పింపవు. మల్ల యుద్ధ, ఖడ్గభ్రమణాదులున్నను అవి సమయోచితములు. వేశ్యలచే తిరస్కరింపబడు విటులు, కాంతలు పై బడినను తప్పుకొని తిరుగు విటులిందు కనిపింతురు. శృంగార రసప్రియత్వముతో భాణమును చదువనెంచిన వారికి రుచించెడు సన్నివేశములు, అందుల కొఱకు మాత్రమే చదువనివారును మెచ్చెడి సన్నివేశములును ఇందు చాల కలవు.[1] ఈతడు నాటి ప్రజల నీతిని, స్వభావమును చక్కగా విమర్శించెను.[2] ఇన్ని గుణములున్న ఈ భాణము పఠితలహృదయము నాకట్టుకొనుటలో ఆశ్చర్యము లేదు. కాని ఒకటి రెండు శ్లేషలే[3] అరుంతుదత్వమును కల్గించును.

శృంగారతరంగిణీభాణము – శ్రీనివాసాచార్యులు :

శృంగారతరంగిణీభాణరచయిత ఈచంబాడి శ్రీనివాసాచార్యులు. వీరు తిరువ-హేందిరపుర శతావధాని. రసికరంజనకొఱకై సహృదయహృదయభృంగారామ మయిన శృంగార తరంగిణీభాణమును రచించిరి. ఈ భాణ రచనాకాలము శక సంవత్సరము 1803[4] అనగా క్రీస్తుశకము 1881 సం॥. 1883 వ సంవత్సరమున ఇది ముద్రిత మైనది.

భాణములందు కథ వేశ్యలకు సంబంధించినది. విటులకు నిలయమైనది. కాని ఆ భాణమువల్ల జనించు ఆనందము, ఔత్సుక్యము మాత్రము కులవనితాప్రణయము

వంటిదట. పద్మమయినను పంకమునుండియే జనించును కదా! శ్రీనివాసాచార్యులు తన గ్రంథోపోద్ఘాతమునందు ఈ విషయమును ప్రతిపాదించెను చూడుడు. —

పుష్పితశృంగారరసో భాణో దూరోపలంభఫలభావః।
కులవనితా ప్రణయ ఇవ ప్రతిపద మౌత్సుక్య ముపచినోతి పరమ్॥

సామాన్యధోరణియందు సాగిపోవు భాణములలో నిది యొకటి. అక్కడక్కడ కొన్ని విశేషములు కన్పించుచుండును. కందుకక్రీడ కన్నిభాణములలోను ఆడవారే ఆటగత్తియలు. కాని ఈ కవి మగవారిచే కందుకక్రీడ నాడించినాడు.[5] యౌవనములో నాటకత్వము నారోపించుచు రూపకాలంకారమును చక్కగా పోషించినాడు. ఈ కవికి ఆధునికులవలె మానవుని మేధపై ప్రగాఢవిశ్వాసము కన్పించును. మానవున కసాధ్య విషయములు లేవని యితడు పలికిన పలుకుల నాలకింపుడు.

నాగేంద్రా స్త్రీవదర్పజ్వరభరపరుషాః పారవశ్యం భజన్తే
నిర్ఘాతానా మభేద్యాః కులగిరిదృషద శ్శిల్పయోగ్యాః క్రియంతే।
భూ రాపోఽగ్ని స్సమీరో వియదపి విదధ త్యాత్మశక్త్యోపకారాత్
శంకే నృణాం ప్రభావః పటుకరణధియా మైశ్వరాత్కించిదూనః॥ శ్లో 64.

ఈ కవిలోని కవితాత్మ సైతము సమ్యక్ దర్శియే. స్పందనతో భావనను ఆదరించ గల మనస్సు ఈ కవికున్నది. తుమ్మెదలనుకూడ పద్మముల కన్నీటి చుక్కలుగా భావించగల కరుణాకలితభావన యితనిది. సంధ్యాకాలవర్ణనములో ఉత్ప్రేక్షను ఎట్లు పొదిగెనో చూడుడు.

నిజ[illegible]యుతమశేషలోక నేత్రం
గతవ[illegible]ముద్య గిరౌ నిలీయమానమ్।
దల[illegible]

1. రససదనభాణ పుట 44, పుట 47.
2. రససదన – శ్లో 85.
3. || 143.
4. శృంగారతరంగిణీభాణము – శ్లో 137.
5. శృంగారతరంగిణీభాణము – శ్లో 52

గలదలికజ్జలమశ్రు కిం సృజన్తి ॥ 103 శ్లో.

ఈ కవి యచ్చటచ్చట చిలుకపలుకులు పలికినను అందుండి తనగొంతు విన్పించుటకే యత్నించును. ఒక వారనారి కరమునందు విలాసముగానున్న చిలుక నోటి నుండి కెంపుల వంటి మాటలను పలికించి కామిస్వభావకాంతుల నెట్లు వెదజల్లెనో చూడుడు.

కామయతి కామిలోకః ప్రథమ మసంజాతసౌహృదాం తరుణీమ్।
విస్రబ్ధరూఢభావాం విహాయ చ స్వైర మన్యత శ్చలతి ॥ 65 శ్లో.

ఏదైనను గొప్ప వస్తువు దొరకునంతవరకు దానిపై ఉబలాటము, దొరకిన తరువాత అనాస్థ చాలమందికి సహజగుణము. కాముకులు కామినుల విషయములో సైత మీ పద్ధతినే ఆశ్రయింతురట. కాంతకు తనపై వలపు కలుగునంతవర కామెను కామించి, ఆమె తనను కామించుచున్నదని తెలియగనే ఆమెను విడిచి, స్వేచ్ఛగా మరొకదిక్కునకు పయనించునట.

ఇక వీరాయితములు, కోళ్లు, వీణావాదనము, పుష్పాపణవర్ణన మొదలగునవి "షరామామూలే". నారీవర్ణనలో నీ కవి ఒక నూతనపద్ధతి ననుసరించినాడు.

హంస! త్వం క్వచిదేవ గచ్ఛ కమల త్వం మజ్జ మధ్యేజలం
వృక్షానాశ్రయ కోకిల భ్రమర భో లీయస్వ పుష్పాంతరే।
శంఖాభ్యేహి సముద్ర మేవ బడిశే పాఠీన ముంచాప్యసూన్
చంద్ర త్వం దివ మేవ యాహి శిఖినో యుష్మద్గతిః కాననమ్ ॥ శృం॥త॥ 44 శ్లో.

సరసచిత్రకావ్యరచనాదక్షులైన శ్రీనివాసాచార్యులు తన రచనచే చాలమందిని ఆకర్షింతురనుట యథార్థము.

పంచాయుధప్రపంచభాణము – త్రివిక్రమభట్టు :

క్రీ.శ.1864వ సం॥ బొంబాయి నుండి ప్రకటింపబడిన దీ భాణము. రచయిత త్రివిక్రమభట్టు. ఇతని తండ్రి చిద్ఘనానందుడు. ఇతడు తన అన్న అయిన త్ర్యంబకుని దగ్గర విద్య నభ్యసించెను.

ఇది పరాశ్రయ మయిన భాణము. ప్రబలదాముడు నాయకుడు. ఇతడు కందర్పవిలాసుడు, మదనశేఖరుడును, కలహంసలీలా, కమనజ్యోత్స్నలను చేపట్టుటకు సహకరించును.

ఈ భాణమునందలి ప్రస్తావనను కవి త్రివిక్రమకట్టు కాక సూత్రధారుడే రచించెనని రామ్ జె ఉపాధ్యాయ అభిప్రాయము.* దాని కాధారముగ సూత్రధారుని ఈ క్రింది వచనములను వారు చూపిరి. —

"అతీతశారదోత్సవే మకరందకందలనామ్నా మే భావేన .... భాణం రసిక మనోజ్ఞం త్రివిక్రమ శ్చక్రే మదుపజ్ఞ మయ మభినవో భాణో ప్రజ్ఞావతాం సమాజేషు భవతా అభినేతవ్య ఇతి సాదర ముక్త్వా మే సమర్పితః".

శృంగారలీలాతిలకభాణము – భాస్కరకవి :

కేరళదేశమందలి శోకనూరు నందలి నంబూద్రీవంశమునకు చెందిన భాస్కర కవిచే రచితమైనది శృంగారలీలాతిలకభాణము. కాలికట్ రాజైన విక్రమదేవుని ఆస్థానమున ఇది ప్రథమముగ అభినయింపబడినది. ఈ కవి కొచ్చిన్ మహారాజుచే గూడ సన్మానింపబడినాడు. వేదాంత వ్యాకరణములందు నిష్ణాతుడైన యీతడు 32సం॥ లకే స్వరస్థుడైనాడు. ఇతడు క్రీ. శ. 1805 ప్రాంతమున జన్మించినాడు. వాగ్దేవి ముఖ మందు వసించునని ఈ భాణమందలి సూత్రధారుని మాటలను బట్టి తెలియును. ఈతడు 16 సం॥ల వయస్సున నుండగనే ఈ భాణమును రచించినాడట. సాగరికాసత్యకేతుల ప్రణయమిందలి ఇతివృత్తము. నవచంద్రిక, చందనలత, పద్మిని, నారాయణి, చిత్రసేన మున్నగు వేశ్యల వృత్తాంతము లానుషంగికములుగ కూర్చబడినవి. ఒక నిర్బంధమువలన కానీభాణము రచించితిననియు, హాస్యప్రియులగు విద్వాంసులకిది సంతోషమును కూర్చునని కవి చెప్పిన శ్లోకము గమనార్హము.

నిర్లజ్జితాయాః కస్యాశ్చి
నిర్బంధాత్ రచితం మయా।
ఇదం హాస్యైక సక్తానాం
విదుషా మస్తు తుష్టయే॥

రసికరంజనభాణము – శ్రీనివాసార్యుడు :

* ఆధునిక సంస్కృత్ నాటక్. పుట 715

అందరిని అందరు ఎల్లవేళల పొగడలేరు. అందరిచేత మామూలుగ పొగడబడెడి వ్యక్తి కూడ కొన్ని యెడల ఎదురుదెబ్బలు తినవలసివచ్చును. సామాన్యముగ ఏ భాణమునందైనను నాయకుడైన విటుని అందరును సంభావించి, సంభాషించినట్లే కన్పడును. కాని దానికి విరుద్ధముగ విటుని (నాయకుని) పలువురు నిందించుటను వర్ణించిన భాణము రసికరంజనభాణము. పేరు వినగనే రసికరంజన మనిపించినను అనుభూతిలో అన్వర్థతపట్ల సంశయము కల్గును. దీనిని శ్రీనివాసార్యుడు రచించెను.

ప్రస్తావనయందును, రూపకాంతమునందును కవి చెప్పికొనిన మాటల వలన ఆతడు శ్రీవత్సగోత్రోద్భవుడు, తాత శ్రీవరదాచార్యులు, తండ్రి శ్రీనరసింహాచార్యులు, తల్లి అలివేలుమంగ అని తెలియును. మైసూరునందలి కృష్ణపార్థివపోషితు డితడు. ఈ కవి తన గ్రంథమును కలియుగమున 4958 సం॥ గడిచినపుడు వ్రాసినట్లు రూపకాంతమున తెలిపియున్నాడు.* ప్రస్తుతము కలియుగమున 5079 సంవత్సరము. కాగా ఈ కవి నేటికి 94 సం॥ ముందు కాలమువాడు. అనగా క్రీ. శ. 1884 ఈ గ్రంథరచనాకాలము.

దక్షిణబదరికాశ్రమసారసమిహిరుడైన శ్రీ యతిరాజసంపత్కుమార సార్వ-భౌముని వజ్రమకుటధారణమహోత్సవసమయమున ఇది ప్రదర్శింపబడి నట్లు ప్రస్తావన పలుకుచున్నది.

ఈతడు తన కృతిని గూర్చి వ్రాసిన మాట లివి.

> గ్రంథేస్మిన్ శుకశాబకోక్తివిధయా వ్యక్తీకృతే సత్కృతే
> సంత స్సంతు గుణైకతానమనసో భూత్వా పురోభాగినః।
> భౌమం వస్తు సమస్తమేవ సమలం ప్రాయో బుధై స్స్మర్యతే
> తత్ క్షేళేశ్వర నీతిసంగతివిదో దోషేష్వనుత్సేకినః॥ 222 శ్లో.

ఈ భాణము అనేక భాణములవలెనే వసంతవర్ణనముతో ప్రారంభ మగును. యదుశేఖరుడని మారు పేరు కలిగిన విటశేఖరు డిందు నాయకుడు. అతడు ఊరంతయు తిరిగి మదనమంజరీ నవార్తవమహోత్సవమునకు చేరుట ఇందలి యితివృత్తము.

రసికరంజనము ఆశించినంతగ జరుగక పోయినను ఇది ఒక విశిష్టమైన భాణము. భౌగోళిక వర్ణనములకు నిలయమైన యీ భాణము, పర్వతప్రదేశ వర్ణనలకు కూడ నిలయమైన మేఘసందేశము వంటిది. మైసూరు తత్పరిసరప్రదేశములను, దాని రాజధానిని, కావేరీనదిని, శ్రీరంగపట్టణమును, అందలి భగవంతుని, దక్షిణ

* రసిక రంజనభాణము 224 శ్లో.

బదరికాశ్రమమును, తిరునారాయణుని, అశ్వత్థమును, లక్ష్మీవరాహక్షేత్రమును, చాముండికను, ఇంకను ఎన్నో విధములుగ భౌగోళిక విషయములను రసవంతముగ వర్ణించుట యీ రాణముయొక్క విశిష్టత అనవచ్చును.

మల్ల యుద్ధవర్ణన, కందుకక్రీడ, వీణావాదన, వీరాభాసవర్ణన మొదలగు కొన్ని విషయములలో ఇతరభాణములకిది నకలే అయినను కొన్ని క్రొత్తపోకడలు ఇందు కలవు. అత్తాకోడళ్ళ గొడవలు, కోడలు పడ్డ బాధలు కవి చేతబడ్డవి. చూడుడు -

భర్తా రాత్రా వహని భగినీ తస్య మాతా చ మృత్యుః
దేవో బంధు ర్గురు రితి గృహే య శ్చ మార్జారపోతః।
గర్వ్యం వీథీగమన మితరాగార మేవానిరీక్ష్యం
కష్టం నార్యా భవతి కమితుః ప్రత్యుతాత్రైవ కారా॥

ఇట్లు కోడళ్ళపై సానుభూతి చూపినంత మాత్రమున స్త్రీలందరిపై నీతడు సానుభూతిని ప్రదర్శించినా డనలేము. మామూలు ధోరణిలో స్త్రీవర్ణన కున్నంత తావే స్త్రీదూషణమునకు నున్నది. స్త్రీవ్యక్తిత్వము నెంతగా గర్హించునో చూడుడు.

దృష్ట్యైక మంచతి పరం మనసా చినోతి
సంజ్ఞాపయ త్యపర మంబరకర్షణేన।
ఓష్ఠేన బాధయతి చే తరమాశు ధీరా
సర్వం హి సాహసధియాం సహజం ధరిత్ర్యామ్॥

మానినీనాం మనస్సత్యం కోపి పాషాణ ఏవ యత్।
తథా జ్వలతి సంప్రాప్తే వల్లభేపి విభావసౌ॥

ఇట్లు నారీదూషణ తీవ్రముగా చేసినను ఘూర్జర, కర్ణాట, చోళాది వివిధదేశ నారీవర్ణనలను చేయక మానలేదు. నారీవర్ణనములో అనంతము లయిన అతిశయోక్తులు చూపక మానలేదు. సంభోగశృంగారమును, అపర్యాప్తసంభోగమును వర్ణింపక ఊరుకొనలేదు. కువలయ-అమిత్రశబ్దముల, శ్లేషలను అనేకులు అనేకవిధముల వాడిరి. కాని ఈ కవి ఆ రెండుపదములతో సూర్యోదయవర్ణనలో మంచి చమత్కారమును చూపును.

కథమేనం కువలయామిత్రం మిత్రం వదంతి ధీమంతోఽపి. తథాహి –

ఉద్యన్నేవ నిశాచరౌఘ మఖిలం నిష్పేషముల్లోలయన్

హృష్టాం నీలసరోజినీం విముఖయన్ ధాత్రీం తప న్నంజసా।
కాన్తాః ప్రజ్వలయన్ స్వకాశ్చ నిఖిలా మధ్యేనభ స్సంచరన్
మధ్యాహ్నేతి కరై రపహర త్యానందకందం నృణామ్॥ 157

ఆంధ్రసాహిత్యములో క్రీ.శ. 1910తో ప్రకృతిపరిశీలనములో ఒక క్రొత్త భావము వెలుగుచున్నది. రాయప్రోలు సుబ్బారావు స్వప్నకుమారమున తన కలలను లోకమున కందించుచు -

సందెలను దారి తప్పు మిళిందసుతులు
తేనె పాలిచ్చి చీకట్ల తిరుగనీక
ఉదయమగుదాక యొడిలోన నిదురబుచ్చు
చేరదీసిన మమతకు చిక్కి నలిని – అని వర్ణించినాడు.

ఇట్టి భావమునకు ఆంధ్రసాహిత్యమున రాయప్రోలువారే ఆద్యులు అని విమర్శక నిర్ణయము. కాని సంస్కృతసాహిత్యమందు ఈ భాణకర్త (క్రీ. శ. 1884) కూడ అట్టి అభిప్రాయమునే వెలిబుచ్చినాడు. బాలుడైన సూర్యుడు పాలుత్రాగవలెనని (కిరణము - చేయి) కరపల్లవాగ్రములతో ప్రాచీకోరమనెడి కుచము స్పృశించుచు ఉదయాద్రి పడకపై నుండి లేచుచున్నాడట. కేవలము ప్రేయసీప్రియులుగా మాత్రమే ఇంతవరకు వర్ణింపబడిన ప్రాగ్దిశాసూర్యులకు మాతృపుత్రభావకల్పనము. చూడుడు -

బాలోయ మాశు మిహిరః కరపల్లవాగ్రైః
ముగ్ధారుణైః కతిపయై రధికం పిపాసుః।
ప్రాచీదిశ స్సపది కోశకుచం స్పృశన్సన్
ప్రోదేతి సస్మిత మసా వుదయాద్రికల్పాత్॥

ఈ రీతిగ కొన్ని క్రొత్త పోకడలతో భాణమును రచించి రసికరంజనతకు దారులు వేసిన శ్రీనివాసార్యుడు ధన్యుడే.

రసోల్లాసభాణము – శ్రీనివాసాచార్యుడు :

అలసలలితముగ్ధా న్యధ్వసంపాత ఖేదా
దశిథిలపరిరంభై ర్దత్తసంవాహనాని।
పరిమృదితమృణాళీదుర్బలా న్యంగకాని

త్వ మురసి మమ కృత్వా యత్ర నిద్రామవాప్తా ॥ *

అని భవభూతి వ్రాయగా అదేభావన నుపయోగించి మరొక చక్కని శ్లోకమును రచించిన కవి శ్రీనివాసాచార్యుడు ఆత్రేయగోత్రీయుడైన శ్రీనివాసుని మనిమనుమడు. వేంకటార్యుని పుత్రుడు అయిన ఈతడు 19వ శతాబ్దములో రసికజనుల కుల్లాసము కలుగునట్లు రసోల్లాసభాణమును వెలువరించినాడు. భూతపురి (?) యందలి ఆది కేశవుని ఉపవనయాత్రోత్సవసందర్భముగ ఇది రచింపబడినది. కవి తాను చెప్పుకొని నట్లు విద్వన్మనోహరమైన అతని వాణి పైశ్లోకము నెట్లనుకరించెనో చూడుడు -

ముకుళితనయనార్ధా ముక్తచైతన్యచిత్తా
మృదితనవమృణాళీ కోమలాంగీ రతాంతే।
మదురసి శయితా త్వం యత్ క్షణం ప్రాప్తనిద్రా
న హి మమ హృదయం తత్ జాతు ముక్త్వా ప్రయాతి॥

సెలయేటి ప్రవాహమువలె సాగిపోయెడి శైలి, మనస్సును రంజింపజేసెడి భావనలు, అత్యంతసులభముగ నర్థము చేసికొనుట కవకాశమిచ్చెడి ప్రసాదగుణము, అలతిఅలతి పదములతో అద్భుతశ్లోకరచనము ఈ కవి కవితకు సువర్ణమయాలంకారములు.

ముక్తావళీ ప్రథమరంగాధిరోహణమహోత్సవమునకై కామశేఖరుని గమన సమయమున సూర్యకిరణములను బహుధా ఉల్లేఖించుచు వ్రాసిన శ్లోకము నొకదానిని గమనింపుడు.

కింజల్కతా ముపగతా స్సరసీరుహేషు
సింధూరతాం హరిదనేకపమస్తకేషు।
శాఖాసు పల్లవపుటత్వ ముపేయివాంసః
క్రీడాచలేన్ద్రశిఖరే ష్వపి ధాతుభావమ్॥

తామ్రచూడనింద, కందుకక్రీడ, మల్లయుద్ధవర్ణన, కళత్రపత్రరచన మొదలగు నవి విషయమున ఇతరభాణముల వంటివి అయ్యును కవితావిషయమున స్వీయ వ్యక్తిత్వమును చాటుచునే యుండును. అనేకాధునికవచనరచయితలందు వలె ఈతని యందును బాణుని బాణీ కన్పించును. చిన్నిచిన్ని పదములలో సంశయాంతముగా ఇతడు పడతిని వర్ణించిన పద్ధతిని చూడుడు.

సుధా వా జ్యోత్స్నా వా కిము శశికళా వా వరతనుః

---

* ఉత్తరరామచరితము — ప్రథమాంకము శ్లో-24.

ఖగౌ వా కుంభౌ వా కిము కనకశైలౌ కిము కుచౌ।
లతే వా మాలే వా కిము కనకయష్టీ కిము భుజౌ
తమో వా బర్హో వా కిము జలధరః కిం కచభరః॥

శ్లోకమున కనకము రెట్టింపయినను శిఖరిణి ఇమిడిన అందము మాత్రము శిఖరము నంటుచున్నది. పరిశీలించుచు పోయిన ఈతని రచనలో అనేకశ్లోకములు అమృతాయ-మానములై కన్పట్టును. ఇంత రమణీయాకృతి కల కృతియయ్యును ఇది ముద్రితమై రసనీయతాస్థితి కింకను నోచుకొనక పోవుట విచార హేతువు.

"..... శ్రీనివాసకవి ర్యస్య వాణీ విద్వన్మనోహరా" అని ప్రస్తావనావశముగ కవి తనను పరిచయము చేసికొనిన మాట వాస్తవమే కాని సంస్తవము కాదు.

రతిభూషణ భాణము – కవితార్కిక కంఠీరవుడు :

సంస్కృత సాహిత్యములోని సంవాదాత్మకశ్లోకములు చాల చమత్కారమును కల్గించుచుండును. నర్మగర్భితముగ, శృంగారరసస్యందముగా సాగిపోయెడి శ్లోకములు నిజముగ రసగుళికలే. అట్టి సంవాదాత్మకశ్లోకము రతి భూషణభాణమునకు నాందియై ఎంత సొలగు వెలార్చుచున్నదో పరికింపుడు.

కస్త్వం గోపాలబాలః సుతను! పశుకులం యాహి మా యాహి గేహం
బాలే లీలావినోదీ సరసమససర ద్రాగమీ యామి కార్యః।
నిర్వ్రక్రీ దేవి! చక్రీ భవ భువపతే స్తల్ప మాకల్ప మేవం
భావాపేక్షీ ప్రియాయాః క్వచన వచనతః పాతు పద్మావతి ర్నః॥

శ్రీపురమునందలి చక్రవర్తివంశములోని నృసింహార్యుని కుమారుడు కవి తార్కికకంఠీరవుడు విష్ణులీలలను వర్ణించుచు వ్రాసిన భాణ మిది. వీరి వర్ణనారీతి కొక చిన్న ఉదాహరణము.

మహాప్రీత్యా రత్యా హితమహితమాణిక్యతిలకా
కనత్ జ్యోత్స్నా కాంతాకరకలితకల్హారకలికా।
రణత్కాంచీదామా రసిక జనసంజీవకరణిః
క్రియా దేషా యోషా కమిహ కృతినం భాస్సుకృతినమ్॥

అనంగతిలక బాణము – రంగనాథుడు :

స్వేచ్ఛాప్రణయమే ప్రధానేతివృత్తమయిన భాణములలో సామాన్యముగా వియోగమో, వీరాయితమో తప్ప దాని ఫలితమును, పర్యవసానమును వర్ణించిన తీరు కన్పించదు. ఆ లోటు తీర్చుటకేమో ఆపన్నసత్త్వ (గర్భవతి)కును తన భాణమందు కాపు నిచ్చినవాడు రంగనాథుడు. ఈతడు తన భాణములో ఆపన్నసత్త్వను వర్ణించిన తీరు చూడుడు -

గరిమాం భజతే నితంబ మస్యాః
తనిమా మంచతి చారు మధ్యభాగమ్।
పరిపుష్యతి పాండిమా కపోలే
కుచయో రగ్ర ముపైతి నీలిమాం చ॥

— "వత్సకులజలధికౌస్తుభో శ్రీనివాసాచార్యతనయో రంగనాథకవిః" అని కవి తనను పరిచయము చేసికొనెను. అతని వాక్కు అద్భుతతమములని కవిలోక మంగీక-రించినదట. రంగనాథుని చైత్రయాత్రా ప్రసంగమున ప్రదర్శించుట కుద్దేశింపబడిన దిది.

రమణీయభావనలతో, చక్కని చిక్కని శైలితో, ప్రసాదగుణభూయిష్ఠతతో సాగిపోయిన యీ భాణమును చదివిన తర్వాత కవితాత్మను ఒక్కమారు పరామర్శించిన తృప్తి పాఠకునకు కలుగు ననుట స్వభావోక్తి. సుదీర్ఘ వచనరచనము, దానిపై బాణుని ప్రభావము కనిపించినను అందమునకు హాని కలుగునట్లీ కవి రచింపడు. కోళ్ళు, పొటేళ్ళతో తృప్తి పడక పరాక్రమము రూపుకట్టిన శార్దూలమును కూడ ఇతడు తన కవితతో బంధించినాడు.

నెఱజాణ నెరికురులనుండి పూవులు జారిపడగ వాని నాధారముగా చేసికొని ఇతడు చెప్పిన శ్లోకమును గమనింపుడు.

ఆరూఢానా మపి సుమనసా ముత్తమాంగే భవత్యా
స్సంసక్తానాం జనితరజసాం కేశభాజాం శుచీనామ్।
సామోదానాం భవతి పతనం సాధుసూత్రాశ్రితానాం
భ్రంశః కేషాం జగతి న భవే దంగనాసంగతానామ్॥

అబలలతో సాంగత్యము పొందినవాడు భ్రంశము పొందక తప్పదట. మరి ఆ విషయమును విరులు నిరూపించుచున్నవి గదా!

ప్రకృతివర్ణములు సైతము కవివర్ణనలలో కలిసి మార్దవమును, స్వాదుతను సాధించుకొన్నవి. మెరుపుతీగెను నటితో పోల్చి వర్ణించిన తీరును గమనింపుడు.

లాస్యం విధాతుం ధ్రువ మభ్రరంగే
రసప్రసూః కాలనటప్రయుక్తా।
తిరోదధా త్యబ్దతిరస్కరిణ్యాం
తటి త్క్షణాలక్ష్యతను ర్నటీవ॥

కాలనటుడు ఆకాశరంగస్థలమున లాస్యమును ప్రదర్శించుటకు మెఱుపనెడి నటిని ప్రకాశపెట్టగా అది క్షణము కనిపించి మేఘమనెడి తెరచాటున అదృశ్యమగు చున్నదట.

"సంస్కృతసాహిత్య మింకను మృతి చెందలేదు. అది సర్వకాలముల అమృతాయమానమే" యను సత్యమును అప్పుడప్పుడు మనస్సులో గుర్తుచేసి-కొనుటకు కూడ నిట్టి భాణములు సహకరించును. కవి- అనంగతిలకనామభాణోఽస్తు విదుషాం ముదే - అని పలికినట్లు ఇది విద్వన్మోదకారియే.

అనంగజీవన భాణము – రామవర్మ :

కోచుణ్ణి భూపాలకుడైన రామవర్మ రచించిన దీ భాణము. ఈ కవి క్రీ.శ.1858 న జన్మించెను. ఈ కవి కలమునుండియే విటరాజవిజయభాణమును వెలువడినది. ఈ రెండు బాణములే గాక విద్యద్యువరాజచరితమ్, శ్రీ రామవర్మకావ్యమ్, విప్ర సందేశము మొ॥ వానిని సైతము ఈ కవి రచించెను. ఇదిగాక మరికొన్ని పరిష్కర-ణములలో ఈతడు తన ప్రతిభను ప్రకటించెను. ఇతడు సంగీతమున సైతము అభిరుచి గలవాడు

ముకుందమహోత్సవసమయమున అనంగజీవనభాణము ప్రదర్శింపబడినది. ఇందు ప్రస్తావనలో నటీసూత్రధారుల కౌగిలింతను కల్పించి కవి మార్పునకు ముందడుగు వేసినాడు. ఇది పరాశ్రయభాణము. శృంగారసారుడు నాయకుడు. ఆనందవల్లీ, భద్రసేనుల సమాగమున కితడు కృషి చేయును.

విటరాజవిజయభాణము నందితివృత్త మిదియే. వేశ్యామాతృవర్ణనాదులలో చక్కని హాస్యరసస్ఫూర్తి కీకవి భారతదేశములోని వివిధప్రాంతముల రాజుల నాహ్వానించెను. నేపాల్, భూటాన్‌లు సైత మిందు ప్రాతినిధ్యమువహించుట గమనార్హము.

శృంగార మంజరి – కేరళవర్మ :

19వ శతాబ్దములో మరొక మంజరిని కానుక చేసినకవి కేరళవర్మ. ఇతడు వంచీవంశ ప్రభువైన రామవర్మ కాశ్రితుడు. రాజరాజవర్మకు మేనల్లుడు. భవభూతి మాలతీమాధవీయమున కనుకరణ మీ కృతిలో కన్పించుచున్నది. తరుణీమణికుచ మండలమును ఈ కవి వర్ణించిన శ్లోకములోని పొంకముఁజూచుట సహృదయతకు నికషాయమాణమే.

పుంజీభవన్నిఖిలకాముక ధైర్యసార
సర్వస్వసంభరిత కుంధరుచిం దదానా।
జీయాత్తృతీయపురుషార్థసమర్థనైక
సామర్థ్యధుర్యతరుణీకుచమండలం సా॥

సకలకాముకులధైర్యసారము నంతయు ప్రోవుచేసి నింపిన కుంభముల కాంతిని ఆ మండలము ధరించుచున్నదట. అంతేగాదు. అది తృతియపురుషార్థము(కామము)నే సమర్థించెడి సామర్థ్యము కలదట. భువనేశ్వరుని యాత్రోత్సవములలో నిది ప్రదర్శించుట కుద్దేశింపబడినది - మనోభవరిపోర్ధైర్యైకపాటచ్చరమ్ - అని భవానీస్మితమును నాందిలో ఈ కవి వర్ణించుట పొగను వెలార్చుచున్నది. రమణీయభావనల, రసనీయ పదముల పొందిక యీ కవికి నల్లేరుపై బండి నడక.

రామజన్మభాణము – తారాచరణశర్మ :

క్రీ.శ.1875 సం॥న రచింపబడిన ఈ భాణమునందు నారాయణసింహుని పుత్రుని జన్మోత్సవము వర్ణింపబడినది. తారాచరణుడు కాశీరాజు ఆస్థానమున నుండెడివాడు. ఇందలి విటుడు జరతి, కమలాక్షి మున్నగు వేశ్యలతో సంభాషించుచు నయము సాగించును. ఈ భాణమునందు కొన్ని గేయము లుండుట గమనార్హము.

రసరత్నాకరభాణము – జయంతుడు :

నారాయణుని పుత్రుడైన జయంతుడు రచించిన ఈ రసరత్నాకరభాణము తిరువాన్కూరు రాజైన వంచుళభూపాలుని ప్రోత్సాహముచే రూపు దాల్చినది. సకలరసభాండభూత మైన దీ భాణమని కవి వక్కణ. కాళిదాసాదుల నాటకములవలె అభినయింపవలెనని సూత్రధారుడు నటిని అభ్యర్థించినాడు. ఈతడు క్రీ.శ. 19 వ శతాబ్దిలో నివసించినట్లు తెలియును.

శృంగారరాజతిలకభాణము – అవినాశీశ్వరుడు :

దేవుని వసంతోత్సవములు రాజుల ఆదరణపై ఆధారపడి యుండెడివి. రాజులు సరిగా ఆదరింపక పోవుటతో ఆగిపోయెడివి. ఇట్లు కొంతకాల మాగిపోయిన పిదప మైసూరు ప్రభువగు చామరాజుచే పునరుద్ధరింపబడిన వరదరాజస్వామి వసంతో-త్సవములో ప్రయోగింపబడిన దీ శృంగారరాజతిలకము. కర్త అవినాశీశ్వరుడు. ఆత్రేయ గోత్రజుడు. రామసూరి, వేంకటాంబల పుత్రుడు. ఈతడు సూర్యసిద్ధాంతము నందు ప్రవీణుడు. కావేరీతీరమందలి వరదరాజపుర మీతని నివాసము కావచ్చును. శ్రీరంగపట్టణ సమీపమునందలి యీ గ్రామముననే వరదరాజస్వామి వేంచేసి యుండెను. ఈ కవి క్రీ.శ. 19 వ శతాబ్ది యుత్తరార్ధమున జీవించియుండెను.

అనంగసంజీవన భాణము – వరదకవి :

ఆత్రేయగోత్రజుడును, శ్రీనివాసాధ్వరి కుమారుడు నగు వరదకవి రచించినది అనంగసంజీవనభాణము. వాజపేయాది క్రతువుల నొనర్చిన ఇతడు తర్కతంత్ర స్వతంత్రుడు. రసజ్ఞమనోజ్ఞమైన యూహతో గ్రంథారంభ మొనర్చినాడు.

> కృష్ణస్య వ్రజయోషిదంబర ముషఃకుంద ద్రుమాలంకృతేః
> పాయా ద్వః ప్రతిబింబ మంబునిధృతం భానో ర్దుహిత్రా చిరమ్।
> వ్యాతేనుః పవనచ్చలా ద్వివసనాః యస్యోపరి ప్రస్ఫుర
> ద్వేగోత్క్షిప్తనితంబబింబసుషమం వీరాయితం గోపికాః॥

మద్రాసు అడయార్ లైబ్రరీలో దీని ప్రతి యొకటి గ్రంథలిపిలో నున్నది.

వసంతాభరణభాణము – శ్రీనివాసుడు :

త్రయో దేవా స్సర్గస్థితిలయకృతః సర్వజగతాం
వహన్తో జిహ్వాయా మురసి వపుషి స్వదయితాః।

అనుచు నన్నయగారి "శ్రీ వాణీగిరిజాశ్చిరాయ" శ్లోకమును తలపింపజేసిన కవి శ్రీనివాసుడు. ఇతడు శ్రీవత్సాన్వయుడు. గోపాలసూరి శిష్యుడు. శ్రీరంగనాథుని వసంతోత్సవ సమయమున అభినయించుట కుద్దేశింపబడిన డితని వసంతాభరణభాణము. R 8176 సంఖ్యతో మ. ప్రా. గం.లో కల ప్రతిలో చాల గ్రంథపాతములు కలవు.

శృంగారమంజరీ భాణము – వేంకట నారాయణుడు :

ఒక విషయమును విస్పష్టముగను, దృష్టాంతపూర్వకముగను చెప్పుటకు సామెతలను, న్యాయములను కవు లాదరింతురు. ఒకే విషయమునకు ఎన్నియో లోకోక్తులు, సామెతలు ప్రయోగించినవాడు వేంకటనారాయణుడు. ఈతడు శృంగార మంజరీభాణమున

నను అయమేవ – గండ స్యోపరిపుటకోద్భేదః
ఇదమేవ ఆస్థలిత స్యోపరిస్థలితమ్
అయమేవ నవీనవ్రణానా ముపరి లవణరసనిష్యందః
అథవా వృశ్చికభియా విద్రవతో లేలిహాన ముఖే వినిపాతః
మృగతృష్టికాభియా వనా ద్వ్రజతో దావానల పరివేషం

అని లోకోక్తులను గుమ్మరించినాడు. R 9969 సంఖ్య కల మద్రాసు ప్రాచ్య లిఖితగ్రంథాలయ ప్రతిలో చాలగ్రంథపాతము లున్నవి. కవివిశేషము లేవియు తెలియ వచ్చుట లేదు. ఇతివృత్తము మామూలే. వసంతవర్ణనము, చంద్రవర్ణనము, ఉపాలంభము, విటుని కలియుటకు నాయికకు మార్గములు మున్నగునవి వర్ణింపబడినవి.

అనంగసర్వస్వభాణము – లక్ష్మీనృసింహుడు :

వసిష్ఠగోత్రజుడును, స్వాతినృసింహాచార్యుల పుత్రుడును అగు లక్ష్మీనృసింహాచార్య కవి యీ బాణమును రచించెను. వీరి కాలమును గూర్చి తెలియరాదు, తంజావూరు సరస్వతీమహల్ గ్రంథాలయమున 4580 సంఖ్యతో దీని ప్రతి యొకటి కలదు.

గోపాలలీలార్ణవభాణము – గోవిందుడు :

సామాన్యముగ తన కృతిని కుమా రెగా భావించుట ప్రచురముగా కన్పట చున్నది. కాని యీ గోవిందుడు తన గోపాల లీలార్ణవభాణమును పుత్రుడుగ భావించినాడు.

> గోపాల లీలాభాణో మే సత్పుత్రో హ్యాభివర్ధతామ్।
> సంతాపయ న్నంతరంగ మనిశం మమ దుర్హృదామ్॥

ఇతడు మహారాష్ట్ర బ్రాహ్మణుడని యూహ. సరస్వతీ రంగాచార్యుల పుత్రుడు. వీని దేశకాలములు తెలియరావు.

కందర్పదర్పభాణము – శ్రీకంఠుడు :

కాశ్యపగోత్రజుడగు శ్రీకంఠునిచే రచింపబడిన దీ భాణము. శ్రీకంఠుడు కాంచీ-పురనివాసి. ఇతని తండ్రి కలియుగకాళిదాసను కీర్తిని పొందిన వ్యక్తి. కాంచీపురమున ఏకామ్రనాథుని వసంతోత్సవమునం దీ భాణము ప్రదర్శితము. తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయమున 4581, 4582 సంఖ్యలతో రెండు ప్రతులు కలవు.

శృంగారజీవనము – అవధాన సరస్వతి :

4612 సంఖ్యతో తంజాపూరు సరస్వతీమహల్ గ్రంథాలయమున కల ఈ ప్రతిలో చాల గ్రంథపాతములు కలవు. భరతవాక్యము మాత్ర మేమియు పోలేదు. సంపూర్ణముగ నున్నది—

> తారుణ్య మస్తు సుదృశాం సతతాభివృద్ధం
> చంద్ర స్సముల్లసతు సంతతపూర్ణబింబః।
> మాసో మధు ర్విహరతా మనిశం వనేషు
> పుష్పాయుధో విజయతాం భువనైకవీరః॥

మదనమహోత్సవభాణము – శ్రీకంఠుడు :

విరహతప్తులైన నాయికానాయకులు కావ్యములలో వసంతోపాలంభము సేయుట, మన్మథోపాలంభము, చంద్రోపాలంభము సేయుట సంప్రదాయముగా

కాన వచ్చుచున్నది. కాని సూర్యోపాలంభ మెచ్చటను కానరాదు. ఆ సూర్యునికూడ ఉపాలంభించిన ఖ్యాతి శ్రీకంఠరచితమైన మదనమహోత్సవభాణమునకే దక్కినది. చూడుదు - .... సోపాలంభం

త్వం పద్మబాంధవ ఇది ప్రథితో హి లోకే
హృష్యంతి పంకజకులాని భవత్కరాప్త్యా।
సత్యం కుత స్సరసిజాయత లోచననాం
సంతాపయ స్యతితరం ముఖపంకజాని॥

భవతు కిమనేన జగచ్చక్షుష ఉపాలంభనేన.... నంజుండ యను నామాంతరము గల ఈ కవి శామయార్యపుత్రుడు ఆత్రేయగోత్రజుడు. ఈ భాణము బాలవ్యాఘ్రపురి లోని విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవములో ప్రదర్శింపబడినది. సిరుపులియూర్ (బాలవ్యాఘ్రపురి) ఇతని నివాసము కానోపు. ఈ కవి విద్వద్వినమ్రుడు. భాణరచయిత యయ్యును జన్మరాహిత్యమును కోరుకొనినవాడు.

విలసతు సౌభాగ్యశ్రీ ర్విదుషాం గేహేషు వీతచాపల్యమ్।
పరిహరతు వేంకటేశః పౌనఃపున్యేన జన్మ మే భూమౌ॥

శృంగారసర్వస్వభాణము – స్వామిశాస్త్రి :

లీలావతీ, లీలావతంసుల ప్రణయ మితివృత్తముగా గల శృంగారసర్వస్వ భాణమును అనంతనారాయణశాస్త్రి కుమారుడైన స్వామిశాస్త్రి రచించెను. శరజన్ముని అపరావతారమని ప్రసిద్ధిచెందిన సుబ్రహ్మణ్యసుధి కీతడు తమ్ముడు. తిరుచినాపల్లి (త్రిశిరఃపురి) లోని మాతృభూతేశ్వరుని వసంతోత్సవమునం దీ భాణము ప్రదర్శించుట కుద్దేశింపబడినది.

శృంగారమంజరీభాణము – రతికరుడు :

శృంగారమంజరీభాణమును రతికరుడు రచించినాడు. నీలానదీ తీరమునఁ గల జానకీరమణుని యుత్సవమందు ఈ భాణము ప్రదర్శింపబడినది. తన గ్రంథములచే నీతడు పాఠకుల మనస్సులలో రతిభావ ముద్బుద మొనర్చుట. కావుననే రతికరుడైనాడట.

అస్తి హి స్వప్రబంధేన సర్వేషాం మనసో రతిమ్।

కరోతి భువి ఖ్యాతో నామ్నా రతికరః కవిః॥

మద్రాసు ప్రా. లి. గ్రం. న R 5201 గల ప్రతి అసంపూర్ణముగ నున్నది. ఇతని కవిత్వమును తెలిసికొనుట కొక శ్లోకము.

సాయంతనప్లవవిశేషమనోహరాంగ్యా
మారోత్సవప్రణయివేషవిసృష్టరత్యా।
శృంగారమంజరికయా సమ మభ్యుపైహి
ధారాగృహస్య కుముదాభిధసౌధశృంగమ్॥

సంపత్కుమారవిలాసభాణము – రంగనాథమహాదేశికుడు :

శ్రీవత్సగోత్రజుడు, రంగనాథమహాదేశికుడు వ్రాసిన సంపత్కుమారవిలాస భాణమునకు మాధవభూషణ మనియు నామాంతరము కలదు. రంగనాథమహాదేశికుడు తర్క వేదాంతశాస్త్రములందు నిష్ణాతుడు. ఇతడు దశరూపకములలో సారము భాణమే అని వచించుట గమనార్హము.

సోయం కవి ర్విశ్వజనానుకూలః
సారశ్చ భాణో దశరూపకేషు।
సభా హి సారజ్ఞముఖ కిమన్య
దేతత్త్రయం దైవవశా దిహాసీత్॥

హరివిలాసభాణము – హరిదాసుడు :

మదనమంజరీ, మాధవుల ప్రణయమును వర్ణించు హరివిలాసభాణమును హరిదాసు రచించినాడు. ప్రౌఢదేవ మహారాజపురమందలి లక్ష్మీనారాయణుని వసంతోత్సవమున ఇది ప్రదర్శితము. ఈ క్రింది శ్లోకముతో భాణము ప్రారంభమగును.

శ్రీలక్ష్మ్యావదనగ్రీవసామ్యం ద్రష్టు మివాదరాత్।
పద్మశంఖే వహన్ దోర్భ్యాం ముకుందః శ్రేయసేస్తు వః॥

శృంగారపావనభాణము – వైద్యనాథుడు :

రాధాకృష్ణుల ప్రేమను, వివాహమును వర్ణించున దీ భాణము. కృష్ణకవి పుత్రుడగు వైద్యనాథ రచనము. తిరువళ్ళూరులో వేంచేసియున్న త్యాగరాజేశ్వరుని చైత్ర యాత్రోత్సవమున నిది ప్రదర్శింప నుద్దేశింపబడినది. ఇత డింకను పరదేవతా ముఖారవిందశతకమును, లక్ష్మీప్రసాదమాల, జ్ఞానదీపకలిక మున్నగు గ్రంథములను సయితము రచించినాడు. రాధాకృష్ణుల ప్రేమను వర్ణించు నీ భాణమునందు నాందీ శ్లోకము కృష్ణప్రణయపరముగ నుండుట గమనార్హము.

> కఠోదంచత్కపోతధ్వనికృత భగవత్కర్ణ పీయూషవర్షా
> హర్షాసార ప్రబుద్ధ ప్రథమరసలతాకోరక ద్రోమహర్షా।
> రింఖద్వక్షోజశైలా కలకలరశనా నాదకామాట్టహాసా
> రాధాపుంభావ కేళీ కలయతు సుభగంభావుకం భావుకం వః॥

అనంగవిజయ భాణము – శివరామకృష్ణుడు :

గౌతమగోత్రజుడైన శివరామకృష్ణ విరచితమైనది అనంగవిజయము. శృంగార భూషణ కలకంఠులకు, వసంతసేనా మందారమంజరులకు కల ప్రణయ మిందలి యితివృత్తము. వామలూరులోని వీరరాఘవుని వసంతోత్సవమునం దీ భాణము ప్రదర్శింప నుద్దేశింపబడినది. ఈ దేవుని వసంతోత్సవము కొంతకాల మాగిపోగ మరల సరస మహీపాలుని (మైసూరురాజు) యాదేశముచే చెన్నకృష్ణపండితుడు పునరుద్ధరించినాడు. ఈ కవి ఘటికాశతగ్రంథప్రబంధుడు. గంగాలహరీ సమానమగు కవితావిహారము చేయువాడు. తన భాణమును గూర్చి యీతడు పలికిన పలుకులు

> సుకుమారార్థసందర్భం సూచితవ్యంగ్యవైభవమ్।
> అనంగవిజయభాణ మాతనిష్ట మనోహరమ్॥

శృంగారరత్నాకరభాణము – సుందరతాతాచార్యుడు :

శృంగారరత్నాకరమును శ్రీ దేవచూడామణి తనయుడైన సుందరతాతాచార్యుడు రచించినాడు. శ్రీశైలవంశస్థుడైన ఇతడు ధన్వినగరవాసి యని తోచును. తన భాణము చివర చెప్పికొనిన ఈ శ్లోకము గమనార్హము.

> శ్రీశై లాన్వయభవ్య శేఖరమణే శ్శ్రీ దేవచూడామణే

రాచార్యస్య తనూభవేన సుతరా మాచార్యనిత్యక్రతోః।
శ్రీమత్సుందరతాతయార్యకవినా శ్రేయోగుణాంబోధినా
భాణోఽభాణి గుణాధికో బుధముదే శృంగారరత్నాకరః॥

మైసూరుమహారాజావారి సరస్వతీభాండారమున దీనిప్రతి కలదు. సంఖ్య-176.

అనంగబ్రహ్మవిద్యావిలాసము – వరదార్యుడు :

సాహిత్య ముపదేశమును సయితము చేయుచుండవలెనని ఆలంకారికుల భావన. ఆనంద ప్రధానము, వేశ్యా విలాసబహుళము నయిన భాణములలో వేశ్యాసంగమమును నిరసించుచు ఉపదేశము నిచ్చినవాడు వాధూలవరదార్యుడు. ధనమానములను విడిచిన వాడును, ప్రవాదమునకు భయపడువాడును, ఇహపరములనుండి భ్రష్టుడైన వాడే వారస్త్రీ సంగమమును కోరునని అనంగబ్రహ్మవిద్యావిలాసమున వివరించినాడు.

ధనమానపరిత్యాగీ ప్రవాద నిరపత్రపః।
ఐహికాముష్మిక భ్రష్టో వారస్త్రీ సంగ మీహతే॥

కుమార వేంకటసూరి తనయుడైన వరదార్యుడు రచించిన అనంగబ్రహ్మవిద్యా విలాసము ఇతివృత్తమున ఇతరభాణముల వంటిదే. సూత్రధారుడు మారిషుని సహాయమున ప్రస్తావనను నిర్వహించినాడు. కావున నీత దర్వాచీనకాలమునకు చెందినవాడే యనిపించును. కాని ఇతని దేశకాలములు స్పష్టముగ తెలియవచ్చుట లేదు. గ్రంథము నందు భాణసామాన్యములైన కలభకలకలము, వైదిక పుంగవుని వర్ణనము, మేషయుద్ధము మున్నగునని కన్పట్టును. పాములవాని వర్ణనము సహజముగ చేయబడినది. పాముల నాడించువారు సొరకాయబుఱ్ఱతో మురళి చేసికొందురు. ఆ విషయ మిట ప్రస్తావింపబడినది. చూడుడు.—

సంస్పృశ్య భోగ మసకృత్కరముత్ప్రకంపన్
గాయ న్నలాబుమురళీం వదనే నివేశ్య।
విధ్యాయపత్రసంతి (?) మాత్మని సంస్పృశన్ గాం
శశ్వద్భుజంగ మధిన ర్తయతే నరేంద్రః॥

శృంగార చంద్రిక – శ్రీనివాసకవి :

అసంపూర్ణముగ లభించు గ్రంథములలో శృంగారచంద్రికాభాణ మొకటి. శ్రీవత్సగోత్రజుడును, వరదార్యపుత్రుడునగు శ్రీనివాసకవి దీనిని రచించెను. ఇతని మాతామహుడైన వీరరాఘవుడు తర్క వ్యాకరణవేదాంతములందు నిష్ణాతుడు. రసిక సంతోషకమైన ఈ భాణమున "వరసహిత గణికాగణమపి నవరసహిత గణికాగణమ్" మున్నగు విరోధాభాసలు కన్పట్టును.

తనోతి తరుణాశ్లేషం లతామంజులతాభృతీ।
సుతనుశ్వసనాలోలదలకాతనుమాలికా॥

అను శ్లోకముతో నీ భాణము ఆగిపోయి, అసంపూర్ణముగ నున్నది.

చంద్రరేఖాభాణము – శంకరుడు :

చంద్రరేఖా, రసికశేఖరుల ప్రణయమును వర్ణించు నీ భాణము అసమగ్రముగ దొరకుచున్నది. D 12516 సంఖ్యగల మ.ప్రా.గ్రం. ప్రతిని బట్టి యిది కోలాహల రాజధానిలో ప్రయోగింపబడినట్లు ఊహింపవచ్చును. "డిస్క్రిప్టివ్ కేటలాగు"లో దీని రచయిత శంకరుడని పేర్కొనబడినది. ఇతని రచన రసవంతమైనది. ఒక్క ఉదాహరణము :-

కాంచీసీమని కాపి కాంచనమయీ నిశ్రేణికా రాజతే
తా మాసాద్య రణోత్సవేన మహతా కేనాపి ధీర త్వయా।
హర్షాత్కంటకశాలినా కరయుగే నాక్రమ్య శైలద్వయం
తస్య ప్రాంత నివాసినః శశభృతః శీతా సుధా లప్స్యతే.॥

శృంగారభూషణభాణము – శ్రీనివాసాచార్యుడు (లేక) లోకాచార్యుడు :

అసమగ్రముగ లభించు భాణములలో శృంగారభూషణభాణ మొకటి. శ్రీశైల వంశమునకు చెందిన వకులభూషణార్యుని పుత్రుడును, శ్రీనివాసాచార్యుని పౌత్రుడు నగు శ్రీనివాసాచార్యునిచే రచింపబడినది. ఇందు నటి ప్రాకృతమున మాట్లాడును. ప్రస్తావనను బట్టి యీ భాణము అతిగంభీరము, మధురలలితవాగ్గుంభితము, వివిధరస భరభరితమునని తెలియును.

శృంగారశేఖరభాణము – రామానుజకవి :

అసమగ్రముగ లభించు భాణములలో రామానుజకవి ప్రణీతమైన శృంగారశేఖర భాణమును చేరును. రామానుజుడు శ్రీవత్సగోత్రజుడు. రఘువరార్యగోపాలసూరి శిష్యుడు. R 53746 సంఖ్యతో మ.ప్రా.గ్రం.లో గల ప్రతి యీ శ్లోకముతో నంత మగుచున్నది.

పుల్లమందార మంజు స్మితరుచితతిభిర్దిక్షు సంతన్యమానా
జ్యోత్స్నా మచ్ఛాం ముఖాంభోరుహమధురమధూల్లోలుపానాం పతంతః।
గాయంతీ ఝణఝణితరణత్కంకణాభ్యాం కరాభ్యాం
మందం మందం మృగాక్షీ ద్రుతకనకలతేవేయ మాయాతి దూరే॥

జీవనభాణము – వరదాచార్యుడు :

అసమగ్రభాణములలో నిది యొకటి. కౌశికగోత్రుడైన శరణ్యాచార్యుని పుత్రుడీ వరదాచార్యుడు. మొదట మన్మథస్తుతితో కృతి ప్రారంభమగును.

సౌందర్యే సకలోపజీవ మభవ ద్యోసౌ వినా వ్యంగకం
యద్బాణాః పతనం వినాపి జగతాం చిత్తం హరంతి క్షణాత్।
యత్సైన్యే కరిణాం న సంత్యవయవాః శుండాశిరోభ్యాం పరే
సః శ్రీమాన్ రతినాయకో వితరతాం తుంగోదయం మంగళమ్॥

మద్రాసు అడయార్ లైబ్రరీలో 157D సంఖ్య ప్రతి మహారాజసభావినోదములతో నంతమగుచున్నది. భాణము చివరకు వచ్చియుండనోపును. కవిని గూర్చిన విషయములు తెలియరావు.

శ్రీనివాసవిలాసభాణము – పైత్తంబాడి రామానుజాచార్యులు :

ఇది బహుశః ఇంతవరకు ప్రకటింపబడిన భాణములలో చివరిది కావచ్చును. అనగా అత్యంత మర్వాచీనము. 1975-76 సంవత్సరములలో 'గైర్వాణి' (సంస్కృత మాసపత్రిక-చిత్తూరు)లో క్రమముగ ప్రకటింపబడినది. రచయిత మహాకవి పైత్తంబాడి రామానుజాచార్యులు. శ్రీశుకపురియందు ప్రదర్శనార్థ మిది యుద్దేశింపబడినది. ఇతని తండ్రి వరాహసూరి. శ్రీరంగలక్ష్మణు డితని గురువు. 1) వేదాంతదేశిక గురు

పూర్వచరితమ్ 2) మునిత్రయజయరూపకమ్ 3) కలికోలాహలనాటకమ్ 4) బ్రహ్మాణ్యానందాంకము - ఇతని ఇతరకృతులు. అహీంద్రనగరమునందలి పైత్తంబాద్యగ్రహారము నివాసము. తొండభూపుని సోదరుడైన ఆకాశరాజునకు ధరణీదేవికి ఆత్మజయైన పద్మావతీపరిగ్రహమహోత్సవమునకు వేంకటశేఖరుడు బయలుదేరి వెళ్ళుట యిందలి యితివృత్తము. ఈ కవి కలము భాణలక్షణమును చక్కగ జీర్ణించుకొన్నది. పద్మావతికై బయలుదేరిన శ్రీనివాసునికూడ వేశ్యావీథినుండి తప్పించలేక పోయినాడు. బహుశః వారి యింటికి మరొకదారి లేదేమో! తాటిచెట్టుక్రింద పాలు త్రాగినను కల్లే కదా! కావున కల్లు త్రాగుదమని వేంకటశేఖరుడు నిర్ణయించుకొనును. ఆ నిర్ణయమును పరిశీలించుడు

వామాః కామశరాతివిద్ధహృదయాః స్మేరారవిందాననాః
పీనోత్తుంగపయోధరా మృదులయా వాచా మనోహారిణీ।
తాస్తా మన్మథమన్మథో హ మధునా ప్యాశ్వాసయన్ సాదరం
నీత్వాహ ర్మధురోక్తిభిః ప్రియతమాం సాయం గమిష్యామి తామ్॥

కాంతలను మనోహరవచనములతో అనునయించుచు మన్మథమన్మథుడనైన నేను పగలిందే గడపి, సాయంకాలము పద్మావతి దగ్గరకు వెళ్ళెదనని అతని నిర్ణయము.

ఈ రచయిత బహుభాషాప్రవీణుడు. సంస్కృతమును, ప్రకరణోచికముగ వాడుటయే గాక గానాదికములకు ద్రావిడభాషలను సైత ముపయోగించినాడు.

వీడు మెన్మృత్తముం వీడు శెయ్ద్మ్ముయిరు।
వీడు యానిడై వీడు శెయ్మనౌ॥

వీరు వర్ణించిన విశేషములలో అంతర్భాణము విశిష్టమయినది. కొన్ని నాటకములలో, భాణములలో ఒకటి, రెండింట అంతర్నాటకము లున్నవి. కాని యీ భాణములో అంతర్భాణ మున్నది. అది మరల భాణమువలె నాందీ ప్రస్తావనా ఋతుగీతాదులతో కూడియే యున్నది. ఋతుగీతాదుల కింద ప్రాకృత ముపయోగింపబడినది. కనుక నిది మిశ్రభాణము.

ఈ అంతర్భాణములో మఱియొక విశేషము కలదు. అంతర్భాణములోని పాత్రములతో ప్రధానభాణములోని విటుడు సంభాషించుట ఒక చమత్కారము. ఇది గ్రీకురూపకములలోని "కోరస్"ను గుర్తుచేయును, తాను రంగస్థలము పై నుండి

పాత్రములతో పాలు పంచుకొనుట "కోరస్" తత్త్వము. ఆ పద్ధతి కనుగుణముగ నిందు ప్రధానభాణనాయకుడు అంతర్భాణపాత్రములతో సంభాషించును. వీరి కవితా శైలి, భావనారీతి కొక చిన్న ఉదాహరణ :—

రంభాయాం నళినం సనాళముదితం తస్మింశ్చ శేతే విధుః
తస్మిన్ కోకనదేఽధునా వికసితే జాతాఽత్ర సూర్యాత్మజా।
సోత్తుంగే చ నిపత్య మేరుశిఖరే వ్యోమాంగణా ద్వాపికాం
ప్రాప్తై తచ్చరితం విలోక్య తరసా ప్రాప్తోహ మద్యాబలే॥

నవీన భాణములు

అర్వాచీనభాణములను పరామర్శించిన తరువాత మరల నవీనభాణములనుట పునరుక్తికముగ తోచవచ్చును. కాని వీని స్వభావమునందలి భేదమే ఈ విభేదమునకు పురికొల్పినది. ఇవి యన్నియు క్రీ. శ. 20వ శతాబ్ది వారలచే రచింపబడినవి. అంతియ కాదు. నూతన దృక్పథముతో (భాణముల లక్షణముల నతిక్రమించియు) సంస్కరణాభిలాషతో రచింపబడిన భాణము లివి. పురాతనధోరణి భాణములు శృంగార విషయమున వీథిన బడినవి. అవధులు దాటినవి. వీనిలో శృంగారస్పర్శయే ఉండదు. హాస్యమే పరిపాలించును. అదియును సున్నితము, వ్యంగ్యపూర్వకమునయి ఉండును. సంఘసంస్కరణాభిలాష తొంగిచూచుచుండును. ఆంగ్ల సాహిత్యమున విశిష్టమైన Satire ప్రభావ మీ నవీనభాణములపై కలదు. సంఘమునందలి దురాచారములను విమర్శించుట కొఱకును, దుష్టవ్యక్తుల (మోసగాండ్ర) దుశ్చేష్టలను వ్యంగ్యరూపమున అధిక్షేపించుటకును నవీభాణము లుద్దేశింపబడినవి. ప్రాచీనభాణము లానందమును ప్రధానముగను, ఉపదేశము నానుషంగికముగను పోషించినవి. కాని నవీనభాణములలో ఉపదేశము ప్రధానము, ఆనందము ఆనుషంగికము. ఈ మార్పునకు కారణము సంఘపరిస్థితులు. ఈ సాంఘికపరిస్థితులను నవీనభాణములు సున్నితముగా విమర్శించి, పరిష్కారము చూపుట ముదావహము.

పురుషపుంగవ భాణము – జీవన్యాయతీర్థుడు :

సంస్కృత సాహిత్యమునకు ఎనలేని సేవచేసిన అర్వాచీనపండితులలో జీవ న్యాయతీర్థు లొకరు. కవిగా, నాటకరచయితగా, విమర్శకుడుగా, విద్వన్మణిగా, పత్రికా సంపాదకుడుగా ప్రసిద్ధి గాంచిన జీవన్యాయతీర్థులు 29-1-1894 వ తేదీన బెంగాలు జిల్లా భట్టపల్లినగరమున జన్మించిరి. ప్రాచీన విద్యాభ్యాసము కాశీలో మహామహోపాధ్యాయ రాఖాల్ దాస్ కడ నొనర్చి ఆధునిక విశ్వవిద్యాలయపరీక్షలలో సర్వప్రథములుగా నిల్చినవారు. 1929 నుండి 29 సం॥లు కలకత్తా విశ్వవిద్యాలయమున సంస్కృత సేవ యొనర్చినారు. వీరి ఇతరరచనలు కాళిదాసనాటకము, దరిద్రదుర్దైవము, పురుష రమణీయము, చౌరచాతుర్యము మున్నగు అనేక ప్రహసనములు.

20 వ శతాబ్ది భాణములలో కొంత ఆధునికత తొంగిచూచినదని ముందే నివేదించితిమి. దానిలో మొట్టమొదట పేర్కొనదగిన దీ రాణము. ఇది మొదటగా సంస్కృత సాహిత్యపరిషత్తు సారస్వతోత్సవములలో ప్రదర్శింపబడినది. ఇందలి నాయకుడు విటు డనలేము. ప్రాచీనభాణములలో అనంగశేఖరుడు, విలాసశేఖరుడు మున్నగు పేర్లు కన్పట్టును. కాని యిందలి నాయకుడు వాగ్వీరుడు. కేవలము వాక్శూరుడు. క్రియాశూరత శూన్యము. భాణమునందలి యితివృత్తము ఈ నామమునకు పోషకముగా నున్నది. నేటి మానవులలో గల ఒకవిధమైన మానసిక ప్రవృత్తికి ఈ వాగ్వీరుడు ప్రతీక. ఇతడు కేవలము ఉపదేష్ట మాత్రమే. అనుష్ఠాత మాత్రము కాదు. "Do as I say, but don't do as I do" అను సామెత నీత డనుసరించును. ఇతరుల భార్యల విషయమై స్వేచ్ఛగా సంచరింప ప్రబోధించును. కాని తన భార్యను గదిలో పెట్టి తాళము వేయును. తన భార్య పరునియం దాసక్తురాలయినచో తన సర్వస్వము పోయినట్లు బాధ చెందును. ఆత డెపుడైనను అస్వస్థుడైనచో భార్య పరాసక్తయై సేవకూడ చేయ దనియు, కావున "స్వగృహం సావధానతయా రక్షణీయమ్" స్వగృహమును, భార్యను జాగ్రత్తగా రక్షించుకొనవలె ననియు నీ వాగ్వీరుని యభిప్రాయము. ఇందీతడు తన వృత్తాంతము నిట్లు చెప్పినాడు.

ఒకనాడు వాగ్వీరుడు గ్రామాంతరమున నున్న బంధువుల యింటికి వెడలినాడు. అచట ఒక దర్భాసనముపై కూర్చుండెను. తిరిగివచ్చునపుడు దర్భ ఒకటి తన వస్త్రమున కంటికొనెను. దానిని తీసికొని మరల వెనుకకు వెళ్ళి వారి కిచ్చి వచ్చెను. (ఇంత వరకు వానిది సచ్చరిత్ర మనిపించును. కాని అక్కడనే ఉన్న స్వర్ణకుండలమును అటునిటు ఎవరు లేకుండ చూచి జేబులో వేసికొనెను. పోలీసు లితనిని పట్టుకొనగా అతని సచ్చరిత్రమును గూర్చి బంధువులు సయితము సాక్ష్యమిచ్చిరి. దర్భ సయితము ఇతరుల సొమ్ము ముట్టుకొనని వాగ్వీరుడా ఈ సొమ్మును దొంగిలించుట. ఇది నమ్మ జాలమని బంధువులు సాక్ష్య మిచ్చుటతో బ్రతికి బయటపడెను. (ఈ ప్రస్తావనలో మనోధైర్యమునుకూడ వ్యక్తపఱచినాడు.)

తరువాత ఈతడు మరొక కథను చెప్పును. అది ఆత్మరామాపర మైనది. అయ్యును కార్యశూన్యతను ద్యోతిక మొనర్చుచునే యుండును. ఇతని రూపసంపదను చూచి ఒక స్త్రీ ఇతనిని కోరి వచ్చును. ఆమె నీతడు సవతిని తనభార్య సహింప దనియు, ఆమె అనంతరము ఈమెను స్వీకరింతునని ఆమెతో సల్లాపము లాడుచుండగ ఆ

వనిత నొక పురుషుడు బలాత్కారముగా లాగికొని పోవుచుండును. ఆమె ఆర్తనాదము చేయును. ఆమెను రక్షించుట కీతడు కఱ్ఱకొరకు వెదకును. కఱ్ఱకై చెట్టుకొమ్మను నఱుకవలె ననుకొనును. ఇట్లీతడు తటపటాయించుచుండుగనే ఆమెను పరుడు లాగికొని పోయినాడు. ఈతడపుడు స్త్రీ స్వేచ్ఛను సమర్థించుచు సంతృప్తి చెందును.

ప్రాచీన భాణములలో విచ్చలవిడియైన శృంగార మిందు కన్పటదు. సంఘము నందు కన్పట్టు కార్యశూన్యులను, వాక్శూరులను దృష్టియం దిడుకొని కవి యీ రచన చేసినాడు. సరళము, సరసమునైన అధిక్షేపణముతో కూడిన రచన యిది. వీరి రచనా సారళ్యమున కొక మచ్చుతునక.

కా నీతిః పరలోకభీతిరహితం యా సాహసం దీపయేత్
కో ధర్మః నిజశర్మ హేతు రపరే మర్మంతుదాపి క్రియా।
కా పూజా జఠరాగ్నితర్పణమయీ కా సాధుతా మౌఖికీ
స్నిగ్ధా వాక్ తదనుచ్ఛలేన కఠినా గుప్తాహతి ర్వక్షసి॥

అభ్యుదయభావనతో, సభ్య ప్రపంచమునకు, వ్యంగ్యరీతిలో నుపదేశమును ప్రసరింపజేసిన జీవన్యాయతీర్థులు నవ్యభాణసాహిత్యమునకు నాందీ ప్రవక్తలు.

మర్కటమార్దలికభాణము – వాయి మహాలింగశాస్త్రి :

మర్కటమార్దలికమను నీ నవీనభాణమును రచించినది మహాలింగ శాస్త్రి. వీరు జూలై 1897లో తంజావూరు జిల్లా తిరువాలంగాడ గ్రామమున జన్మించిరి. అప్పయదీక్షితేంద్రుని వంశమున జన్మించిరి. తండ్రి యజ్ఞస్వామి. సంస్కృత సాహిత్యమునందే కాక సంగీతశాస్త్రమునందును విశేషానుభవము కలవారు. స్వతంత్రభారతమున సంస్కృతభాషకు తగిన ప్రోత్సాహము లేదను ఆవేదన కలవారు. వీరీ భావముతో భారతీవిషాదమును వ్రాసిరి. ఇది యింకను అముద్రితమే. ముద్రిత గ్రంథములలో వ్యాజోక్తిరత్నావళి, ద్రావిడార్య సుభాషితసప్తతి, భ్రమర సందేశము, నవలత మున్నగునవి పేర్కొనదగినవి. రూపకములలో శృంగార నారదీయము, కలిప్రాదుర్భావము, ప్రతిరాజసూయము మున్నగునవి. ప్రస్తుత మర్కటమార్దలికభాణము 1937లో నూతనమార్గమున రచింపబడినది.

కథాంశము:- ఇందు నాయకుడు మానవుడు కాదు వానరము. ప్రస్తావనలో సూత్రధారుడు కోతిని గూర్చి ప్రస్తావించును. కోతికి తోకలో ముల్లు గ్రుచ్చుకొనిన

దనియు, అది భరింపరాని బాధ కల్గించుచున్నదనియు చెప్పి తప్పుకొనును. వెంటనే వానరము రంగస్థలముపై సాక్షాత్కరించును. తోకలోని ముల్లు మరణబాధ కల్గించు చుండును. ఇంతలో ఆ కోతికి ఒక మంగలి కన్పించును. వానర మాతనిని తన తోక లోని ముల్లు తీయుమని ప్రార్థించును. తగిన పారితోషికమిత్తునని కూడ ప్రాధేయపడును. అత డంగీకరించి ఆ ముల్లు తీయును. అట డట్లు తీయుచుండగ ఈ కోతి గంతులు వేయును. అపుడు కోతితోక చివరసగము తెగినది. కోతికి కోపము వచ్చినది. మంగలిని కోతి దూషించినది. అతని కత్తిని తీసికొని అతనిని వెడలగొట్టినది. కొంతదూర మేగునప్పటికి కోతి కొక ముసలి అవ్వ కన్పించినది. ఆమె బుట్టలల్లుటకు చేతిగోళ్ళతో వెదుళ్ళను చీల్చుచుండెను. కోతి ఆమెను చేరి అవ్వా! అని జాలిగ సంబోధించి తన దగ్గరున్న కత్తిని ఆమెకు బహూకరించినది. ఆమె పనిని సుకరము చేసి కొమ్మని ప్రార్థింప ఆమె సంతోషించి అట్లే చీల్చ మొదలిడెను. కాని వెదురు గట్టిగ నుండుటచే కత్తి విరిగిపోయెను. కోతికి కోపమువచ్చి అవ్వను తిట్టి, కత్తికి బదులు బుట్టనిమ్మని నిర్బంధించినది. ఆమె చేయునది లేక ఒక బుట్టనిచ్చి దీనిబాధ తప్పించు కొనినది. కోతి బుట్టతో ముందుకు సాగినది. అక్కడ ఒకడు తన ఎద్దులను ఒకచాపపై మేతవేసి మేపుచుండెను. కోతి అతనిని చేరి తనబుట్ట నిచ్చెను. ఆ బుట్టలో గడ్డివేసి మేపబోయినా డతడు. ఇంతలో ఎద్దులు బుట్టను త్రొక్కివేసినవి. కోతికి కోపము వచ్చినది. అతడీ కోతికి భయపడి ఎద్దులను వదలి పారిపోయినాడు. అతనిని తిట్టి, బుట్టకు ప్రత్యామ్నాయముగ ఎద్దులను తీసికొనినది. ముందుకుపోయి కోతి ఒక నూనెగానుగ వర్తకుని చూచెను. అతనికి ఎద్దుల నిచ్చి అతనినుండి నూనెను గ్రహించినది. దానిని ఒక ముసలి అవ్వ కిచ్చినది. ఆ నూనెతో ఆమెచే అపూపములు వండించినది. ఆమె కొన్ని అపూపముల నమ్ముకొన జూచెను. కోతి వాని నన్నిటిని లాగికొని, కొన్నిటి నక్కడివారికి పంచిపెట్టెను. ఇంతలో ఒక గాయకుల గుంపువచ్చి, కోతికి ఒక్కటికూడ లేకుండ వానిని గ్రహించినది. కోతికి కోపమువచ్చి వారిని తరిమికొట్టినది. వారు భీతితో పరువిడి పారిపోయిరి. ఆ తొందరలో వారొక మర్దలమును (మద్దెల) విడిచిపోయిరి. కోతి దానిని గ్రహించి చెట్టెక్కి దానిని వాయింప మొదలుపెట్టెను. మిగిలిన కోతులు దానిచుట్టు చేరినవి. వానికి తనవృత్తాంతమును చెప్పినది. మిగిలిన కోతులు దానిపరాక్రమమునకు అచ్చెరువంది దానిని తమనాయకునిగ చేసికొనినవి. ఇంతటితో కథ ముగియును.

కవి ఇందులో ఆకాశభాషితమును సైతము స్వీకరించెను. ఇతివృత్తము అచ్చముగ లౌకికము. ఎప్పటినుండి మొదలిడిరో తెలియదు కాని నేటికిని పల్లెపట్టులలో

పిల్లలును, పెద్దలును హాస్యమునకై చెప్పుకొనుచుండెడి కథ. మా అనుభవములో నెల్లూరు ప్రాంతమునను, గోదావరి ప్రాంతమునను విన్న కథయే యిది. మిగిలిన ఆంధ్రదేశమున సైతముండి యుండవచ్చును. ఈ భాణరచయిత లోకము నుండి స్వీకరించి యుండిన ఇది ఆంధ్రేతరప్రాంతమునను వ్యాప్తమనట ముంజేతి కంకణమే. ఇట్టి చమత్కార లౌకిక కథ నితివృత్తము చేసిన యీ కవి అభినందనీయుడు.

ఈ భాణములో నరుడు కాక వానరుడు నటుడుగుట విశేషము. లోకమునందు కొందరు వ్యక్తులు తను వాఙ్నైపుణ్యముచే ముందు నాలికతీపుగా మాట్లాడి, ఉపకారము చేసినట్లు నటించి, ఎదుటివ్యక్తులను లోబఱచుకొని, వారిని వెంటనే గెంటివేయుదురు. ఇట్టి వ్యక్తులను బట్టియే తెలుగులో "అరచేతిలో పెట్టి మోచేతి వరకు నాకింతురు, ఏరుదాటి తెప్ప తగులబెట్టుదురు" అను సామెతలు చెప్పికొందురు. ఈ వ్యక్తులు అందరిని ప్రోగుచేసికొని, "సొంతడబ్బా" కొట్టుకొని, వారికి నాయకత్వము వహింతురు.. ఇట్టి ప్రజ్ఞావంతులను దృష్టియం దిడుకొని, ప్రజల గతానుగతికత్వమును సున్నితముగ సూచించున దీ భాణము. రాజకీయరంగమునం దిట్టి వ్యక్తులు తఱచుగా కానవత్తురు. ఇట్టి లోకప్రవృత్తిని మర్కట ప్రవృత్తిగా రూపొందించి, అందును తోకతెగిన కోతిగ అట్టి దానిని స్ఫురింపజేయుట యిందలి విశేషము.

సాక్షాత్కారభాణము – శివప్రసాద భారద్వాజ :

శ్రీశివప్రసాదభారద్వాజ రచించిన అత్యాధునికభాణ మిది. ప్రాచీనభాణముల కోవను బాహ్యస్వరూపమున మాత్రము స్వీకరించి, ఆంతరముగ నూతనత్వము కలదిది.

వామదేవుడను నిరుద్యోగి ఉపాధ్యాయపదవికి 'ఇంటర్వ్యూ'కు వెళ్ళుటమే సాక్షాత్కారేతివృత్తము. ఆ 'ఇంటర్వ్యూ'లో నేటికాలమున ఎన్నో ఇంటర్వ్యూలలో జరిగెడి అస్తవ్యస్తపరిస్థితులు, అవకతవక ప్రశ్నలు, జీతాల విషయములోని లావా దేవీలు మున్నగు విషయములు కళ్ళకుకట్టినట్లు వివరింపబడినవి. విద్యావంతుల దుర్దశ, ఎన్నికసమితుల (Selection Committee) లోని వింతవింత పద్ధతులను అద్దము పట్టినట్లు చూపునదిది. ఈ విషయములన్నింటిని హాస్యముతో జోడించి సహృదయలోకమున కుపాయనము చేసిన ఘనత యీ కవిది. చివరగ వామదేవుడు అశాంతితో అలమటించుచు తన అశక్తతను, కోపమును ప్రకటించుచు పలికిన శ్లోకము స్మరణీయము.

ప్రొజ్జ్వాలజ్వాలనై ర్జ్వలేత్ క్షితితలం చండాంశుచండాంశుభి
స్తప్తం తర్పితకోణగహ్వారజలై రాలోపితం తోయదైః।
రుద్రః సంతనుతా దకాండవికటం స్వం భైరవం తాండవం
మృత్యు శ్చర్వతు గర్వదుర్భరధియో యుష్మాదృశాన్ శోషకాన్॥

ఫంటూసచరిత(ప్రత్యూష చరిత) భాణము – అభిరాజరాజేంద్రమిశ్రా :

"ఫంటూసచరిత" భాణరచయిత శ్రీ అభిరాజరాజేంద్రమిశ్రా. ప్రయాగ విశ్వ విద్యాలయములోని సంస్కృత విభాగములో ప్రవక్తృపదము నలంకరించిన పండితులు వీరు. క్రీ.శ.1967 యీ గ్రంథరచనాకాలము. వామనావతరణమహాకావ్యము, ఆర్యాన్యోక్తి శతకము, భారతదండకము మొదలగునవి యితర కృతులు. ఫంటూస చరితభాణముతో మరి నాలుగు రూపకములను కలిపి "నాట్యపంచగవ్య"మను పేర వారు ప్రకటించిరి. కవిసమ్మేళనమ్, రాధామాధవీయమ్, నవరసప్రహసనమ్, కచాభిశాపమ్ అనునవి మిగిలిన నాలుగురూపకములు.

"ఫేషన్"లకు లొంగిపోయిన, విశృంఖల ప్రవర్తన గల, ఒకానొక ఆధునిక విద్యార్థి నాయకుడు. తన మేనమామకూతురయిన వాగురను ప్రేమించిన వాడీతడు. ఆమెను కలిసికొనవలెనని అలహాబాద్ లోని మంఫోర్డ్ గంజ్ మహల్ నుండి కొడగంజ్ వరకు నడచుట ఇందలి యితివృత్తము.

ఇది ప్రాచీనభాణములవలె శృంగారరసభూయిష్ఠము కాదు. ఒక్కమాటలో చెప్పవలెనన్న ప్రాచీనభాణములలో సామాన్యముగ కన్పించెడి యేవిషయము నిందు స్వీకరింపబడలేదు. కథాప్రస్తావనము కాని యిందు ప్రస్తావింపబడు వివిధవస్తువులు కాని సమకాలీన సమాజమునకు సంబంధించినవే. "మోడర్న్ గర్ల్"చేత చెప్పులతో దెబ్బలు తినెడి యువకులను సైత మీకవి ఆదరించినాడు. పరీక్షలన్ని తప్పుచు తానెందరినో ప్రేమించుచున్నను, తన నెవ్వరు ప్రేమించకపోగ, ఇతర విద్యార్థులతో తనను పోల్చికొని, తాను వారివలె నెందులకు గొప్పవాడు కాలేక పోవుచున్నాడో, అర్థము కాక వాపోయెడివాడిందు నాయకుడు. అట్టి యువకులకిది ప్రాతినిధ్యము వహించును

ఆధునికకాలములోని ఏకపాత్రాభినయములతో దీనికి సాదృశ్యమెక్కువ. శ్లోకరచన మున్నను సంఖ్య తక్కువే. ఆకాశభాషితము లాదరింపబడినను లెక్కకు

మిక్కిలి కావు. ఇంత స్వల్పపరిధిలోనే కవి తన వ్యుత్పత్తిని వివిధ కోణములనుండి ప్రదర్శించుటను మనము చూడగలము. ఈతని పద్యకవితాశైలి కొక ఉదాహరణము.

సైవ స్ఫుర త్తడిదివైతి దుకూలవస్త్రా
దృష్టద్ధ్వ్యరోజిదృఢకంచులికాం దధానా।
పారంపరీణ మృదుతాం హృది ధారయన్తీ
చంచత్తరీవ భువి చంక్రమణం దధాతి॥

భాషావిషయమున సైత మీ కవి ఆధునికతను, స్వేచ్ఛను ప్రదర్శించినాడు. వ్యవహారముననున్న అనేకాంగ్లపదములను, పలుకుబడులను యథాతథముగ స్వీకరించినాడు. ఏకపాత్రాభినయముగ దీని ప్రదర్శనము సుకరమే. కాని ప్రారంభమున ప్రస్తావనలో సూత్రధారవచనములలో ప్రయాగవిశ్వవిద్యాలయ సంస్కృత విభాగమును గురించి, అందలి వ్యక్తులను గురించి విస్తృతముగ వ్రాయుట పాఠకునకు విసువు కల్గించును. ఎంత సూత్రధారవచన మైనను అంత విస్తృతి లేకుండిన రసనీయముగ నుండెడిది.

అజ్ఞాతభాణములు

భాణములు రచనారూపమున ఏకపాత్రము లయినను సమాజమున వాని ఆస్తిత్వము అనేకపాత్రములను ధరించవలసి వచ్చినది. అస్తవ్యస్తములు, ప్రమాదములు అందు అనేకములు కన్పించుచున్నవి. కొన్ని గ్రంథములు నామమాత్రావశిష్టములు. కొన్ని గ్రంథమాత్రావశిష్టములై నామములను కోల్పోయినవి. కొన్ని గ్రంథనామమును - కర్తృనామమును సైతము కోల్పోయినవి.

అట్టివానిలో కొన్నింటిని ప్రస్తుతము పరిశీలించెదము.

-- ? --:

R_3693 (O_M_L.*) సంఖ్యతో కళ్యాణవర్మా - కేరళసుందరుల (కళావతి రెండవ కుమార్తె) ప్రణయమును వర్ణించుచు నొక భాణము అజ్ఞాతనామకము కలదు. ఇది స్వనామమును, స్వకర్తృనామమును సైతము కోల్పోయిన భాణము. రచయిత ఎవ్వరో తెలియుటలేదు. భాణముమాత్రము సంపూర్ణముగా నున్నది. బహుశః రవివర్మ (కేరళీయుడు) కాలమునందు అతనికి సన్నిహితుడైన రచయిత ఎవరో దానిని వ్రాసియుండును. భాణాంతమున భరతవాక్యమున రవివర్మ ప్రస్తావనము చూడుడు

భుజామధ్యం యావ త్సుభగయతి రూపం మధురిపోః
కుచాభోగానమ్రః కుసుమశరసామ్రాజ్యమహిమా।
విపన్ముక్తాం సంపద్వితతపరితోషాం వసుమతీ
ముదన్వత్పర్యన్తా మవతు రవివర్మా విమలధీః॥

వసంతోత్సవసమయమున ప్రదర్శించుట కుద్దేశింపబడిన యీ భాణములో నాయికానాయకుల అనురాగమును సూచించెడి యీ శ్లోకము అతని శైలిని పట్టియిచ్చును.

కాన్తః కళ్యాణవర్మా సకలగుణమణిశ్రేణిరత్నాకరో యః
తస్మిన్నత్యంత కౌతూహలి మమ చ శ్రీయుత స్తస్య చేతః॥

* Oriental Manuscript Library, Madras.

కాదాచిత్కశ్చ సంప్రత్యజని చ తయో ర్నో వసంతోత్సవేఽస్మిన్
సంయోగ స్తస్య తావత్ ద్రఢిమసి న వరం భావ ఏకః ప్రమాణమ్ ॥

గ్రంథమున నితివృత్తముగా నుండు వేశ్యల దురాగతములను - కల్లబొల్లి ఏడుపులను గుర్తించి, నాందిలో ఆ కన్నీటికి ఎంతగడుసుగా ఈ కవి జయము పలుకు చున్నాడో చూడుడు -

ముహూర్మాత్రా పుంసః ప్రసభవిధుత స్యాప్యనుపదం
వితాన్వానా చిత్తే కుసుమకరసామ్రాజ్యవిభవమ్ ।
సరోజ శ్రీసారగ్రహణనిపుణా నేత్రయుగలాత్
గలన్తీ వామాక్ష్యా నవసలిలధారా విజయతే ॥

-- ? --:

R 3755 O. M. L. సంఖ్యతో సంపూర్ణముగా నున్న మఱియొక భాణము భారతరాజ్యమున కేరళ దేశ ప్రభువైన రామవర్మను ప్రస్తుతించుచు కన్పట్టుచున్నది. కావున నీ భాణము రామవర్మకు సమకాలికమయిన రచనము. బహుశః ఇదికూడ వసంతోత్సవసమయ ప్రదర్శనమున కుద్దేశింపబడినదే. వసంతుని విటునితో పోల్చుచు, అందలి రమణీయ ప్రకృతిని కవి ఎంత రమణీయముగా వర్ణించుచున్నాడో పరిశీలింపుడు

మనోజ్ఞైస్సల్లాపైః పరభృతవధూనాం వ్యవహరన్
పరాగై శ్చూతానాం నిబిడ మనులిప్తైః సురభిళైః ।
విలోభ్య ద్వంద్వానాం కుల మకలుషాణాం ఘటయితా
వితన్వ న్నానందం విట ఇవ వసంతో విజయతే ॥

రామవర్మ పరిపాలితమైన కేరళరాజధానిని సైతమీ కవి వర్ణించును.

రథేభమహసాదిభిః క్వచన మోదిభి ర్మేదురా
క్వచిత్తిలకితా ముహుర్విభవకీర్తనైః పత్తనైః ।
క్వచిచ్చ నయనాంచలైః చలదృశాం యువానః క్షతాః
త్రయీ పరిచయః క్వచి త్ఖలు పురీ పరిభ్రాజతే ॥

-- ? --:

R 2461 సంఖ్యతో కేరళదేశీయుడైన యొకానొక కవి రచించిన మఱియొక భాణము O.M.L. లో గలదు, బహుశః ఇది శివపురిలో ప్రథమపర్యాయము ప్రదర్శింపబడి యుండవచ్చును. ఆద్యంతములు శిథిలములు. హేమంతఋతు వర్ణనము ప్రస్తావనలో కన్పించును. నటి సూత్రధారునితో ప్రాకృతభాషలో మాటాడును. రచయిత కవితాతత్త్వమున కొక ఉదాహరణము,

> వినయాదిగుణగ్రామదర్శిత ప్రీతచేతసామ్।
> అనుగ్రహేణ సాధూనాం మహత్త్వం యాతి మానవః॥

క్రీ. శ. 10 వ శతాబ్దమునకు చెందిన సాగరనంది తన నాటక లక్షణరత్న కోశమున పత్రలేఖాభాణమును, లలిత నాగరభాణమును, వీణావతీభాణమును పేర్కొనినాడు. కాని అవి లభించుటలేదు. వివరములును తెలియుట లేదు. కాని దీనిని బట్టి 8, 9 శతాబ్దములలోనే భాణరచన విరివిగా సాగుచుండెడిదని భావింపవచ్చును.

క్రీ. శ. 1175 - 1250 మధ్యకాలపు వాడైన శారదాతనయుడు తన భావ ప్రకాశమున నందిమతీభాణమును, శృంగారమంజరీభాణమును, వీణావతీభాణమును పేర్కొనినాడు. శృంగారమంజరీనామముతో నేటికిని అనేకభాణములు కన్పించు చున్నవి. శారదాతనయు డుదాహరించిన భాణము వీనిలోనిది కాకపోవచ్చును. ఉపలభ్యమానములు అన్నియు అర్వాచీనములే. వీణావతీభాణమును సాగరనంది, శారదాతనయుడు నిరువురును పేర్కొనుట దాని ప్రాచుర్యమును, ప్రాశస్త్యమును తెలుపుచున్నది. కాని అది అలభ్యము.

భోజుడు తన శృంగార ప్రకాశమున "ముకుటతాడితక"మను భాణమును పేర్కొనినాడు. ఇదియు అజ్ఞాతమే. "సంస్కృతవిస్మృత కావ్యావళి - ముకుటతాడితక" మనుపేర శ్రీ ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులు ఒక వ్యాసమును ప్రకటించినారు. (భారతి—మార్చి—1930).

విశ్వనాథుడు తన సాహిత్యదర్పణమున "లీలామధుకరభాణము"ను పేర్కొని-నాడు. కాని అదియు నామమాత్రావశిష్టమే.

సంస్కృత సాహిత్యమునకు విశిష్ట సేవ చేసిన పెదకోమటి వేమారెడ్డి తన "సాహిత్యచింతామణి" యందు తానొక భాణమును రచించినట్లుగా పలికినాడు.

దాని పేరు, వివరములు నేడు లభించుట లేదు. కవిపేరు, గ్రంథము పేరు తెలియని వానిలో నేదైన అతనిది కావచ్చునేమో! అది విశేషపరిశోధనల తర్వాత తేలవలసిన విషయము.

సర్వజ్ఞసింగభూపాలుడు తన రసార్ణవసుధాకరమునందు తన కందర్ప సంభవము లోనిదిగా క్రింది శ్లోకము నుదాహరించినాడు -

ఉభే తదానీ ముభయోస్తు చిత్తే
కదుష్టనిశ్వాసచరిష్ణు కేన।
ఏకీకరిష్య న్ననురాగశిల్పీ
రాగోష్మణైవ ద్రవతా మనై షీత్ ॥

(ద్వితీయోల్లాసము— స్నేహోదాహరణము)

ఇది చక్కని శ్లోకము. గ్రంథమంతయును ఇటువంటి శ్లోకములతోనే నిండి యుండినచో నది లభింపకపోవుట దురదృష్ట మనిపించును.

R_4282 క్రమసంఖ్యతో O.M.L.లో శృంగారమంజరి అను పేర కొన్ని తాళ పత్రములు కలవు. రచయిత పేరు లేదు. ఇది ఏ శృంగారమంజరియో సంపూర్ణముగ మరెక్కడనైన నున్నదో లేదో తెలియదు. ఈ భాణరచయిత శ్రీ రామచంద్రోదయమను మరొక కావ్యమును సైతము రచించెనట. రంగనాథుని వసంతోత్సవములలో ప్రదర్శించుట కుద్దేశింపబడిన దీ భాణము. చూడుడు—

సకల సుగుణధామా సంస్తుతౌదార్య భూమా
సతతవితతధైర్య స్సక్షమాదేవవర్యః।
పృథులతర నిజౌజాః ప్రీతయే రంగధామ్నః
ప్రచురరసధురీణం భాణమేకం వ్యభాణీత్ ॥

శృంగారరస (సరస) భాణమను పేర నొక భాణము R 9959 సంఖ్యతో O.M.L. లో కలదు. నాంది లేదు. "సమాప్తః శృంగారరసో నామ భాణః" అని చివర కలదు. గ్రంథపాత మధికము. దొరకెడి గ్రంథము వసంతవర్ణనముతో ప్రారంభ మగుచున్నది. విలాసశేఖరుడిందు నాయకుడు. అనంగమంజరి నాయిక కావచ్చును. రచన సుందర మయినదే. నక్షత్రవర్ణనము చేసెడి యొక శ్లోకమును చూడుడు -

వ్యోమస్థలీ విక్రయ వీథికాయాం
నవం తమోనీలపటం వితత్య।
ప్రదోషసాయాంత్రికవిప్రకీర్ణా
హారా ఇవోడుప్రకరా విభాంతి ॥

ఆకాశ మనెడి అంగడివీథిలో చీకటి అనెడి నల్లనిబట్టను పరచి అమ్మకమునకై దానిపై పోసిన హారములవలె తారకలున్నవట.

R-11413, R-11414 క్రమసంఖ్యలో రెండు భాణములు కలవు. కాని ఇవి రెండును మళయాళ లిపిలో వ్రాయబడి యుండిన కారణమున మేము పరిశీలించుట కవకాశము లేక పోయినది. భాణము పేరు గాని, కవి పేరు గాని తెలియుట లేదు.

మదనమంజరీ భాణమను పేర MS 1261 క్రమసంఖ్యతో ఆంధ్ర విశ్వకళా పరిషద్గ్రంథాలయమున ఒక భాణము కన్పించుచున్నది. ఈ గ్రంథకర్త సైత మెవరో తెలియలేదు.

"సంస్కృత్ మే ఏకాంకీ రూపక్" గ్రంథమును రచయించిన డా॥ వీరబాలా శర్మ అనేక భాణములను అజ్ఞాతకర్తృకములుగ నిచ్చిరి. వానిలో పెక్కు సవివరముగ మాచే నింతకుముందు పేర్కొనబడినవి. ఇక మాకును అలభ్యములైనవి కొన్ని భాణములు — ఆనందతిలకభాణము, కోలభాణము, మాలమంగలభాణము (ఇది బహుశః మహిషమంగలభాణము కావచ్చును), ప్రద్యుమ్నానందభాణము నట్టివి. రసవిలాసము అజ్ఞాతకర్తృకముగ వారిచేఁ బేర్కొనబడినది. కాని యిది చొక్కనాథుని రసిక విలాసమే.

R3764 క్రమసంఖ్యతో O.M.L. లో అజ్ఞాత నామముతో మరియొక భాణము కలదు. కాని ఇది చతుర్భాణిలో ప్రచురింపబడిన ధూర్త విట సంవాదమే. శ్రీ మానవల్లి రామకృష్ణకవి సైతము మొదట అజ్ఞాత నామముగనే వ్యవహరించి, ఆ పై ధూర్తవిట సంవాదమను పేర దానిని చతుర్భాణిలో ప్రకటించిరి.

శృంగారమంజరి అను మరియొక భాణము ఆంధ్రవిశ్వకళాపరిషత్తునందు (29194.A.U. Collection) లభించుచున్నది. ఈ భాణకర్త ఎవరో తెలియరాలేదు.

భాణములు - సామాన్యాభిలక్షణములు

భాణముల లక్షణము ఇంతకు ముందు వివరింపబడినది. లక్షణమాత్రముగ కాక భాణముల "బ్లూప్రింట్" రేఖామాత్రముగనందే వివరింపబడినది. కాని భాణములు ప్రాయికముగ ఒకే మూసనుండి తీసిన ప్రతిమలవలె కన్పించుచుండును. కాని 'ఆనంద వర్ధనుడు' వచించినట్లుగ* కథనవైచిత్ర్యము ననుసరించియు, రసాశ్రయత నాదరించియు, నవీనత గోచరించుచుండును. కనుక భాణము లాదరింపదగినవే. ఒకచో సంవాదము కన్పించుచున్నను, అది ఉత్తమమార్గముననే నడుచును. అక్కడక్కడ మధ్యమాధమ స్థితులును లేకపోలేదు. కనుక అట్లు సర్వసామాన్యముగ కన్పించెడి కొన్ని కొన్ని విషయముల సమ్యగ్దర్శనమే ప్రకృతవ్యాసోద్దేశము. ముందుగ కవులు భాణములు స్వీకరించుటకు గల కారణముల నూహింతము.

భాణరచన మెందులకు ?

భాణముల నన్నింటిని పరిశీలించిన తర్వాత ఏ నియమమునకు లోబడక వ్రాయుట కత్యంతసులభమైనది బాణ మనిపించుచున్నది. రససంఖ్యాది నియమములు కొన్ని యున్నను అవి అంతగ స్వేచ్ఛ నరికట్టునవి కావు. కవి తనకు తోచిన సర్వవిషయముల కందు ప్రవేశము కల్పింపవచ్చును. కనుక నితివృత్త నియమము కానరాదు. మంచి కొక నియమము గాని మంది అన్న తర్వాత పెక్కు భంగులు గదా!

ఇక రసపోషణవిషయమున గాని పాత్రపోషణ విషయమున గాని నాటక కర్తకు - కనీసము శ్రవ్యకావ్యకర్తకు కావలసినంత - జాగరూకతయు అవసరము లేదు. ఇక పరిమితిని గూర్చి ఆలోచింపవలసిన యవసరము లేదు. ముప్పది శ్లోకము లలో ముగించిన వారుండగ మూడు వందల శ్లోకములను మించి వ్రాసిన వారును కలరు (వచనములు కూడ). ఒక్క మాటలో చెప్పవలెనన్న సమాజమును గూర్చి తన కప్పుడప్పుడు తోచిన భావముల పద్యరూపములను తానొక మాలగా కూర్చదలచి-

---

* దృష్టపూర్వా అపి హ్యర్థాః కావ్యే రసపరిగ్రహాత్ |
సర్వే నవా ఇవాభ్రాంతి మధుమాస ఇవ ద్రుమాః ||
న కావ్యార్థ విరామోఽస్తి యది స్యాత్ప్రతిభా గుణః ||

ధ్వన్యాలోక - 4 ఉద్ద్యోత.

నపుడు — అనగా ముక్తకములకు కావ్యాకృతిని కల్పింప నెంచినపుడు, ఒక విటుని కల్పించి, మధ్యలో వచనములను చేర్చి, వాని నన్నింటిని అతనిచే చెప్పించవచ్చును. అనగా ఆంధ్రసాహిత్యమున శతకరచనము వలె అభ్యాసమాత్రమునకు కాని లేక అనుభవసారమును కూర్చుటకుగాని భాణరచనను సాగించవచ్చును. అనేకకవులు పాతిక సంవత్సరముల లోపు వయస్సున భాణరచన చేసినట్లును తెలియుచున్నది. అట్లు సాగిన భాణములలో కొన్ని విశేషములు.

అనంగుడో – సుందరాంగులో !

ఈ యిద్దరిలో ఎవరో యొకరి కటాక్ష వీక్షణములు సరసుల కవసరమే. కాని మహాకావ్యకర్త లెవ్వరును సామాజికుల విషయము నింతగ పట్టించుకొనలేదు. కావ్య నాయకునకు సరస సల్లాపముల కవకాశము కల్పించినారు. కాని సామాజికులను మాత్రము పెద్దవారిని చేసి కూర్చుండబెట్టిరి. భాణక ర్తలు మాత్రము సామాజికులపై సానుభూతిని చూపి అనంగుని చేతనో, సుందరాంగులచేతనో, వారి సురతముచేతనో, పురుషాయితముచేతనో ఆశీస్సుల నిప్పించిరి.

సర్వభాణములందును నాందియందు సమాసోక్తి, అతిశయోక్తుల నుపయోగించి కాని, నాంది ముగిసిన వెనుక రంగస్థలమున ప్రవేశించిన సూత్రధారుని వచనమున కాని, సామాజికుల కుల్లాసము కల్గించుటకు, అనంగునో, సుందరాంగులనో జుట్టు పట్టుకొని (అనంగుడైనా సరే) ఈడ్చికొని వచ్చెదరు. వారికి తీరిక లేకున్నచో సురతమునో, పురుషాయితమునో కొని తెచ్చెదరు. అట్టి సురతమహోత్సవ సంలీనమయిన ఇంద్రియ సమూహము మిమ్ము రక్షించు ననుచు యువరాజు రచించిన శ్లోకమును చూడుడు —

కేశా ద్భ్రంశ స్స్రుమానాం బలివిధిరధరాస్వాదనం మృష్టభుక్తిః
లోకైరాలోకనార్థం సకుతుకకృత ముద్గ్రీవణం రోమహర్షః।
ఉద్యత్స్వేదాంబుధారాప్లవన మవసతిస్నానమానందమూర్ఛా
ప్రస్వాపో యత్ర సోఽవ్యా న్మదనసురమహః ప్రీయమాణేంద్రియౌఘమ్॥

[రససదనభాణ - శ్లో. 9]

తలనుండి రాలు పువ్వులు బలివిధియట; అధరాస్వాదనము మృష్టభుక్తి యట; రోమాంచము లోకమంతయు చూచుటకు మెడపైకెత్తుట యట; చెమటలలోనే స్నానమట, నిదుర ఆనందమూర్ఛ యట. ఈ రీతిగ మదనసురయాగము చేయు నింద్రియసమూహము రక్షించునట.

ప్రరోచన :

ఇది ప్రస్తావనయందే ప్రస్తావించబడెడు ఒకానొక ప్రస్తావనాంగము. సామాజికులను, నాటక దర్శనోన్ముఖులను చేయుట ప్రరోచన. ఇది సర్వనాటకము లందును స్పష్టముగ కన్పించదు. కాని శ్రీహర్షుని నాటకములలో స్పష్టముగ నుండును. ఆ బాణీనే భాణము లనుసరించినవి. సామాన్యముగ 'ప్రరోచన' లేని భాణము కన్పింపదు. ఆ "ప్రరోచన" వివిధరీతు లందుండును.

కేవలము కవి కథాదుల యౌన్నత్యము తెలుపు ప్రరోచనలు కొన్ని. కాని అనేక ప్రరోచనలు ఒక ప్రశ్నకు సమాధానరూపమున గలవు. తర్కకర్కశుడైన కవి వాక్కులకు కావ్యకళాసౌందర్య మెట్లబ్బునని నటుడు లేక నేపథ్యము నందెవరైనను ప్రశ్నించెదరు. అప్పుడు కవి తత్సమాధానరూపమున ప్రరోచన నాదరించును. ఆ ప్రశ్నకు పద్మనాభుడు చెప్పిన సమాధానమును పరిశీలింపుడు —

కవిః ప్రకృతి కర్కశ ప్రబల తర్క విద్యాధర
స్తథాప్యధి గతైవ తత్కవితయా సుధామాధురీ।
గభీర బడబానల జ్వలన బంధు సింధూదరా
ద్బభూవ మధురా న కిం నను సుధాప్యాయినీ॥ [లీలాదర్పణభాణము]

కవి తర్కకర్కశు డైనంతమాత్రమున ఆతని కవితకు సుధామాధుర్యము సిద్ధింప కుండునా? "లోన బడబానలము మండుచున్న సాగరమునుండి అమృత ముద్భవింప లేదా?"

పురుషాయితము :

ఈ ప్రస్తావనము ముగిసిన వెంటనే విటుడు ప్రభాతకాలమున ప్రవేశించును. అప్పు డతని స్మృతులలో మెదలెడివానిలో పురుషాయితమొకటి. కొన్ని భాణములలో

1. ఉన్ముఖీకరణం తత్ర ప్రశంసాతః ప్రరోచనా - దశరూపకము – తృ. ప్ర.

నిది కొంతగడచిన తర్వాతనైన నుండును. ఆంధ్రసాహిత్యమున "రాధికాసాంత్వనము" వంటి కృతులలో పురుషాయితములకు లోటులేదు. గీర్వాణవాణి యందలి మహాకావ్యములలో గాని, నాటకములలోగాని స్త్రీలు విజృంభించి వీరాయితమును సాగించి నట్లెక్కువ కన్నట్టదు. సిగ్గుతో మొగ్గవలె ముడుచుకొనిపోయెడి తన్విలోని శృంగారమునకే కావ్యనాయకులు అఱ్ఱులు చాచెడివారు. దక్షిణనాయకుడైనను కనిష్ఠ మీదనే విశేషానురాగమును ప్రదర్శించెడివాడు.

ఆ లోపమును తీర్చుటకు భాణరచయితలు కంకణము కట్టుకొనినారు. సాధారణ శృంగార వర్ణన మితరకావ్యములలో నెంత ప్రచురమో పురుషాయిత వర్ణనము "భాణము"లలో అంతప్రచురము. వేశ్యాప్రస్తావన మిందు ఎక్కువగ నుండుట అందులకు కారణము కావచ్చును. అభినవ కాళిదాసుని పురుషాయిత వర్ణనమును పరిశీలింపుడు.

అపరాంగ విలీన చూలికానా
మధిరుహ్యోరుతలం నిషేదుషీణామ్।
అనుభుంజత ఏవ సుందరీణా
మతిదీర్ఘం పురుషాయితం యువానః॥ [శృంగార శేఖరభాణము_శ్లో10].

కురులు వెనుక భాగమున చిడిముడిపడుచుండగా తమతొడలపై నెక్కి సుందరీమణుల సుదీర్ఘ పురుషాయితమును యువకు లనుభవించుచున్నారట. యథార్థమునకు భాణములలోని పురుషాయితములలో నిది చాల సున్నిత మైనది.

దీనిని శ్లేషనాధారముగ కొని వీరకృత్యముతో పోల్చి చెప్పుట భాణకర్తలకు వెన్నతో పెట్టిన విద్య. వామనభట్టబాణుడు ప్రారంభముననే వీరాయితమును పరిచయము చేసి, దాని నభినందించి పురుషలోకమున నిందలకు గురికాక అదృష్ట వశమున తప్పించుకొనినాడు. చూడుడు—

తారాజాలకచుంబ్యమానకమలం ధౌతప్రవాళాధరం
శంఖాతర్గతకూజితం శశికలాసంసక్తకాలాంబుజమ్।
శైలక్షోభవలన్మృణాళతిలకం సంత్రస్తవిద్యుల్లతం
వేలోల్లంఘిమనోభవం విజయతే వీరాయితం యోషితామ్॥

[శృంగార భూషణభాణము - భాణము - శ్లో-2.]

ఇందీ కవి కేవలము నాయికచే గాక శ్లేష అతిశయోక్తుల చేత గూడ వీరాయితమును చేయించినాడు

ప్రణయములో ప్రళయము :

నోటిదాక వచ్చిన వస్తువు నోటికందనిచో ఎవరైనను నాధపడక తప్పదు గదా! అందున ప్రణయవిషయమున ఇక చెప్పవలయునా ? కాముకుల కందరకును స్త్రీ అనగనే మధురాధరమే గుర్తునకు వచ్చును. కాళిదాసంతటివాడు – "రతిసర్వస్వ మధరం" - అని నిక్కచ్చిగ పలికినాడు.[1] ఆ కాళిదాసే ఏ శుభముహూర్తమున ప్రారంభించెనో గాని దుష్యంతుని చేత ఒక చక్కని శ్లోకమును పలికించినాడు. దుష్యంతుని అనుభూతికి చక్కని చిత్రణము. శకుంతల తనను వీడి పర్ణశాలకు వెళ్ళిన పిదప -

> ముహురంగుళిసంవృతాధరోష్ఠం
> ప్రతిషేధాక్షరవిక్లబాభిరామమ్।
> ముఖమంసనివర్తి పక్ష్మలాక్ష్యాః
> కథమప్యున్నమితం న చుమ్బితం తు ॥ [2]

ఆ అధరపానము చేయిజారినందులకు బాధపడును. దానిని ఒరవడిగా తీసికొని అధరచుంబనము చేయిజారినదని విలపించెడి రసికులు ప్రతిభాణమందును ప్రత్యక్ష మగుచుందురు. అధరవంచితుడైన రసికుడు లేని భాణము ఎక్కడో కాని కన్పించదు. ఒక ఉదాహరణమును చూడుడు -

> చమత్కృతిచటూక్తిభిః కథమపి ప్రలోభ్యాదరా
> దుపేత్య పరిరభ్య నిర్భర ముదీతరోమోద్గమమ్।
> ప్రసహ్య కుచకోరకావపి నిపీడ్య నీవీపదం
> కథం కథమపి స్పృశ న్నధరచుంబనా ద్వంచితః ॥ [3]

చాటుకారములచే ఎట్లెట్లో మరులు గొలిపి, దరిజేరి, పులకరింతలు కలుగగ కౌగిలించి, బలవంతముగ చనుమొగ్గలు తాకి, పోకముడినెట్లో స్పృశించి, తుద కధర చుంబనమున మాత్రము మోసపోతిని గదా!

---

1. అభిజ్ఞానశాకుంతలము - ప్రథమాంకము - "చలాపాంగాందృష్టిం .."
2. " - తృతీయాంకము
3. సరసకవికులానందభాణము - పుట 15

ఈ మోసపోవుటకు కారణము లనేకములు. వానిలో నెక్కువ దైవికములే. ఎవరేని హఠాత్తుగా సమీపింప విశ్లేషణము పొందుటయో లేక తెలతెలవార భీతయైన నాయిక పరువెత్తుటయో లేక కోడి జాలిమాని "కాక్కొరోకో" అని తన సొమ్మంతయు పోవునట్లు కూయగ నాయిక పారిపోవుటయో జరుగును. కనుకనే కోడెకారునకు కోళ్ళన్నచో కోపము.

తామ్రచూడ నింద :-

కాని అది దుష్టచరణాయుధము కదా! కనుక వారి నింద కది గురి కాక తప్పదు. ఆ కోడిని రామభద్ర దీక్షితు లెట్లు నిందించెనో చూడుడు—

ఉరసి మమ పతన్త్యా భ్రాంతభూమ్నా రతాంతే
మధుర మధరబింబం యాన దాస్వాదనాయ।
కువలయ వదనాయాశ్చోపగృహ్ణామి యావ
త్పరుషతర మకూజ త్త్వాతకీ తామ్రచూడః॥

[శృంగారతిలకభాణము - శ్లో 15].

ఇక్కడ కొన్ని సంశయములు కలుగవచ్చును. రతాంతమున శ్రాంత్యాధిక్య మున్న సమయమున అధరచుంబనము లేదను బాధ యుక్తమా! లేక 'పునర్విమర్శన' లో అది లోపించినదని బాధయా ? కాక శృంగార సిద్ధాంతమున చుంబనము అంత్యమా? లేక అధరవంచితులుగ విటులను వర్ణించుటలో కవుల కాసక్తి యెక్కువా? కావ్యము లలో నాయికలు మన్మథుని, మలయానిలమును, చంద్రుని దూషింతురు, కాని కుక్కుట నింద కన్పట్టదు. ఇది భాణముల ప్రత్యేకత.

కామోపదేశాలు :-

విచ్చల విడిగా విటులు సంచరింపవలెనన్న ఎవరో యొకరి చేయూతయో, ఉపదేశమో అత్యావశ్యకము. కామకళానిష్ణాతులైన విటులు అనుభవహీనులకు, సంశయనిహతులకు, పిరికిగుండెల వారికి అరటిపండు నొలిచి చేతబెట్టినట్లు ఈ కామోపదేశములు చేయుచుందురు. అవి ఒకచో పలురీతుల వితండవాదములతో కన్పించుచండును. శాస్త్ర చర్చల ధోరణితో సాగుచుండును. కాని అందలి వాక్చమత్కారము, భావచమత్కారము పాఠకుల మనస్సుల నాకట్టుకొనుచుండును. ధూర్తవిటసంవాద భాణమంతయు కామోపదేశములతో నిండినదే. కులస్త్రీలకు

వారకాంతలకు గల భేదము చూపబడినది. యోగదీక్ష కన్న అనంగయాగదీక్ష అవశ్యకర్తవ్యమని పండిత యువకులకు బోధించి, వారిని వెన్నుతట్టి నడిపించుట విటుల జీవితాశయము. ఇది ఒకచో చార్వాక సిద్ధాంతములను పోలియుండును. కాని భాణముల లక్ష్యము అది కాదు. కాబట్టి ఆ కోణము నుండి వానికి ప్రాధాన్యము లేదు. ఒక ఉపదేశమును చూడుడు –

పణ్యస్త్రీషు పరస్త్రీషు పుష్పదోషో న విద్యతే।
న తాసు కులదోషో వా కులస్త్రీణాం హి తావుభౌ॥ (వసంతతిలక – 47)

వెలయాండ్రకు, పరాంగనలకు పుష్పదోషము, కులదోషము లేవట. అవి కుల స్త్రీలకు మాత్రమట.

కాని ఒకొక్కచో నీ కామోపదేశములు "సెక్స్" విజ్ఞానమును పాఠకులకు కల్గించుట కుపకరించునేమో యనిపించును. అనగా తాత్త్విక పరిశీలనముతో కొన్ని కొన్ని ఉపదేశములు జరుగుచుండును - ఒక ఉదాహరణము చూడుడు

రతక్షమాయాః ముగ్ధాయా వరం ముగ్ధా రతాక్షమా।
యతో భోగః క్రమాల్లభ్యః ప్రౌఢమధ్యమయో రపి॥
(శృంగారతిలక - 125 శ్లో.)

కవి ఏ కారణము చెప్పి సమర్థించినను ప్రౌఢారతికున్న ముగ్ధారతియే ఆనంద హేతువనుట శాస్త్రానుభవసమ్మతమైన విషయము గదా !

ఆశీః పరంపర :

ఈ ఉపదేశములతోఁబాటు ఇవి సఫలము లగుటకు విటులు పెట్టుబడులు అవసరము లేని ఆశీస్సులను అదేపనిగ క్రుమ్మరింతురు. అవి కేవలము శృంగార సారము. కాని పాత్రోచితములు, రసోచితములు కావున భాణములలో నవి రాణించినవి. చతుర్భాణిలోను, ఆ పై శృంగారమంజరి (అష్టభాషాబహిరిగోపాలరావు) మొదలగు వానిలోను ఈ ఆశీస్సు లెక్కువ. "ఉభయాభిసారిక" యందలి యొక ఆశీస్సును చూడుడు -

ఆఢ్యాస్తే దయితా స్సన్తు విప్రియా స్సన్తు నిర్ధనాః।
మాతుర్లోభా త్కదాచి త్స్యా న్నాప్రియైరపి సంగమః॥

కాని అత్యంత మనోహరము, యుక్తియుక్తమైన ఆశీస్సు పంచబాణవిజయ భరతవాక్యమున కల్పించుచున్నది...

అద్వైతం యువయోరస్తు కుచయో రివ సర్వదా।
మాభూ ద్భ్రువో రివద్వైతం కదాచిదపి చేతసోః॥

- స్తనములకువలె మీకెప్పుడును అద్వైతము సిద్ధించుగాక! కనుబొమలకు వలె ద్వైత మెప్పుడును లేకుండుగాక.

నారీ దూషణ :

ఇంత చక్కని ఆశీస్సుల నివ్వగలిగినను భాణరచయితలకు స్త్రీలపై కినుక ఎక్కువే. దానిని ద్వేష మనలేము కాని నారీ దూషణమున కందరును పాల్పడిరి. అందు అత్యంత రమణీయము, వ్యంగ్య వైభవవిలసితమయి, తిలకాయమాన మయిన శ్లోకము వసంతతిలకమున తిలక వర్ణనమున గలదు.

లోకే కళంక మపహాతు మయం శశాంకో
జాతో ముఖం తవ పున స్తిలకచ్ఛలేన।
తత్రాపి కల్పయసి తన్వి కళంక రేఖాం
నార్య స్సమాశ్రితజనం హి కళంకయన్తి॥

జాబిల్లి తనలోని కళంకమును పోగొట్టుకొనదలచి నీ మోముగ మారినాడు. కాని ఓ కాంతా! నీవు ఆ మోమునకు తిలక మను కళంకమునే తీర్చుచున్నావు. కాంతలు ఆశ్రితులు నెప్పుడును కళంకపరచుదురు గదా!

స్నుషాబాధలు:

ఇట్లు భాణకర్తలు నారీదూషణమును చేసినంతమాత్రమున వారికి స్త్రీ లోకముపై జాలి లేదనలేము. అత్తలబారిపడిన కోడళ్ళ బాధల నెట్లు వర్ణించిరో పరిశీలింతము -

న కాంచనవిభూషణం న రుచిరాణి చేలాని వా
స్రజో న హి న చందనం చికురశోభి తైలం న వా।
న వాంజన మసాంగయో ర్న కదాపి మృష్టాదనం
స్నుషాత్వ మధమాంగణే నిధనమేవ వామభ్రువామ్॥

నగలులేక, నాణ్యమయిన బట్టలు లేక, పూలు లేక, చందనాదులు లేక, సువాసన తైలము లేక, చక్కని తిండిలేక దరిద్రుని యింట కోడలుపిల్లగా బ్రతుకుట మరణ సమానమే అన్నా డీ కవి. ఇది దరిద్రుల యింటిలోనిదిగ పృథక్కరింపబడినది. కాని భర్తృగృహములు సాక్షాత్తు కారాగృహములని వర్ణించిన వారనేకులు. కాని వారు చూపించెడి కారణములు వారిపై జాలిని కల్గించెడివి కాక విరుద్ధలక్షణచే ఏహ్యమును కలించునవి. అనగ భాణకర్తలు ఆ రూపమున సంఘములోని నారీదుర్వర్తనమును ఖండింపనెంచి రన్నమాట. అందుచే "అత్తలేని కోడ లుత్తమురాలు, కోడలు లేనత్త గుణవంతురాలు " అను సామెతలో దానిని గుప్పించినారు తెలుగువారు.

వేశ్యామాత :

సామాన్యముగ నీమెను భాణకర్తలు 'జరతి' యని వ్యవహరింతురు. యౌవన ముప్పొంగుచున్న యువతులకు, దాని నందుకొను అభిలాషగల నిర్ధనయువకులకు నీమె సింహస్వప్నము. ఉత్సాహముగ బయలుదేరు విటునకు "పానకములో పుడకవలె" నడ్డుతగులునది. ఈమె పతివ్రత (వృద్ధనారి). ఈమె భిక్షాధికారికిగాని, లక్షాధికారిగ ప్రవేశించి భిక్షాధికారియైన వారికిగాని, ఎట్టి అవకాశము నివ్వదు. నిర్ధనునిపై నిష్కారణముగ అర్ధచంద్రప్రయోగము చేయును. కులయౌవనరూపవిద్యా వినయాలను గ్రహింపక, కేవలము ధనము నాదరించు వ్యక్తిత్వము కలది.

న కులం న చ యౌవనం న రూపం
న చ విద్యా వినయం న వా విటానామ్।
గణయ త్యథ విత్తలోలచిత్తా
బహుదోషం పర మాహ్వాయ త్యసౌ॥ (అనంగతిలకభాణము)

తలలు బోడులైన ....

తలపులు బోడులా అని యొక కవివాక్కు. దీని కుదాహరణములు భాణములలో కోకొల్లలు. శ్రోత్రియులు, శ్రోత్రియమ్మన్యులు సాగించెడి విశృంఖల విహారము లిందు పూసగ్రుచ్చినట్లు వర్ణింపబడినవి. రంభవంటి భార్య ఇంటనుండగ పరాంగనకై పాటుపడు మగవారిని — శ్రీ రామచంద్రునివంటి భర్త యింటనుండగ అతనిని మోసగించి లేచిపోయెడి ఆడవారిని యివి తీవ్రముగ ఖండించును. "వైదికుని చేతి విడెమాయె వనితబ్రతుకు" - అని ఒకడు స్త్రీలపై జాలిచూపును. 'సాంఘిక విషయానుశీలన' సందర్భమున నీ విషయమును ప్రస్తావించెదము —

వీరాభాసము :

భాణలక్షణకర్తలు "సూచయేద్వీరశృంగారౌ" అన్నను వీరరసము నెవ్వరును భాణములలో స్వీకరింపలేదు. దాదాపు "వీరరసప్రధానభాణము" లేదనవచ్చును. కాని వీరరసప్రస్తావన మందునిందు కన్పట్టుచుండును. మల్లయుద్ధములు, కోడిపందెములు, మేషస్పర్ధలు ఇవి వీరతాసూచకములే. కాని జంతువుల విషయము విడిచి మానవులను నాలోచించిన అక్కడక్కడ కొంత వీర స్పర్శ - అదిబహుశః అస్థానపతిత మయిన వీరము. కావున వీరాభాసము కావచ్చును. ఒక వేశ్యకొఱకు ఇరువురు వీరులు కలహించుట కొన్ని భాణములలో గలదు. శృంగారభూషణము, శృంగారసర్వస్వము మొదలగునవట్టివి. కాని ఆ కలహము పరాకాష్ఠకు చేరకముందు నివారింపబడుట, ఎవరి తప్పు వారు తెలిసికొని తప్పుకొనుట జరుగుచుండును.

నర్మభాషణములు :

నర్మోక్తులకు భాణములు పెట్టినది పేరు. అసలే కోతి. ఆ పై కల్లు త్రాగిన దన్నట్లు — మాటాడునది విటుడు, వినునది వేశ్య, ఇక నర్మోక్తులకు లోపమేమి? అవి నర్మోక్తులే గాక మర్మోక్తులుగ సైతముండును. కందుకక్రీడ సలిపెడి కాంత తోడనో, లేక ప్రసాధనవిధియందు లగ్నమైన తరుణితోడనో, లేక ఏ నెపమును లేకపోయినను వేళాకోళమునకో ఈ మర్మోక్తులను పలుకుట జరుగుచుండును. నర్మమో, మర్మమో ఏది అయినను శృంగారరసమును దాటి మాత్రము పయనింపదు. సామాన్యముగా దక్షిణనాయకుడే బహుచాటుకారుడై యుండును గదా! ఇక వేశ్యాలంపటుడైన విటుని చాటుకారములను, నర్మోక్తులను గుఱించి వ్రాయవలెనా?

కళత్రపత్రము :

ఎంత వేశ్యలైనను, ఎన్ని నర్మోక్తులాడినను, కొన్ని నియమములు, కట్టుబాటు వారికినుండును. "సానిదానికి మాత్రము నీతి ఉండవద్దా? మా పంతులుగారిని పిలిపించి - అయ్యా! ఇటు పైని మీత్రోవ మీది, నాత్రోవ నాది? అని తెగతెంపులు చేసికొన్న వరకు నేను పరాధీనురాలనే" అని మధురవాణి రామప్పపంతులుతో నికార్సుగా చెప్పినది కదా![1] ఆ దినములలో సానుల నుంచుకొనుటకు కొన్ని నియమములు, పద్ధతులు ఉండేవి. అది ఆనాటి సాంఘికస్థితి. ఆ స్థితి, ఆ పద్ధతి మన కంతకుముందు చాల కాలము నుండి యుండెడి దనువిషయమును భాణములు

1. 'కన్యాశుల్కము' ప్రథమాంకము 2వ స్థలము,

తెల్పుచున్నవి. సానితోబాటుగనే "సానినియమములు" పుట్టియుండును. ఆ నియమములను తెలిపెడిది "కళత్రపత్రము". భాణము లన్నింటిలోను విధిగా నుండును. ప్రాచీన భాణములందు కొన్నిట మాత్రమున్నది. విటుడు వేశ్యకు ఆమెను తానెంతకాలము ఏ నియమములకు లోబడి యుంచుకొనునో వివరముగా తెలుపుచు వ్రాసియిచ్చెడి "ప్రామిసరీనోటు" కళత్ర పత్రము. ఈనాడు డబ్బు అప్పు పుచ్చుకొనువాడు ఋణదాతకు వ్రాసియిచ్చెడి. "నోటు" నిది ముమ్మూర్తుల పోలియుండును. ఉన్న భాణములలో సమగ్రముగ నున్న "ప్రామిసరినోటు" నిందు గమనించెదము. అయిదుశ్లోకములలో[1] నున్న దాని అనువాదము క్రింద వ్రాయుచున్నాము -

"స్వస్తిశ్రీ మన్మథ నామసంవత్సర వసంతమాసమున పూర్ణిమయందు, హాలాస్యపుర నివాసియైన భుజంగ శేఖరవిటుడు కాంచనలత యను వేశ్యకు వ్రాయించి యిచ్చిన కళత్రపత్రము.—

ఈ కాంచనలత నాకు ఒక సంవత్సరకాలము భార్యగ నుండును. దానికి మూలధనముగ నీమెకు దినమునకు నూరు దీనారముల నిచ్చెదను. ఆదియుగాక ప్రతిదినము కస్తూరి, కుంకుమ, గంధము, మాలలు, తాంబూలములను, నెల కొకమాఱు రెండు పట్టుబట్టల నిచ్చెదను.

గడువు ముగియకమునుపు ఈమె మరియొకరిని కోరినచో యావజ్జీవము ధనము లేకుండ నాకు భార్యగ నుండవలసి వచ్చును. వసంతకుడు, కలహంసుడు, మాలతి, ఇందుకుసాక్షులు.

ఇది భుజంగశేఖర, కాంచనమాలల అనుమతితో 'మణులూరు' గ్రామవాసి 'మాధవ సేనుని' కుమారుడైన చిత్రలేఖకునిచే వ్రాయబడినది –

కన్యాశుల్కములో గాని, వెలుగుచూడని అనేక సాంఘికదురాచారములు – వేశ్యలసరసములు గీర్వాణవాణిలో అంతకు ముందుకాలముననే కవుల నాకర్షించి కావ్యముల ప్రతిబింబితములైనవి గదా!

సామాన్యముగ సర్వభాణములందును పురుషుడు స్త్రీకి వ్రాసియిచ్చిన కళత్ర పత్రములే యుండును. పురుషుల కొక న్యాయమూ? స్త్రీల కొక న్యాయమా?" అని ఎవరైన విమర్శింపగలరని అక్కడకూడ ఒకటిరెండింట స్త్రీ చేత "సమ్మతి పత్రము"ను

---

1. శృంగారతిలక ము 109 నుండి 114 శ్లో॥ వరకు.

సైతము వ్రాయించినారు. "కామబాణభాణ" రచయిత నారాయణకవి ఇంచు మించు ఇదే పద్ధతిలో స్త్రీ చేత సైతము సమ్మతిపత్రమును ఇప్పించినాడు.[1]

కాని ఇంత పకడ్బందీగ పత్రములు వ్రాసికొన్నను, ఎవరో ఒకరి దోషము వలన తదతిక్రమణము జరుగుచుండును. దానివలన ఘర్షణలు, జగడములు. వానిని తీర్చుటకు విటుడు ధర్మాధికారిగా వ్యవహరించును. ఒకచో అతడు "Members of Jury" నికూడ ధర్మాధికారులుగ ఏర్పరచుచుండును. అందు వాదిప్రతివాదులు చేయు ఆరోపణములు చమత్కారపూరితములై నిండుగ నవ్వుకొనుట కవకాశమిచ్చును.

అరంగేట్రం (రంగాధిరోహణోత్సవము):

భాణసంఖ్యలో సగమును మించిన భాణములు ఈ రంగాధిరోహణోత్సవము తోడనే ముగియును. ప్రాయికముగ విటుడు వేశ్యాసుతయొక్క ప్రథమరంగాధిరోహ-ణోత్సవమునకు బయలుదేరుటయే అనేకభాణములలో నితివృత్తము. కనుక భాణాంతమున ఆ మహోత్సవమును, అక్కడకు వచ్చిన వివిధవ్యక్తులను, నిర్వహింపబడెడి బహు కార్యక్రమములను, ఆ మహోత్సవమున చుక్కలలో చంద్రునివలె ప్రకాశించెడి ఆ పూబాలను రమణీయముగ, రసనీయముగ వర్ణించుట భాణకవులకు పరిపాటి. ఇంత జరిగిన తరువాత భరతవాక్యము లేకుండునా? అదియు ఒకచో సామాన్యనాటక భరతవాక్యమువలె - వేరొకచో భాణములలోని నాందివలె కన్పించుచుండును.

---

1. కామబాణభాణము - No. F 46 b, 47a

సాంఘిక విషయానుశీలనము

ఏ కవియును దేశకాలాద్యనవచ్ఛిన్నముగ కావ్యసృష్టి యొనర్పలేదు. ఒకవేళ అట్లు చేసినను అవి నాలుగుకాలముల పాటు నిలువ జాలవు. కారణ మేమన దాని నాస్వాదించు సహృదయులు దేశకాలపరివృతులగుటయే. ఆ యా పరిసరముల చేతను, కాలము చేతను, సంప్రదాయముల చేతను, ప్రత్యక్షముగను, పరోక్షముగను ప్రభావితులై యుందురు. ఆ ప్రభావమునుండి విడిపడుట ఎట్టి వారికిని కష్టము. కావున దేశకాల సంప్రదాయాదుల ఔచితీ పరిధి సహృదయుల కెల్లవేళల దృష్టిపథమున గోచరించును. దీని నతిక్రమించిన రచన నాతడు ఔచిత్యదూరముగ పరిగణించును. అప్పుడు ఆతనిలో ఆస్వాదన లోపించును. కావున మహాకావ్యములుగ, స్థిరసాహిత్యముగ నిలువజాలిన కవితాసృష్టిలో సామాజిక స్పృహ తప్పక యుండితీరును. అట్లని సాహిత్యము కేవలము చరిత్ర కారాదు. చరిత్ర కేవలము భౌతికరూపమును మాత్రమే వ్యక్త మొనర్చును. సంఘమును యథాతథముగ చిత్రించునది చరిత్ర. కవితాస్పర్శతో భౌతికరూపమునే గాక సంఘమునందలి వ్యక్తుల మానసిక విజ్ఞానమును, ప్రవర్తనలను, మౌలిక భావములను వానిలోని వైవిధ్యమును, పరోక్షముగ నందించునది సాహిత్యము. చరిత్రలో శిల్పము శూన్యము. అది కేవలము ముడిసరుకు. కాని సామాజికస్పృహ విషయమున సాహిత్యమున శిల్ప మనల్పము. సుందరముగా మలచిన యాభరణము సాహిత్యము.

ఇందొక విషయమును గమనింపవలసి యున్నది. మానవసంఘమందలి మౌలికభావములు శాశ్వతములు, దేశకాలాద్యనవచ్ఛిన్నములు. భౌతికరూపము దేశకాలాద్యవచ్ఛిన్నము. ఈ రెండింటిని వీలయినంత దగ్గరగా చేర్చు సాహిత్యమే నాల్గు కాలముల పాటు నిల్చుచున్న దనుట అనుభవైకవేద్యము. సాహిత్య స్థైర్యమునకు ఆ ఆంతరదృష్టి ఆవలంబనము నిచ్చుచున్నది. దీనిని గమనించియే భారతీయ లాక్షణికులు ఆ మౌలికభావపరంపరను నిర్దేశించి, అవి రసవ్యంజకతకు తోడ్పడునని యాదేశపూర్వకముగ నుడివియున్నారు. ఇది నేటికిని సిద్ధాంతమై నిలచియున్నది. నేటికీ కాదు, ఏ నాటికిని సత్యము శాశ్వతమే కదా!

ఇట్టి సమాజావలంబనము సంస్కృత సాహిత్యమునందు తక్కువ యను అప-వాద మొకటి కలదు. సంస్కృతసాహిత్యము రాజభవనములలోను, అంతఃపురముల

లోను ఆవాస మొనర్చి సామాన్యజనతకు దూరమైనదని కొందరి తలపు. సాహిత్యము నందు ఉదాత్తతాసంపాదనమునకై వారట్లు చేసిరి. అది కవుల పొరపాటు కాదు. ఉదాత్తజీవనము ముమ్మూర్తుల ప్రతిఫలించిన ప్రదేశమును వారు వస్తువుగ, ఆలంబనముగ గ్రహించిరి. "మంచియన్నది పెంచుమన్నా" అని కదా మహాకవి ప్రబోధము. ఆదర్శప్రాయమైన జీవితమును చిత్రించుటవలన మానవసమాజ ముత్తేజితమై మంచిని పెంచుకొనుటకు ఆయత్తమగును. అది విశ్వశ్రేయమునకు హేతువగును. మానవ కళ్యాణమును దృష్టియందిడుకొని "సర్వేజనా స్సుఖినో భవన్తు" అను నాదర్శముతో బయలు వెడలిన సాహిత్యము నిట్లు విమర్శించుట దృష్టిభేదమే యగును. అది యట్లుండనిండు. ఉదాత్తజీవనమునే గాక సామాన్యజీవనమును, అందలి సామాజికవర్తనములను, క్రీడావినోదములను, ఒకటేల ఎన్నియో విశేషములను, దైనందినజీవితమును ప్రతిబింబింపజేసిన భాణసాహిత్యము సయితము నేటి పాఠకులకు దూరముగ తాళీదళములలో తలదాచుకొన వలసివచ్చినది. (అది సహృదయతాలోపమే యనవలసివచ్చును.)

కావున సాహిత్యస్థైర్యమునకు 1) మౌళిక భావచిత్రణము, 2) సామాజికస్పృహ, 3) సహృదయత కారణములుగా చెప్పవచ్చును. ఇందు మొదటి రెండును పుష్కలముగ నున్న భాణసాహిత్యమునందలి మొదటివిశేషమును ఇతర ప్రకరణములలో వివరింతుము. ఈ ప్రకరణమున సామాజిక పరిస్థితులను ఈ సాహిత్య మెట్లు ప్రతిఫలింపజేసెనో యించుక సమీక్షింతుము.

ఈ భాణసాహిత్యము వెలువరించిన సామాజిక విశేషములను రెండు దశలుగ విభజింపవచ్చును. ఇది కాలక్రమమును దృష్టియందుంచుకొని చేయబడినది. మొదటి దశ ప్రాచీనదశ, రెండవదశ అర్వాచీనదశ. క్రీ.శ 15, 16శతాబ్దములనుండి అర్వాచీన దశ ప్రారంభమగును. అంతకుముందు చతుర్భాణి, కర్పూరచరితము పేర్కొనదగినవి. వానిని గూర్చి ముందు ముచ్చటింతుము. వీనికాలము మగధ, గుప్తసామ్రాజ్యముల కాలమై యున్నది. పాటలీపుత్రము, ఉజ్జయినీపట్టణములు వర్ణింపబడుటచే ఇట్లూహింప బడినది. ఆకాలమునాటి ప్రజలజీవన విధానమంతయు, నగర వర్ణనములతో సహా చతుర్భాణి ఫలింపజేయుచున్నది.

అష్టాదశవర్ణనములలో నగరవర్ణనము మొట్టమొదటిది. ఆ నగరవర్ణనము వలన ప్రజల నాగరికత, సంస్కృతి, జీవనవిధానము స్ఫురించుచున్నవి. కుసుమపురము (పాటలీపుత్రము – పుష్పపురము - పాట్నా) ఆనాడు ఒక పెద్ద నగరము, రాజధాని.

వివిధవస్తుసముదాయముల క్రయవిక్రయములు జరుగుచుండెడివి. ఆపణములు (బజారులు) అన్నియు జనవ్యాప్తములై శోభిల్లుచుండెడివి.[1] రాజమార్గము లన్నియు తీర్చిదిద్దినట్లుండెడివి. సిమెంటు రోడ్డులు వేసికొనిరేమో! రాజమార్గము ఏ మాత్రము దుమ్ము, ధూళి లేక పరిశుభ్రముగా నుండెడిదట.

ఈ ఆపణములలో వర్తకులు విరివిగా వాణిజ్యము సాగించుచుండెడివారు. ఆనాటి వాణిజ్యము ఇతరదేశములకు సయితము వ్యాపృతమైయుండెడిది. స్వదేశ వాణిజ్యము వలన లాభములచే సంతృప్తిపడనివారు దేశాంతరములకుపోయి వర్తకము సాగించుచుండెడివారట. ఇట్టి అత్యాశకలవారిని చోరులు ప్రయాణము లందు బంధించి, కొల్లగొట్టుచుండెడి వారట. ఈ విషయము 'ఉభయాభిసారిక'లో విటుడు ధనమిత్రునితో సంభాషించుటలో స్పష్టపడును.[2]

ఇది మహానగర మగుటచే అంబరచుంబి సౌధములును, నగర వీథులలో రాజోద్యోగిసంచారమును కల్గి రీవి వెలార్చుచుండెడిది.[3] రాజోద్యోగులు అశ్వారూఢులు, గజారూఢులునై సంచరించుచుండెడివారు. నగరములందలి యువతులందరును చారువిలాసినులై, అలంకారసంయుతలై అమరాంగనలను సయితము అపహసించు సౌందర్యముతో విరాజిల్లుచుండెడివారు. గణికాజనములు రాచబాటలలో సర్వజననయన సంతర్పణ మొనర్చుచు విలాసవిభ్రమములతో విహరించుచుండెడివారు. పట్టణమందలి ప్రజలు నిర్భీకులై ప్రహృష్టవదనులై నిత్యము ఉత్సవములు చేసికొనుచుండెడివారు. రత్నభూషణములు ధరించెడివారు. ఉజ్జ్వలములైన వస్త్రములను, గంధమాల్యాదులను ధరించి, ఆటపాటలతో నిత్యకళ్యాణము పచ్చతోరణముగ విలసిల్లుచుండెడివారు. ఇట్టి పాటలీపుత్రము భూమికి తిలకాయమానమై అమరావతితో తులతూగుచుండెడిది. ఈ విషయములను ఈ క్రింది శ్లోకము సుడువుచున్నది.

సర్వై ర్వీతభయైః ప్రహృష్టవదనై ర్నిత్యోత్సవవ్యాపృతైః
శ్రీమద్రత్నవిభూషణాంగరచనై స్స్రగ్గన్ధవస్త్రోజ్జ్వలైః।

---

1. నానావిధానాం పణ్యసముదాయానాం క్రయవిక్రయ వ్యాపృతజనేన
శోభంతేఽన్తరాపణముఖాని (ఉభయాభిసారిక పుట 3)
2. కి మతిలోభకాంక్షయా కుటుంబసంక్షేమ సర్వస్వేన సంగృహీతభాండో దేశాంతర
మభిగచ్ఛన్ అంతరా చోరై రప్యాసాదితో భవాన్ ? (ఉభయాభిసారిక -10 పుట)
3. అపి చ ప్రవరహయగజరథగతా ఇత స్తతః పరిచలంతః శోభన్తే మహామాత్రముఖ్యాః
(ఉభయాభిసారిక - 3 పుట.)

క్రీడాసౌఖ్యపరాయణై ర్విరచిత ప్రఖ్యాత నానాగుణైః
ర్భూమిః పాటలిపుత్రచారుతిలకా స్వర్గాయతే సాంప్రతమ్.

ఉభయాభిసారిక — శ్లో॥ 6.

ఆనాటి వారి విజ్ఞానము సయితము అబ్బురము గొల్పును. హర్మ్యములలో నీటి పంపుల నమర్చికొని[1] ప్రజలు సుఖసంతోషములతో జీవనము సాగించెడివారు. విద్యావినోదములతో ఆనందించెడివారు. సంగీతసాహిత్యములురెండును "సమపాళ్ళ"లో నున్న సంగీత రూపకములు ప్రదర్శింపబడుచుండెడివి.[2] విలాసజీవనమున కనువగు పుష్పాపణములు జనులకు నయనానందకరములుగ విలసిల్లుచుండెడివి. పుష్పాపణములు రూపుదాల్చిన పుష్పలావికలవలె నుండెడివని యీ శ్లోకము సాక్ష్య మిచ్చుచున్నది.

పద్మోత్ఫుల శ్రీ మద్వక్త్రా సితకుసుమముకులదళనా నవోత్పలలోచనా
రక్తాశోక ప్రస్పందోష్ఠీ, భ్రమరరుతమధురకథితావర్తస్తబకస్తనీ
పుష్పాపీడాలంకారాఢ్యా గ్రథితశుభకుసుమవసనా స్రగుజ్జ్వలమేఖలా
పుష్పన్యస్తం నారీరూపం వహతి ఖలు కుసుమవిపణి ర్వసన్తకుడుంబినీ

పద్మప్రాభృతకము - శ్లో॥ 20.

ఇట్టి విలాసజీవనము గడపు జనులకు నిలయమైన యా పట్టణములను చూడ వలెనని జానపదులు నిత్యము వచ్చుచుందురు. వారికా పట్టణములు ఆశ్చర్యము గొల్పుచుండెడివట.[3]

ఆ పట్టణప్రజల జీవనవిధానము సురలకును ఆకర్షణీయమై యుండెడిది. తమలో అసూయామాత్సర్యాదులు లేక శిష్టప్రవృత్తి కల్గి గుణగ్రాహులు, కృతజ్ఞులునై జనులు ప్రవర్తించెడివారు.

దాతారః సులభాః కలా బహుమతా దాక్షిణ్యభోగ్యాః స్త్రియః
నోన్మత్తా ధనినో న మత్సరయుతా విద్యావినీతా నరాః।
సర్వః శిష్టకథః పరస్పర గుణగ్రాహీ కృతజ్ఞో జనః
శక్యం భో నగరే సురైరపి దివం సంత్యజ్య లబ్ధుం సుఖమ్ ॥

ధూర్తవిటసంవాదము - శ్లో॥ 9

---

1. నిష్ఠీవన్తీవ విమలముక్తాదామసన్నిభాన్ ప్రణాలీముఖై స్తోయావశేషాన్ హర్మ్యస్థలాని, (ధూర్తవిట సంవాదము – పుట 3)
2. చూడుడు - ఉభయాభిసారిక పుట - 2, 3, 12.
3. పణ్య సముదాయాజ్జనబాహుల్యాచ్చ తాంస్తాం చ సమృద్ధివిశేషాన్ దృష్ట్వా విస్మయతే జనః (ధూర్తవిటసంవాదము - పుట 4)

కావుననే ఆ రోజులలో కుసుమపురమును మించిన నగరము భూమిపై లేదను విఖ్యాతి కల్గినది. అట్లని నీడలేని తేజస్సే కన్పట్టుననియు చెప్పజాలము. ఆ విశేషములను వెలువరించుటకు సయిత మీసాహిత్యము వెనుకాడలేదు. కవులు పరస్పర మత్సరగ్రస్తులై యుండెడివారు – "ఏ గతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరే గదా" యని చేమకూర మాత్రమే వాపోలేదు. శూద్రకుని సమయమందును ఇట్టి పరిస్థితికి తావు లేకపోలేదు. "అస్మిన్ కాలే ప్రవృత్తం ప్రతిభా స్రోతోవిఘాతినం సుప్రియ మపి సుహృద మధ్యసూయన్తే కవయః" (పుట 5) అని పద్మప్రాభృతకము కవుల యసూయాగుణమును వ్యక్త మొనర్చుచున్నది.

స్వార్థపరులచేతను, మానసికబలహీనులచేతను మతము భ్రష్ట మగుచుండెడిది. అట్టివారిని జను లవహేళన మొనర్చెడివారు. వరరుచి యిట్టి సన్నివేశమును ఉభయాభిసారికలో చిత్రించినాడు. విలాసకౌండిని అనెడి పరివ్రాజిక పైకి పరివ్రాజికగా నటించుచునే తెరచాటున శృంగారవిలాసములను ప్రదర్శించెడిది. పేరుకూడ అట్టి భావమునే సూచించునట్లు పెట్టినాడు. ఆమె సెంటు పులుముకొని వచ్చుచుండ ఆ సువాసనకు తుమ్మెదలుకూడ చూతపుష్పములను విడచి ఆమెను చేరునట.[1] బౌద్ధభిక్షువులు సయిత మిట్టి ప్రవర్తనకే యలవాటుపడి తాము పరిహాసపాత్రులై మతమును భ్రష్ట మొనర్చుచు పరిహాసభాజన మొనర్చుచుండెడివారు.[2]

ధనికులైన జనులు చాలమంది విలాసజీవనమున కలవాటు పడియుండెడివారు. దేశము సుభిక్షముగ నుండెడిది. విలాసజీవనవిధానములో ప్రాచీనదశకును, అర్వాచీన దశకును, కించిద్భేదము పొడసూపును. ప్రాచీనదశలో శృంగారము గృహములను దాటిపోలేదు. వేశ్యా సంపర్కమున్నను అర్వాచీనదశలో వలె విచ్చలవిడిగా లేదు. అదియును వేశ్యా స్త్రీలు ధనికుల యిండ్లకే వచ్చి తమవిలాసములతో ధనికులను వశ పరచుకొనెడివారు. అనగా స్త్రీలే ఎక్కువపాలు అభిసరించెడివారు. కాని అచ్చటచ్చట దీనినతిక్రమించిన సన్నివేశములు నుండెడివి. అవి వ్యక్తి గత తీవ్రసంకల్పమును బట్టి జరిగెడివి. ఉభయాభిసారిక దీనినే సూచించును.

రసికజీవనము గడపు విలాసపురుషులు యౌవనస్ఫురణము కొరకు రసాయనాదులను సేవించుటయు జరిగెడిది. ఈ విషయము నుపమానముగా గ్రహించి

---

1. "అస్యాః పటవాస గంధోన్మత్తా భ్రమంతో మధుకరగణా శ్చూత శిఖరాణ్యపి త్యక్త్వా పరివ్రజన్తి ఖల్వేనామ్," ఉభయాభిసారిక - పుట 6.

2. "భ్రాతః! క్వేదానీం వేశ వీథీ దీర్ఘకాగతో బక ఇవ శంకితశ్చరసి." పద్మప్రాభృతకము పుట 15,

శూద్రకుడు చక్కని రూపకచిత్రణ మొనర్చినాడు. వసంతవర్ణన మొనర్చుచు "రమణీయం ఖలు తావదిదం శిశిరజరాజర్జరస్య సంవత్సరస్య హిమరసాయనోపయోగా త్పునరావృత్తం వసంత కైశోరక ముపోహ్యతే."

సంవత్సరమనెడి విటునకు శిశిరము ముసలితనమనియు, హిమరసాయనమును సేవించి ఆతడు వసంతయౌవనమును పొందెనని రూపకమున సూచించినాడు.

ప్రజలు శకునములపై నమ్మకము కల్గియుండెడివారు. "భోః అస్యాః దర్శన మేవ నః కార్యసిద్ధినిమిత్తమ్." ఆమె దర్శనముచే తన కార్యసిద్ధి యగునని విటుని నమ్మకము. ఇట్టి నమ్మకముతోబాటు దైవభీతి సయితము కల్గియుండెడివారు. కాని ధూర్తవిటసంవాదమును పరికించినచో ఒక వింత యభిప్రాయము కల్గును. ఆతడు నాందియందు దేవస్తుతిగాని, ఆశీస్సునుగాని చేయలేదు. నా యుపక్రమమే క్రొత్తదనుచు వచించినాడు. దీనినిబట్టి ఆ కాలమున బౌద్ధముయొక్క ప్రభావము మిక్కిలిగా నుండెదిదని తోచును.

విద్యయా ఖ్యాతా ఖ్యాతిః సజ్జనారాధనం ధనమ్ ।
తేషాం ప్రీత్యా భవేద్ధర్మ ఇత్యస్మాక ముపక్రమః ॥

అని ధర్మముతో నుపక్రమించుటయే కాక, స్వర్గమును, అప్సరసలను నిరసించినాడు. ఇట్టి భావములు విరళముగ కన్పట్టును.

మొత్తముమీద సంఘ మంతయు నిత్యకళ్యాణము పచ్చతోరణముగా నుల్లసిల్లు చుండెడిదని చెప్పనొప్పును. సామాన్యజీవనమునందు సుఖశాంతులు లోపించెడివి కావని తెలియును. కూటికి, గుడ్డకు లోటు లేకపోవుటచే ప్రజలు కళలపై దృష్టి నిగిడ్చి, విలాసవినోదములకు తగినంత యవకాశముతో నానందభాజను లగుచుండిరని చెప్పనొప్పును. ఇది ప్రాచీనదశ. ఇక అర్వాచీనదశలో సాంఘిక జీవనము నొకపరి పరిశీలింతము.

అర్వాచీన దశ :

ఈ దశ(భాణసాహిత్యమున) 15వ శతాబ్ది చివరిభాగమునుండి ప్రారంభ మగును. అప్పటినుండి యీ సాహిత్య మెక్కువ దక్షిణదేశమునందే యుద్భవించినది. క్రీ.శ. 16,17,18 శతాబ్దములలో పెచ్చు పెరిగి విఱ్ఱవీగినది. దక్షిణభారతదేశము

నందు పై శతాబ్దులలో శృంగారము విచ్చలవిడిగా ప్రవహించినది. పడకటింటినుండి బయలువెడలి వేశ్యాగృహములలోను, ఉద్యానవనములలోను ప్రవేశించుటయే గాక పరస్త్రీతల్పములపై నధిరోహించుటకు కూడ సంశయింపలేదు. ధర్మభీతి, శృంగార విషయమున కొంతవరకు కొరవడినదనియే చెప్పవచ్చును. ఆ కాలములో పుట్టిన యీ సాహిత్యము తాత్కాలికములైన సంఘపరిస్థితులను చాటుమాటు లేకుండ బయట పెట్టుచున్నది. ఆ విశేషము నొక్కింత గమనింతము.

అప్పటి ప్రజలకు పొట్ట, బట్ట దిట్టముగా నుండుటచే ప్రజలు కళలపై కొంత మోజు కన్నవారు. రాజులు సయితము ఆ కళాత్మకభావనకు తోడుగా నిలచెడి వారు. వీరందరు ఏకత్ర సమావేశ మగుటకు దేవాలయములు ఆటపట్టులుగా నుండెడివి. ప్రతిసంవత్సరము రాజులు దేవాలయములలో వసంతోత్సవములు నిర్వహించెడి వారు. చుట్టు ప్రక్కలనున్న జనులందరు వచ్చి ఆ యుత్సవములలో పాల్గొనెడివారు. అందు ఎన్నియో వింతలు, వినోదములు మాత్రమే గాక కళలకు నిలయమైన రూపకములు ప్రదర్శింపబడుచుండెడివి. ఈ వసంతోత్సవములను చాలామంది రాజులు ఉత్సాహపూరితులై నిర్వహించెడివారు. కర్పూరము, పువ్వులు, చందనము, కస్తూరి మున్నగు సుగంధ ద్రవ్యములు విరివిగా నుపయుక్తము లగుచుండెడివి. ఈ ఉత్సవములు 15వ శతాబ్దమునుండి ఎక్కువగా జరుగుచు వచ్చినవి - ఆంధ్రదేశమున కుమారగిరి కాలమున నివి ఎక్కువ జరుగుటచేతను, కర్పూర మా ఉత్సవములలో నెక్కువగా ఉపయుక్తమగుటచేతను అతనికి కర్పూరవసంతరాయలనియు ప్రసిద్ధికల్గెను. కృష్ణరాయలు ఈ వసంతోత్సవములను కవితాగోష్ఠులతో నిర్వహించెడివాడట.

ప్రతివర్ష వసంతోత్సవ
కుతుకాగత సుకవి నికర గుంభితకావ్య
స్మృతిరోమాంచ విశంకిత
చతురాంతఃపురవధూప్రసాదన రసికా.

అని రాయలు కీర్తింపబడినాడు గదా! ఈ వసంతోత్సవములు దక్షిణ దేశమున విరివిగా సాగుచుండెడివి. ఈ యుత్సవములలో రూపకములు కూడ ప్రదర్శింప బడుచుండెడివి - సామాన్యులేగాక ధీమాన్యులును వీనిని తిలకించి యానందపరవశు లగుచుండెడివారు. అవి హృదయమున హత్తుకొనిపోయెడివి. మరల నవి స్మృతిపథమున మెదలినపుడు రోమాంచము కట్టెడిది. ఇట్టి యనుభవమును ప్రసాదించు

రూపకములలో భాణములు ప్రధానములైనవి. కారణ మవి శృంగారప్రాయము లగుటయే. ధర్మభీతిని కూడ వదలి హద్దులు మీరి, మానవుని బలహీనతలను తీరని కోరికలను ఒక్కసారి రేకెత్తింప చేసి ప్రశమింపజేయు నట్లుండెడివి.

భాణములలో వేశ్యావిలాసములు అతివేలమనోహరములుగా వర్ణింపబడినవి. వారి విలాసములు అందరను ఆకర్షించుచుండెడివి. శ్రోత్రియులు కూడ ఘాటైన చాటు సరసములకు లొంగి పోయెడివారు. వారిని ప్రజలు అవహేళన మొనర్చు చుండెడివారు.

హస్తే పుస్తక మాకలయ్య లలితం హింతాళపత్రాంచితం
కౌసుంభం పరిధాయ మూర్ధ్ని వసనం ప్రౌఢోర్ధ్వపుండ్రోజ్జ్వలః।
పద్మాక్షాక్షసరం ముహు శ్చ గణయ న్నగ్రాంగుళీభిః క్రమా
త్కోఽయం వైదిక పుంగవోఽత్ర గణికా వీథీషు చాటీకతే॥

(అనంగబ్రహ్మవిద్యావిలాసము)

వేశ్యలు సర్వులకును అభిగమ్యలను భావము వ్యాప్తిలో నుండుటయే గాక వేశ్యాగమనము నెరుగని పురుషుడు షండసదృశుడుగా కూడ పరిగణింప బడెడివాడు - ఈ అభిప్రాయము నిన్న మొన్నటివరకును కన్పట్టెడిది గదా - ధనవంతులను వేశ్యలు వారి హావభావ విలాసములతో నాకర్షించి, వారిని భోగములలో దేల్చి, నిర్ధనులుగా చేసి, వేశ్యామాత లను పిశాచములచే వారిని బయటకు నెట్టించెడివారు. వారి యాక్రోశములు కూడ ఇందు వర్ణింపబడినవి. వారి వేశ్యావైముఖ్యము పాఠకులకు వైరాగ్యమును కల్గించునదై యున్నది. సాంఘికజీవనమునందలి లోపములను, మానవుని మానసిక బలహీనతలను చాటులేకుండ బయటపెట్టి, దానినుండి తమ్ము కాపాడుకొనుమని పాఠకుల కుపదేశ మిచ్చినవీ భాణములు. ఈ విషయమున శ్రీ P.P.S. Sastry గారి వాక్యములు ప్రస్తావనార్హములు.

"The bhanas are as a rule deal with the social and moral drawbacks of the people with a view to give the people an opportunity to rectify themselves. All the bhanas are devoted to the elucidation of the ways of inumoral conjugal happiness. So that the people may detect those means and put a stop to them (అనంగ జీవనము వ్రాతప్రతికి ఉపోద్ఘాతము.)

ఇచ్చట ఒక్క శోచనీయ విషయము కూడ కలదు. వేశ్యాగమనమే గాక పరాంగనాసంగమమునకు సయితము వెరవని పురుషపుంగవులును భాణములలో కన్పట్టుదురు. వారి విలాసములను, నైపుణ్యములను సయితము బయటపెట్టుట కీ భాణసాహిత్యము సంకోచింపలేదు. సరసకవికులానందమున పరాంగనను వశపరచు కొనుటకు మార్గముల నెట్లు చెప్పెనో పరికింపుడు.

తరసా నిపీయ సరసాధరం కుచా
పురసా నిపీడ్య సరసోక్తి సల్లపన్ ।
కురు సాహసాని సహసా తతః పరం
స్వవశా భవన్తి వివశాః పరాంగనాః ॥

పాత్రోచిత దృష్టితో చూడగల్గినచో ఇందులో మనకంత అనౌచిత్యము కన్పట్టక పోవచ్చును. అట్టి సంఘమును, ఆచారములను వ్యంగ్యాధిక్షేపణము చేయుచున్నట్లు గ్రహించుట పాఠకుల ధర్మము కూడ.

దేవాలయోత్సవములలోనికి వివిధదేశ స్త్రీలు వచ్చుచుందురు - భాణకర్తలు వారి వారి సంప్రదాయములను, ఆచారములను, వేషభూషణములను, వింత సోయగములను వర్ణించినారు - దిదృక్షువులైన జనసమూహములకు ఆ సందర్భములు నేత్రపర్వములుగా నుండెడివి. "కేచిద్యాన్తి రిరంసవః" అను వాక్యమునుబట్టి రక్షణసూచకముగ "....వివాహే తీర్థయాత్రాదౌ స్వదారా నిహ రక్షయేత్" అను వాక్యము ఆ కాలము నందలి సంఘటనలను బట్టియే ప్రచారములోనికి వచ్చియుండును. ఒక్క మాటలో చెప్పవలెనన్నచో ప్రజలు రసికజీవనము గడుపుచుండెడివారని చెప్పనొప్పును.

సామాన్యజనతాజీవనములో ఎన్నియో క్రీడలు, వినోదములు ప్రచారము నందుండెడివి. ఈ విశేషములు 'క్రీడలు వినోదములు' అను ప్రకరణమున వివరింప బడును. మరికొన్ని విశేషములను "సామాన్యాభిలక్షణము"లలో వివరించియే యుంటిమి.

క్రీడలు - వినోదములు

తెలుగునేల నాలుగుచెఱగు లందును ప్రజలకు పరిచితములయిన దేశవాళీ ఆటలు అనేకములు కలవు. స్వల్పవ్యయముతో, అత్యల్పబలముతో, స్త్రీ పురుష భేదము లేకుండ అందరు ఆడదగిన ఆటలు మనదేశమున కోకొల్లలు. అవి కేవలము వినోద ప్రాయములే గాక సంస్కృతివాహకములయిన బాట లయి, బీటలు వారిన చరిత్ర - సంస్కృతులను మరల సన్నిహితపరచుచుండును. ఇంత నేపథ్యముతో మనకవి ప్రత్యక్షమగుచుండును.

అట్టి క్రీడలు కొన్ని మనలో నామమాత్రావశిష్టములై గ్రంథ సాక్ష్యములై మిగిలినవి. అట్టి గ్రంథములలో భాణములకు గూడ తగినంత స్థానము కలదు. భాణ రచయితలు తమతమ కాలములలో విస్తృతప్రచారములో నున్న క్రీడలకు, వినోదములకు తమ గ్రంథములందు సముచితస్థానము కల్పించిరి. వానితో పాఠకులకు కూడ కొంత వినోదమును సంతరింపజేసిరి. అట్టి క్రీడలను, వినోదములను కొన్నిటి నిట పరిశీలింతము. వీనిలో భాణరచయితల సామాజిక స్పృహ తేటతెల్లమగును.

వెన్నెలవత్తి: ఈ ఆటను సరదాకొఱకు వెన్నెలరాత్రులలో ఆడుచుండుటచే దీని కీ పేరు కలిగినది. దీనిని వేరు వేరు ప్రాంతములలో వేరు వేరు పేర్లతో వ్యవహరించుచుందురు. “పిల్లదీవాట” అని ఒకచోట, “చిక్కుచిక్కుపుల్ల” అని ఒకచోటను, “దూదుంపుల్ల” అని ఒకచోటను పిలుతురు. సూర్యరాయాంధ్ర నిఘంటువు దీనిని “కుచ్చీల్ “ అని పేర్కొనెను. ఈ ఆట ఇసుక ప్రదేశములో ఆడుదురు. కాళిదాసెంత ప్రాచీనుడో ఈ ఆట అంత ప్రాచీనమైనది.

> అన్వేష్టవ్యైః కనకసికతాముష్టినిక్షేపగూఢైః
> సంక్రీడన్తే మణిభి రమర ప్రార్థితా యత్ర కన్యాః ॥ మేఘ – 26.

మట్టిలో లేక ఇసుకలో బారెడు - మూరెడు పొడవు కట్ట చేసి, అందేదైనను వస్తువును దాచిన దానిని రెండవవాడు కనుగొనుట ఈ ఆట స్వరూపము.

తెలుగున వసుచరిత్రకారుడు సయితము యీ ఆటను సరసమనోజ్ఞముగా చిత్రించినాడు (ఆ.3-29ప). శృంగార సర్వస్వభాణకర్త దీనినెట్లు వర్ణించెనో చూడుడు -

మత్తాకాశినీపయోధరాకారశాంతయా పరికల్పితేషు పంక్తి భూతేషు సైకత రాశిషు కుత్రచి త్తద్విహారప్రవృత్తేన నరేణ క్వచి ద్గోపితో మణిః నిమీలితాక్షేణ తదన్యేన యేన సముద్ధ్రియతే తస్య జయః, నో చేత్పరాజయః[1]

ఇసుకను కుప్పలుగా పోసి ఒక కుప్పలో మణిని దాచెదరు. రెండవవారు దానిని కనులు మూసికొని గుర్తించవలయును. గుర్తించినచో వారు గెలిచినట్లు - లేనిచో ఓడినట్లు. ఈ గెలుపు ఓటములకు ఫలితము లుండును.[2] భాణములలో ప్రత్యేక శిక్షలు సయితముండును.

దాగుడుమూతలు: "ఎక్కడి దొంగలు అక్కడనే గప్‌చిప్" అని అందరును దాగికొని, ఒకరిని ఏడిపించుట ఈ ఆటలోని సరదా. దీనిని పింగళి సూరన కళాపూర్ణోదయమున "కనుమూసిగంతులు" అని పేర్కొనినాడు. 'చక్షురపిధానవిహార' మని నల్లా దీక్షితుడు దీనికి నామకరణము చేసినాడు. "సాక్షిణ్యా సుమధ్యయా అనయా పిహితాక్షీ కాంచనమాలా......కథ మేషా కాంచనమాలా ఇతస్తతో విలీనాః సఖీ రన్వేషయన్తీ కరలగ్నాం కలభగమనా మానయతి"[3] "ఈ కవి ఈ ఆటకు అధికారిని సైతము సూచించుచు "కలభగమన" వంటి మందగామినుల కీ యాట తగదనును.

దీని క్రిందనే జనకట్టబడెడి మరొక క్రీడావినోదము కలదు. మన మెవరేని వ్యక్తితో ముచ్చట లాడుటకు పూర్వము, వారికి వెనుకగా వెళ్ళి వారి కనులుమూసి, వారు మనపేరు చెప్పువరకు కన్నులు తెరువనీయము. పేరు మాత్రమే గాక అభిజ్ఞానముగ కూడ ఒక సన్నివేశమును సూచించుటను శృంగారసుందర భాణములో ఈశ్వర వర్మ సుందరముగా వర్ణించినాడు.

"అయే ఏష కోపి జనః పశ్చా దాగత్య కమలాభ్యా మివ మృదులాభ్యాం పాణిభ్యాం మమ దృశౌ నిబధ్నాతి. స్పర్శేన యోషేవ ప్రతిభాతి చ.... భద్రే జ్ఞాతాసి త్వం – ముంచ మే దృశో ర్బంధనం - క్రిం బ్రవీషి ? ఏవం చేత్కిమ ప్యభిజ్ఞాన మభిధీయతా మితి"[4]

---

1. శృంగార సర్వస్వభాణము, పుట 16.
2. వీని సంపూర్ణ స్వరూపమునకు చూడుడు విజ్ఞానసర్వస్వము – 4వ సంపుటము - 145.
3. శృంగార సర్వస్వభాణము. పుట 16.
4. శృంగారసుందరభాణము – పుట 33

అభిజ్ఞానముగ సుందరశృంగార సన్నివేశమును ఆ పాత్రచే పలికించును.

స్మరసి తదయి తాంతా త్వం రతాంతే ప్రమోహా
దురసి మమ శయానా యావ దీషత్ప్రసుప్తా।
ఉషసి గృహవధూనాం వాస్తు సంస్కుర్వతీనాం
కరవలయరణో యత్ బోధక స్తావదాసీత్ ॥

సరిబేసి ఆట : చేతిలో కొన్నివస్తువులను మూసి, సరియో బేసియో చెప్పుమని ప్రశ్నించి, సరియైన సమాధాన మిచ్చిన ఆ వస్తువులను వారి కిచ్చుట, లేనిచో వారి నుండి గ్రహించుట ఈ యాటలోని విశేషము. ఈ ఆటను "యుగ్మాయుగ్మ విహార" మని పేరు పెట్టి నల్లాదీక్షితులే గ్రంథస్థ మొనరించినాడు.

"ముక్తాభిః పరిపూరితాం ముష్టిం ప్రదర్శ్య, అత్ర ముష్టౌ యుగ్మ మయుగ్మం వా మౌక్తిక మితి కేనచి దనుయుక్తః ప్రతిద్వంద్వీ యుగ్మమితి వా ఆయుగ్మమితి వా కించిత్ప్రతిజానీతే. అనంతరే మౌక్తికానాం విభజనే పరిశిష్యమాణం ప్రతిజ్ఞానుసారేణ సంపద్యతే చేత్ ప్రతిజ్ఞాకృతో జయః, నోచే త్పరాజయః ॥ [1]

ఈ ఆట కొన్నిప్రాంతములలో నూతనవధూవరులచే పెండ్లిండ్లలో ఇప్పటికిని ఆడింతురు. వారి వారి వైభవానుసారముగ ధనముంచి ఆడింతురు - పందెములకంటె పరాచికముల కింద ప్రాధాన్యమధికము. భాణములలో పందెములు ప్రత్యేకతను సంతరించుకొనినవి. జయమునకు ఉపరిశయనము, పరాజయమునకు అధశ్శయనము ఇత్యాదిగా నుండును. స్వామిదాసభావములును స్వీకరింపబడును.

కందుక క్రీడ : ఈ క్రీడలేని భాణమే కన్పట్టదు. చతుర్భాణిలో రెండవదగు పద్మప్రాభృతకముతో ప్రారంభింపబడి అవిచ్ఛిన్నముగ ఆదరింపబడినది. వీనిలో చాలమంది శ్లేషాశ్లేషముగను, సమాసోక్తియుక్తముగను కందుక్రీడలాడించిరి. వేశ్యలు విటుల నాకర్షించుటకు తమ హావ భావ విలాసములను, చాటూక్తులను మాత్రమే గాక కందుకక్రీడలను, అక్షద్యూతక్రీడలను సయితమాశ్రయించెడివారు. సామాన్యముగ కవులందరు బంతితో నింతికుచములకు సామ్యము చెప్పి వర్ణించిరి. అందొక అర్థాంతరమును కల్పించి ముకుందానందకర్త ఎట్లు చెప్పెనో గమనించుడు.

గుణిన మపి సువృత్తం కందుక మాలోక్య తాడితం తన్వ్యాః।
పరివృత్యతి కుచభారః కర్కశవృత్తస్య కుత్ర కారుణ్యమ్ ॥

1. శృంగార సర్వస్వభాణము - పుట 24

సద్గుణములు కలిగినదియు, సువృత్తము కలిగినదియు నగు కందుకము కొట్ట బడినది. దానిని చూచి కుచభారము సానుభూతిని విడిచి నాట్యము చేయుచున్నదట. కఠినమైన ప్రవృత్తికలవారికి (కర్కశత్వము, వృత్తత్వము స్తనములకు గల లక్షణము) దయ యెక్కడనుండి వచ్చును. శ్లేషాక్లిష్టమగు అర్థాంతరన్యాసము సహృదయులకు ఆనందము నందించుచున్నది గదా! ఇట్టి కందుకక్రీడలు వేశ్యల ఆకర్షణశక్తిలో ఆనుషంగిక విద్యలు.

అక్షక్రీడ : భారత దేశమునందు రూపొందిన దీ క్రీడ. ఋగ్వేదమున అక్షక్రీడ వలన వచ్చెడి నష్టములను తెలుపుచు ఒక సూక్తము కలదని పూర్వమే చెప్పబడినది. మహాభారతయుద్ధముకు మూలమయినది అక్షక్రీడయే గదా! ఈ నాటికిని పాచికలను తయారుచేసికొని వివిధపద్ధతులలో తెలుగుప్రజలు ఈ ఆట నాడుచునే యుందురు. సుమారు అన్ని భాణములలోను ఈ అక్షక్రీడ వర్ణింపబడినది. అదియును స్త్రీ పురుష లిరువురి నడుమనే. దీనిలో పందెము సయితము శృంగార సంబంధి యగుట గమనార్హము. ఓడినవారు అధశ్శయనము నంగీకరింపవలయునట. రామభద్ర దీక్షితులు శృంగారతిలకములో అమృతతుల్యమయిన మరొకపందెమును సరసమనోజ్ఞముగ ప్రకటించినాడు.

ద్యూతే యదీయం విజితా మయా స్యా
దస్యాః పిబామి స్వయ మాననాబ్జమ్।
అహం జితశ్చే దధరం మదీయం
గృహ్ణాతు పాతుం పురతః సపత్న్యాః॥

(ఆమె నాచే ఓడింపబడినచో ఆమె అధరమును నే నాస్వాదింతును. నేనే ఓడినచో ఆమె తన సవతి యెదురుగనే నా అధరపానము చేయవచ్చును.) ఎవరు గెల్చినను ఆస్వాదము సమానమగుట చమత్కారము. "…. కాదన్నను నీదు మోవి మధురామృతమా నిట బాసచేసెదన్" – అన్న ఉలూచి ఇక్కడ గుర్తునకు రాకపోదు (విజయవిలాసము)

చదరంగము: ఇది భారతీయమైన ఆట. వేదకాలము నుండి యున్న అక్షక్రీడయే ఇట్లు మారియుండును. మనదగ్గరనే అరబ్బులు నేర్చికొనినారు. ప్రస్తుత మీ ఆటలో రష్యనులది పైచేయిగా కన్పట్టుచున్నది. ఈ ఆట నాధారముగా చేసికొని

తెలుగు సాహిత్యములో ఎన్నియో చమత్కృతులు సయితము చోటుచేసికొనినవి. "ఉద్ధతులమధ్య పేదల కుండఁదరమె"[1] అను చక్కని పద్యపాదము చదరంగము నాధారముగ చేసికొని వెలువడినదేయని ప్రతీతి. రెండు ఏనుగులమధ్య ఒక బంటు నిలువలేదను విషయము నాధారముగ చేసికొని యీ పాదము వెలువడి చక్కని చమత్కారయుత పద్యమునకు బీజమయినది. ఈ ఆటలో త్రోసిరాజు (ఆటకట్టు), ఉయ్యాలత్రోసిరాజు (ఆటకట్టు) అని ఆటకట్టులో కూడ రెండు చమత్కారములను గ్రంథస్థ మొనరించిన ప్రతిభ శ్రీ నండూరి రామకృష్ణమాచార్యుల వారికి దక్కినది.

మన భాణములలో నల్లా దీక్షితులే దీనిని గ్రంథస్థ మొనరించినాడు. [2]

డోలాక్రీడ:-

తమిఁ బూఁదీగెల తూగు టుయ్యేలల పంతాలాడుచున్ దూగు నా
కొమరుం బ్రాయపు గబ్బిగుబ్బెతల యంఘ్రుల్ చక్కగా జాఁగి మిం
టి మొగంబై చనుదెంచు లీవిఁ గనుగొంటే దివ్యమౌనీంద్ర! నా
కమ్మృగీనేత్రల మీదఁ గయ్యమునకుం గాల్దాచు లాగొప్పెడిన్——

కళాపూర్ణోదయము - పుట 1-32.

అని పింగళి సూరన కళాపూర్ణోదయములో డోలాక్రీడ నతిమనోహరముగ చిత్రించినాడు. ఈ డోలాక్రీడ మిగుల ప్రాచీన మయినది. కాలగతిలో చాలవరకు నశించినది. కాని గ్రామసీమలలో నేటికిని అట్లతద్దినాడు ఆడపిల్ల లందరును అమితోత్సాహముతో ఊయలలూగుచుండుట కనవచ్చును.

` భాణరచయితలు ఈ ఆటవైపు సయితము దృష్టిని సారించక విడువలేదు.. చక్కని కన్నెపిల్లల వినోదము కదా! కొంచె మించుమించు సూరన భావనతో సరి తూగ గల ఈ శ్లోకమును పరికించుడు -

---

1. ఒత్తుకొని వచ్చు కటికుచోద్వృత్తిఁ జూచి
తరుణి తనుమధ్య మెచటికో తరలిపోయె
నుండె నేనియు కన్పడకున్నె యహహ
ఉద్దతుల మధ్య పేదల కుండఁ దరమె.

2. శృంగార సర్వస్వము - పుట 28.

ప్రతిభాతి విభ్రమనదీప్లవన మివ మదాధిరూఢఫలకేయమ్ ।
ఆనీతేవ తులాఘట మమరీభి స్తులయితుం మనోజేన ॥
(మదనగోపాల విలాసము)

ఉయ్యాల నెక్కి ఆ బాల అమరకాంతలతో తూచుటకు కొనిరాబడిన త్రాసు నెక్కినట్లున్నదట. ఇప్పటికిని ధనవంతుల యిండ్లలో ఆంధ్రదేశమున ఉయ్యాల బల్లలుండుట క్రీడయందలి యభిరుచిని తెలుపును. ఉయ్యాల ఊపును 'శైలిలో కూడ చూసి ఆంధ్రుడైన బెల్లంకొండ రామారావు పండితకవి' అనిపించుకొనినాడు

ఆలికా మరాలికా కరాలికా ధుతాలికా
పాలికా మధూలికా కణాళికా దమాలికా
కాలికా సుశై లికా రమాలికా మరాళికా
కాలికా భచూళికా విభాలికా సునీలికా॥ (కందర్పదర్పవిలాసము)

బొమ్మల పెడ్లిండ్లు: బాలిక లుత్సాహముతో ఆడుకొను ఆటలలో 'బొమ్మల పెండ్లిండ్లు' ఒకటి. రెండు బొమ్మలను చేర్చి, వధూవరులని తలపోసి, వారికి పెండ్లిచేసి సకలలాంఛనములను జరిపింతురు. దీనిలో వేర్వేరు పాత్రలను వేర్వేరు వ్యక్తులు ధరించి, హుందాగా నటింతురు. ఈ ఆటను స్వల్పముగా స్పృశించినవాడు శృంగార మంజరీకర్త విశ్వనాథుడు. 'బాల్యే సమయే క్రీడావశాత్ దంపతీకృత్వా మందిర మేకత్ర........ కస్యచిత్ కర్ణాయకల్పిత నిశాభాగౌచ - శయ్యాం గతౌదృష్ట్వా తే జననీ మనంతరం ఉభే...' అని విటుడు బాల్యకాలమును స్మరింపజేయుచు వేశ్యతో పలికినట్లు ఈ ఆటను ప్రస్తావించినాడు.

కోడిపందెములు : "ఈ కోడిపందెంబు లేమి తెల్పెదునయా
ఆంధ్రజాతీయ శౌర్యాభిలిప్స" అని కవులు వీనిని శౌర్యప్రతీకలుగ తీర్చినారు. తెలుగువారికి అత్యంత సన్నిహితములీ కోడిపందెములు. పలనాటి యుద్ధమునకు పాచిక లయినవి ఈ కోడిపందెములే గదా - కాళ్ళకు కత్తిగట్టి, కోడిపుంజులను వదలి, కలహించెడి వానిని చూచి, కేరింతలు కొట్టుచు పల్లెప్రజలు ఆనందింతురు. వీనిపై జూదమెక్కువగుటచే ప్రభుత్వము నిషేధించినది. కాని చాటుమాటున సాగుచునే యున్నవి. పల్లెసీమలలో ప్రజలకు వినోదమును చేకూర్చుచునే యున్నవి. ఇంత వినోదస్థానమును భాణకర్తలు విడుచుదురా! కోడిని చక్రవర్తిని చేసి వదలినాడు వరదార్యుడు.

పశ్చా న్న యాతి న చ యాతి పురప్రదేశాత్
పార్శ్వం న యాతి చరణాయుధసార్వభౌమః।
వామేన కేవల మసౌ చరణేన శత్రోః
మౌళౌ నిహత్య ముహు రుత్థితకంఠనాదః॥ వసంతతిలక – 39

తెలవారుచున్న కాలమును నిర్ణయించుటలో కోళ్ళపాత్ర ప్రధానమైనది కదా! కాలనిర్ణేతలకు సమాజములో సకల కాలములందును స్వాగతమే లభించునని యీ కోళ్ళు నిరూపించును.

పొట్టేళ్ళ పోటీలు : ఊపు తెచ్చికొని ముందుకు దూకుటలో ఏ ప్రాణి యైన పొట్టేళ్ళతర్వాతనే. జానపదసాహిత్యమున తప్ప చారిత్రకముగా గాని, సాహిత్యపరముగా గాని వీని కంత ప్రాధాన్యమున్నట్లు కనపడదు. కానీ, వర్తమానకాలమున కోడి పందెముల కున్నంత ప్రాధాన్యము లేకున్నను, వీనికి కొంచెము ప్రాధాన్యమున్నది.. ఇక భాణములలో నన్నచో సామాన్యముగ కోళ్ళు- పొట్టేళ్ళు ప్రక్క ప్రక్కనే సాక్షాత్కరించును. శృంగారభూషణము (ఆంధ్రానువాదము) నందలి ఈ క్రింది వర్ణనమును పరిశీలింపుడు -

'...... ఇదియేమి! కోపాటోపముతో నీ గొట్టెపోతులు పెంచిన వారిచేఁ బ్రేరేపింపఁబడుచు వెనుకకుఁ దగ్గితగ్గి, మెడల నడ్డముగా బెట్టి, కొమ్ములకొనం గట్టిన యినుపగొలుసులు కలకల ధ్వనులు చేయుచు, నొకదాని పైనొకటి ఢీకొని, మస్తకములచే భయంకరమైన యాస్ఫాలనములు సేయుచు, ఘోరమగు పోరు కావించుచున్నవి. ఆహా! తిర్యగ్జంతువులలో బరస్పర విరోధము అతిశయించుచున్నది !"

కోతులనాడించుట – [మర్కటవినోదము] "కోటివిద్యలు కూటికొరకే" అను సామెత తెలియునో, తెలియదో కాని "కోతి విద్యలు" కూటికొరకే అని మాత్రమే తెలిసి, కోతులకుకూడ తెలిపి, ఎందరో బ్రతుకు వెళ్ళబుచ్చుచున్నారు. మానవున కత్యంత సన్నిహితమై అతని నడవడిని చక్కగా అనుకరింపగలిగినది కోతి. దానిని ఆధారముగా చేసికొని అనేకచేష్టలు చేయించుట భాణములందు పరిపాటి. మదనవిజయభాణము ఆ కోతి కెట్లు అద్దము పట్టినదో చూడుడు....

ప్రణయకుపితా మేతాం ప్లవంగమవధూం కపి
ర్నమతి తనుతే చారాద్గత శ్చుబుకగ్రహమ్।

తదను చ యథాధ్యాసం విలాసిజనోచితా
న్యహహ కురుతే భీత స్స్వపాలక చోదితః॥ 79 శ్లో.

ఇది కోతులనాడించు వాని నేర్పా? కోతి నేర్పా? ఇంత చక్కగా కోతిచేసిన శృంగారమును - కోతిచేత చేయించిన వినోదమును వర్ణించిన కవినేర్పు గాని మరేమియు కాదు.

శ్రీ శేషాచార్యులుగారు దుర్బలప్రాణియైన కోతినే కాదు భయంకరమైన ఎలుగుబంటిని సైతము ఆడించినారు. ఆంధ్రదేశములో ఈ నాటికిని ఇంటింటికి కోతులను వలె ఎలుగుబంట్లను సైతము తీసికొని వచ్చి, ఆడించుట అందరికీ తెలియ కున్నను ఎందరికో తెలియును. అవి కూడ తమ యజమాని చెప్పిన వింత వింత పనులుచేసి ప్రజలకు సంతోషము కూర్చును.

తిష్ఠ న్వాభ్యాం పదాభ్యాం భువి భయరహితః కిం చ వామేన కాష్ఠం
హస్తే నాదాయ గాఢం నళికమివకరేణాయుధాయాగ్రయాయీ।
ధృత్వా వామేతరేణా ప్యసిమివ తరళాం వేణుయష్టిం ప్రధావ
న్మోదం పశ్యజ్జనానాం జనయతి నితరా మచ్ఛభల్లః ప్రపుల్లః॥

రెండు కాళ్ళతో నడచుచు మిగిలిన రెంటిని చేతులవలె నుపయోగించుచు అవి చేసెడి చేష్టలు ఎవరి కానందము కల్గింపవు? అది ఆశ్వారోహణ నైపుణ్యమును సహితము ప్రదర్శించుచున్నదని తర్వాతి శ్లోకమున వర్ణింపబడినది.

పాముల నాడించుట :- ఇది కూడ అత్యంత ప్రాచీనమే. నేటికిని విరివిగా వ్యాప్తిలో నున్నదే. విశాఖదత్తుడు ముద్రారాక్షసమున ఒక గూఢచారికి పాములవాని వేషమునే వేయించి పాములనాడింపించినాడు. కసితో బుసకొట్టు క్రూరసర్పములను సైతము పసిపిల్లలను వలె భుజాన వేసికొని తిరిగెడి వారిని నేడును చూచుచున్నాము. పుట్టలోని పాములను పట్టి, బుట్టలో పెట్టికొనివచ్చి, నాగస్వర మూదుచూ ఆడించుట మనకు తెలిసినదే. గారడీవారు ఈనాడు 'వీటి నెక్కువ' ఉపయోగించుకొనుచున్నారు. భాణకర్తలును పాములనెన్నింటినో పట్టి భాణములలో నిక్షేపించిరి.

సరభసమిహ ముక్తః స్వామినా సంనిరుద్ధః
ప్రకృతపరిఘ పార్శ్వా ప్రాప్త విస్తారమూర్ధా।

చలవలయకరాగ్రం సంనివృత్యాస్య పశ్యన్
వలయతి ఫణివర్యః పశ్యతాం చేతసాని ॥ (అనంగతిలకభాణము)

బుట్టమూత తీయగనే వెలికి రాబోయి పాములవాడు అడ్డగింపగా, పడగవిప్పి మెలికలు తిరుగుచు ఆడెడి పాపఱేడు ద్రష్టల కానంద మిచ్చుచున్నాడు అని చక్కని స్వభావోక్తి ఈ శ్లోకములో కన్పించును.

స్తంభన నాట్యము (దొమ్మరాట):- ఈ నాటికిని ఊరూర తిరుగుచు, ప్రాణములతో చెలగాట మాడి, జీవనము గడపుకొనుచు, ప్రజలను సంతోషపెట్టు ఒక జాతి దొమ్మరివారి ఆట దొమ్మరాట (స్తంభననాట్యము). శృంగారసర్వస్వకర్తయే దీనికి కూడ తన భాణమున స్థాన మిచ్చినాడు.

అంతేగాక భాణములలో ఇంకనూ కొన్ని వినోదస్థానములు కలవు. మల్లయుద్ధ వర్ణన కొంచె మించుమించు భాణములలో అపరిహరణీయమే అయినది. ఇంద్రజాల ప్రదర్శనలు, నెమళ్ళ నాట్యములు, పారావాత శృంగారములు, రాచిలుకలకు మాటలు నేర్పుటలు, మదగజ కోలాహలములు, వాటిని పట్టుటకు సింహపు ముసుగులను ధరించుట, శార్దూలధావనమును, అంతర్నాటకములు మున్నగునవి భాణములలో చోటు చేసికొన్నవి. ఇవి కేవలము వినోదములే గాక నాటి సాంఘిక వాతావరణమునకు ప్రతిబింబము లగుట మనము ప్రత్యేకదృష్టితో గమనింపదగిన విషయము. శృంగార మంజరి (గోపాలరావు) లో గంగిరెద్దుల క్రీడ సైతము చక్కగా వర్ణింపబడుట సహృదయులకు మనఃపరితోషమును కల్గించుచున్నది.

సీతారామకళ్యాణము:- తెలుగువారికి అత్యంతము సన్నిహితమైన సంస్కృతి శకలములలో గంగిరెద్దులు, వాటి ఆటపాట సైత మొకటి. జానపదుల జీవనాడులను స్పందించఁజేసి పులకింతలు గలించెడి దిది. సీతారాముల కళ్యాణము వీరి ప్రధాన ప్రదర్శము. అదియే వృత్తిగ జీవించెడి వారనేకులు.

కతిచన భృతరాగం కాహళీః పూరయన్తే
తతతర మిహ కేచి త్తమ్మటా న్వాదయన్తే
కతిచి దతివిచిత్రం కాంస్యభేద ప్రణాదా
న్విదధతి కలయన్తే కేఽపి వంశస్వరాంశ్చ ॥

- శృంగారమంజరి - శ్లో. 25.

ఇది గంగిరెద్దుల ఆటకు పూర్వరంగము - ఇక వాటి చేష్టలు.

స్వైరా దన్తరగార మేతి న తతః ప్రత్యాపత త్యర్పితం
తై రల్పం యది చోదితోఽప్యయ మహో! తేషాం శిరస్సంజ్ఞయా।
పర్యాప్తం న మమేతి సూచయతి చ ప్రత్యావ్రజ త్యర్పితే
పూర్ణే య త్ర్పవదన్త్యమీ తదఖిలం వ్యక్తం విధత్తే నృపః ॥

శృంగార మంజరి-శ్లో. 209.

స్వేచ్ఛగా నింటిలోనికి వెళ్ళుచున్నదట. వారు తక్కువ ధన మిచ్చినచో చాలదని తలనూపుచు అదలించినను కదలకున్నదట. ఆ పై వారు నిండుగ ధన మిచ్చినచో తిరిగి వచ్చుచున్నదట. ఇట్లు వారు నేర్పిన దంతయు ఆ ఎద్దు తప్పక ఆచరించుచున్నది. ఇట్లు వర్ణించిన గోపాలరావు చివరగ ఒక చురక తగిలించినారు - ఏమిటీ వెఱ్ఱిలోకము! ముసలియెద్దును దేవతగా పూజించుచున్నదని. -

మరియు "304" అని వ్యవహరింపబడు పేకాటను కూడ భాణరచయితలు విడువలేదు. 'విప్రవినోదులకు'ను ఇందు కొదవ లేదు. భాణములలో ఇతివృత్తము వేశ్యాసంకుల మగుటయే యిన్ని క్రీడలు వీనిలో చోటునందుటకు కారణమైనది.

వర్ణనవైశిష్ట్యము

నగరార్ణవ శైలర్తుచంద్రార్కోదయవర్ణనమ్।
ఉద్యానసలిలక్రీడామధుపానరతోత్సవాః॥
విప్రలంభోవివాహశ్చ కుమారోదయవర్ణనమ్।
మన్త్రద్యూతప్రయాణాజినాయకాభ్యుదయా అపి ||
ఏతాని యత్ర వర్ణ్యంతే తన్మహాకావ్య ముచ్యతే।
ఏషా మష్టాదశానాం యైః కైశ్చిదూన మపీష్యతే॥ [1]

అని విద్యానాథుడు మహాకావ్యములలో నుండవలసిన వర్ణనల పట్టిక నిచ్చెను. క్రాంతదర్శులైన కవుల మేధకు నికషము వర్ణనములే - వానికి కాణాచులుగ శ్రవ్య కావ్యములు వెలసినవి. దృశ్యకావ్యకర్తలు కూడ కొలదిగ ఈ వర్ణనల నాదరించినారు. అట్టిచో శ్రవ్యకావ్యముతో దగ్గర సంబంధమున్న భాణములలో నీ వర్ణనలు లేకుండునా? పైన పేర్కొనబడిన అష్టాదశవర్ణనలలో చాల వర్ణనలు భాణములలో కన్పట్టును. ఇవికాక ఇంక నితరవర్ణనలును భాణములలో గలవు. ఇంతకు ముందు శీర్షికలలో ప్రస్తావింపబడినవానిని వదలి మిగిలిన వర్ణనలను పరికించెదము. పై వర్ణనములలో అనేకములు శృంగారదీపకములే కనుక శృంగార ప్రధానమైన భాణములలో వాని యుపస్థితిని పరిశీలింపవలసియున్నది.

చంద్రోదయ – సూర్యోదయములు :

భాణములలో కథైక్యము లోపించినను ప్రకృతి వర్ణనములు మాత్రము ప్రాయికముగ కథతో సంగమించుచుండుట ఒక గొప్ప సుగుణము. ఈ మార్గము ఆదికవి వాల్మీకిచే ప్రారంభింపబడి, కాళిదాసాదులచే నాదరింపబడి, ప్రవృద్ధమైనది. కాళిదాసు శకుంతల నత్తవారింటికి పంపుటకు ముందు చంద్రాస్తమయము నెట్లు వర్ణించుచున్నాడో చూడుడు -

[2] అన్తర్గతే శశిని సైవ కుముద్వతీ మే
దృష్టిం న నన్దయతి సంస్మరణీయశోభా।

---

1. ప్రతాపరుద్రీయము - కావ్యప్రకరణము
2. శాకుంతలము - చతుర్థాంకము.

ఇష్టప్రవాసజనితా న్యబలాజనస్య
దుఃఖాని నూన మతిమాత్రసుదుస్సహాని ॥

ఈ మార్గము ననుసరించి సూర్యోదయ, సూర్యాస్తమయ, చంద్రోదయ, చంద్రాస్తమయాదులను వర్ణించుట భాణరచయితలకు వెన్నతో బెట్టిన విద్య. సూర్యుని విటునిగాను, తూర్పును - కమలినిని - నిశను నాయికలుగను భావించి శృంగారా-భాసమును దక్షిణనాయకశృంగారమును సృష్టించుచుందురు. భాణములలో విటుడు సర్వకర్మసాక్షి. సూర్యుడు కర్మసాక్షి కనుక సూర్యునిలో విటత్వము నారోపించిరేమో! కర్పూర చరితములోని యొక్క శ్లోకమును పరిశీలించుడు

అచ్ఛిద్య సద్యః ప్రతినాయకస్య
చంద్రస్య మందప్రతిభస్య లక్ష్మీమ్ ।
తాం శాంభవీం రాత్రి మపాస్య దూరే
ధూర్తో రవి ర్ద్యాం గణికా ముపైతి ॥

ధూర్తసూర్యుడు ప్రతినాయకుడైన చంద్రుని లక్ష్మిని లాగి - రాత్రిని దూరముగ వదలి - దివి యను గణికను చేరుకొమెనట. ఇట్టి వర్ణనలు సమాసోక్తి రూపకముల సాగుచుండును. కనుక భాణరచయితలకు రూపక, సమాసోక్తులు రెండుప్రాణముల వంటివని మరల చెప్ప నవసరములేదు గదా! ఇదే రీతి సూర్యాస్తమయ, చంద్రోదయాదులు కథానుగుణవర్ణనలతో నలరారి ఆనందహేతువు లగుచుండును.

ఋతువర్ణన: 'శరత్సంగ్రామవిషయే వివాహే గ్రీష్మమాధవౌ' అని సాహిత్య దర్పణకారుడు ప్రస్తావనలో చేయవలసిన ఋతువర్ణనమునకు నియమముల నేర్పరిచినాడు. భాణము లన్నచో వీనిలో ఏ కోవకు చేరనివి. కాని వివాహపదము కామమున కుపలక్షకము కనుక గ్రీష్మ, వసంతర్తువర్ణనములు భాణములలో నభిలషణీయములు. భాణరచయితలు వీనినే కాక హేమంతవర్షావర్ణనములను సైతము చేసిరి (రససదనభాణము, ధూర్తవిట సంవాదము). ఈ ఋతువర్ణనములు కాని, పైఁ జెప్పిన సూర్యోదయాదులను గాని, సుదీర్ఘముగ వర్ణించిన వారును కలరు. వారు వారి భావఝరికే ప్రాధాన్యమిచ్చిరి కాని మరియే నియమమునకుఁ గాదు. మచ్చున కొక వసంతఋతు వర్ణనమును చూచెదము -

నవీనపుష్పా నవపల్లవాధరా
మధువ్రతాసక్తపుళింద శేఖరా ।

మనోజ్ఞ గుచ్ఛ స్తనభారభంగురా
మనోహర త్యార్యజనస్య పుష్పలా ॥ (విలాసభూషణభాణము)

ఈ వసంతవర్ణనము సయితము శృంగారరసస్యందిగనే కన్పించుచుండును. అంతియే గాక ఈ ఋతువర్ణనములో భాణరచయితలు మరియొక ప్రయోజనమును కూడా సాధించిరి. ప్రస్తావనాంతమున పాత్ర ప్రవేశమును సూచించి సూత్రధారుడు నిష్క్రమించును. అట్లు సూత్రధారుడు పాత్రప్రవేశసూచనను చేయుటకుపకరించెడి పంచాంగములలో ఒకటి ప్రవర్తకము. దాని నాశ్రయించి ఋతువర్ణనము చేయుచు, తన్మూలముగ పాత్రను సూచించి, పాత్రప్రవేశమున కవకాశమిచ్చుట ద్వారా భాణ రచయిత లనేకులు ఋతువర్ణనము నుపయోగించుకొనిరి.

దోహదక్రియలు : ఈ ఋతువర్ణనముల కనుబంధముగ గాని, విడిగ గాని ఉద్యానవనం, వృక్షదోహద, మందమారుతములను వర్ణించిన సన్నివేశములు గలవు. వీనియందును విశేషముగ శ్లేషమూలకముగ శృంగారరసమును చిప్పిల జేయుచుందురు. వృక్షదోహదములలో శ్లేష కనుకూలమని కాబోలు అశోకము ఎక్కువగా ఆదరింపబడినది. చూడుడు -

నవ్యాలక్తకపంకపల్లవితసన్మంజీరనిక్వాణయు
క్సుందర్యాశ్చరణాంబుజాహతిభవత్ప్రాణ్యానురాగోదయః।
తం రాగం నవశోణపల్లవమిషా దేవం క్షమాం కుర్వతః
సప్రేమోదవహద్వసంతసమయే శ్రీమానశోక స్తరుః ॥

కామబాణభాణము - 106.

సలిల క్రీడ : ఉద్యానవనములో ఒక జలాశయ ముండక పోదు కదా! అందు చేరిన చెలియలు జలకము లాడక మానరు కదా! కనుక సలిలక్రీడను వర్ణించుట యీ ఋతువర్ణనముల కనుబంధముగనే సాగినది. నీట తడిసినబట్టలలో నుండి ప్రతిబింబించెడి యూరు మండలములుగల బాలికలు కాదుకాదు- మనస్సు నాకట్టుకొను మూలికలు సరస్సునుండి పైకి వచ్చుచున్నారట. ఈ వర్ణనలో బాలికలను మూలికలను చేసిన ఘనత కాశీపతిధి. చూడుడు –

1. అశోక శ్చరణాహత్యా వకులో ముఖసీధునా ।
కరస్పర్శేన మాకందో ముఖరాగేణ చంపకః ॥ మొ॥నది దోహదవిధి

అంబుసిక్త మలినాంబరాంతరా
ద్బింబమాన జఘనోరు మండలాః।
ఉత్తరంతి సరసోఽద్య బాలికాః
చిత్తమోహకర సిద్ధమూలికాః॥ (ముకుందానందభాణము)

ఇతర వర్ణనలు :- మధుపానవర్ణనమును భాణకర్తలు పలువురు దగ్గర చేర్చిరి. యువరాజు కల్లు అమ్మువారిని, అది త్రాగినవారి పాట్లను సైతము రససదనభాణమున వర్ణించినాడు. తిరునాళ్ళను వర్ణించుటలో సైతము ఈ కవి తన వరివస్యను తాను అందించినాడు. ఈ కవియేగాక చాల మంది భాణకర్తలు రథోత్సవములు, తిరునాళ్ళపై తమ దృష్టిని గాఢముగ నాటిరి. వివిధమనస్తత్త్వముల కూడలి అదే కదా. అంతియే గాక దేవాలయములను, అందలి దైవములను వర్ణించి దైవస్తుతులు చేసిన రచయితలును లేకపోలేదు (లీలాదర్పణభాణము మొ॥). భక్తికి ఒక తావని నియమ మేమున్నది. ఎక్కడ మనస్సు ఏకాగ్రమగునో అవన్నియు భక్తికి నిలయములే. ఇక రతోత్సవవర్ణనల కన్నచో ఏ భాణమునను కొదవ లేదు. పురుషాయిత పర్యంతము వర్ణింపబడినవే కదా. ఆ రీతిగనే విప్రలంభము లేక విప్రలంభాభాసము విరివిగనే విలువ నందినవి. ఇటువంటి సర్వవిషయములకు ఆలవాలమో, ఆశ్రయమో, ఒక ఊరుకావలెను కదా !

నగర వర్ణనము :- భాణరచయితలు ఆ లోపమును కూడ తీర్చినారు. అనేక భాణములలో నగరవర్ణనములు చేయబడినవి. కులకాంతలకు నిలయమైన నగర వర్ణనము కాక – తదేక దేశమయి అనియతస్వాంతలకు ఆశ్రయ మయిన వేశ్యవాటిని సైతము వర్ణించినారు. నగరవర్ణనములు మామూలు ధోరణిలో సాగినను – ఏ నియమములు లేని వేశ్యలని కాబోలు వేశ్యవాటివర్ణనలకు పదగణనియమరహితమైన గద్యము ననేకు లాదరించినారు. అది ప్రశంసార్హమైన విషయమే. అందును ఆచేతన వస్తుస్థితికి అద్దముపట్టినారు. ధూర్తవిటసంవాదమున ఈశ్వరదత్తు ఆ రీతిగ కుసుమపురమును తుమ్మెద వంటి విటునిచే వర్ణింప చేసిన పద్ధతిని గమనింపుడు.

యో మాం పశ్యతి సత్వరోపి న కథాం చిత్వా ప్రయా త్యన్యతః
సంబా ధేఽపి దదాతి చాన్తరమసౌ సద్యః ప్రహృష్టో జనః।
కశ్చిన్నాతిచిరం విలంబయతి మాం కార్యా త్మయాశంకయా
లోకజ్ఞైః పురుషై రహో పురవరస్యాప్తం యశో లక్ష్యతే.

[ధూర్తవిటసంవాదము – 12శ్లో]

తనను చూచినవారు తొందరపని యున్నను, మాటను మధ్యలో త్రుంచి వెళ్ళరట — మాట్లాడెడి సమయమున నితరుల కవకాశమిచ్చునట - అందరును ఆనందముతో నున్నవారేనట. ఒకరిపని దాటి పోవునను భయమున జాగు సేయనిచ్చుట లేదట ఆహా! ఈ పురుషు లెంత లోకజ్ఞానులు?

వివిధ నారీ వర్ణన :- ఇంత చక్కని నగరములు, మధురమైన వేశ్యవాటికలు, సరదాలకు ఆటపట్టులు, తిరునాళ్ళు కళ్ళముందుండగా వివిధ వేష సంప్రదాయములు కలిగిన కాంతామణులు లేకుందురా? భాణములలోని వర్ణనములలో నిది యొక విశిష్టాకర్షణ. వివిధ కాంతల స్వాంతములను, వేషభాషలను, సొంపు సోయగములను నలుగురికి అవగతముచేయుట వారిలక్ష్యము. తమ హృదయములలో వారకాంతలకు అవకాశమిచ్చి యుండక పోవచ్చునుగాని, తమరచనలలో అవకాశ మివ్వని వారెవ్వరును భాణరచయితలో కన్పింపరు. కర్ణాట, నేపాల, చోళ, లాట, ఆంధ్ర, ద్రవిడ, ఘూర్జరాది కాంతలకందు ప్రవేశమున్నది. వేంకటాధ్వరి కన్నులలో నుండి ఒకరిద్దరు కాంతలను విలోకించుదము -

ఆపాదలంబవసనా నిస్తులవక్షోజనమ్రమధ్యలతా।
ఆంధ్రీ భాతి వధూటీ తాళీదళక్లృప్తముగ్ధతాటంకా॥

ఇది ఆంధ్రీవర్ణనము. పాదముల వరకు జీరాడు వస్త్రముతో వక్షోజములవలన వంగిన మధ్యభాగము కలదై, తాటియాకులతో చేయఁబడు కమ్మలను ధరించి, ఆంధ్ర యువతి అలరారుచున్నదట. ఒక ఘూర్జరీయువతిని పరికించుదము.

ఫాలే రోచనయా ప్రకల్ప్య తిలకం తస్మి న్మణీదర్పణం
విన్యస్యాలకపార్శ్వయోః సరుచకం సంబధ్య ముక్తావళీమ్।
వల్లీదామనిబద్ధవేణి చ శిరః సంచాద్య ఖండాంశుకాత్
కాంచీనూపుర మంజులధ్వనికలం సా ఘూర్జరీ గచ్ఛతి॥

ఇందరు విరిబోణులను వర్ణించిన కవివర్యులు ఆ యలరుబోణుల నలరించెడి యలరుల విడిచి పెట్టుదురా? కనుక ఆపణవర్ణనములను, పుష్పాపణవర్ణనములను, గంధాపణవర్ణనములను సైత మాదరించిరి. శృంగారమంజరిలో విశ్వనాథుడు ఆపణవర్ణనమును రమణీయముగ తీర్చినాడు. ఈచంబాడి శ్రీనివాసాచార్యుల పుష్పాణమును దర్శించి అలరుల తావుల నాఘ్రాణించుదము.

పుష్పాణ్యత్ర హవిష్యదగ్రధమనీదత్తానవై రున్మదై
రాఘ్రూతాని మధువ్రతై రవిభృతై స్సద్యో లసన్తి స్వయమ్।
స్థూలాశ్చ స్తబకా ఇమే సురభయః పత్రావళీబంధురా
మాలాకార కరగ్రహై రశిథిలై రావిర్భవంతి క్షణాత్ ॥

(శృంగారతరంగిణీభాణము)

పువ్వులంగళ్ళనే కొందరు వర్ణించగా, పువ్వుల నమ్మెడి కాంతలను వర్ణించిన వారున్నారు. ఆంధ్రప్రబంధసాహిత్యప్రభావముచే స్ఫూర్తిని పొందిన అష్టభాషా బహిరీ గోపాలరావు వంటి కవులు పుష్పలావికలను సయితము వర్ణించినారు.

భాణములయందలి వర్ణనములను సానుభూతితో పరిశీలించినపు డవి విశిష్ట రేఖలుగనే నిలుచును. భాణములు మహాకావ్యములు కాకపోయినను, అవి అన్నియు ఒకే మూసలో పోసి తీసినట్లుగా కన్పించుచుండినను, ఏకత్వములో భిన్నత్వమువలె అవి తమతమ ప్రత్యేకత, వ్యక్తిత్వమును, సౌందర్యమును నిలిపికొనినవి.

ఎక్కడి కక్కడ వేఱుగ ఒక జీవనాడి - ఒక చైతన్యస్పందన స్పృశించిన మాత్రమున తగులుచుండును.

భాణవివరములలో కొన్ని ప్రామాదికములు

పండితులచే అంతగా ఆదరింపబడక పఠన పాఠనాదులనుండి దూరమయిన యీ భాణములను పరిశీలించుట అనేకకష్టములకు ఆలవాలమైనది. ప్రాచ్యలిఖిత గ్రంథాలయములలోని కొన్ని "డిస్క్రిప్టివ్ కేటలాగు" లందును - ముద్రితములయిన గ్రంథములందును భాణముల నామములు ఒకచో గ్రంథకర్తృనామములు విశృంఖలములుగా ఎవరి ఇచ్చవచ్చినట్లు వారు పేర్కొనిరి. కొన్ని పేర్లను బట్టి అవి భాణము లనిపించును. గ్రంథము చూడనంతకాలము అది భాణమే అనిపించును. కాని గ్రంథములు చూడగనే అవి నాటికలయి యుండును. ఇట్టి వానిని సమీకరించి చూచుటలో మాకు కన్పించిన ప్రామాదిక విషయములను పరిశీలకుల కుపకరించుటకై ఇందు పొందుపరచుచున్నాము.

అడయార్ లైబ్రరీ, మద్రాసులో 1583 క్రమసంఖ్యతో శ్రీరంగరాజభాణ మను నొక భాణము - ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము, మద్రాసులో R 15413 క్రమసంఖ్యతో శృంగారశృంగాటక మను నొక భాణమును కలదు. కాని యివి "పంచబాణవిజయభాణ" మను పేర ప్రకటింపబడినవే. మూడు పేర్లతోడను వ్యవహరింపబడిన గ్రంథ మొక్కటే. కర్త వాధూల రంగార్యకవి -

శ్రీరంగార్యకవి ర్బభాణ లలిత శృంగార శృంగాటకం ।
భాణం కంచన పంచబాణవిజయారంభ ప్రియంభావుకమ్ ॥

అని కవి పలికినందున ఈ ప్రమాదముల కవకాశ మేర్పడినదేమో !

R 752 క్రమసంఖ్యతో ప్ర.ప్రా.లి.పు.భా. నందు అభినవ కాళిదాసరచనముగ శృంగారకోశమను భాణము కలదు. మరికొన్ని కేటలాగులును అట్లే యిచ్చినవి. కాని ఇది అభినవ కాళిదాసరచనముగ ముద్రింపబడిన శృంగారశేఖరభాణమే. ముద్రాపకు లెవ్వరును ఆ విషయమును సూచించినట్లు కానరాదు.

D 12512 క్రమసంఖ్యతో ప్ర.ప్రా.లి.పు.భా. నందు కాళీకేళీయాత్రాభాణమను పేర నొక భాణము గలదు. కర్త యువరాజకవి. కాని అది ముద్రితమైన రససదనభాణమే. ఈ రెండును ఒకటే అను విషయమును New Catalogues Catalogorum లో రాఘవన్ సూచించెను.

R 2693 క్రమసంఖ్యతో ప్ర.ప్రా.లి.పు.భా. నందు నీలకంఠ విరచితముగ కళ్యాణసౌగన్ధిక మను భాణము "డిస్క్రిప్టివ్ కేటలాగ్"లో నున్నది. కాని అది ఏకాంకిక కాని భాణము కాదు. బహుపాత్రమిశ్రితము. ఇతివృత్తమును వేరు.

R3764 క్రమసంఖ్యతో ప్ర.ప్రా.లి.పు.భా. నందు అజ్ఞాతనామముగ నొక భాణము గలదు. కాని అది చతుర్భాణిలో ప్రకటితమయిన ధూర్తవిటసంవాదభాణమే. శ్రీ మానవల్లి రామకృష్ణకవి విస్మృతనాటకముల వ్యాసములో దీనిని ముందు నామ విరహితముగ చర్చించి, తరువాత చతుర్భాణిలో పేరుతోకూడ ముద్రింపించిరి.

D 17066, R7877 క్రమసంఖ్యలలో శ్రీరంగరాజభాణమని యొక్క భాణము కలదని, R5384 క్రమసంఖ్యలో శ్రీరంగరాజచరితభాణము కలదని ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తక భండాగారమునకు సంబంధించిన "డిస్క్రిప్టివ్ కేటలాగ్", "ట్రైనియల్ కేటలాగ్" సూచించుచున్నవి. కాని యివి రెండును భాణములు కావు. వీనియందు అనేక పాత్రల ప్రవేశము కలదు. వీనిని ఏకాంకికలనుట సమంజసము.

వరదాచార్య విరచితము అయిన అనంగజీవనభాణమునే అనంగసంజీవన భాణమని కొందఱు పేర్కొనిరి. (M. A. Dc. No. 1234). కాని రెండును ఒకటే.

చొక్కనాథుని రసికవిలాసభాణమునే కొందఱు (Krishnamacharya - History of Sanskrit literature, డాక్టర్ వీరబాలశర్మ – సంస్కృత్ మే ఏకాంకీరూపక్) - రసవిలాసభాణమనియు నుదహరించిరి. కాని రెండు నొక్కటే.

చంద్రలేఖాభాణము - శారదాతిలకభాణము రెండింటిని రచించిన కవులు శంకర నామధేయులయిన కారణముగ ఈ రెండును ఒకటేనని కొంద రనిరి. కాని అది అసత్యము. కవుల పేర్లయందే సామ్యము కాని భాణములు వేరువేరు.

కేరళాభరణభాణమని యొకటి పేర్కొనబడుచున్నది. కాని అది భాణము కాదు. కేరళాభరణము లేక రససర్వస్వచంపూ అనుపేర ప్రకటింపబడిన చంపూగ్రంథము. ఇందు విశ్వగుణాదర్శము ననుసరించుచు వసిష్టవిశ్వామిత్ర సంవాద ముండును.

1351 క్రమసంఖ్యతో మద్రాసు అడయార్ లైబ్రరీలో కువలయానందభాణ మను పేర నొక భాణము కలదు. కాని అది ముద్రితమైన సరసకవికులానందబాణమే. కర్త వెల్లాల రామచంద్రుడు.

శృంగారసుందరభాణమే శృంగారశృంగభాణమని (సాగరిక 14వ సం॥ 3సం॥ పుట 317) చెప్పబడినది. కాని రెండు నొక్కటే. బహుశః తెలుగునాటక వికాస కర్త చెప్పిన శృంగారశృంగభాణ మిదియే కావచ్చును.

ప్రధాని వేంకభూపతి రచించిన కామకలావిలాసమే కామవిలాసమను పేర సైత ముదాహరింపబడినది. కాని రెండు నొక్కటే.

మద్రాసు ప్ర.ప్రా.పు.భా.లో - శ్రీరంగార్య విరచితమైన "కుసుమాయుధ జీవిత" మనుభాణముకలదు (R8725). ఇది గ్రంథలిపిలో నుండుటచే మేము చూడ లేకపోతిమి. కాని యిది "పంచభాణ విజయమే" అని అనుమానము కల్గుచున్నది. రంగార్యుడు తన పంచబాణ విజయ ప్రస్తావనలో -

"శృంగారరసభూయిష్ఠం కుసుమాయుధజీవితమ్
రూపకం రసికానందజనకం రూప్యతామితి."

అని చెప్పినాడు. దీనిలో "కుసుమాయుధజీవితమ్" అనువిశేషణమును పొరబడి గ్రంథనామముగా గ్రహించి యుందురని శంకకల్గుచున్నది. కర్త రెండింటికి ఒకడే -

శృంగారవాపికా : - విశ్వనాథ రచితమని (M.కృష్ణమాచార్యులు గారిచే) పేర్కొనబడిన యీ గ్రంథము భాణము కాదు. చూడుడు - ఆధునిక సంస్కృత్ నాటక్ P312 (రామ్‌జీ ఉపాధ్యాయ) అందిది నాటికగా వివరింపబనది.

మద్రాసు, ప్ర.ప్రా.పు.భా. నందు 12633 క్రమసంఖ్యగల భాణమే రసికజన రసోల్లాసమని, రసికజనమానసోల్లాసమని రెండు పేర్లతో వ్యవహరింపబడుచున్నది. రెండు నొకటే. కర్త వేంకటార్యుడు.

కొన్ని తెలుగు భాణములు

ఆంధ్రు లనేకులు భాణముల రచించియున్నారు. ఆంధ్రులు ఆంధ్రమున రచించిన భాణములు అంతగా కానరావు. 20వ శతాబ్దమున సంస్కృత భాణములకు కొన్నింటికి అనువాదములు వెలసినవేతప్ప అంతకుముందు ఆంధ్రమున స్వతంత్రములు కాని, అనువాదములు కాని ఎక్కువగా నున్నట్లనిపించదు.

జక్కన తన విక్రమార్క చరిత్రకావ్యావతారికలో వంశవర్ణనమున పెద్దయా-మాత్యుని మేధాసంపత్తిని వివరించుచు ఇట్లనినాడు.

సంస్కృత ప్రాకృత శౌర సేన్యాదుల
ఘటికలో నొక శతకంబుఁ జెప్పుఁ
బ్రహసన ప్రకరణ భాణాది బహువిధ
రూపకంబుల యందు రూఢిమెఱయు -విక్రమార్క చరిత్ర 1-20

మఱి యాకవి వ్రాసిన ప్రకరణ ప్రహసన భాణము లేవియు లభించుట లేదు కదా! కనుక యా కవి రచించినట్లు చెప్పబడు భాణములు ఆంధ్రభాషలోనివో దేవవాణి లోనివో తెలియదు.

ఆ తర్వాత గణపవరపు వేంకటకవి వసంతతిలకభాణమును తెలుగున రచించె నని తంజావూరు ఆంధ్రసాహిత్యము సాక్ష్యము పలుకుచున్నది. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యమున దానిని పేర్కొనెను గాని తెలుగో, సంస్కృతమో చెప్పలేదు. నేలటూరు వారి నిర్ణయము ననుసరించి అది తెలుగే అనినచో అనువాదమో, స్వతంత్రమో తెలియుటలేదు. కాని అనేక ప్రక్రియలను చవిచూచుట లక్ష్యముగాగల యీ కవి బహుశః తెనుగున స్వతంత్రముగా దానిని వ్రాసియుండునేమో! అదే నిజ మయినచో తెనుగున తొలి భాణ రచయిత గణపవరపు వేంకటకవి కాగలడు. అటు తర్వాత తెలుగులో యక్షగానాది రూపక ప్రక్రియలు ముమ్మరముగా వెలువడినను భాణరచన సాగినట్లు కనిపించదు.

---

1. మధుర తంజావూరు రాజులనాటి ఆంధ్రవాఙ్మయ చరిత్ర
డా|| నేలటూరి వేంకటరమణయ్య పుట 44

శృంగార భూషణ భాణము :

క్రీ.శ. 1900 సంవత్సరములో, వామనభట్టబాణుని శృంగార భూషణభాణము అనువదింపబడి ప్రకటింపబడినది. అనువక్త బయపునేడి వేంకటజోగయ్య. అతని తండ్రి వేంకనార్యుడు. ఈ గ్రంథమునకు ముందుగా కవి రచించిన వందన సమర్పణములో జననీ జనకులతో రాజమహేంద్రమునుకూడ వర్ణించెను. ఈతడు విశాఖపట్టణము జిల్లా కోర్టులో షెరిస్తదారుగా నున్నట్లు పుస్తకము తెలుపును. పుస్తకము విశాఖపట్టణమందే ముద్రితము. 1908వ సంవత్సరమునకే ఇది ద్వితీయ ముద్రణకు నోచుకొనినది.

లాస్యాంగమైన గేయమును ఇతడు రాగతాళముల సూచించి, గేయముగనే అనువదించినాడు చూడుడు.

ఆరభి - త్రిపుట

జయము, జయము వసంతలక్ష్మికి,
జయము మనసిజస్వామికి
జయము, మలయాచల విహారికి,
జయము రోహిణీజానికి,
జయము జయమహో

కాపీ రాగము - ఏక తాళము.

జయవిజయం-బహు- జయవిజయమ్
అణుమధ్యములును-ఘనజఘనములును
స్తనయుగ్మోన్నతి-మినుకు కన్నుగవ
నెనసి వెలయు జవ్వనుల భాగ్యమిల
జయవిజయమ్-బహు-జయవిజయమ్.[1]

ఇతని శైలి మనోహరమై స్వతంత్ర కావ్యభావమునే కల్గించును.

బలితపు గబ్బిగుబ్బ లెదఁ బాతరలాడగఁ గౌను తీగ సం
చలనము గాంచి నివ్వటిలి చాల విరాళులుఁ గొల్ప గొప్పులో

1. శృంగార భూషణరాణము పుట 16

నలమిన పూలు జాతి చెవియందలి కుండలపాళిఁజిక్క నీ
వలరుచు జేసినట్టి పురుషాయుత మెంచగ మర్వశక్యమే.

సుమనో వినోద భాణము :

వెంకటగిరి సంస్థానాధీశులైన శ్రీరాజ గోపాలకృష్ణయాచేంద్రుల సహకారముతో ముద్రణమునకు నోచుకొనిన సుమనో వినోద భాణము ఆంధ్రమున రచింపబడిన స్వతంత్రభాణము. 1903లో ప్రకటింపబడిన ఈ భాణరచయిత చిలకపాటి వేంకట రామానుజశర్మ, కళావతీ ప్రణయకోపమును మాన్పుచున్న సుమశేఖరుని ప్రవేశముతో కథ ముగియును. నవమంజరీ నూతన రంగాధిరోహణ మహోత్సవమునకు బయలుదేరి, సుమశేఖరు దక్కడకు చేరుట ఇతివృత్తము - గోపాలకృష్ణున కంకితము చేయబడిన దిది.

ఇది సామాన్య స్థాయిలో సాగిపోయెడి సంస్కృతభాణముల ఫక్కికనే అనుసరించి యుండును. భర్తను వీడి వ్యభిచరించు భార్యలు, కులగౌరవమును నశింపజేయు యువకులు, వేశ్యామాతలచే మెడబట్టి గెంటబడెడి నిటులు, మేషస్పర్ధ, కుక్కుటస్పర్ధ, సర్ప ఖేలనము, వివిధ దేశస్థుల నారీ విలాసములు, కళత్రపత్రరచనము మొదలుగా గల విషయజాత మంతయు సామాన్యభాణస్థాయినే అనుసరించును.

భర్త చేసిన పాపపుణ్యములలో భార్యకు పాలులేదని నారదుడు బోధించినట్లు, భార్యచేసిన పాపముల స్పర్శ భర్తల కుండదని ఇంద్రదూతిక అహల్యకు బోధలు చేయును. సముఖము వేంకటకృష్ణప్పనాయకుని ఆ పద్యమును ఈ కవి తన నీతిబోధలో ఉపయోగించుకొనినాడు -

ఇంతుల పాపముల్ పతుల కింతయు కాని ప్రసక్తిలేదు కా
సంతయు వారికంచు స్మృతులన్నియుఁ బల్కును కాదటంచు నిం
తంతయుఁ గల్గనేని ఋతువైన జను న్మఱి చింతయేల నే
కాంతకు సమ్మతుండయిన కాంతునిఁ జెందుట యొక్కొ నేరమా?
(అహల్యాసంక్రందనము 3-40; సుమనో వినోదభాణము 74)

ఈ రచయిత రచనపై అక్కడక్కడ శృంగారనైషధ - రాధికాసాంతన్వముల ప్రభావము కన్పించుచున్నది. చూడుడు –

కాంచెనా సరసుని కౌగిలి కోరని కాంతలే దీ వీథికడకుఁ జూడ
చూచెనా కాంతుని సుందరాకారంబు పొగడని సతిలేదు పురములోన
నితడు నా మగడైన నిట్టి సౌభాగ్యంబు మరి గోరుదురు పురి మగువలెల్ల
నల రాగమంజరి యా త్మేశుక్రియ నుండవలదా యటందురు వారిమగల
సుమనో వినోద భాణము 37 ప.

కోరి లీలాగేహకుడ్యభాగంబుల వ్రాయుదు రమ్మహీశ్వరుని మూర్తి
వ్రాసి కన్యాత్వగౌరవము వీసరవోవ దర్శింతు రనురాగ తరలదృష్టి
దర్శించి యతనికే దగుదునో తగనో యంచించుకించుక సంశయింతు రాత్మ.
శృంగారనైషధము- 1-70

కవి తెలుగువాడగుటచే తెలుగు సాహిత్యప్రభావము పడుట యబ్బురము కాదు. ఈతడు నాటికి ప్రచారములోనున్న రాణసాహిత్యమును సయితము క్షుణ్ణముగా చదివిన వాడయియుండును. వామనభట్టబాణుని శృంగార భూషణ మందలి యొక వాక్యమును సమయము సందర్భము చూచి చక్కగా ఆంధ్రీకరించినాడు. శృంగార భూషణమున ధనమిత్రుడు పరభృతికను లోగొని యధరపానము చేయునంతలో విఘ్నమైనదని తెల్పునప్పుడు "సాధుతరే సంగ్రామే చాపస్య జ్యాభంగః" అని యనును. అట్టి సందర్భమునే యీతడు రసవత్తరముగ చిత్రించి "కటకటా! సాధుతరంబయి యెప్పు సంగ్రామంబునందు చాపంబునకు జ్యాభంగంబు కలిగి నట్లయ్యె" అని వర్ణించినాడు. ఇట్లు ప్రాచీనభాణములలోని రసవత్సన్నివేశముల నీతడు నేర్పుగా పరిగ్రహించినాడు. అయినను స్వాతంత్ర్యమును వీడలేదు. దేవాలయమున కేగుచున్న వివిధ దేశ స్త్రీలను వర్ణించి, తన భాణమును సంఘ ప్రతిబింబము నొనర్చినాడు. ఆంధ్ర యువతులను, వేంకటాద్రి యరవిందముఖులను, కళింగ భీత మృగాక్షులను, ద్రావిడ వనజముఖులను, గౌడ కువలయనేత్రలను, చోళాబ్జముఖులను, ఘూర్జరాంబుజపాణులను మనోహరముగా వర్ణించినాడు. అందు ఆంధ్రయౌవతము నందములను తేటగీతిలో తేటమాటలతో మూట గట్టినాడు.

చేరలంతేసి కన్నులు చెలువుగుల్కు
చెక్కుటద్దంబులు పిసాళి చిన్ని నగవు
నురము పట్టని వక్షోజగిరులు గలుగు
నంబుజాక్షీకులం బాంధ్రయౌవతంబు – 50

"వినోదకథాకల్పవల్లి"తో ప్రసిద్ధుడైన చిలకపాటి రామానుజశర్మ చేతినుండి వెలువడిన యీ భాణము చేపట్టిన తుదముట్టు వరకు సంతోషముతో చదివించి తీరును.

ఆంధ్ర భాషా విలాసము:

ఈ పేరున తెనుగున స్వతంత్రభాణరచనమును గావించిన మనీషి మున్నంగి లక్ష్మీనరసింహశర్మ.[1] రచనాకాలమును గుఱించికాని, రచయితను గుఱించికాని భాణమును గుఱించికాని ఏ వివరములు లభించలేదు.

ముకుందానంద భాణము:

కాశీపతికవి రచించిన ముకుందానంద భాణమును ఆంధ్రీకరించిన ఘనత గని శేషయ్యశాస్త్రుల వారిది. 1906 వ సం॥న శ్రీరాజా వెలుగోటి శ్రీ వేంకటకృష్ణ యాచేంద్ర బహదూరువారి యాజ్ఞచొప్పున నిది వారిచే ఆంధ్రీకరింపబడినది. శేషయ్యశాస్త్రి కర్నూలు మునిసిపల్ హైస్కూలులో ఆంధ్రపండితులుగ పనిచేసినవారు. ఇది చదలవాడ సుందరరామశాస్త్రులచే పరిష్క రింపబడినది.

ఈ అనువాదము ఆదరింపదగినది. పద్యరచనమున గాని, గద్యరచనమున గాని ఈ కవి చక్కని "తూగును" (శయ్యను) ఆద్యంతమును పోషించును. అనువాద విధానము సైతము అన్వయ కాఠిన్యమునకు దూరమయినదే. శబ్దాడంబర మనిపించి నను రమణీయశయ్యగల క్రింది పద్యమును చూడుడు—

ఇందిరాసుందర విహార మందిరమున
గంధ తుందిలమకరంద బంధురమున
గ్రందుకొనె ముంద రరవిందకందరమున
మందమందముగ మిళింద బృందమమరె.[2]

అనువాద విధానమున కొక్క ఉదాహరణమును చూచి, ముందునకు సాగుదము. సూర్యాస్తమయ వర్ణనము నందలి కాశీపతిశ్లోకము -

జరఠ ఇవ మరాళో జర్జరాగ్రై ర్మయూఖైః
స్ఖలతి శిశిరభానుః పశ్చిమాంబోధి పారే।

1. తెలుగునాటక వికాసము పుట633.
2. ముకుందానంద ధాణము 75

అయ మయ ముదయాద్రే ర్నాతిదూరే వివస్వా
నయ మయ మమృతాంశుః పాతకీ యాతి చాస్తమ్   ముకు– శ్లో 26

అనువాదము.

జరఠమరాళమో యనగ జర్జరితాగ్రమయూఖ పంక్తి ని
ర్భరగతిఁ బశ్చిమాంబునిధి పాఠమున న్నెల జాఱె దాని యం
బరపతయాళు రేఖలనఁ బల్చనఁ బల్చనఁ గాంచు కాంతులన్
బొరలుచునున్న వే మనినఁ బొందగు తారక లచ్చటచ్చటన్.

మూలాతిక్రమణము లేని యనువాదమని చెప్పుట సాహసము కానేరదు.

చతుర్భాణి :

చతుర్భాణికి అనువక్త బాలాంత్రపు రజనీకాంతరావు. రజనీకాంతరావు వర్తమానకాలమున ప్రసిద్ధి చెందిన సంగీతసాహిత్యవేత్త. ఆంధ్రవాగ్గేయకారుల చరిత్ర మున్నగు గ్రంథములను రచించినారు. ఆకాశవాణిలో స్టేషన్ డైరెక్టర్ పదవిని కూడ నిర్వహించినవారు.

పద్మప్రాభృతకము.[1] – వెన్నెలలు వెదజల్లెడ శిష్ట వ్యావహారిక భాషలో తెలుగు నుడికారములు ప్రోది సేయుచు ఈ భాణము అనువదింపబడుట ముదావహమైన విషయము.

“ఇదిగో! ఇక్కడ మరో అడవిమాలోకం దాపురించాడు!” “ఏవోయ్! బ్రాహ్మర్లబ్బాయ్” “అమ్మబాబోయ్ ఈ మదనజ్వరం అనేది అంత తేలికగా అన బడుతున్నా మహా చెడ్డబల మయినది” ఈ రీతిగా వచనరచన సాగును.

పద్యరచనముతో పాటు మరింత అందమును సృష్టింపగలమని విశ్వాస మున్నపుడు వీరు పద్యములను గేయముల లోనికికూడ అనువదించినారు. ఒక ఉదాహరణను చూడుడు –

మూలాదపి మధ్యాదపి
విటపాద ప్యంకురా దశోకస్య
పిశునస్థ మివ రహస్యం
సమన్తతో నిష్కసతి పుష్పమ్.[2]

1. భారతి 1969 ఏప్రిల్.
2. పద్మప్రాభృతకమ్ - శ్లో 4.

వేరు చూచినా, నడుమ చూచినా,
చివురు చూచినా, మాకు చూచినా
లోభివాని లోగుట్టు పోలికను
విరియ బూచిన దశోక మంతటా

పద్యరచనమున సైతము ఈ కవి చేయితిరిగిన వాడే.

నిభృతవదనా శోకగ్లానా నిరంజనలోచనా
మలినవసనా స్నేహభ(త్య)క్త ప్రలంబఘనాలకా !
శిథిల వలయా పుష్పోత్క్షేపై శ్చ్యుతాంగుళివేష్టనా
తరుణయువతి స్తన్వీ భూయ స్తనుత్వ ముపాగతా.[1]

బరువగుమోము ఎంతవసివాడెడు, కాటుకలేని కళ్ళు దు
మ్మరలెడు కట్టుచీర పెనయన్ చమురంటని కేశపాశమున్
అరచెయివైపు జారువలయాల్ పువులెండిన దండ తోరమున్
తరుణవియోగినీ తపన తన్వి తనుత్వము పెంచుc దద్దయున్ .

ఇది "తామరపువ్వుకానుక" అనెడి పేరుతో 'ఆకాశవాణి' ద్వారా ప్రసారము చేయబడినది.

ఉభయాభిసారిక :

1972 ఏప్రిల్ - భారతి సంచికలో ప్రచురింపబడినది. సంస్కృత మూల రచయిత వరరుచి. కుబేరదత్తునకు, నారాయణదత్తకును ఏర్పడిన ప్రణయకలహమును తీర్చుటకు విటుడు బయలుదేరి, ఎందరినో పరామర్శించి, చివరకు కృతకృత్యుడగుట యిందలి యితివృత్తము.

ఈ భాణానువాదకాలమునకు రచయిత దృక్పథము మారి, కొంత మార్పు కన్పించుచున్నది. గేయములసంఖ్య కొంత తగ్గినది. గేయరచనములో ఇంతకు ముందటికన్న మణికొంత తేలికదనాన్ని ఆదరించుటను కూడా పరిశీలింపవచ్చును. మచ్చునకొకటి -

---

1. పద్మప్రాభృతకము - శ్లో 28.

కోఽసి త్వంమే కావాహం తే విసృజశఠ మమ నివసనం ముఖం కిమపేక్ష సే
నవ్యగ్రాహం జానే హేహే తవ సుభగ! దశనవసనం ప్రియాదశ నాంకితమ్
యా తే రుష్టా సా తే నాహం వ్రజ చపల హృదయ నిలయాం ప్రసాదయ కామినీ
మిత్యేవం వః కన్దర్పార్తాః ప్రణయకృతకలహకుపితా వదంతు వరస్త్రియః[1]

నా కేమవుతావు నువ్వు – నీకేమవుతాను నేను
దయచేయవోయ్ దగాకోరు – ముద్దంటే మొహంవాపో
దిగులుపడను తెలిశాయోయ్ – పెదవులపై పలునొక్కులు,
ప్రేయసి యిచ్చిన కాన్కలు – నీవె కోపగించినది.
నేను కాను వేరెవ్వతో – కుదురులేనివాడా! పో
కోరిన జవరాలి కడకు – అంటూ భాషింత్రు గాక
మరులుగొన్న వరస్త్రీలు – ప్రణయకోపమున పలుకులు
ములుకుల తమ ప్రియుల గూర్చి ——

వారు చేసిన మఱియొక సంస్కరణము - ఆకాశభాషితములు పరిహరించి ఆ యా పాత్రములను రంగస్థలముననే ప్రవేశపెట్టుట, అనగా 'భాణమును' నాటకము (ఏకాంకిక) గా మార్చివేసినారు. అది 'భాణ' లక్షణమునకే భంగకరము. కాని అనువక్త ఏదో సౌలభ్యమును దృష్టిలో నుంచికొని ఆ పని చేసినారు. బహుశః "పద్మ ప్రాభృతకము"ను (తామర పువ్వుకానుకను) - ఆకాశవాణి ప్రసారము చేసెడి సమయమున అది కేవలము శ్రవ్యనాటిక కావున, అప్పుడు అది సృష్టించిన చిక్కులను దృష్టిలో నుంచుకొని, ఆ తర్వాత ప్రసార సౌకర్యమును కల్పించుటకు అన్ని పాత్రములను ప్రవేశ పెట్టి యుండవచ్చును. కాని అట్లు సర్వపాత్రములకు ప్రవేశయోగ్యత నిచ్చుట ఎవ్వరికిని నష్టము లేని సంస్కరణమే కాని భాణ లక్షణమునకు మాత్రము భంగకరమే. ఈ భాణమన వారి పద్యానువాద వైఖరికి చిన్న ఉదాహరణము -

శశిన మభిసమీక్ష్య నిర్మలం
పరభృతరమ్యరవం నిశమ్య వా।
అనునయితి న యః ప్రియం జనం
విఫలతరం భువి తస్య జీవితమ్॥[2]

---

1. ఉభయాభిసారిక శ్లో 1.
2. ఉభయాభిసారిక శ్లో 31.
2. భారతి 1975 జనవరి, ఫిబ్రవరి

మచ్చలేని చందమామను చూచియు
పరభృతంపు తీయ పాట వినియు
ఎవరు సకియ ననునయింపడొ అవ్వాని
బ్రతుకు బ్రతుకె రాతిబండ గాక.

ఇందు 'నిర్మల' పదమును - "మచ్చలేని" అని అనువదించుట రమణీయము. ఆ అనువాద మాత్రమునకే మూలమున లేని అతిశయోక్త్యలంకారము అనువాదమున సిద్ధించుచున్నది. అనగా మచ్చలేని చందమామ అనుట- ముఖాధ్యవసాయమును, పరభృతంపు తీయని పాట అనుట నారీగానాధ్యవసాయమును సూచించుచు, అట్టి స్త్రీని చూచి అను నర్థమును సైత మందిచ్చును. బ్రతుకు బ్రతుకె! అని మూలమున లేని కాకుస్వరముకూడా అనువాదమున కంద మిచ్చుచున్నది.

ధూర్తవిట సంవాదము :

అనువాదసరణిలో పద్మప్రాభృతక – ఉభయాభిసారికలకును, దీనికిని పెద్ద భేదము లేదు. కానీ మున్నుడిలో అనుకర్త సూచించిన ఒక మాట గమనింపదగినది.

"మిగిలిన భాణాలలో లాగే, ఇందులో కూడా ఒకే నటుడు ప్రధానపాత్ర అయిన విటుడుగా ప్రవేశించి - మిగిలిన పాత్రల నాటకాలను, సంభాషణలను ఆకాశ భాషితాలుగా "ఏమంటున్నావు - అలాగ" "అనా" అనే విధంగానే మూలంలో రచించినప్పటికీ, అనువాదంలో మిగిలిన పాత్రల పేర్లు ఆ యా సందర్భాలలో మార్జినులో మామూలుగా నాటకాలలోలాగ సూచించడ మైంది"

- భారతి 1975 జనవరి పుట 14

ఈ సూచనను ఉదయాభిసారికా ప్రకటన సమయముననే చేసియుండినచో బాగుగ నుండెడిదేమో!

ఇక ఈ అనువాదమున సైతము గేయముల సంఖ్య తగ్గినది. విస్తృత భావ ప్రకటనమునకై గేయప్రాయముగా వ్రాయుటకు వీలయిన "సీసము"- తుదిని తేటగీతి లేక ఆటవెలది లేకుండగనే స్వీకరింపబడినది. అట్టి సీసములే ఈ అనువాదమున అధికము. ఎట్లో చూచుదము -

అదష్టస్ఫురితాధరే భవతి యో వక్త్రారవిందే రసః
ప్రీతి ర్యా చ హృతాంశుకే చ జఘనే కాంచీప్రభాద్యోతికే।
లక్ష్మీ ర్యా చ నఖక్షతాంకురధరౌ పీనౌ కపోలౌ స్త్రియో
రక్తం తేన విరజ్యతే న హృదయం జాత్యంతరేఽపి ధ్రువమ్ ॥

- ధూర్త విట సంవాద శ్లో 64

అనువాదము -

పలుగాట్లు పడగ కంపిలు మోవి యందూరు
మోము తామరతేనె ముసురునందు
వలువలు తొలగగ మొలదట్టి యెగ్రదోయు
వలుదపిరుందుకై వలపు నందు
బలిసిన చెలిచెక్కిళుల గోటిగుర్తుల
పంటినొక్కుల హెచ్చు భాగ్యమందు
ననురక్తు డైనచో నతడు జన్మాంతర
మందైన వైరాగ్య మందబోడు

రజనీకాంతరావు "చతుర్భాణి" లోని మూడు భాణములకు నింతవరకు చక్కని అనువాదములను ప్రచురించినారు. ఎక్కడను అన్వయమున గాని, భాషలో గాని క్లిష్టతకు తావీయక సులభమంజులమైన శైలిని ఆదరించుట ప్రశంసార్హమైన విషయము. అనువాదమే అయినను వీలైనంతవరకును స్వతంత్రతాఖ్యాతికి లోపము రానట్లుగా వీరి అనువాదము లుండుట ఆనందహేతువు.

పాదతాడితకము

చతుర్భాణిలో నాల్గవది పాదతాడితకము - దీని అనువాదము ఇంకను అముద్రితము. మిగిలిన మూడు భాణముల యనువాదము వలెనే ఈ అనువాదము కూడ తేట తెలుగు మాటలతో పొందికగా కుదిరినది.

జయతి మదనస్య కేతుః
కాంతం ప్రత్యుద్యతో విలాసిన్యాః

శిరసా ప్రార్థయితవ్యః
సాలక్తక నూపురః పాదః

అను నీ శ్లోకభావమును సంపూర్ణముగా కందములో పొదిగినారు—

లత్తుకతో నందియతో
నెత్తిన వగలాడి పాద మిష్టసఖునిచే
నెత్తెరిగి వేడుకొనదగు
చిత్తజుని పతాక జయము చేకొనుగాతన్

తెలుగువారికి చిరపరిచితులైన రజనీకాంతరావు చతుర్భాణిని అనువదించి సంస్కృత సాహిత్యాభిరుచిని ధ్రువపరచుకొనినారు.

వసంత విలాసభాణము

దేవులపల్లి వేంకటనృసింహశాస్త్రిచే 1910 లో విరచితమైనట్లు "తెలుగు నాటక వికాసము" అనుబంధమునందు (పు 687) శ్రీ పి.యస్.ఆర్. అప్పారావు పేర్కొని యున్నారు. దీనినిగూర్చి యింతకు మించిన విశేషము లేమియు తెలియరావు. సంస్కృతమున నీ పేరుతో భాణము లేకుండుటచే స్వతంత్రరచన యని ఊహింప నగును.

ధూర్తానుభవభాణః

[అక్షసూక్తాధారముగా కూర్చబడినది]

ప్రావేపా మా బృహతో మదయంతి
ప్రవాతేజా ఇరిణే వవృతానాః |
సోమస్యేవ మౌజవతస్య భక్షో
విభీదకో జాగృవి ర్మహ్య మచ్ఛాన్ ||

(నాన్ద్యన్తే - సూత్రధారః ప్రవిశతి)

సూత్రధారః – అద్య ఖలు ఇష్టి పరిసమాప్తౌ సదస్యై రనుజ్ఞాతోఽస్మి ధూర్తానుభవభాణ మభినేతుమ్. తద్గృహిణీ మాహూయ సంగీతకమేవ నిర్వర్తయిష్యామి. (పరిక్రమ్య, సంస్మృత్య) కష్టం భో కష్టమ్. హ్యః ఖలు –

నమా మిమేథ న జిహేళ ఏషా
శివా సఖిభ్య ఉత మహ్య మాసీత్ |
అక్షస్యాహ మేకవరస్య హేతో
రనువ్రతా మపజాయా మరోధమ్ ||

తదద్య కథం ను ఖలు గత్వా తామాకరోమి. ఆహూతాపి సా నా గతా భవే త్కదాపి

(నేపథ్యే)

అయే! సమానుభవయోగిన్! సత్యమే వాభిహితమ్. యతః

ద్వేష్టి శ్వశ్రూ రపజాయా రుణద్ధి
న నాథతో విన్దతే మర్డితారమ్ |
అశ్వస్యేవ జరతో వస్న్యస్య
నాహం విన్దామి కితవస్య భోగమ్ ||

(ఆకర్ణ్య) హన్త! మయి కథమపి గమనోన్ముఖే సత్యాలపేన కోఽపి మాం విమనాయయతి. తత్పునః సభా మేవ గచ్ఛామి మనః పరితోషాయ. (ఇతినిష్క్రాంతః)

(తతః ప్రవిశతి ధూర్తః)

ధూర్తః – (ప్రవిశ్య - పునఃపఠతి)

ద్వేష్టి శ్వశ్రూ రపజాయా రుణద్ధి
న నాథతో విన్దతే మర్డితారమ్ ।
అశ్వస్యేవ జరతో వస్న్యస్య
నాహం విన్దామి కితవస్య భోగమ్ ॥

అథవా సత్యమేవ సభాధ్యక్షో క్తిః యదక్షాః పంచాక్షరీ మంత్రప్రాయాః యత్త త్సేవినా మక్షదేవినాం సర్వబంధవిశ్లథనేన మోక్షప్రాప్తి రపి భవతీతి. దృశ్యతామ్—

అన్యే జాయాం పరిమృశన్త్యస్య
యస్యాగృధ ద్వేదనే వాజ్యక్షః ।
పితా మాతా భ్రాతర ఏన మాహుః
న జానీమో నయతా బద్ధ మేనమ్ ॥

(ఆకాశే శ్రుత్వా) కిం పృచ్ఛసి - తత్కుతస్తే ఖేద ఇతి. బ్రవీమి శ్రూయతామ్. మమ సహధర్మచారిణీ మోక్షలక్ష్మీప్రాయా. సన్న్యాసాశ్రమా దపి గృహస్థాశ్రమ ఏవ ఉత్కృష్ట స్తాన దార్శ్యై రభ్యధాయి. తద్వియోగేన కో వా న ఖిన్నో భవేత్ - పునః కిం బ్రవీషి - తత్క్రియతా మక్షత్యాగః మోక్షలక్ష్మీప్రాప్తయే ఇతి - తదపి వదామి ఆకర్ణయ -

యదాదీధ్యే న దవిషా ణ్యేభిః
    పరాయద్భ్యోఽవహీయే సఖిభ్యః ।
న్యుప్తాశ్చ బభ్రవో వాచ మక్రత
    ఏమీ దేషాం నిష్కృతం జారిణీవ ॥

సభా మేతి కితవః పృచ్ఛమానః
జేష్యామితి తన్వా శూశుజానః ।

అక్షాసో అస్య వితరన్తి కామం
ప్రతిదీవ్నే దధత ఆకృతాని ||

అంగ! కథ మయం శృణ్వన్నేవ గతః - ఆం జ్ఞాతమ్. సభాధ్యక్ష జామాతా ఖల్వయమ్. శ్వశురం శ్వశ్రూ సమీపం నేతుం గచ్ఛతి నామ. (అన్యతో గత్వా) అహో కః ఖలు వదతి, దారుణా నిర్మితాః అక్షా ఇతి సత్యమేవ తే దారుణా నిర్మితాః కృతాంతేన. యతః -

అక్షాస ఇదం కుశినో నితోదినో
నికృత్వాన స్తపనా స్తాపయిష్ణవః |
కుమార దేష్ణా జయతః పునర్హణో
మధ్వా సంపృక్తాః కితవస్య బర్హణా ||

(పార్శ్వతోఽవలోక్య) కథమత్ర నవయౌవన ప్రాంగణ స్థితః యువరాజోఽపి అక్షసభాంగణ మేవాగతః - నమః అక్ష ప్రభవే. అత్ర చ -

త్రిపంచాశః క్రీళతి వ్రాత ఏషాం
దేవ ఇవ సవితా సత్య ధర్మా |
ఉగ్రస్య చిన్మన్యవే నానమన్తే
రాజాచి దేభ్యో నమ ఇత్కృణోతి ||

ఏనం కించిదివ వాదయామి. నమో యువరాజాయ (దృష్ట్వా) కథ మయం నిశామయన్నపి న పశ్యతి. నాత్ర అస్య దోషః. దోషః పున రేతస్య భాగ్యహీనతాయాః ఏవ. యతోఽస్య ఖేలనే.

నీచా వర్తన్త ఉపరి స్ఫురన్త్య
హస్తాసో హస్తవన్తం సహన్తే |
దివ్యా ఆంగారా ఇరిణే న్యుప్తా
శీతా స్సన్తో హృదయం నిర్దహన్తి ||

(ప్రతీచీం విలోక్య) హన్త! హరితః అక్షనిహతస్య స్థితిరివ మలినతాం యాన్తి. కోఽత్ర గృహప్రాంగణే ? అవగతమ్. అయమపి సభిక ఏవ. యస్య చ -

జాయా తప్యతే కితవస్య హీనా
మాతా పుత్రస్య చరతః క్వస్విత్ ।
ఋణా నా బిభ్య ద్ధన మిచ్ఛమానోఽ
న్యేషా మస్త ముపనక్త మేతి ॥

తద్దర్శనదోషం పరిహృత్య పరతో గచ్ఛామి (పరిక్రమ్య విలోక్య) కోయ మత్ర సభికః స్వజాయామనునయనేఽపి ఆశక్త ఇవ దృశ్యతే? ఆహో! మదభిముఖమేవ ఆనీయతే సః తయా అభాగ్య తరుణ్యా భగిన్యా. అయి కిం బ్రవీషి ? (ఆకర్ణ్య) అయం ఖలు హ్యః మమ అధరం నిపీయ శపథం కృత్వా పునరస్మిన్ దినే సర్వం అక్షాయ సమర్ప్య ఆగతః పునరపి అనునయతి, శపథం కరోతి చేతి. తన్వి! శృణు! అయం ఖలు అక్షప్రియానాం ప్రకారః. యత్

స్త్రియం దృష్ట్వాయం కితవః తతాపా
న్యేషాం జాయాం సుకృతం చ యోనిమ్ ।
పూర్వాహ్ణే అశ్వాన్ యుయుజేహి బభ్రూన్
త్సోఽగ్నే రన్తే వృషలః పపాత ॥

ఆయం పునః కిమపి వక్తుకామ ఇవ! ఆర్యః! కిం వదసి ? (శ్రవణ మభినీయ) న భూయోఽపి దీవ్యామీతి. (స్వగతమ్) మేధావినః ఖలు పురుషాః ప్రాయః నారీః విశ్వాసయితుమ్. (ప్రకాశమ్) కిం తత్సత్యమేవః ? కిం బ్రవీషి ? -

యోవ స్సేనానీ ర్మహతో గణస్య
రాజా వ్రాత స్స ప్రథమో బభూవ ।
తస్మై కృణామి న ధనా రుణధ్మి
దశాహం ప్రాచీ స్తదృతం వదామి ॥

యుక్తమే వైతత్. తదస్యాః పాదయోః పతిత్వా ప్రసాదయ. కథమ్? అనుపద మేవ తదనేన కృతమ్! అముం ఖల్వద్య ఉపదిశామి. వయస్య

అక్షై ర్మాదీవ్యః కృషిమి త్కృషిస్వ
విత్తే రమస్వ బహుమన్య మానః ।

తత్ర గావః కితవ తత్ర జాయా
తన్మే విచష్టే సవితాయ మర్యః ||

భగిని! కింతే భూయః ప్రియ మాచరామి. తథాపీద మస్తు భరత వాక్యమ్ -

మిత్రం కృణుధ్వం ఖలు మృళతా
నోమానో ఘోరేణ చరతాభిధృష్ణు |
నివో ను మన్యు ర్విశతా మరాతి
రన్యో బభ్రూణాం ప్రసితౌ న్వస్తు ||

(ఇతని నిష్క్రాంతః విటః)

ఇతి ఋగ్వేదదశమ మండలాంతర్గతాక్షసూక్త మాధారీకృత్య సూరం వంశోద్భవేన, శ్రీనివాసేన గుమ్ఫితః ధూర్తనుభవభాణ స్సమాప్తః

భాణములలోని కొన్ని సామెతలు - సూక్తులు

భాణములలో నాల్గు కాలముల పాటు నిలువవలసిన చక్కని సూక్తులు, సామెతలు కోకొల్లలు. అన్నిటిని వ్రాయవలెనని అభిలాష యున్నను అవకాశము లేని కారణమున కొన్నిటినే ఉదహరించుచున్నాము.

1. మానధనా హి విశేషేణ క్షత్రజాతిః
2. కో వా ప్రాదుర్భావసమయ ఏవ నవనీతస్య భగ్నవాన్ దధిస్థాలీమ్
3. రమతే కి మితరతోపి భ్రమరః సహకారమంజరీచపలః
4. కష్టం నామ కామినీనాం పతిగృహవాసపాతకమ్
5. ప్రకృత్యైవ యం కంచిదపి హస్తలగ్న మధరీకుర్వంతి వారాంగనాః
6. మార్గే గచ్ఛతో మందిర నిర్మాణం సుకరమ్, బిభ్రతః ఖలు భారః
7. ఆలయఘంటామణినాశే ప్యర్చకస్య కా హానిః
8. కిమిదానీ మాపణనాలికేర మధ్యవినాయకస్య ప్రహరసి
9. బహువిధేషు జనేషు కిం కిం న సంభవతి ?
10. న హి మృదుతర బృంహితసమాహూతోపి హరిణీ కరణ ముపసర్పతి
11. కాముకానాం మనఃప్రవృత్తౌ న జాతివిశేషవిచారః
12. ప్రేమ్ణ ప్రాప్నోతి యః స్త్రీణా మతిమాత్రస్య పాత్రతామ్
    స ఏవ కోపవిషయో నాన్యః సాధారణో జనః
13. ఆధునికానాం స్వభావః ఖల్వయం, యత్స్వదోష మపహ్నుత్యాపి పరదోష మాలోక్య పరిహాసః
14. వనితా జనానా మితరవనితా ప్రశంసన మతిదుస్సహ మేవ
15. ఇష్టార్థ సిద్ధయే పూర్వం కుర్వంతి శపథాన్ బహూన్ ।
    సిద్ధే పున ర్విచేష్టన్తే విపరీతం హి యోషితః॥
16. అంగణస్థితాయాః మల్లికాయాః సౌరభ్యం నాస్తి
17. మధుర రసాస్వాదనా నన్తర మామ్లరసోఽపి మనా గాస్వాదనీయః
18. సాధుతరసంగ్రామే చాపస్య జ్యాభంగః

19. వృద్ధవారవిలాసినీ వానరీభవతి
20. ఉభయో ర్గాఢ మన్యోన్యం వదతో ర్యో నరోంతికమ్ |
    వినా కారణ మభ్యేతి తం ద్విపాదం పశుం విదుః||
21. ఆర్త్యై నూన మభాగ్యానా మాయుర్ద్రాఘయతీశ్వరః
22. మదనీయం ఖలు పురాణం మధు
23. శిరోవేదనా నామ గణికాజనస్య లక్షవ్యాధియౌతకమ్
24. సుమనసః ముసలేన మాక్షౌత్సీః
25. పితా నామ ఖలు నవయౌవనస్య పురుషస్య మూర్తిమాన్ శిరోరోగః
26. మానినీనాం మన స్సత్యం కోపి పాషాణ ఏవ
27. నియమితచిత్తానామపి చిత్తాకర్షణనిపుణం స్త్రైణమ్
28. కాంతాపరిభవో దుర్విషహమానినః కామినః
29. ఏకస్స్వాదు న భుంజీత
30. సర్వోఽప్యాత్మాన మదోష మేవ మన్యతే
31. కస్య వా గచ్ఛతః స్ఖలనం న సంభవతి
32. కదాచి ద్విశదమతయోపి భ్రమంతి ఘంటాపథేషు
33. అయస్కారవాటికాయాం సూచీవిక్రయః
34. శంబూకజాతి రపి కిం న ప్రసూతే ముక్తాఫలం శుక్తిః
35. స్త్రీరత్నం దుష్కులాదపి
36. శైశవేఽపి సాధారణ స్త్రీణా మసాధారణా ఖలు వ్యవహారవైదగ్ధీ
37. వినయః ఖలు భూషణం విద్యాయాః
38. స్థితస్య ఖలు గతి శ్చింతనీయా
39. అచింతనీయా హి కాలగతిః
40. బుభుక్షా హి తితిక్షాయాః పరీక్షా
41. సతి హి కుడ్యే చిత్రకర్మచింతా
42. సహజా ఖలు చంచరీకస్య భ్రాంతిః
43. దుర్విషహః వధూతిరస్కారః
44. శ్రేయాంసి బహువిఘ్నాని

45. కష్ట మాపోరనసలిలే ఏవ శిలాఘట్టనేన
46. కిం ఖలు సర్వా ఏవ దృషదః సూచీం కర్షంతి
47. కిమిదం గోపాలకులే తక్రవిక్రయ
48. న సూర్యే దీపే నాంధకారం ప్రవిశతి
49. న దీపే నాగ్నిమార్గణం క్రియతే.
50. సంతుష్టస్యాపి జనస్య న త్వమృతే పర్యాప్తిరస్తి
51. మృతమపి పురుషం సంజీవయే ద్వేశ్యాముఖరసః
52. ప్రత్యక్షే హేతురచనం నిరర్థకమ్
53. అన్య స్త్రీ గోత్రగ్రహణం హి మహానుపప్లవః కాముకానామ్
54. కృతఘ్నతా సర్వపాపీయసీ
55. సర్వో హి సుఖినం ద్వేష్టి లోకః
56. అన్యద్ధి శాస్త్ర మన్యథా పురుషప్రకృతిః
57. గుణవాన్ ఖలు గుణవతాం సన్నికర్షః
58. ఆహోస్విత్ కామ్యమానం కామయన్తే స్త్రియః

న్యాయములు

1. ఘుణాకర్షణ న్యాయము
2. రేఖాగవయన్యాయము
3. కూప ఖానకన్యాయము
4. దండాపూపికాన్యాయము
5. భ్రష్టావసరన్యాయము
6. తత్క్రతు న్యాయము
7. బ్రహ్మాస్త్రన్యాయము
8. గడ్డులికాప్రవాహన్యాయము.
9. ఖలేకపోతన్యాయము
10. యదాగమన్యాయము

—ఈ న్యాయములన్నియు మదనానందభాణములోనివే.

భాణముల పట్టిక

సంకేత దీపిక

1.	M. O.	=	Govt. Oriental Manuscripts library, Madras
2.	M. A.	=	Adayar Library, Madras
3.	Tan	=	Trinial catalogue of Sanskrit Mss. Tanjavore Saraswati Mahal Library.
4.	M. K.	=	History of Sanskrit literature - M. Krishnamacharya.
5.	V. B.	=	సంస్కృత్ మే ఏకాంకీ రూపక్ - Dr. Veer BalaSarma.
6.	ము	=	ముద్రితము.
7.	అము	=	అముద్రితము
8.			* ఈ గుర్తు గల రచయిత ఆంధ్రుడు. (ఇతరులు కూడ ఎవరైన ఆంధ్రులు గలరేమో)
9.	N. C. C.		New catalogues catalogorum - University of Madras.
10.	K. S. C.		కేరళీయ సంస్కృత సాహిత్య చరితమ్
11.	Tri		Catalogue of Trivandrum
12.	మధ్య		మధ్యకాలీన సంస్కృతనాటక్ - రామ్‌జీ ఉపాధ్యాయ
13.	సం. సా.		సంస్థానములు - సాహిత్యపోషణము
14.	తె.వి.స.		తెలుగు విజ్ఞాన సర్వస్వము Vol IV సంస్కృతి.
15.	ర.సు.		రసార్ణవ సుధాకరము
16.	అల	=	అలభ్యము

గ్రంథము పేరు	రచయిత	ము /అము /అల	
అఖిలజనమనోరంజన భాణము	విక్రాల శేషాచార్యులు*	అము	
అనంగజీవన భాణము	వరదార్యుడు	అము	M. A. 1234
అనంగజీవన భాణము	రామవర్మ	ము	Tan 4572- Kerala Sanskrit Series -1960
అనంగతిలక భాణము	రంగనాథుడు	అము	M. A. 1233
అనంగ బ్రహ్మవిద్యావిలాసభాణము	వాధూల వరదార్యుడు	అము	M. O. D. 12430
అనంగ మంగళ భాణము	కవీంద్రాచార్యులు	అల	NCC
అనంగ మంగళ భాణము	శ్రీనివాసుడు	అల	NCC
అనంగ మంగళ భాణము	సుందరకవి	అల	MK
అనంగలతిలక భాణము	---	అల	MK - Levi OPP 73
అనంగవిజయ భాణము	శివరామకృష్ణ	అము	MO - D 12431
అనంగవిజయ భాణము	జగన్నాథుడు *	అము	Tan 4577
అనంగసర్వస్వ భాణము	లక్ష్మీనృసింహుడు	అము	Tan 4580
అభినవ శృంగారరసమంజరీభాణము	తిరుమలబుక్కపట్టణం బుచ్చి వెంకటాచార్యులు *	అము	విజ్ఞానసర్వస్వము Vol IV P 1176
ఆనందతిలక భాణము	---	అల	VB - మిశ్రభాణమిది
ఉభయాభిసారికా భాణము	వరరుచి	ము	D. G. శర్మ & కృష్ణ - పాట్నా 1922

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
కందర్పదర్పణ భాణము	శ్రీకంఠుడు	అము	Tan 4581
కందర్పదర్పణ భాణము	శ్రీకృష్ణుడు	అల	NCC
కందర్పదర్పణ భాణము	వేంకటాచార్యుడు	ము	Printed Serially in the journal of Tanjore Saraswathi Mahal library begining with Vol XIX - I - II 1966 and ending with XX
కందర్పదర్పణ భాణము	లోకనాథాధ్వరి	అల	NCC
కందర్పదర్పవిలాస భాణము	బెల్లంకొండ రామరాయకవి*	ము	భారతీవిలాస ప్రెస్సు, బాపట్ల - 1910
కందర్పవిజయ భాణము	ఉద్దండ కవి		Baroda
కందర్పవిజయ భాణము	ఘనగురుడు	అల	MK
కందర్పసంభవ భాణము	సర్వజ్ఞసింగభూపాలుడు *	అల	రసార్ణవ సుధాకరము
కమలానంద భాణము	కోరాడ రామచంద్రశాస్త్రి *	అల	విజ్ఞానసర్వస్వము Vol IV
కమలవిలాస భాణము	నారాయణకవి	ము	Journal of Sri Venkateswara Oriental Research Institute - Tirupathi.
కర్పూర చరిత భాణము	వత్సరాజు	ము	గైక్వాడ్ ఓరియంటల్ సిరీస్ – 8 బరోడ
కలకంఠ భాణము	---	అల	రసార్ణవసుధాకరము, రంజకోల్లాసము – 88 శ్లో.

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
కామకళావిలాస భాణము (లేక)			
కామవిలాస భాణము	ప్రధాని వేంకట భూపతి	అము	ఆధునిక సంస్కృత నాటక – పుట 468
కామబాణ భాణము	నారాయణ కవి	అము	M.A.1350
కామినీకాముకోల్లాస భాణము	దువ్వూరి విశ్వనాథుడు*	అము	M.O.R. 1876
కుసుమబాణవిలాస భాణము	----	అల	M.K. – CC 1-113
కుసుమబాణ భాణము	----	అల	Bibliography of Sanskrit drama. Columbia University press
కుసుమాయుధజీవితమ్	శ్రీరంగార్యుడు	అము	M.O.R. 8725 ఇది పంచబాణవిజయమేమో అని అనుమానము
కృత్తికాభాణము	రాఘవవర్మ తంపురాన్	అల	K.S.C. IV 683 P.
కోలాభాణము	---	అల	V B
కైతవకలాచంద్ర భాణము	నారాయణస్వామి	అల	ఆధునిక సంస్కృత నాటక. పుట 542
గోపాలలీలార్ణవ భాణము	శేషగోవిందుడు*	అము	Tan 4583, Tri 5028 } M.K.
చంద్రరేఖావిలాస భాణము	శంకరుడు	అము	M.O.D. 12516 D 12517
చాతురీ చంద్రికా భాణము	చిలుకమట్టి వేంకటాచార్యులు*	అము	M.O.D. 1646

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
జగన్మోహన భాణము	విక్రాల నరసింహాచార్యులు*	ము	
తరుణభూషణ భాణము	శరకోపుడు	అము	M.O.R. 5204
ధూర్తవిటసంవాదము	ఈశ్వరదత్తు	ము	
నందిమతీ భాణము	----	అల	భావప్రకాశము - శారదాతనయుడు
పంచబాణ భాణము	భట్టి వేంకటేశుడు*	అము	తిరుపతిలో తాళపత్ర ప్రతి గలదు
పంచబాణవిజయ / శృంగార శృంగాటక / శ్రీరంగరాజ భాణము	వాదూల రంగార్యుడు	ము	M.O.D. 12538, NCC శ్రీ వాణీనిలయ ముద్రాక్షరశాల 1882
పంచబాణవిజయ భాణము	---	---	M.O.R. 1446
పంచబాణ విలాస భాణము	---	అల	M.K.; VB; CCI 1315
పంచబాణ సిద్ధాంత భాణము	శ్రీనివాస కవీంద్రుడు / బాలకవి	అల	NCC Baroda II 6694 (a)
పంచాయుధ ప్రపంచ భాణము	త్రివిక్రమభట్టు	ము	బొంబాయి 1864
పత్రలేఖాభాణము	---	---	మధ్య P 475. నాటక లక్షణ రత్నకోశ / సాగరనంది.
పద్మ ప్రాభృతకము	శూద్రకుడు	ము	
ప్రద్యుమ్నానంద భాణము	---	అల	V.B.
పాదతాడితకము	శ్యామిలకుడు	ము	

గ్రంథము పేరు	రచయిత	ము /అము /అల	
పురుషపుంగవ భాణము	జీవన్యాయతీర్థుడు	ము	సంస్కృత సాహిత్య పరిషత్పత్రిక – 43 – 12
పుష్పబాణ విజయ భాణము	ఈయుణ్ణి భాష్యకారాచార్యులు*	ము	
పౌండరీక భాణము	కొక్కొండ వేంకటరత్నం పంతులు	అల	
ఫంటూస చరిత భాణము	అభిరాజేంద్రమిశ్రా	ము	వైజయంతప్రకాశనమ్. ద్రోణీపురం – జైనపురం ఉత్తరప్రదేశ్ 1971 – 72
మదనగోపాల భాణము	స్వయంభూనాథరామ్	అల	MCC Mysore I P 278
మదనగోపాలవిలాస భాణము	గురురామకవి	అము	M A 1436 / M O D 12576
మదనమంజరీ భాణము	వేంకటేశ కవి*	అము	M.S. available at Andhra University No.1261
మదనమంజరీపరిణయ భాణము	వైద్యనాథుడు	అల	Mysore IP 278 NCC
మదనభూషణ భాణము	అప్పాయజ్వుడు	అము	Tan – 4585
మదనమహోత్సవ భాణము	శ్రీకంఠుడు	అము	M.O.D. 12577, R 15710
మదన విజయ భాణము	విక్రాల శేషాచార్యులు*	అము	
మదన విజయ భాణము	కర్నమడకం అనంతాచార్యులు	అల	
మదన విలాస భాణము	పశుపతి నాగనాథుడు*	అము	M.O.R.1876b
మదనసంజీవన భాణము	ఘనశ్యాముడు	అము	Tan 4587

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
మదనసామ్రాజ్య భాణము	తంజాపురి భుజంగకవి	అల	M.K. Mysore I P 278
మదనానంద భాణము	భట్టరు పార్థసారథి*	ము	ఆయుర్వేద ముద్రాశాల, నూజివీడు
మదనాభ్యుదయ భాణము	శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి	అము	M.O.R. 2114
మనోజ విజయ భాణము	శింశనగళ్ కృష్ణమాచార్యులు*	అల	
మన్మథమోహన భాణము	కడమోకుడి సుబ్రహ్మణ్యశాస్త్రి	ము	Journal of Sahriday Vol II
మన్మథాభ్యుదయ భాణము	వేంకటేశ	అల	M.K.
మర్కట మార్దలికా భాణము	Y. మహలింగ శాస్త్రి	ము	“మంజూష” సెప్టెంబర్, అక్టోబర్ 1951
మహిషమంగళ భాణము	---	ము	M.A. 1453 1880 Palghat
మాధవవిలాస భాణము	దువ్వూరి విశ్వనాథశాస్త్రి*	---	Ref సం.సా. P 247
మాలమంగళ భాణము	మాలమంగళ		VB
ముకుందానంద భాణము	కాశీపతి*	ము	K M 7
ముకుట తాడితక భాణము			శృంగారప్రకాశములో ఉదాహృతము
రతిభూషణ భాణము	కవితార్కిక కంఠీరవ	అము	M.O.D. 16081 NCC
రసరత్నాకర భాణము	జయంతుడు	అము	M.O.D. 3307
రసవిలాస భాణము	---	అల	V.B. మిశ్ర
రసవిలాస భాణము	చొక్కనాథుడు*	అల	M.K.

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
రసవిలాస భాణము	కేరళవర్మ తంపురాన్	అల	K.S.C. IV P 671
రససదన భాణము	యువరాజ	ము	M.A. 1505 నిర్ణయసాగర ప్రెస్సు 1922
రసాంకుర భాణము	నారాయణన్ నంబీశన్	అల	K SSC VI 385
రసార్ణవతరంగ భాణము	కపిస్థలం కృష్ణమాచార్యులు*	ము	విక్రాలవారు చెప్పిరి
రసికజనమానసోల్లాస భాణము		అము	M O 12633
రసికజనరసోల్లాస భాణము	కామసముద్రం వేంకటాచార్యులు	అము	MOD 12634 D 12633
రసికజనరసోల్లాస భాణము	శ్రీనివాసాధ్వరి	అల	VB మిశ్ర
రసికతిలక భాణము	ముద్దు మృదురామకవి	ము	Tri viii N0 – 1328
రసికభూషణ భాణము	ఉదయవర్మ తంపురాన్	అల	KSC IV P 483
రసికరంజన భాణము	ప్రతివాది భయంకర శ్రీనివాసాచార్యులు	ము	
రసికరంజన భాణము	సుందరరాజకవిరాజ*		బృందావనం వేంకట రంగాచార్యులు – ఆకులమన్నాడ్ కృష్ణాజిల్లా
రసికవిలాస భాణము	చొక్కనాథుడు	అల	ఇదే రసవిలాసమేమో
రసికశేఖర భాణము	గదాధర విద్యాభూషణుడు	ము	Journal of Manorama Vol I & III

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
రసికామృత భాణము	శంకరనారాయణ	అల	M.K.
రసోదార భాణము	సురపురం అణ్ణయార్యుడు*	అము	శ్రీ బిరుదరాజు రామరాజు కడ ఒక ప్రతి కలదు
రసోల్లాస భాణము	శ్రీనివాసాచార్యుడు*	అము	M.A. 1506, M.O.D 769, Tan 4589 శ్రీనివాస వేదాంతాచార్యులు
రామజన్మ భాణము	తారాచరణ శర్మ	ము	రామనగర మహారాజ పుస్తకాలయము
లలితానాగర భాణము	---	అల	సాగరనంది – నాటకలక్షణరత్నకోశము P.P.476 VB
లీలాదర్పణ భాణము	పద్మనాభుడు*	అము	M.O.R. 2310
లీలామధుకర భాణము	---	అల్	సాహిత్యదర్పణం
వర్తమాన భాణము	---	అము	Baroda
వల్లీపల్లవోల్లాస భాణము	మంజులాచార్యులు*	అము	M.O.R. 2115
వల్లీపల్లవోల్లాస భాణము	శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి*		విజ్ఞానసర్వస్వము 4 భా.
వసంతతిలక భాణము	నృసింహసూరి	అము	Tan 4590
వసంతతిలక భాణము	భాస్కరకవి		NCC (Mysore IP 282)
వసంతభూషణ భాణము	వరదాచార్యుడు	}	V.B., MK
వసంతభూషణ భాణము	నృసింహసూరి*	}	బహుశః ఇవి రెండు పై రెండు భాణములే కావచ్చును
వసంతాభరణ భాణము	శ్రీనివాసుడు	అము	M.O.R. 8176, R 8348

గ్రంథము పేరు	రచయిత	ము /అము /అల	
వసంతమిత్ర భాణము	మంగళగిరి కృష్ణ		
	ద్వైపాయనాచార్యులు*	ము	విజయనగరం నుండి
విటరాజవిజయ భాణము	కౌచ్యుణితంపురాన్ (రామవర్మ)	ము	KSC IV (Mangabdayarm Trichur)
విటవిద్రా భాణము	---	అము	Tri 1301
విటవిలాస భాణము	మహాదేవశాస్త్రి	ము	Sanskri Journal of pudukkotta – 1907
విలాసభూషణ భాణము	వేంకటకృష్ణయ్య*	అము	M.O.R. 1576b
వీణావతీ భాణము	---	---	నాటకలక్షణ రత్నకోశము, భావప్రకాశము
వేంకట భాణము	శ్రీధరపేరుసూరి*	---	
శారదాతిలక భాణము	శంకరకవి*	అము	M.O.D.19314
శారదాతిలక భాణము	శేషగిరి కవి	అము	ఆధునిక సంస్కృత నాటక - 542
శారదాతిలక భాణము	చామయమంత్రి	అము	
శారదానందన భాణము	శ్రీనివాసాచార్యులు	అము	M.O.D. 12701
శృంగారకేతు లీలాచరితము	భాస్కరకవి	ము	
శృంగారకోశ భాణము	గీర్వాణేంద్రదీక్షితులు	అము	Tan 4611
శృంగార చంద్రికా భాణము	శ్రీనివాసుడు	అము	M.O.R. 2192
శృంగార జగన్మోహినీ భాణము	బాల చంద్రశేఖర*	---	Andhra's Cntribution to Sanskrit Literature P178

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
శృంగార జీవన భాణము	అవధాన సరస్వతి	అము	Tan 4622
శృంగార జీవన భాణము	వరదాచార్యులు	అము	M.A. 1571
శృంగారతరంగిణి	ఈచంబాడి శ్రీనివాసాచార్యులు	ము	వాణీనిలయ ముద్రాక్షరశాల – చెన్నపురి 1883
శృంగారతరంగిణి	రామచంద్రుడు	---	M.K. CCI 660
శృంగారతరంగిణి	వేంకటాచార్యులు	---	M.K. M T 5439 (b)
శృంగారతిలక భాణము	రామభద్ర దీక్షితులు	ము	Tan 4613
శృంగారదీపికా భాణము	వింజమూరి రాఘవాచార్యులు*	అము	M.O.D. 12702
శృంగారదీపికా భాణము	వేంకటాధ్వరి	అము	M.O.R. 7730
శృంగారపావన భాణము	వైద్యనాథుడు	అము	M.O.D.12703
శృంగారభూషణ భాణము	వేంకటాచార్యులు*	అము	M.S. 1580 - 1581
శృంగారభూషణ భాణము	అనంతాచార్యులు*	అము	M.A. 1574
శృంగారభూషణ భాణము	శ్రీనివాసుడు లేక లోకాచార్యులు	అము	M.O.R. 3144 C
శృంగారభూషణ భాణము	వామనభట్టుడు*	ము	సరస్వతీనిలయముద్రాక్షరశాల – చెన్నపురి 1873
శృంగారమంజరీ భాణము	---	అము	M.O.R. 4285
శృంగారమంజరీ భాణము	విశ్వనాథుడు*	అము	M.O.R.1876 a
శృంగారమంజరీ భాణము	రతికరుడు	అము	M.O.R. 5201

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
శృంగారమంజరీ భాణము	వేంకటనారాయణ	అము	M.O.R. 9969
శృంగారమంజరీ భాణము	అష్టభాషాబహిరీ గోపాలరావు*	ము	
శృంగారమంజరీ భాణము	కేరళవర్మ	అము	Tri vol VIII P 1335
శృంగారరత్నాకర భాణము	సుందరతాతాచార్యులు	అము	R 8174 R 8347
శృంగారరస భాణము	---	అము	M.O.R. 9959
శృంగారరసభృంగార భాణము	ఇంద్రగంటి కొండయ*	అము	M.O.R. 2309
శృంగారరసభృంగార భాణము	విశ్వనాథుడు	అల	V.B.
శృంగారరసాయన భాణము	ద్వివేది నారాయణశాస్త్రి	అల	సం.సా. P 523
శృంగారరసోదయ భాణము	లింగమకుంట రామకవి*	అము	M.O.12707 మిశ్రభాణమిది.
శృంగార రాజ భాణము	---	అల	V.B. మిశ్రభాణమిది
శృంగారరాజతిలక భాణము	అవినాశిన్ వర్మ	అము	M.O.D. 12708
శృంగారలీలాతిలక భాణము	భాస్కరన్ నంబూద్రి	ము	కలకత్తా 1935 ఆధునికసంస్కృతనాటక – P 566
శృంగారవిలసిత భాణము	నారాయణ		MK – Mysore I.P. 285
శృంగారవిలాస భాణము	సాంబశివశాస్త్రి	అము	M.O.R. 3340
శృంగారశృంగ భాణము	--		తెలుగునాటక వికాసము పుట 195
శృంగారశృంగాటక భాణము	శ్రీరంగార్యుడు	అము	M.O.R. 15413 D 18659

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
శృంగారశేఖర భాణము	అభినవకాళిదాసు*	ము	ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1969
శృంగారశేఖర భాణము	సుందరేశశర్మ	---	ఆధునిక సంస్కృతనాటక్ పుట 1191
శృంగారశేఖర భాణము	రామానుజుడు	అము	M.O.R.5374 b
శృంగారసంజీవన భాణము	గూటాల శరజిత్కవి*	అము	M.O.R. 2229
శృంగారసర్వస్వ భాణము	స్వామిశాస్త్రి	అము	M.O.D. 12709
శృంగారసర్వస్వ భాణము	భూతినాథుడు	అల	V.B.
శృంగారసర్వస్వ భాణము	అనంతనారాయణసూరి	అము	M.O.R. 5137
శృంగారసర్వస్వ భాణము	నల్లాబుధుడు	ము	
శృంగారసర్వస్వ భాణము	వేదాంతాచార్యుడు	అము	Tan 4626
శృంగారసర్వస్వ భాణము	చూడామణి	---	Bibliography of Sanskri drama
శృంగారసుందర భాణము	ఈశ్వవవర్మ	ము	
శృంగారసుధాకర భాణము	అశ్వతి రామవర్మ	ము	Printed in the Journal of Travancore University Oriental Series Vol I, 1945
శృంగారసుధార్ణవ భాణము	కోరాడ రామచంద్రశాస్త్రి*	ము	మహేశ్వర ప్రెస్సు, మచిలీపట్టణము 1899
శృంగారస్తబక భాణము	నృసింహుడు	అము	Tan 4623
శ్యామలా భాణము	చింతామణి	అము	Baroda

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల	
శ్రీరంగనాథ భాణము	శ్రీనివాసుడు	అల	MK
శ్రీనివాస విలాస భాణము	పైత్తంబాడి రామానుజాచార్యులు	ము	గైర్వాణి 1975-76 లో ముద్రితము
సంకర్షణ భాణము	---	---	Baroda
సంపత్కుమారవిలాస భాణము	రంగనాథ మహాదేశిక	అము	M.O.D. 12719
సరసకవికులానంద భాణము	వెల్లాల రామచంద్రకవి*	ము	లక్ష్మీనృసింహ ప్రెస్సు, మైసూరు 1894
సారస్వతోల్లాస భాణము	వేంకట్రామ	అల	MK
సాక్షాత్కారము	శివప్రసాద భరద్వాజ	ము	విశ్వసంస్కృతమ్, నవంబరు 1964
హరివిలాస భాణము	హరిదాసుడు	అము	M.O.D. 12733
భాణము పేరు లేదు	---	అము	M.O.R. 2461
" "	---	అము	M.O.R. 3693
" "	---	అము	M.O.R. 3755
" "	---	అము	M.O.R. 11413
" " (మళయాళలిపిలో కలదు)	---	అము	M.O.R. 11414
" "	---	అము	M.O.R. 2461
" "	పెద కోమటివేమారెడ్డి*	అల	Andhra's Contribution to Sanskrit Literature

తెలుగు భాణములు

గ్రంథము పేరు	రచయిత	ము/అము/అల		
ఆంధ్రభాషావిలాస భాణము	మున్నంగి లక్ష్మీనృసింహశర్మ*	ము	Ref తెలుగునాటక వికాసము పుట 633	
ఉభయాభిసారిక	బాలాంత్రపు రజనీకాంతరావు*	ము	భారతి 1972 ఏప్రిల్	అనువాదము
తలదన్ను ముచ్చట	బాలాంత్రపు రజనీకాంతరావు*	అము	(పాదతాడితకము)	అనువాదము
ధూర్తవిట సంవాదము	బాలాంత్రపు రజనీకాంతరావు*	ము	భారతి 1775 జనవరి, ఫిబ్రవరి	అనువాదము
పద్మప్రాభృతకము	బాలాంత్రపు రజనీకాంతరావు*	ము	భారతి 1969 ఏప్రిల్	అనువాదము
ముకుందానంద భాణము	గని శేషయ్యశాస్త్రి*	ము		అనువాదము
వసంతవిలాస భాణము	దేవులపల్లి వేంకటనృసింహశాస్త్రి*	ము	Ref తెలుగునాటక వికాసము పుట 687	
వసంతతిలక భాణము	గణపవరపు వేంకటకవి*	అల		
శృంగారభూషణ భాణము	బయపునేడి వేంకటజోగయ్య*	ము	అనువాదము	
సుమనోవినోద భాణము	చిలుకపాటి వేంకటరామానుజశర్మ*	ము	స్వతంత్రము	

ఉపయుక్త గ్రంథ సూచిక

తెలుగు

1. తెలుగునాటక వికాసము - పి. యస్. ఆర్. అప్పారావు
2. నాట్యశాస్త్రము - పి. యస్. ఆర్. అప్పారావు
3. సంస్కృత వాఙ్మయ చరిత్ర - మల్లాది సూర్యనారాయణశాస్త్రి
4. విజ్ఞాన సర్వస్వము సంపుటి IV
5. ఆంధ్రసంస్థానములు–సాహిత్యపోషణము - తూమాటి జొనప్ప
6. సమగ్ర ఆంధ్రసాహిత్యము - ఆరుద్ర
7. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
8. సాహిత్య దర్శనము - కె. వి. ఆర్. నరసింహం
9. సాహిత్య శిల్పసమీక్ష – పింగళి లక్ష్మీకాంతం
10. మధుర తంజావూరు రాజులనాటి ఆంధ్రవాఙ్మయ చరిత్ర
    - నేలటూరు వేంకటరమణయ్య.
11. గీర్వాణ రూపకము
12. వ్యాసరచనల సూచి

ఇంకను సంస్కృతాంధ్రములో అనేక కావ్యనాటకములు, వివిధ సారస్వత పత్రికలు, అనేక తాళపత్రములు.

సంస్కృతము :

1. నాట్యశాస్త్రము
2. దశరూపకము.
3. కావ్యానుశాసనము
4. ప్రతాపరుద్రీయము
5. అలంకారసంగ్రహము
6. సాహిత్యదర్పణము
7. ధ్వన్యాలోకము
8. భావప్రకాశము
9. అభినయదర్పణము
10. ఋగ్వేదము
11. రసార్ణవసుధాకరము

English :

1. History of Sanskrit Drama - A. B. Keith
2. History of Sanskrit Literature - M. Krishnamacharya
3. Andhra's contribution to Sanskrit Literature
   - Dr. P. Srirama Murty
4. New Catalogues Catalogorum
   Print - 9 Volumes; Unprint - 11 Volumes
5. Some aspects of Sanskrit Drama - S. K. De
6. Sanskrit Literature of Kerala - E. Eswaram Nampoothiri
7. Contribution of Kerala to Sanskrit Literature - Kunjunni Raja
8. Sanskrit Drama of Twentyeth Century - Smt. Usha Satyavrat
9. Samskrita Vimarsah - Volume VII Parts 1, 2 - 1975
10. Discriptive Catalogues of
    (1) Govt. Oriental Manuscript Library, Madras
    (2) Adayar Library, Madras
    (3) University Library, Trivendrum
    (4) Saraswathi Mahal Library, Tanjore
11. Dictionary of Literary Terms - J. A. Cuddon
12. Types of Sanskrit Drama - Mankad

Hindi

1. సంస్కృత్ మే ఏకాంకీ రూపక్
2. మధ్యకాలీన సంస్కృత నాటక్
3. ఆధునిక సంస్కృత నాటక్
4. భారతీయ సాహిత్య శాస్త్రకోశ్